www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 24-4-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 8 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి పూర్తి; నక్షత్రం: స్వాతి రా. 12.14 తదుపరి విశాఖ; వర్జ్యం: శేషం ఉ. 6.22; దుర్ముహూర్తం: ఉ. 11.48-12.38; అమృతఘడియలు: మ. 3.05-4.50; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.56; సూర్యాస్తమయం: 6.29 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇండియా ఇన్‌వాల్వ్‌డ్ ర్యాంకింగ్‌లో

రిలయన్స్ టాప్



న్యూఢిల్లీ: వికసిత్ భారత్ లక్ష్యాలపై భారత కార్పొరేట్ రంగం నిబద్ధతను మదించే ఇండియా ఇన్‌వాల్వ్‌డ్ ర్యాంకింగ్‌లో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అగ్రస్థానంలో నిలిచింది. సామాజిక- ఆర్థిక సమస్యలు, సమ్మిళిత వృద్ధి వంటి అంశాలపై దృష్టిసారించిన దేశీయ మేధోమదన సంస్థ స్కోచ్ గత ఏడాదికి గాను ఈ ర్యాంకింగ్‌లను విడుదల చేసింది. 231 అంశాలపై పలు కంపెనీలను ఆరు నెలల పాటు అధ్యయనం చేసి టాప్ 20 కంపెనీలకు ర్యాంకింగ్స్ కేటాయించినట్లు స్కోచ్ తెలిపింది. మరిన్ని విషయాలు..

- హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్), అదానీ గ్రూప్.. రిలయన్స్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.
- 'ఇండియా ఇన్‌వాల్వ్‌డ్ ర్యాంకింగ్ ఇన్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్'లో జియో ప్లాట్‌ఫామ్స్‌దే అగ్రస్థానం. లూపిన్, హెరిటేజ్ ఫుడ్స్ ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.
- ఈఎస్‌జీ (పర్యావరణ, సామాజిక, పరిపాలన) ర్యాంకింగ్స్‌లో హెచ్‌యూఎల్, అదానీ గ్రూప్, బ్రిటానియా వరుసగా తొలి మూడు స్థానాలను దక్కించుకున్నాయి.
- కార్పొరేట్ ఎక్సలెన్స్ ర్యాంకింగ్‌లో బ్యాంక్ ఆఫ్ ఇండియా అగ్రస్థానంలో ఉండగా.. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ ఆ తర్వాత స్థానాలు లభించాయి.

వాతావరణ మార్పులతో
ధరలు మళ్లీ పైకి..!



హెచ్చరించిన ఆర్‌బీఐ బులెటిన్

ముంబై: వాతావరణంలో తీవ్ర మార్పులతో పాటు దీర్ఘకాలిక భౌగోళిక రాజకీయ అనిశ్చితులతో ద్రవ్యోల్బణానికి ముప్పు పొంచి ఉన్నప్పటికీ, జీడీపీ వృద్ధి పథంలో మరింత ఎగబాకేందుకు అవసరమైన పరిస్థితులు రూపొందుతున్నాయని మంగళవారం విడుదల చేసిన ఏప్రిల్ బులెటిన్‌లో ఆర్‌బీఐ పేర్కొంది. ద్రవ్యపరపతి విధాన సమీక్షలో కీలక వడ్డీ (రెపో) రేట్లపై నిర్ణయం తీసుకునేందుకు కీలకమైన రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణం మార్చిలో 4.9 శాతానికి తగ్గింది. అంతక్రితం వరుసగా రెండు నెలలు సూచీ 5.1 శాతంగా నమోదైంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం..ఈ ఏడాది సాధారణం కంటే అధికంగా నమోదుకానున్న వర్షాలు ఆహార ధరలు తగ్గుముఖం పట్టేందుకు దోహదపడనున్నప్పటికీ ఈ వేసవిలో వాటి రేట్లు ఎగబాకే అవకాశాలున్నందున పరిస్థితులను జాగ్రత్తగా గమనించాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ అభిప్రాయపడింది.

ఆస్టన్ మార్టిన్ వాంటేజ్ స్పోర్ట్స్ కారు

ధర రూ.3.99 కోట్లు

బ్రిటిష్ లగ్జరీ కార్ల దిగ్గజం ఆస్టన్ మార్టిన్.. భారత మార్కెట్లోకి సరికొత్త స్పోర్ట్స్ కారు 'వాంటేజ్' విడుదల చేసింది. ఈ కారు ధర రూ.3.99 కోట్లు (ఎక్స్‌షోరూమ్). 4.0 లీటర్ వీ8 ట్విన్ టర్బో ఇంజన్‌తో కూడిన ఈ కారు కేవలం 3.5 సెకన్లలో వంద కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దేశంలో హై-పెర్ఫార్మెన్స్ డ్రైవింగ్ అనుభూతిని అందించే విధంగా వాంటేజ్‌ను తీర్చిదిద్దినట్లు ఆస్టన్ మార్టిన్ సీఈఓ అమెదెవ్ ఫెలిసా వెల్లడించారు. సరికొత్త ఇంటీరియర్, 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్‌ను ఇందులో పొందుపరిచినట్లు చెప్పారు.



ఫోక్స్‌వ్యాగన్ సరికొత్త టైగున్



చెన్నై: జర్మనీకి చెందిన ఆటోమొబైల్ కంపెనీ ఫోక్స్‌వ్యాగన్.. దేశీయ మార్కెట్లోకి తన స్పోర్ట్స్ యుటిలిటీ వాహనం (ఎస్‌యూవీ) టైగున్‌లో రెండు కొత్త వేరియంట్స్‌ను విడుదల చేసింది. పోర్టు ఫోలియోను మరింతగా విస్తరించే ఉద్దేశంతో టైగున్ జీటీ లైన్, జీటీ ప్లస్ స్పోర్ట్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు కంపెనీ తెలిపింది. 1.0 లీటర్ టీఎస్ఐ ఇంజన్‌తో కూడిన టైగున్ జీటీ లైన్ ధర రూ.14.08 లక్షలుగా ఉండగా 1.5 లీటర్ టీఎస్ఐ ఇంజన్ కలిగిన జీటీ ప్లస్ స్పోర్ట్ ధర రూ.18.53 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉందని పేర్కొంది. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన ఫోక్స్‌వ్యాగన్ యాన్యువల్ బ్రాండ్ కాన్ఫరెన్స్‌లో భాగంగా ఈ ఎస్‌యూవీలను కంపెనీ ఆవిష్కరించింది.

బొలెరో నియో, అమేజ్‌లో భద్రత డొల్ల!

రెండు కార్లకు తక్కువ రేటింగ్ కేటాయించిన గ్లోబల్ ఎన్‌క్యాప్

న్యూఢిల్లీ: మహీంద్రా బొలెరో నియో, హోండా అమేజ్‌లో భద్రత ప్రమాణాలు పేలవంగా ఉన్నాయని బ్రిటన్‌కు చెందిన వాహన భద్రత రేటింగ్ సంస్థ గ్లోబల్ ఎన్‌క్యాప్ అంటోంది. ఈ రెండు కార్లకు సంస్థ అతి తక్కువ రేటింగ్‌ను కేటాయించింది. పెద్దలు, పిల్లల భద్రత పరంగా బొలెరో నియోకు కేవలం ఒక స్టార్ రేటింగ్ లభించింది. అమేజ్‌లో పెద్దల భద్రత పరంగా 2 స్టార్స్, పిల్లల సేఫ్టీలో సున్నా రేటింగ్‌ను కేటాయించింది. కాగా, కియా కారెన్స్‌లో పెద్ద భద్రతకు 3, పిల్లల సేఫ్టీ విషయంలో 5 స్టార్ రేటింగ్‌ను కేటాయించింది. గ్లోబల్ ఎన్‌క్యాప్ 5 స్టార్ రేటింగ్ అత్యంత భద్రతకు, సున్నా స్టార్ రేటింగ్ భద్రత డొల్లతనానికి సంకేతం. కాగా, మహీంద్రాకు చెందిన థార్, ఎక్స్‌యూవీ 700, 300, స్కార్పియో ఎన్ మోడళ్లకు మాత్రం అత్యంత భద్రతకు ప్రామాణికమైన 4, 5 స్టార్ రేటింగ్ లభించింది.

బ్యాటరీల తయారీ యూనిట్ల రేసులో అమర రాజా

న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం కింద అధునాతన కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) బ్యాటరీల తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు అమర రాజా గ్రూప్ కంపెనీ అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆసక్తి చూపిస్తోంది. ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన టెండర్‌కు అనుగుణంగా ఇందుకోసం బిడ్ కూడా సమర్పించింది. అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ, లుకాస్ టీవీఎస్ లిమిటెడ్, వారీ ఎనర్జీస్ లిమిటెడ్ వంటి 10 కంపెనీలు ఇందుకోసం బిడ్స్ సమర్పించాయి.

కేంద్ర ప్రభుత్వం 10 గిగావాట్ల ఎనర్జీ స్టోరేజీ బ్యాటరీల తయారీ కోసం టెండర్ జారీ చేస్తే ఈ 10 కంపెనీలు 70 గిగావాట్ల ఇంధన స్టోరేజీ బ్యాటరీల తయారీకి బిడ్స్ సమర్పించాయి.

హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

హిటాచీ ఎనర్జీ ఇండియా

హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయనున్నట్లు హిటాచీ ఎనర్జీ ఇండియా వెల్లడించింది. భారత్‌లో కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం నాడిక్కడ సంస్థ ఎండీ, సీఈఓ ఎన్ వేణు మాట్లాడుతూ.. త్వరలోనే హైదరాబాద్‌లో జీసీసీని నెలకొల్పటంతో పాటు వరంగల్‌లో ఒక లేబొరేటరీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అయితే జీసీసీ ఏర్పాటుకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. భారత్‌లో కంపెనీ కార్యకలాపాల విస్తరణ కోసం గడచిన నాలుగేళ్లుగా ఏటా రూ.100 కోట్లు పెట్టుబడులు పెడుతూ వస్తున్నట్లు వేణు తెలిపారు. ఈ పెట్టుబడులతో కొత్తగా మూడు ప్లాంట్లు నెలకొల్పినట్లు చెప్పారు. అంతేకాకుండా భారత్‌లో కంపెనీ మొత్తం ప్లాంట్ల సంఖ్య 19కి చేరిందని వివరించారు. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా కంపెనీ సేల్స్ ఆఫీస్‌లను నిర్వహిస్తోందన్నారు. హిటాచీ ఎనర్జీ.. హై-వోల్టేజ్ స్విచ్ గేర్, బ్రేకర్స్, హై-వోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ (హెచ్‌వీడీసీ), ట్రాన్స్‌ఫార్మర్లు, సెమీకండక్టర్స్ సహా పలు ఉత్పత్తులను తయారు చేస్తోంది.

సైయెంట్ డీఎల్‌ఎం లాభంలో 81 శాతం వృద్ధి

హైదరాబాద్: గడచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో సైయెంట్ డీఎల్‌ఎం రూ.361.8 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.22.7 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 30.5 శాతం, లాభం 80.7 శాతం వృద్ధి చెందింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1,191.90 కోట్ల ఆదాయంపై రూ.61.20 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు తెలిపింది.

లాభాల బాటలోనే..

సెన్సెక్స్ 90 పాయింట్లు అప్



ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో దేశీయ ఈక్విటీ మదుపరులు టెలికాం, టెక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగ షేర్లలో కొనుగోళ్లు పెంచడం ఇందుకు దోహదపడింది. అయితే, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ మార్కెట్ లాభాలను పరిమితం చేశాయి. మంగళవారం ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ ఒక దశలో 400 పాయింట్లకు పైగా పుంజుకున్నప్పటికీ, చివరికి 89.83 పాయింట్ల లాభంతో 73,738.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 31.60 పాయింట్ల వృద్ధితో 22,447.55 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 18 లాభపడ్డాయి. ఫారెక్స్ మార్కెట్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ 5 పైసలు పెరిగి 83.31 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ రకం ముడి చమురు పీపా ధర ఒకదశలో 0.41 శాతం పెరిగి 87.36 డాలర్ల వద్ద ట్రేడైంది.

ఆఫీస్ స్పేస్ సొల్యూషన్స్ ఐపీఓకు సెబీ ఓకే : కో-వర్కింగ్ స్పేస్ కంపెనీ ఆఫీస్ స్పేస్ సొల్యూషన్స్‌తో పాటు ట్రావెల్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ టీబీఓ టెక్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రతిపాదనలకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా టీబీఓ టెక్ రూ.400 కోట్ల తాజా ఈక్విటీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన 1,56,35,996 ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. ఆఫీస్ స్పేస్ రూ.160 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు పలు ఇన్వెస్టర్లకు చెందిన కోటికి పైగా ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన అమ్మకానికి పెట్టనుంది.

- నోయిడాకు చెందిన లిథియం బ్యాటరీ, సోలార్ ప్యానెళ్ల తయారీ సంస్థ ఆర్‌సీఆర్ఎస్ ఇన్నోవేషన్స్ లిమిటెడ్ ఐపీఓ ద్వారా నిధుల సమీకరించేందుకు ఎన్ఎస్ఈలోని ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ఎన్ఎస్ఈ ఎమర్జ్‌కు ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.10 ముఖవిలువ కలిగిన 48.24 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. తద్వారా సేకరించే నిధులను వ్యాపార విస్తరణకు ఉపయోగించుకోనున్నట్లు సంస్థ పేర్కొంది.
- జేఎన్‌కే ఇండియా పబ్లిక్ ఆఫరింగ్ తొలిరోజు ముగిసేసరికి, ఇష్యూ సైజులో 49 శాతానికి సమానమైన సబ్‌స్క్రిప్షన్ లభించింది.

నిఫ్టీ నెక్స్ట్ 50 డెరివేటివ్ కాంట్రాక్టుల ట్రేడింగ్ నేటి నుంచే..

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ నెక్స్ట్ 50 డెరివేటివ్ కాంట్రాక్టులను బుధవారం నుంచి ప్రవేశపెట్టనుంది. ఈ కాంట్రాక్టుల ట్రేడింగ్‌ను ప్రారంభించేందుకు ఎక్స్ఛేంజీకి ఈ మధ్యనే సెబీ ఆమోదం తెలిపింది. నిఫ్టీ 100లో నిఫ్టీ 50 కంపెనీలను మినహాయించగా మిగిలిన కంపెనీలకు ప్రాతినిధ్య సూచీయే నిఫ్టీ నెక్స్ట్ 50. ఈ డెరివేటివ్ కాంట్రాక్టుల్లో భాగంగా ఎక్స్ఛేంజీ మూడు వరుస నెలల ఇండెక్స్ ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ కాంట్రాక్టులను ఆఫర్ చేయనుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,160 ▼	66,150 ▼	86,500 ▼
ముంబై	71,591 ▼	65,584 ▼	80,007 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	350	విజయవాడ	380
వరంగల్	352	గోదావరి	380
చిత్తూరు	473	విశాఖపట్నం	400

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	గోదావరి	121
వరంగల్	118	విజయవాడ	121
కరీంనగర్	118	గుంటూరు	125
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	125
కర్నూలు	118	చిత్తూరు	110
విశాఖపట్నం	113		

స్పోర్ట్స్

నేటి మ్యాచ్
రాత్రి 7.30 గం.
వేదిక: ఢిల్లీ

ఢిల్లీ X గుజరాత్

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
379 (8 మ్యాచ్‌లు)	13 (8 మ్యాచ్‌లు)

ఈసారి టైటిల్ మాదే!

టీ20 వరల్డ్‌కప్‌పై రిచర్డ్స్



న్యూఢిల్లీ: త్వరలో జరగనున్న టీ20 వరల్డ్‌కప్ విజేతపై వెస్టిండీస్ దిగ్గజం వివ్ రిచర్డ్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ జూన్‌లో అమెరికా-విండీస్ సంయుక్తంగా నిర్వహించనున్న మెగా టోర్నీలో 20 జట్లు పాల్గొనడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, సొంతగడ్డపై వెస్టిండీస్ మరోసారి విజేతగా నిలుస్తుందని రిచర్డ్స్ ఆశాభావం వ్యక్తం చేశాడు. కోచ్ డారెన్ సామి, కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ సారథ్యంలోని విండీస్.. అగ్రశ్రేణి జట్లకు దీటుగా పోటీపడగలదన్నాడు. 2012, 2016ల్లో సామి కెప్టెన్సీలో కరీబియన్లు రెండుసార్లు పొట్టికప్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

ఆషి-స్వప్నిల్ జోడీకి స్వర్ణం

బాకు (అజర్‌బైజాన్): షూటింగ్ వరల్డ్‌కప్‌లో భారత్ రెండో స్వర్ణాన్ని ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన 50 మీటర్ల రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో ఆషి చౌక్సే-స్వప్నిల్ కుశాలే జోడీ 16-12తో దారియా టైఖోవా-సెర్హి కులిష్ (ఉక్రెయిన్) ద్వయాన్ని ఓడించింది. స్వప్నిల్‌కు ఇది మూడో పతకం. స్వప్నిల్ వ్యక్తిగత, పురుషుల టీమ్ ఈవెంట్‌లో రజత పతకాలు కొల్లగొట్టాడు. మొత్తంగా ఈ వరల్డ్‌కప్‌ను భారత్ రెండు పసిడి, మూడు రజతాలు సహా 5 పతకాలతో రెండో స్థానంలో ముగించిం ది. కొరియా మూడు స్వర్ణాలు, మూడు కాంస్యాలతో పతకాల పట్టికలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర.రే
రాజస్థాన్	8	7	1	0	14	0.698
కోల్‌కతా	7	5	2	0	10	1.206
హైదరాబాద్	7	5	2	0	10	0.914
లఖ్‌నవూ	8	5	3	0	10	0.148
చెన్నై	8	4	4	0	8	0.415
గుజరాత్	8	4	4	0	8	-1.055
ముంబై	8	3	5	0	6	-0.227
ఢిల్లీ	8	3	5	0	6	-0.477
పంజాబ్	8	2	6	0	4	-0.292
బెంగళూరు	8	1	7	0	2	-1.046

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర.రే: నెట్ రన్‌రేట్

టీటీలో భారత్ నెంబర్ వన్ శ్రీజ



టీటీ జాతీయ ర్యాంకింగ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ స్టార్ ప్యాడ్లర్, కామన్వెల్త్ క్రీడల పతకధారి ఆకుల శ్రీజ జాతీయ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో తెలుగమ్మాయి శ్రీజ.. మనికా బాత్రాను వెనక్కి నెట్టి, టాప్‌కి చేరింది. అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో శ్రీజ ప్రస్తుతం 38వ స్థానంలో ఉంది. ఇటీవల జరిగిన డబ్ల్యూటీటీ ఫీడర్ కార్పస్ క్రిస్టీ, డబ్ల్యూటీటీ ఫీడర్ బీరూట్ టైటిళ్లను శ్రీజ కైవసం చేసుకోవడం తెలిసిందే. పురుషుల్లో శరత్ కమల్ జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంక్‌ను దక్కించుకోగా, అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో 37వ స్థానంలో కొనసాగుతున్నాడు.

'స్పోర్ట్స్‌మన్ ఆఫ్ ద ఇయర్' జొకో



మాడ్రిడ్: ప్రతిష్ఠాత్మక లారెస్ క్రీడా వార్షిక అవార్డులను సోమవారం రాత్రి ఇక్కడ ప్రదానం చేశారు. గత ఏడాది ఉత్తమ క్రీడాకారుడి పురస్కారాన్ని టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ అందుకున్నాడు. స్పెయిన్ ఫుట్‌బాలర్ ఐటానా బోన్మాటి ఉత్తమ క్రీడాకారిణి అవార్డు దక్కించుకుంది. అమెరికా స్టార్ జిమ్నాస్ట్ సైమన్ బైల్స్ పునరాగమన ప్లేయర్ అవార్డు అందుకుంది.

'లారెస్'లో కోహ్లి ఇన్నింగ్స్



కోహ్లీకి అరుదైన గౌరవం.. విరాట్ కోహ్లీకి మరో ఘనత దక్కింది. ప్రతిష్ఠాత్మక లారెస్ క్రీడా అవార్డుల ప్రదానోత్సవంలో.. కోహ్లి ఆడిన ఇన్నింగ్స్‌ను ప్రదర్శించారు. 'లారెస్ మహత్తర క్షణాలు' పేరిట కోహ్లి వన్డేలలో చేసిన 50వ సెంచరీ ఇన్నింగ్స్‌ను ప్రదర్శించారు. న్యూజిలాండ్‌తో గతేడాది ముంబైలో జరిగిన వరల్డ్ కప్ సెమీఫైనల్లో విరాట్ ఆ శతకం (117) సాధించాడు.

స్టొయినిస్.. ఒంటిచేత్తో..

- లఖ్‌నవూ అద్భుత విజయం
- చెన్నైకు మళ్లీ షాక్
- రుతురాజ్ శతకం వృథా


స్టొయినిస్ (63 బంతుల్లో 124 నాటౌట్)

చెన్నై: మార్కస్ స్టొయినిస్ (63 బంతుల్లో 13 ఫోర్లు, 6 సిక్స్‌లతో 124 నాటౌట్) మ్యాచ్ విన్నింగ్ శతకంతో.. డిఫెండింగ్ చాంప్ చెన్నై సూపర్ కింగ్స్‌కు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మళ్లీ షాకిచ్చింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ 6 వికెట్లతో చెన్నైను ఓడించింది. తొలుత చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 210/4 స్కోరు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (60 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్స్‌లతో 108 నాటౌట్), శివమ్ దూబె (27 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లతో 66) ఇన్నింగ్స్ వృథా అయ్యాయి. హెన్రీ, యశ్ ఠాకూర్ చెరో వికెట్ పడగొట్టారు. ఛేదనలో లఖ్‌నవూ 19.3 ఓవర్లలో 4 వికెట్లకు 213 రన్స్ చేసి గెలిచింది. పూరన్ (15 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34) రాణించాడు. పతిరన 2 వికెట్లు తీశాడు. స్టొయినిస్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

తడబడి.. నిలబడి: ఛేదనలో లఖ్‌నవూ ఆరంభంలో తడబడినా.. స్టొయినిస్ ఒంటరి పోరాటంతో జట్టును గెలిపించాడు. పూరన్‌తో కలసి నాలుగో వికెట్‌కు 34 బంతుల్లో 70 పరుగుల భాగస్వామ్యంతో మ్యాచ్‌లో నిలిపాడు. మూడో బంతికే డికాక్ (0)ను దీపక్ డకౌట్ చేసి షాకిచ్చాడు. కానీ, కెప్టెన్ రాహుల్ (16), స్టొయినిస్ జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, ముస్తాఫిజుర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే క్రమంలో రాహుల్ వెనుదిరిగాడు. దీంతో రెండో వికెట్‌కు 33 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో పడిక్కల్ (13) సహకారంతో స్టొయినిస్ చెన్నై బౌలర్లపై ఎదురుదాడి చేస్తూ స్కోరు బోర్డును నడిపించడంతో.. పవర్‌ప్లే ముగిసే సరికి లఖ్‌నవూ 45/2తో నిలిచింది. కానీ, పడిక్కల్‌ను పతిరన బౌల్డ్ చేయడంతో.. మూడో వికెట్‌కు 55 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌కు తెరపడింది. 88/3 ఇబ్బందుల్లో పడిన సమయంలో స్టొయినిస్‌కు పూరన్ అండగా నిలిచాడు. చివరి 5 ఓవర్లలో లఖ్‌నవూ విజయానికి 74 పరుగులు కావాల్సి ఉండగా.. పూరన్ 6,4,6తో బ్యాట్‌కు పనిచెప్పాడు. అయితే, కీలక సమయంలో పూరన్‌ను అవుట్ చేసిన పతిరన.. జట్టుకు కావాల్సిన బ్రేక్‌ను అందించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా పోరాటాన్ని కొనసాగించిన స్టొయినిస్ 18వ ఓవర్‌లో సెంచరీ పూర్తి చేసుకోగా.. దీపక్ హుడా (17 నాటౌట్) సిక్స్ బాదడంతో లక్ష్యం 12 బంతుల్లో 32కు దిగివచ్చింది. 19వ ఓవర్‌లో హుడా రెండు బౌండ్రీలతో 15 పరుగులు రాబట్టాడు. ఆఖరి ఓవర్‌లో 17 రన్స్ అవసరం కాగా.. స్టొయినిస్ 6,4,4,4తో ఫినిష్ చేశాడు.

ఆఖర్లో అదరగొట్టారు..: కెప్టెన్ రుతురాజ్ కళాత్మక బ్యాటింగ్.. డెత్‌లో దూబె పవర్ హిట్టింగ్‌తో చెన్నై భారీ స్కోరు సాధించింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 46 బంతుల్లో 104 పరుగుల భాగస్వామ్యంతో జట్టు స్కోరును 200 మార్క్ దాటించారు. తొలి ఓవర్‌లో హెన్రీ బౌలింగ్‌లో రాహుల్ అద్భుత క్యాచ్‌తో ఓపెనర్ రహానె (1) వెనుదిరిగినా.. తుదికంటా నిలిచిన గైక్వాడ్ కీలక భాగస్వామ్యాలతో జట్టును ఆదుకొన్నాడు. లైఫ్ దక్కినా సద్వినియోగం చేసుకోలేక పోయిన మిచెల్ (11)ను యశ్ పెవిలియన్ చేర్చడంతో.. పవర్‌ప్లేలో చెన్నై 49/2తో నిలిచింది. మధ్య ఓవర్లలో గైక్వాడ్, జడేజా (16) వీలుచిక్కినప్పుడల్లా షాట్లు కొడుతూ పరుగులు రాబట్టారు. కానీ, 12వ ఓవర్‌లో చెన్నై స్కోరు సెంచరీ దాటినా.. జడ్డూను క్యాచవుట్ చేసిన మొహిసిన్ మూడో వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఈ దశలో దూబె క్రీజులోకి రావడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. మరోవైపు గేర్ మార్చిన గైక్వాడ్ 6,4,4తో శతకం పూర్తి చేసుకొన్నాడు. ఎడాపెడా సిక్స్‌లతో హాఫ్ సెంచరీ సాధించిన దూబె రనౌట్ కాగా.. ధోనీ (4 నాటౌట్) బౌండ్రీతో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. మొత్తంగా చివరి 5 ఓవర్లలో లఖ్‌నవూ 75 పరుగులు సమర్పించుకొంది.


రుతురాజ్ (60 బంతుల్లో 108 నాటౌట్)

స్కోరుబోర్డు

చెన్నై: రహానె (సి) రాహుల్ (బి) హెన్రీ 1, రుతురాజ్ (నాటౌట్) 108, మిచెల్ (సి) హుడా (బి) యశ్ 11, జడేజా (సి) రాహుల్ (బి) మొహిసిన్ 16, శివమ్ దూబె (రనౌట్) 66, ధోనీ (నాటౌట్) 4, ఎక్స్‌ట్రాలు: 4; **మొత్తం: 20 ఓవర్లలో 210/4;** వికెట్ల పతనం: 1-4, 2-49, 3-101, 4-205; **బౌలింగ్:** హెన్రీ 4-0-28-1, మొహిసిన్ 4-0-50-1, రవి బిష్ణోయ్ 2-0-19-0, యశ్ ఠాకూర్ 4-0-47-1, స్టొయినిస్ 4-0-49-0, క్రునాల్ పాండ్యా 2-0-15-0.

లఖ్‌నవూ: డికాక్ (బి) చాహర్ 0, రాహుల్ (సి) రుతురాజ్ (బి) ముస్తాఫిజుర్ 16, స్టొయినిస్ (నాటౌట్) 124, పడిక్కళ్ (బి) పతిరన 13, పూరన్ (సి) శార్దూల్ (బి) పతిరన 34, హుడా (నాటౌట్) 17, ఎక్స్‌ట్రాలు: 9; **మొత్తం: 19.3 ఓవర్లలో 213/4;** వికెట్ల పతనం: 1-0, 2-33, 3-88, 4-158; **బౌలింగ్:** దీపక్ చాహర్ 2-0-11-1, తుషార్ 3-0-34-0, ముస్తాఫిజుర్ 3.3-0-51-1, శార్దూల్ 3-0-42-0, మొయిన్ అలీ 2-0-21-0, జడేజా 2-0-16-0, పతిరన 4-0-35-2.

గుకేష్ విజయం..
విశ్వ చెస్‌పై మన ఆధిపత్యం



(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

'భారత్‌లో చెస్ అభివృద్ధి దిశగా సరైన అడుగులు పడుతున్నాయి. అందుకే ప్రపంచ చెస్‌లో భారత్ అగ్రగామిగా నిలిచే రోజులు ఎంతో దూరంలో లేవు' వరల్డ్ మాజీ చాంపియన్ కార్ల్‌సన్ గతేడాది చేసిన వ్యాఖ్య ఇది. సరిగ్గా సంవత్సరం తిరిగే సరికి..నార్వే దిగ్గజం అభిప్రాయం దిశగానే భారత్ పయనిస్తోంది. తన కంటే ఎంతో అనుభవజ్ఞులైన ఆటగాళ్లను తలదన్ని ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ విజేతగా అంతర్జాతీయ చెస్‌లోకి గుకేష్ అనే టీనేజర్ దూసుకొచ్చాడు. ఇక.. చైనాకు చెందిన డింగ్ లిరెన్‌తో ప్రపంచ టైటిల్ కోసం గుకేష్ తలపడడమే మిగిలుంది. ప్రస్తుత ఫామ్‌నుబట్టి చూస్తే..వరల్డ్ చాంపియన్‌గా నిలిచే అవకాశమూ గుకేష్‌కి లేకపోలేదు. గుకేష్‌తోపాటు, ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేసి, విదిత్ గుజరాతీ, ఆర్.వైశాలీ, ద్రోణవల్లి హారిక వంటి భారత గ్రాండ్‌మాస్టర్లు విశ్వ వేదికలపై అద్భుత ఆటతో ఆకట్టుకుంటున్నారు.

ఇవీ కారణాలు..: ఫిడే అంచనా ప్రకారం దేశంలో ప్రతిభావంతులైన చెస్ ఆటగాళ్లు 50వేల మంది ఉన్నారు. ఇలా వేలాదిమంది ప్లేయర్లు ఆవిర్భవించడానికి పలు కారణాలున్నాయి. అందులో ముఖ్యమైనవి.. తక్కువ ధరలకే ఇంటర్నెట్ డాటా ప్యాక్‌లు లభించడం, సెల్‌ఫోన్లలో చెస్ యాప్‌లు అందుబాటులోకి రావడం. ఇంటర్నెట్ పుణ్యాన.. టైర్-2, టైర్-3 నగరాల్లో ఆన్‌లైన్ చెస్ కోచింగ్‌లకు అవకాశం ఏర్పడింది. తద్వారా మెట్రోపాలిటన్ నగరాల్లో చెస్ అకాడమీల ద్వారా చిన్నారులకు ఉత్తమ శిక్షణ పొందే మార్గం ఏర్పడింది. అలాగే గత తరం ఆటగాళ్లు యువ ప్లేయర్లకు శిక్షణ ఇస్తూ తమ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. కరోనా తర్వాత విస్తారంగా ఆన్‌లైన్ టోర్నీలు జరుగుతున్నాయి. ఈ టోర్నీల ద్వారా యువ ఆటగాళ్లకు గ్రాండ్‌మాస్టర్లతో తలపడే అవకాశాలు లభిస్తున్నాయి. అలా వారు తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుంటున్నారు. ఇలా..అందుబాటులో ఉన్న అవకాశాలను రెండు చేతులా అందిపుచ్చుకుంటున్న దేశ నవతరం చెస్ ప్లేయర్లు అంతర్జాతీయ వేదికలపై మెరుస్తున్నారు. భారత చెస్ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తున్నారు.

టొరొంటోలో భారత భూకంపం

గుకేష్ ఘనతపై చెస్ దిగ్గజం కాస్పరోవ్

న్యూఢిల్లీ: గుకేష్‌ను రష్యా చెస్ దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ ఆకాశానికెత్తేశాడు. క్యాండిడేట్స్ టోర్నీలో అతడి టైటిల్ విజయాన్ని టొరొంటోలో 'భారత భూకంపం'గా అభివర్ణించాడు. గుకేష్ గెలుపు ప్రపంచ చెస్‌లో ఆధిపత్య మార్పునకు చిహ్నమన్నాడు.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 24-4-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ

30 సంవత్సరాలుగా లక్షలాదిమంది
విజేతల రూపకర్తగా అండగా!
లైఫ్ కెరీర్ ఏదైనా
'కేశవరెడ్డి' తోనే లైన్ క్లియర్
కేశవరెడ్డి విద్యాసంస్థలు
91003 30121, 91000 65505



ఆంధ్రజ్యోతి
బుధవారం • 24 ఏప్రిల్ 2024
నవ్య
కుటుంబ కదంబం
IV



కరోనా నియంత్రణకు వ్యాక్సిన్ ఒక్కటే మార్గమని ప్రపంచమంతా నమ్ముతుంటే... 'అవేకెన్ ఇండియా మూవ్‌మెంట్' ఉద్యమకారిణి **సరస్వతి కవుల** మాత్రం ఆ టీకాలు ప్రాణాంతకమైనవని ప్రచారం చేస్తున్నారు. అలాగే ఎంతో సౌలభ్యమని భావిస్తున్న డిజిటల్ కరెన్సీ... మన జీవితాల మీద మనకు హక్కు లేకుండా చేసే ప్రక్రియగా ఆమె అభివర్ణించారు. 'ఇదంతా ప్రపంచ ప్రఖ్యాత అపర కుబేరుల మార్కెట్ అవసరాల కోసం ప్రపంచ దేశాలన్నిటినీ ఒకే చోటకు తీసుకొచ్చేందుకు మొదలైన కుట్ర. దీనికి వ్యతిరేకంగా మరో స్వాతంత్ర్య పోరాటం అవసరం' అంటున్న సరస్వతి... తమ సంస్థ ఉద్దేశాలు, లక్ష్యాల గురించి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

మరో... స్వాతంత్ర్యోద్యమం అవసరం

"కరోనా పేరుతో ప్రపంచ వ్యాప్తంగా పౌరుల హక్కులను హరిస్తున్నారు. దీన్ని నిరసిస్తూ మా 'అవేకెన్ ఇండియా ఉద్యమం' 2020, అక్టోబరు2 గాంధీజయంతి రోజున ముంబైలో మొదలైంది. తెలంగాణతో పాటు గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్, కేరళ, ఒడిశా, మేఘాలయ తదితర రాష్ట్రాల్లో చాలా బలంగా సాగుతోంది. ఇందులో ప్రఖ్యాత వైద్యులు, న్యాయవాదులు, పౌర సంఘాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, సామాజికవేత్తలు చాలా మంది భాగమయ్యారు. మొదటగా కొవిడ్‌ను 'ప్యాండమిక్' కాదు 'ప్లాన్‌డమిక్'గా గుర్తించాం. కరోనా కేసులను మ్యాథమెటికల్‌గా ప్రాజెక్టు చేసి మరీ భయాన్ని సృష్టించడాన్ని తీవ్రంగా నిరసించాం. దీనికి వ్యాక్సిన్ మినహా మరో విరుగుడులేదని నమ్మబలికారు. దీనికి వ్యతిరేకంగా ఊరూవాడా తిరిగి ప్రచారం చేశాం. క్లినికల్ ట్రయల్స్ పూర్తి కాకుండా, తర్వాత కాలంలో తలెత్తే దుష్ప్రభావాలను గుర్తించకుండా ప్రతి ఒక్కరికీ కరోనా టీకాలు బలవంతంగా వేయించారు. వ్యాక్సిన్ తీసుకోవడమన్నది స్వచ్ఛందమని వైద్య ఆరోగ్య శాఖ వెబ్‌సైట్‌లోనూ ప్రస్తావించినా, ఆచరణలో అందుకు విరుద్ధంగా నడుచుకున్నారు. దీన్ని సవాల్ చేస్తూ మా 'అవేకెన్ ఇండియా' ప్రతినిధి డాక్టర్ జాకబ్ పులియెల్ సుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయపోరాటం చేశారు. ఆ సందర్భంగా... టీకా తీసుకోనివారిపట్ల ప్రభుత్వమే వివక్ష చూపించడాన్ని, వారి ప్రాథమిక హక్కుల మీద దాడిగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అంతేకాదు, బలవంతంగా టీకాలు వేయడం చట్ట వ్యతిరేకం. ముందుగా వ్యాక్సిన్ తయారీలో వాడిన పదార్థాలు, వాటివల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు తెలియజేయడంతోపాటు అది తీసుకోవాలా వద్దా అనేది పూర్తిగా ఆ వ్యక్తి ఇష్టమని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. ఇది 'అవేకెన్ ఇండియా'కు అతి పెద్ద విజయం.

కరోనా అనంతర మరణాలు...

కరోనా టీకాల అనంతర కాలంలోనే కొవిడ్ కేసులు పెరిగాయి. పైగా ఆ తర్వాతే డెల్టా వేవ్ వచ్చింది. ఏటా మన దేశంలో కనీసం పది లక్షలమంది పొగాకు ఉత్పత్తుల వాడకంవల్ల చనిపోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం అంగీకరించింది.

మొత్తం మరణాల సంఖ్యలో 9.5 శాతం పొగాకువల్ల జరుగుతుంటే, సిగరెట్ కంపెనీలు మూతపడవు. అదే కరోనా వల్ల 0.02 శాతం మంది చనిపోతే, 130 కోట్లమంది జనాభాకు ప్రాణాంతకమైన టీకాలు వేయడం దారుణం కదా. దీన్నే ప్రజల్లోకి తీసుకెళ్లాం. పైగా 'అది మీ మంచి కోసమే' అంటూ జనాన్ని ఎమోషనల్‌గా బెదిరించారు. వార్తల ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం ఇప్పటివరకు వ్యాక్సిన్ దుష్ప్రభావాల వల్ల భారత్‌లో సుమారు 18 వేలమంది చనిపోయారు. అంతెందుకు... 11-17 ఏళ్ల మధ్య పిల్లలు 130 మంది టీకా తీసుకున్న కొద్ది రోజుల్లోనే మరణించిన ఘటనలు మా దృష్టికొచ్చాయి. అయితే ఈ మరణాలకు... వ్యాక్సిన్‌కు సంబంధం లేదని ఐసీఎమ్మార్ చెబుతోంది. కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత చనిపోయినవారి శరీరానికి పంచనామా చేయాలని మేము కొట్లాడినా లాభం లేకపోయింది. అయినా మా పోరాటాన్ని కొనసాగిస్తున్నాం. ఇదివరకెన్నడూ లేని విధంగా... కరోనా అనంతర కాలంలోనే టీనేజర్లు, యువకులు గుండెపోటుతో చనిపోతున్నారన్న వార్తలు వింటున్నాం. ఇలాంటి విషయాల మీద సమాజంలో అవగాహన కల్పిస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. డబ్ల్యూహెచ్‌వో చెప్పిందనో, ప్రభుత్వం ఆదేశించిందనో మన జీవితాలను పణంగా పెట్టడం సరికాదు. వీటన్నిటిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

పోలీసుల పరోక్ష మద్దతు...

వాస్తవాలను ప్రజలముందు ఉంచుతున్న క్రమంలో మేము కొన్ని సమస్యలు ఎదుర్కొన్నాం. ముఖ్యంగా కరోనా కాలంలోనే టీకాలు తీసుకోవడంవల్ల తలెత్తే అనర్థాలను వివరిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఒక ప్రాంతంలో ప్రచారం చేస్తున్నాం. స్థానిక పోలీసులు మమ్మల్ని అడ్డుకొని, స్టేషన్‌కు తీసుకెళ్లారు. మమ్మల్ని చట్టవ్యతిరేకులని అన్నారు. వ్యాక్సిన్లకు వ్యతిరేకంగా మా పోరాటం చట్టబద్ధమైనదే అని సాక్ష్యాలు చూపిస్తూ... ఈ టీకాల తయారీలో వాడే కొన్ని పదార్థాలవల్ల తలెత్తే ఆరోగ్య సమస్యల గురించి అక్కడి పోలీసులకు వివరిస్తే... వారంతా నిర్ఘాంతపోయారు. 'అవేకెన్ ఇండియా' లేవనెత్తిన అంశాలను సమ్మతించారు. మా పోరాటానికి పరోక్ష మద్దతు తెలిపారు. మాస్కు పెట్టుకోవడంవల్ల



హెచ్‌పీవీతో దుష్ప్రభావాలు...

గర్భాశయ ముఖద్వార కేన్సర్ నియంత్రణలో భాగమంటూ బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇస్తున్నారు. కానీ దీనివల్ల కలిగే దుష్ప్రభావాలను మాత్రం ప్రజల ముందు ఉంచడంలేదు. ఈ టీకా తయారీలో వాడే పదార్థాల వివరాలు తెలియచేయడం లేదు. ఫైజర్ కంపెనీ 'గర్డసిల్' టీకా తీసుకున్న అమెరికన్ బాలికలలో కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. ముఖ్యంగా రోగనిరోధక వ్యవస్థ నరాల మీద దాడిచేయడం, గుండె పోటు, మెదడులో బ్లడ్ క్లాట్స్, అల్సరేటివ్ కొలిటిస్ తదితర జబ్బులకు గురయ్యారని వింటున్నాం. ఇదే హెచ్‌పీవీ టీకా క్లినికల్ ట్రయిల్‌లో తెలంగాణ, గుజరాత్ ప్రాంతాలకు చెందిన ఏడుగురు అమ్మాయిలు 2007లో చనిపోయిన విషయం దాచేస్తే దాగదు కదా. అప్పుడు ఈ టీకాల తయారీని ప్రోత్సహించిన 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్'కు అనుబంధమైన 'పాత్' స్వచ్ఛంద సంస్థను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బహిష్కరించింది. ఇప్పుడు అదే వ్యాక్సిన్‌ను మన దేశంలోని అమ్మాయిలందరికీ ఇస్తున్నారు. దీన్ని వ్యతిరేకిస్తున్నాం. హెపటైటిస్ బీ లాంటి లైంగిక సంక్రమిత వ్యాధుల నిరోధక టీకాలను పసిపిల్లలకు ఇవ్వడంవల్ల తలెత్తే పరిణామాలను ఎవ్వరూ పట్టించుకోవడంలేదు. టీకాలంటేనే జీవాలను చంపి చేసేది. హింసాత్మకమైంది. కనుక దీన్ని మహాత్మాగాంధీసైతం వ్యతిరేకించారు. ప్రత్యామ్నాయ వైద్య విధానాలు, చికిత్సా పద్ధతులను ప్రోత్సహించకుండా మనుషులను వినియోగదారులుగా మార్చడంలో భాగమే ఈ వ్యాక్సిన్లు. అందుకే దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి.

మరింత ప్రమాదమని కూడా ప్రచారం చేశాం. మాస్కు పెట్టుకోనందుకు మరొకచోట పోలీసులు చలానా రాస్తే, మాస్కు ధరించడం ఐచ్ఛికమని ప్రభుత్వమే వెబ్‌సైట్‌లో పొందిపరిచిన విషయాన్ని గుర్తుచేశాం. దాంతో పోలీసులు వెనక్కి తగ్గారు. కరోనా వ్యాక్సిన్‌వల్ల తలెత్తిన దుష్ప్రభావాలను రికార్డు చేయడంతోపాటు కేసులను రిపోర్టు చేయాలన్నదీ మా ప్రధాన డిమాండ్లలో ఒకటి.

దుష్ప్రభావాలు లేని చికిత్సలున్నా...

ప్రకృతి వైద్యం, ఆయుర్వేదం, అల్లోపతిలోని ఐవర్ మెక్టిన్ లాంటి దుష్ప్రభావాలు లేని వైద్య చికిత్సలను అంగీకరించకుండా, ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలను నిర్బంధంగా అమలుచేశారు. కరోనా నియంత్రణకు అధిక మోతాదులో విటమిన్ సీ, డీ3, మెలటోనిన్‌లను ఇవ్వడంతో పాటు యాంటీ ఫంగల్ చికిత్సతో రోగాన్ని నయం చేయవచ్చని ప్రవీణ్‌కుమార్ సక్సేనా, దిగంబర నాయక్, సుధా చేప్యాల, లలిత్‌కుమార్ దేవరావు లాంటి ప్రముఖ అల్లోపతి వైద్యులు ఐసీఎమ్మార్‌కు వివరణాత్మకంగా నివేదిక ఇచ్చినా లాభం లేకపోయింది. ప్రపంచ దేశాలన్నీ 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' (డబ్ల్యూహెచ్‌ఓ) కను సన్నల్లో నడుచుకుంటున్నాయి. అదొక ప్రైవేటు సంస్థ. దాని ప్రయోజనాలు వేరు. అసలు వ్యాక్సిన్ తయారీ కంపెనీల వెనుక 'బిల్‌గేట్స్ ఫౌండేషన్' పాత్ర ప్రముఖంగా ఉందని 'అవేకెన్ ఇండియా' గుర్తించింది.

ప్రపంచ కుబేరుల కుట్ర...

కరోనా లాంటి 'ప్లాన్‌డమిక్' వెనుక బిల్‌గేట్స్, క్లాస్ శ్వాబ్, జార్జి సోరెస్సెన్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత అపర కుబేరుల స్వార్థ ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయి. ప్రపంచాన్నంతటినీ ఒక గొడుగు కిందకు తీసుకొచ్చి... తద్వారా వనరుల మీద గుత్తాధిపత్యంచేయాలన్నది వారి లక్ష్యం. అందుకోసం వన్ వరల్డ్ గవర్నమెంట్, ఒక కొత్త విశ్వ వ్యవస్థ (న్యూ వరల్డ్ ఆర్డర్) స్థాపించాలన్నది ఈ నయా సామ్రాజ్యవాదుల ఆలోచన. 'వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్' లాంటి సంస్థల ద్వారా దేశదేశాల ఆర్థిక వ్యవస్థలను వారి ఆధీనంలోకి తీసుకోవడం, ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా మిగతా దేశాలను శాసించడం... ఇలాంటివన్నీ ఆ కుట్రలో భాగమే. ఇప్పుడు 'ఇ-రూపీ' కూడా అలాంటిదే. డిజిటల్ కరెన్సీ అన్నది ఒక పథకం ప్రకారం రూపొందించింది. దీనిలో మన డబ్బు మీద పూర్తి అధికారం మనకు ఉండదు. అంతేకాదు... మన సొమ్మును మనం దేనికి వాడుకోవాలో కూడా వారే నిర్ణయిస్తారు. మన డబ్బును... నిర్ణీత గడువులో, నిర్దేశిత మొత్తాన్ని ఖర్చుపెట్టకుంటే దాన్ని వెనక్కితీసుకునే ప్రమాదం లేకపోలేదు. ఫేషియల్ రికగ్నైజ్ సాఫ్ట్‌వేర్ ద్వారా నిరంతరం పౌరుల మీద నిఘా పెడతారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తే, వారి ఖాతాలను నిలిపివేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఎందుకంటే, మనకు సంబంధించిన సమస్త సమాచారం బ్యాంకు ఖాతాకు అనుసంధానమై ఉంటుంది కనుక. మొత్తంగా ఈ-రూపీ (డిజిటల్ కరెన్సీ) వాడకమంటే పరాధీనతలోకి జారుకోవడమే. 'డిజిటల్ కరెన్సీ వద్దు' అంటూ ప్రధానికి పోస్టు కార్డు రాయాలని పిలుపునిచ్చాం.

జాగృతం చేయడమే లక్ష్యం...

వ్యాక్సిన్ల దుష్ప్రభావాల మీద ప్రఖ్యాత వైద్యుడు ప్రవీణ్ సక్సెనా గారి ద్వారా 2006 నుంచి నాకు కొంత అవగాహన ఉంది. ప్రముఖ కార్డియాలజిస్టు ప్రశాంతి అట్లూరి ప్రోత్సాహంతో అమెరికా, భారత్‌లలోని కొంతమంది వైజ్ఞానిక శాస్త్రవేత్తలు, డాక్టర్లు, సామాజికవేత్తలను కలిసి 'డీకోడ్ వ్యాక్సిన్' పేరుతో రెండు భాగాలుగా డాక్యుమెంటరీ తీశాను. దీంతో పాటు వ్యాక్సిన్ల మీద అవగాహన కల్పిస్తూ 'అవేకెన్ ఇండియా' ద్వారా మేం రూపొందించిన వీడియోలను యూట్యూబ్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల్లో ఉంచాం. కానీ వాటిని ఆయా సంస్థలు తొలగించాయి. అందుకే వాటిని 'బిట్‌చ్యూట్' ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాం. కరోనా లాంటి 'ప్లాన్‌డమిక్'ల ద్వారా ప్రపంచ జనాభాను తగ్గించడం, తద్వారా ప్రకృతి వనరుల మీద పూర్తి ఆధిపత్యాన్ని పొందడం, ప్రపంచాన్ని శాసించడం లాంటి ప్రపంచ కుబేరుల దుర్మార్గ ఆలోచనలను, వారి కుట్రలను తిప్పికొట్టడమే మా ప్రధాన లక్ష్యం. అందుకోసం మరొక స్వాతంత్ర్య ఉద్యమం అవసరమని నమ్ముతున్నాం. ఆ దిశగా జనాన్ని జాగృతం చేస్తున్నాం."

• సాంత్వన్

టీచర్ కావాలనుకొని టెకీ అయిన ఆమె... ఆటిజం బాధిత పిల్లలకు ఆశాకిరణంగా మారారు. 1,200మందికి పైగా బాలల్లో మార్పునకు దోహదపడ్డారు.'వారిలో సమగ్రాభివృద్ధే నా ఆశయం' అంటున్న **అమృతా కృష్ణమూర్తి** పదకొండేళ్ళ ప్రయాణం ఇది...

ఆ పిల్లలకు 'స్టెప్పింగ్ స్టోన్'

"చాలామందికి జీవితంలో తమదైన లక్ష్యం ఉంటుంది. కానీ మలుపు వారిని వేరే దారిలోకి మళ్ళిస్తుంది. నా విషయంలోనూ అదే జరిగింది. ముందుగా నా గురించి పరిచయం చేసుకుంటాను. మాది తమిళనాడులోని మదురై. బిటెక్‌లో గోల్డ్ మెడలిస్టుని. చదువు పూర్తయ్యాక చెన్నైలోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో అప్లికేషన్ డెవలపర్‌గా చేరాను. నాకు చిన్నప్పటినుంచీ టీచింగ్ అంటే ఇష్టం. కానీ కుటుంబం ఒత్తిడి వల్ల నా అభిరుచికి విరుద్ధమైన కెరీర్‌ను ఎంచుకోవాల్సి వచ్చింది. పెద్దగా ఉత్సాహం కానీ, ఉత్తేజం కానీ కలిగించని రొటీన్‌తో విసుగ్గా ఉండేది. కొన్నాళ్ళకు బెంగళూరులో మరో కంపెనీలోకి మారాను. బోధనా వృత్తిలో నా ఆసక్తిని తీర్చుకోవడం ఎలా? అనే ఆలోచనలో ఉండగా... నేను కొందరు మిత్రులతో కలిసి బెంగళూరులోని 'స్పాస్టిక్ సొసైటీ ఆఫ్ కర్ణాటక'ను సందర్శించాను. అదే నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. ఆటిజంతో ఉన్న పిల్లలను మొదటిసారిగా అక్కడ చూశాను. నేను బాగా చదువుకున్నాను. కానీ పిల్లల పెరుగుదలలోని లోపాల గురించి నాకు తెలిసిన విషయాలు చాలా తక్కువ అని అర్థమయింది. 'ఏదో ఒక రోజు నేనూ తల్లిని అవుతాను. కానీ బిడ్డను కనే ముందు... గర్భంలో ఉన్నది మొదలు కాస్త ఎదిగే వరకూ పిల్లలకు ఎదురయ్యే సమస్యల గురించి తెలుసుకోవాలి' అనుకున్నాను. ఆటిజం గురించి అధ్యయనం చేశాను. ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరు ఆటిజం బాధితులనీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం వంద మంది పిల్లల్లో ఒకరికి ఈ సమస్య ఉందనీ ఒక అధ్యయనాన్ని చదివాను. అలాంటి పిల్లల కోసం ఏదైనా చెయ్యాలనిపించింది. 2013లో 'స్టెప్పింగ్ స్టోన్స్ సెంటర్' పేరిట ఒక సంస్థను స్థాపించాను. 'ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్' (ఎఎస్‌డి) ఉన్న పిల్లల సమగ్రాభివృద్ధికి దోహదం చెయ్యడం క్రమంగా విద్యావ్యవస్థతో వారిని అనుసంధానించడం దీని ఉద్దేశం.

ముందుగా గుర్తించడమే కీలకం

వివిధ దశల్లో పిల్లల ఎదుగుదల... ముఖ్యంగా ఆరేళ్ళ లోపువారిలో ఎలా ఉండాలో, ఎలా ఉందో గ్రహించడం చాలా అవసరం. తొలి దశలోనే లోపాలను, జాప్యాలను గుర్తిస్తే... వాటిని పరిష్కరించడానికి ముందుగానే చర్యలు తీసుకొనే వీలు కలుగుతుంది. ఇది చాలా కీలకమని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. మాట్లాడే, ఆవశ్యకమైన విషయాలు, అలవాట్లు నేర్చుకొనే నైపుణ్యాలు లేకపోవడం, శరీరం కదలికల్లో లోపాలు, అతి చురుకుతనం, మందకొడిగా ఉండడం, దేని మీదా ధ్యాస లేకపోవడం.. ఇలాంటివి ఆటిజంలో ముందుగా గుర్తించగలిగే చిహ్నాలు. పుట్టిన తరువాత పిల్లల మెదడు అభి



వృద్ధికి మొదటి వెయ్యి రోజులను 'గోల్డెన్ పీరియడ్'గా చెప్పవచ్చు. ఈ కీలకమైన దశలో లోపాలేవైనా కనిపించినట్టయితే వెంటనే జాగ్రత్త తీసుకోవాలి. ఈ నేపథ్యంలో మేము ఎర్లీ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ అమలు చేస్తున్నాం. పిల్లల భౌతిక, భాషా, ప్రవర్తనా, సామాజిక, విజ్ఞానపరమైన ఎదుగుదలను పరిశీలిస్తాం. ఆ పిల్లల అవసరాలేమిటనేది నిర్ధారిస్తాం. తరువాత నిపుణుల సాయంతో... ప్రత్యేకమైన కార్యక్రమాలను రూపొందిస్తాం. స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఫిజికల్ డెవలప్‌మెంట్.. ఇలా వివిధ విభాగాలకు చెందిన నిష్ణాతులు వీటిని నిర్వహిస్తారు. తల్లితండ్రులను కూడా దీనిలో భాగస్వాములుగా చేస్తాం. ప్రతిరోజూ పిల్లలతో చేయిస్తున్న యాక్టివిటీస్‌ను, వాటికి వారు ప్రతిస్పందించిన తీరును, వారిలో వస్తున్న మార్పులను నమోదు చేస్తాం. వారానికి ఒకసారి వాటిని సమీక్షించి... మార్పులూ, చేర్పులూ చేస్తూ ఉంటాం.

తల్లితండ్రుల పాత్ర కీలకం...

ఇప్పుడు మా సంస్థలో 72 మంది నిపుణుల బృందం ఉంది. ఇప్పటివరకూ ఆటిజం ఉన్న 1,200



మందికి పైగా పిల్లలకు సాయం అందించాం. ప్రస్తుతం మా దగ్గర 48 మంది ఉన్నారు. వీరికి యోగా, నృత్యం, క్రీడలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లాంటివి కూడా నేర్పిస్తున్నాం. మా దగ్గర చికిత్స, శిక్షణ పొందుతున్న పిల్లలను చేర్చుకోవడానికి స్కూళ్ళను వెతకడం పెద్ద సమస్య. చాలా పాఠశాలల్లో ఇలాంటి పిల్లలకు సౌకర్యాలు, వాటికి బోధన చేసే పాఠ్యప్రణాళిక లేవు. బెంగళూరులో నాలుగు పాఠశాలలు మాతో కలిసి పని చేస్తున్నాయి. సెషన్స్ వారీనైనా లేదా ఏడాదికి ఒకేసారైనా ఫీజు చెల్లించి... వివిధ సేవలను ఉపయోగించుకోవచ్చు.

సాధారణ పాఠశాలల్లో చదివే తమ వయసు పిల్లల స్థాయి అవగాహనను ఆటిజం పిల్లల్లో కల్పించాలన్నదే నా ప్రయత్నం. దీనిలో తల్లితండ్రుల పాత్ర కీలకం. ఎందుకంటే పిల్లలతో ఎక్కువసేపు గడిపేది వాళ్ళే. కాబట్టి వారికోసం ఆరు వారాల 'పేరెంట్ ప్రోగ్రామ్' కూడా నిర్వహిస్తున్నాం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కన్నా ఇది నాకు ఎంతో ప్రశాంతంగా ఉంది. ఆటిజం పిల్లలకు బోధిస్తున్నప్పుడు... నావంతుగా సమాజానికి కొంత సేవ చేయగలుగుతున్నానే సంతృప్తి వెలకట్టలేనిది."

'దిక్సూచి' వెబ్ పేజీలో... సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/5uFuCdPలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

సందీప్‌కిషన్ 30వ చిత్రం ప్రారంభం




'ఊరి పేరు భైరవకోన' చిత్రం తర్వాత హీరో సందీప్‌కిషన్ నటించే కొత్త చిత్రం షూటింగ్ మంగళవారం ఉదయం ప్రారంభమైంది. ఇది ఆయనకు 30వ సినిమా. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. దర్శకుడు విజయ్ కనకమేడల కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సందీప్‌కిషన్ పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు దిల్ రాజు క్లాప్ ఇచ్చారు. నిర్మాత అనిల్ సుంకర గౌరవ దర్శకత్వం వహించారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో రావు రమేశ్ కీలక పాత్ర పోషించనున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించుకొనే ఈ సినిమాకు ప్రసన్నకుమార్ బెజవాడ కథ, స్ర్కీన్‌ప్లే, మాటలు అందిస్తున్నారు. నిజార్ షఫీ డీవోపి. బాలాజీ గుత్తా సహ నిర్మాత.

30 మంది నటులు.. 500 మంది డాన్సర్లు



సినిమాలో ఒక పాటలో ఒకరు కాదు. ఇద్దరు కాదు.. ఏకంగా 30 మంది నటులు, వారికి తోడు 500 మంది డాన్సర్లు పాల్గొనడం.. ఆసక్తికరంగా అనిపిస్తోంది కదూ. ఈ హంగామా దేనికోసం అంటారా.. 'వెల్‌కమ్' సిరీస్‌లో మూడో భాగంగా వస్తున్న 'వెల్‌కమ్ టు ది జంగిల్' చిత్రం కోసం. ఈ యాక్షన్ అడ్వెంచర్ కామెడీ డ్రామాను అహ్మద్ ఖాన్ తెరకెక్కిస్తున్నారు. అక్షయ్‌కుమార్, సంజయ్ దత్, సునీల్ శెట్టి, దిశా పటానీ, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, లారా దత్తా తదితరులతో కూడిన భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. వీరందరితో పాటు మరి కొందరు తారలు ఈ పాట చిత్రీకరణలో పాల్గొంటారట.

ఐమాక్స్ 3డీలో జై హనుమాన్



పాన్ ఇండియా సంచలనం 'హను-మాన్' చిత్రానికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' చిత్రం నిర్మించనున్నట్లు దర్శకుడు ప్రశాంత్ వర్మ ఇదివరకే ప్రకటించారు. స్ర్కిప్ట్ కూడా లాక్ చేశారు. భారీ తారాగణం, సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పని చేయనున్నారు. అయోధ్యలోని రామ మందిరం ప్రారంభోత్సవం రోజున ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు దర్శకుడు ప్రశాంత్ వర్మ ప్రారంభించారు. హనుమంతుడి జయంతి సందర్భంగా మంగళవారం కొత్త పోస్టర్ విడుదల చేశారు. డ్రాగన్‌లను తొలిసారిగా ఇండియన్ స్ర్కీన్ మీదకు తీసుకొస్తున్నారు ప్రశాంత్ వర్మ. అలాగే ఐమాక్స్ 3డీ ఫార్మెట్‌లో 'జై హనుమాన్' విడుదల కానున్నట్లు ఈ పోస్టర్ ద్వారా ఆయన వెల్లడించారు.

హంటర్ ఎంట్రీ



బాలకృష్ణ ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'ఎన్‌బీకె 109'. సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. మంగళవారం ఆయన ఈ సినిమా సెట్‌లో అడుగుపెట్టారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్‌మెంట్స్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. "హంటర్ ఎంట్రీ ఇచ్చారు. సెట్స్ లోకి స్వాగతం బాబీ డియోల్. మూవీలో మీ స్ర్కీన్ ప్రజన్స్ సినీ లవర్స్‌కి, బాలకృష్ణ అభిమానులకు పండగ వాతావరణాన్ని తీసుకురానుంది" అని పేర్కొంది.

పడమటి కొండల్లో ప్రేమకథ



అనురూప్ కటారి హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'పడమటి కొండల్లో'. నరేశ్ పెంట దర్శకత్వంలో జయకృష్ణ దురుగడ్డ నిర్మించారు. యశస్వి శ్రీనివాస్, శ్రావ్యారెడ్డి కీలకపాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం హీరో సాయి దుర్గ తేజ్ సోషల్ మీడియాలో ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ స్టిల్‌లో రక్తంతో తడిసిన కత్తిని పట్టుకొన్న హీరో గంభీరంగా కనిపించాడు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "పడమటి కొండల్లో' సినిమాతో సరికొత్త అనుభూతిని ప్రేక్షకులకు అందిస్తాం. ఇందులో యాక్షన్‌తో పాటు ప్రేమకథ ఆకట్టుకుంటుంది. అందమైన లొకేషన్లలో చిత్రీకరణ చేస్తాం. ఈ చిత్రానికి సంగీతం కూడా అందిస్తున్నాను' అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కన్నన్ మునిసామి.

ఆరంభం... ఆ రోజే



ఎమోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆరంభం' చిత్రం విడుదల తేదీ ఖరారైంది. మే 10న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు నిర్మాణ సంస్థ ఏవీటీ ఎంటర్టైన్‌మెంట్ మంగళవారం తెలిపింది. అజయ్ నాగ్ వి, దర్శకత్వంలో అభిషేక్ వీటి నిర్మిస్తున్నారు. మోహన్ భగత్, సుప్రీత సత్యనారాయణ, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ ప్రధాన తారాగణం. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వైవిధ్యమైన కథ, కథనాలతో ఈ చిత్రం తెరకెక్కించాం. కొత్త తరహా చిత్రాన్ని చూసిన అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సింజిత్ యెర్రమిల్లి. సినిమాటోగ్రఫీ: దేవ్‌దీప్ గాంధీ.

జులైలో డెడ్‌పూల్ హంగామా



మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో సూపర్ హీరో చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'డెడ్‌పూల్' సిరీస్ నుంచి రాబోతున్న తాజా చిత్రం 'డెడ్‌పూల్ అండ్ వోల్వారిన్'. ర్యాన్ రేనాల్డ్స్, హ్యూగ్ జాక్‌మాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. షాన్ లేవీ దర్శకుడు. మార్వెల్ స్టూడియోస్, 21 ల్యాప్స్ ఎంటర్టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జులై 26న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు నిర్మాణ సంస్థలు మంగళవారం తెలిపాయి. ఇంగ్లీష్‌తో పాటు హిందీ, తెలుగు భాషల్లోనూ అదే రోజున విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. డెడ్‌పూల్‌గా ర్యాన్‌రేనాల్డ్స్ తన యాక్షన్ హంగామాతో ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో ఎమ్మా కొరిన్, మోరెనా బక్కరిన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.

ఫ్యాంటసీ డ్రామా



సి.సుప్రీత్ కృష్ణ ఓ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోదాటి నటిస్తున్నారు. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీవరుణ్, శ్రీరాములు రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల వినూత్న రీతిలో ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం ఆవిష్కరించింది. ఈ పోస్టర్‌ను చూస్తుంటే ఓ గ్రామంలో జరిగే ఫ్యాంటసీ డ్రామాలా అనిపిస్తోంది. ఈ చిత్రానికి ఎడిటర్: అశ్వత్ శివకుమార్, సినిమాటోగ్రాఫర్: కార్తీక్ సాయికుమార్, సంగీతం: సంతు ఓంకార్.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 24-4-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
విజయవాడ సిటీ**

కాంగ్రెస్ వాటా.. ముస్లిం కోటా

రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ర్యాలీల్లో మోదీ ఫైర్

8



- దళితులు, ఆదివాసీల రిజర్వేషన్ల కత్తిరింపు!
- 2004లో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పైలట్ ప్రాజెక్టు
- 2011లో కూడా దేశవ్యాప్తంగా అమలుకు యత్నాలు
- మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం
- ఇప్పుడు కాంగ్రెస్ వస్తే.. మళ్లీ అదే ప్రయత్నం చేస్తుంది
- మీ ఆస్తులను ఎక్స్-రే చేసి ముస్లింలకు పంచుతుంది
- కర్ణాటకలో హనుమాన్ చాలీసా వినడం కూడా నేరమైంది
- దక్షిణాదిని వేరు చేయాలని కర్ణాటక నేత అంటారు: మోదీ
- ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు కొనసాగుతాయని వాగ్దానం

'టైటిల్'తో రైతన్నకు ఉరి!

ఒక చట్టం... ప్రజలకు మేలు చేయాలి. అన్నీ ఆలోచించి నిబంధనలు రూపొందించాలి. మరీ ముఖ్యంగా... భూములకు సంబంధించిన చట్టాలను అత్యంత జాగ్రత్తగా చేయాలి. కానీ... జగన్ సర్కారు తీరే వేరు! 'భూ యాజమాన్య హక్కు చట్టం' పేరుతో రైతుల భూములకు ఉరి వేశారు.


భూ యాజమాన్య హక్కు చట్టంతో సంకటం

మీ భూమి మీదైతే చాలదు! అన్ని పత్రాలూ ఉన్నా సరిపోదు! ఇంకెవరో మోసగాడు వచ్చి.. తప్పుడు పత్రాలు సృష్టించి మీ భూమిని తమ భూమిగా చెప్పుకొంటే చాలు! దానిపై మీకున్న అన్ని హక్కులూ పోయినట్లే! ఆ భూమిపై 'వివాదాస్పద' ముద్ర వేస్తారు. 'ఈ భూమి నాదే' అని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత మీదే!

జగన్ చేసిన చట్టం ప్రకారం భూ వివాదాలపై సివిల్ కోర్టులూ జోక్యం చేసుకోలేవు. 'నా భూమిని నాకు అప్పగించండి' అని రైతులు నేరుగా కోర్టులను ఆశ్రయించలేరు. 'పెదరాయుడు' తరహాలో రెవెన్యూ అధికారులే ట్రైబ్యునల్‌లో తీర్పులు చెబుతారు. రాష్ట్రస్థాయి ట్రైబ్యునల్‌లోనూ న్యాయం జరగకపోతే, హైకోర్టును ఆశ్రయించాల్సి ఉంటుంది.

జగన్ సర్కారు నిపుణులను సంప్రదించకుండా అడ్డగోలుగా ల్యాండ్ టైటిల్ తీసుకొచ్చింది. న్యాయ నిపుణుల అభ్యంతరాలను పట్టించుకోలేదు. ఇప్పటికే జగన్ సర్కారు చేపట్టిన భూముల రీ సర్వే వల్ల కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇక కొత్త చట్టం వల్ల మరెన్ని సమస్యలు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.

- అడ్డగోలుగా జగన్ సర్కారు తయారీ
- భూ హక్కులకే ఎసరు తెచ్చే ప్రమాదం
- కేంద్రం వద్దన్న అంశాలు చేర్చిన వైనం
- భూములపై వివాదాలు ఏర్పడితే రైతులు కోర్టులకు వెళ్లే అవకాశం లేదు
- ట్రైబ్యునల్స్ పేరిట రెవెన్యూకు పవర్
- వారి దయ ఉంటేనే రైతులకు హక్కులు
- అక్రమార్కులకు వంత పాడితే అంతే
- హక్కులకు హైకోర్టే రైతుకు దిక్కు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రైతుకు భూమితో విడదీయలేని అనుబంధం! అంగుళం కూడా కోల్పోవడానికి ఇష్టపడడు. ఎవరైనా వివాదం రాజేస్తే ఎంతదాకైనా పోరాటం చేసి భూమిని దక్కించుకుంటాడు. ఇదీ భూమిపై రైతుకున్న సెంటిమెంట్. అందుకే రైతుల భూముల పరిరక్షణ కోసం ప్రభుత్వాలు చట్టాలు తీసుకొచ్చాయి. ఇప్పుడున్న చట్టాలను పారదర్శకంగా, సమర్థంగా అమలు చేస్తే రైతుల కష్టాలు తీరుతాయి. అయితే, భూ వివాదాల పరిష్కారానికి భూముల సమగ్ర సర్వే చేపడతానని, 100 ఏళ్ల తర్వాత చాలా గొప్ప పనిచేస్తున్నానని ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారు. భూముల సర్వే పూర్తయ్యాక ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టం (ల్యాండ్ టైటిల్) తీసుకొస్తామన్నారు. కానీ భూముల సర్వే పూర్తికాకముందే సర్కారు టైటిల్ చట్టం అమల్లోకి తీసుకొచ్చింది. ఆ చట్టం రైతుల భూములకు ఉరివేసేలా ఉంది. భూమిపై పట్టాదారు పాసుపుస్తకాలు, ఆర్ఓఆర్, 1బీ, ఇతర రికార్డులు రైతు పేరిటే ఉన్నా, అవి నిజమైనవేనని నిరూపించుకోవాలి. ఆ భూమిపై ఎవరైనా వివాదం రాజేస్తే ఇక అంతే సంగతులు. అది తన భూమే

మిగతా 8వ పేజీలో...

జగన్‌కు మరో షాక్!



ఆంజనేయులు



కాంతిరాణా

'వీరభక్త' ఐపీఎస్‌లపై ఈసీ వేటు

ఇంటెలిజెన్స్ చీఫ్, విజయవాడ కమిషనర్ బదిలీ

- ఎన్నికలతో సంబంధంలేని విధుల్లోకి ఆ ఇద్దరు
- సత్వరం రిలీవ్ కావాలని ఆదేశాలు
- జగన్‌కు కళ్లూ చెవులుగా పీఎస్సార్ ఆంజనేయులు
- వైసీపీ రాగానే కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్రానికి
- కోడెలను ఇరికించడం నుంచి బాబు అరెస్టు దాకా!
- ఆది నుంచీ విపక్ష నేతలే లక్ష్యంగా విధులు
- జగన్‌పై ఈగవాలినా సహించని కాంతిరాణా
- ఐపీఎస్‌ల సంఘం తరపున తానే వకాల్తా
- విపక్షాలు, మీడియాపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు
- 'గులకరాయి' దర్యాప్తు తీరుపై విమర్శలు

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారుకు ఎన్నికల కమిషన్ మరో షాక్ ఇచ్చింది. ఎన్నికల వేళ గీత దాటి మరీ వైసీపీ సేవలో తరిస్తున్న మరో ఇద్దరు ఐపీఎస్‌లపై బదిలీ వేటు వేసింది. జగన్‌కు కళ్లు, చెవులుగా పనిచేస్తోన్న ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు, అదే స్థాయిలో స్వామి భక్తి ప్రదర్శిస్తున్న విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ కాంతి రాణా తాతాను ఎన్నికలతో సంబంధంలేని విధులకు బదిలీ చేయాలని మంగళవారం ఆదేశించింది. వీరిద్దరి స్థానంలో కొత్త అధికారుల నియామకం కోసం... ముగ్గురేసి పేర్లతో బుధవారం మధ్యాహ్నం 3 గంటల్లోపు జాబితా పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని ఆదేశించింది. వీరిద్దరూ సత్వరం తమ కిందిస్థాయి అధికారులకు

మిగతా 12వ పేజీలో...

ఇళ్లల్లోకి దూరండి!

9

- ఇష్టారాజ్యంగా తనిఖీలు చేయండి
- జగన్ వచ్చే దారిలో ఎవరినీ వదలొద్దు
- వంటింట్లో కత్తులూ ఉపేక్షించొద్దు
- పోలీసులకు అసాధారణ అధికారాలు
- ఉత్తర్వులు జారీ చేసిన హోం శాఖ
- గులకరాయి దెబ్బతోనేనని వివరణ
- ఎన్నికల వేళ విపక్షాల ఇళ్లే టార్గెట్?

నోటీసులిచ్చినా అదే నోటి దురుసు

సిద్ధం సభల్లో ఇష్టమొచ్చినట్టు జగన్ వ్యాఖ్యలు

- ఇష్టారీతిన ఎన్నికల కోడ్ ఉల్లంఘన
- పైగా ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యంలో మామూలేనట!
- ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదు
- ఆయనపై తదుపరి చర్యలు తీసుకోండి
- కేంద్ర ఎన్నికల సంఘానికి మీనా నివేదిక

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ ఇష్టారీతిన ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారని కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా నివేదించారు. ఇప్పటికే ఒకసారి కోడ్ ఉల్లంఘనపై నోటీసులిచ్చినప్పటికీ ఆయన తీరు మారలేదని స్పష్టంగా

మిగతా 9వ పేజీలో...

1న ఇంటింటికీ పింఛన్ అందాలి

లేదంటే అది ప్రభుత్వ కుట్రే: పవన్

- సీఎస్, డీజీపీ అడ్డంకులు సృష్టించకుంటే పెన్షన్ ఇంటికే చేరుతుంది
- వైసీపీ రేబిస్ సోకిన కుక్క
- ఎవరిని పడితే వారిని కరుస్తోంది
- జగన్ అవినీతి మాకెందుకని జనం అనుకుంటే పొరపాటే
- ఐదేళ్లలో సొంత పత్రికకు రూ.930 కోట్లు దోచిపెట్టాడు
- ఆయన వద్ద లక్ష కోట్లు
- అదంతా ప్రజలదే
- సజ్జలా.. చిరంజీవి గురించి ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు
- జనసేనాని హెచ్చరిక
- పిఠాపురంలో నామినేషన్
- ఉప్పాడలో భారీ బహిరంగ సభ



నామినేషన్ వేయడానికి ర్యాలీగా వెళ్తూ టీడీపీ, జనసేన జెండాలతో పవన్

కాకినాడ-ఆంధ్రజ్యోతి/పిఠాపురం, ఏప్రిల్ 23: ఈ ఒకటో తారీఖున ఇంటింటికీ సామాజిక పింఛన్లు తీసుకెళ్లి ఇవ్వకుంటే దాని వెనుక ప్రభుత్వ కుట్ర ఉన్నట్లేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. చీఫ్ సెక్రటరీ, డీజీపీ, ఇతర అధికారులు అడ్డంకులు సృష్టించకుంటే పింఛన్ ఇంటికే చేరుతుందన్నారు. వైసీపీ రేబిస్ సోకిన కుక్క. రాష్ట్రంలో అది ఎవరిని పడితే వారిని కరుస్తోందని నిప్పులు చెరిగారు. కాకినాడ జిల్లా పిఠాపురం

మిగతా 7వ పేజీలో...

గజపతినగరంలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రబాబు



డ్వాక్రాలకు 10 లక్షలు

వడ్డీ లేని రుణాలిస్తాం: చంద్రబాబు

- మహిళలకు స్థానిక రిజర్వేషన్ల ఘనత టీడీపీదే.. చట్ట సభల్లోనూ కోటాకు కృషి
- ఆస్తిలో సమాన హక్కు కల్పించాం.. మహిళలతో మరిన్ని స్కీంలు అమలు చేయిస్తాం
- వారిని లక్షాధికారులను చేస్తాం.. ఎంత మంది పిల్లలున్నా అందరికీ తలో 15 వేలు
- ప్రతి మహిళకూ నెలకు 1,500.. ఐదేళ్లలో వాటిని 9 లక్షలు చేసే బాధ్యత నాదే
- ఆర్టీసీ బస్సుల్లో వారికి ఉచిత ప్రయాణం.. ఏటా మూడు ఉచిత సిలిండర్లు
- పెంఛన్ ఏప్రిల్ నుంచే 4 వేలు.. విద్యుత్ చార్జీలు పెంచం.. చెత్త పన్ను రద్దు
- పెట్రో, నిత్యావసరాల ధరల నియంత్రణ.. జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేదు
- ఉత్తరాంధ్రను గంజాయి రాజధాని చేశాడు.. పిల్లలను బానిసలను చేస్తున్నాడు
- జే బ్రాండ్ మద్యంతో చంపుతున్నాడు.. ప్రజాగళంలో టీడీపీ అధినేత ధ్వజం
- పాతపట్నం, ఆమదాలవలసల్లో భారీ సభలు.. బొండపల్లిలో మహిళాగళం

శ్రీకాకుళం/విజయనగరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు రూ.10 లక్షల వరకు అందిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. తద్వారా వారిని సంపాదనపరులుగా, లక్షాధికారులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. దీనికి స్పష్టమైన ఆలోచనలు తన వద్ద ఉన్నాయన్నారు. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. మంగళవారం ఆయన శ్రీకాకుళం జిల్లా

మిగతా 12వ పేజీలో...

ఏమని చెప్పను షెల్లెమ్మా!

వ్యాపారవేత్తగా తన ప్రస్థానంపై జగన్ మౌనం

- యువతి ప్రశ్నకు దిక్కులు చూసిన ముఖ్యమంత్రి
- సజ్జల భార్గవ కల్పించుకుని సొంత సమాధానం
- ఆంత్రప్రెన్యూర్‌గా జగన్ జీవితం ఇన్‌స్పైరింగట
- ఇంటర్నెట్‌లో చూసి తెలుసుకోవాలని సలహా

12



వ్యాపార ప్రస్థానంపై యువతి ప్రశ్నకు సమాధానమివ్వకుండా దిక్కులు చూస్తున్న జగన్

అంటే.. ఎన్డీయేకే జగన్ జై!

ఉక్కు కార్మికులతో భేటీలో పరోక్షంగా అంగీకారం

- ఎన్డీయేకు మెజారిటీ సీట్లు రాకపోతే వైసీపీ ఎంపీల మద్దతు
- అప్పుడు ఉక్కు సమస్య పరిష్కారానికి అవకాశం.. కార్మిక నేతలతో జగన్ వ్యాఖ్యలు
- స్టీల్‌ప్లాంటు నష్టాల్లో ఉందా అని అమాయక ప్రశ్న!.. గనుల రెన్యువల్‌కు నిరాకరణ
- విద్యుత్ బిల్లుల చెల్లింపు గడువుకూ హామీ ఇవ్వని వైనం

7

ఎందరి పుస్తెలు తెంచావు జగన్?

- మద్య నిషేధమని చెప్పి మద్యం వ్యాపారివయ్యావు
- జనానికి చివరకు చిప్ప, గుండు సున్నా మిగిల్చావు
- పులి కడుపున పిల్లి పుట్టింది.. జగన్‌పై ఎద్దేవా
- రాష్ట్రంలో దొంగల రాజ్యం.. దోపిడీ రాజ్యం
- తెనాలి, కర్లపాలెం బహిరంగ సభల్లో షర్మిల ధ్వజం

12



కడప జిల్లా కోర్టు గీత దాటింది!

- విచారణ పరిధి దాటి ఉత్తర్వులు.. హైకోర్టులో వివేకా కుమార్తె సునీత, టీడీపీ నేత బీటెక్ రవి పిటిషన్లు
- వివేకా హత్యపై ప్రజా బాహుళ్యంలోని వివరాలనే ప్రస్తావించాం
- వ్యాఖ్యలపై అభ్యంతరం ఉంటే ఈసీని ఆశ్రయించాలి
- నేరుగా దావా వేయడం చెల్లదు.. ఓ పార్టీకి అనుచిత లబ్ధి చేకూర్చేలా కడప కోర్టు ఆదేశాలు.. రద్దు చేయాలని అభ్యర్థన

9

ఐదేళ్లూ ఎక్కడ ఉన్నావ్.. ఎప్పుడు విన్నావ్?

ఎన్నికల ప్రేమలు 2.0

రెక్కలు.. ముక్కలు

భవన నిర్మాణ రంగాన్ని

కూల్చేశారు!

60 లక్షల మందిని వేధించిన జగన్



10 11

సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..

ఆ నిబంధన ఎందుకు తొలగించారు?

- పతంజలి కేసులో కేంద్రాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు
- డీఎంఆర్ యాక్ట్‌లోని రూల్ నంబర్ 170 ప్రకారం చర్యలు తీసుకోవద్దంటూ రాష్ట్రాలకు కేంద్రం లేఖ
- ఆ లేఖపై వివరణ ఇవ్వాలని ఆయుష్ శాఖకు ఆదేశం
- పతంజలి 'క్షమాపణ' ప్రకటనల పరిమాణంపై ఆరా

9

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

బాధ్యతారాహిత్యం

రాజస్థాన్‌లోని బన్స్‌వారాలో ఏప్రిల్ 21వ తేదీన ఎన్నికల ప్రచార సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్న మాటలు సామాన్యమైనవి కావు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే కాక, అనేక ప్రజాస్వామిక, హక్కుల సంఘాలు కూడా ఆ మాటల మీద ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయంటే, అందులో ఆశ్చర్యమేమీ లేదు. చిన్నస్థాయి నాయకులు ఎవరన్నా అటువంటి వ్యాఖ్యలు చేయడం ఆనవాయితీ అయిపోయింది కానీ, సాక్షాత్తూ నరేంద్రమోదీయే ఇంతటి తీవ్రంగా మాట్లాడడం ఆయన అభిమానులకు, బీజేపీ శ్రేణులకు కూడా జీర్ణం కావడం లేదు. పెద్ద పెద్ద పదవులలో ఉన్నవారు, దేశానికి, భారత సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ఇట్లా మాట్లాడి, తమ గౌరవాన్ని తగ్గించుకోవడం, దేశప్రతిష్ఠను దిగజార్చడం అన్యాయమని మేధావులు, పౌరసమాజం ప్రముఖులు ఆవేదన చెందుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే, అది సంపదనంతా ముస్లిములకు పంచిపెడుతుందని మోదీ అన్నారు. పిల్లలెక్కువగా కనేవాళ్ళు, చొరబాటుదార్లు, అని కూడా ముస్లిములను దృష్టిలో పెట్టుకుని మోదీ వ్యాఖ్యానించారు. సంపదను ముస్లిములకు పంచిపెట్టడమనే వాదనకు మూలం, ప్రస్తుత ఎన్నికల కోసం కాంగ్రెస్ ప్రకటించిన మేనిఫెస్టోలో ఉన్నదేమో అనుకుంటే పొరపాటు. ఎప్పుడో పద్ధెనిమిది సంవత్సరాల కిందట అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ జాతీయాభివృద్ధి మండలిలో చేసిన వ్యాఖ్యలను విచిత్రంగా అన్వయించి, మోదీ తన వాదనకు ఉపయోగించుకున్నారు. షెడ్యూల్డు కులాలు, తెగలు, మైనారిటీలు, స్త్రీలు, పిల్లలు, ఈ శ్రేణుల అభివృద్ధి కోసం చేయవలసిన ప్రణాళికారచన గురించి, మౌలికసదుపాయాల కల్పన గురించి ప్రస్తావిస్తూ, మన్మోహన్ సింగ్, అభివృద్ధి ఫలాలలో మైనారిటీలు న్యాయమైన భాగం పొందడానికి సృజనాత్మకంగా పథకరచన చేయాలని అన్నారు. వనరులను ప్రాధాన్య ప్రాతిపదికన పొందే హక్కు వారికి ఉండాలని కూడా అన్నారు. ఆ మాటలనే ఇప్పుడు తన తీవ్ర వ్యాఖ్యలకు ఇంధనంగా ఉపయోగించుకున్నారు. మన్మోహన్ మాటలకూ, మోదీ వ్యాఖ్యానానికీ ఏమైనా పొంతన ఉన్నదా అని ఆశ్చర్యం కలుగుతున్నది. మరుసటి రోజు కేంద్రహోంమంత్రి అమిత్ షా మరో సభలో మాట్లాడుతూ, వనరుల మీద మొదటి హక్కు ఆదివాసులకు, దళితులకు, ఓబీసీలకు ఉన్నదని వ్యాఖ్యానించారు. ముస్లిములను ఆయన మినహాయించారు. మోదీ తాను అన్న మాటలు అప్రదిష్ఠ కలిగిస్తాయని గుర్తించారో ఏమో తన వ్యక్తిగత వెబ్‌సైట్‌లో వాటిని తొలగించి, తక్కిన ప్రసంగం పోస్ట్ చేశారు. తరువాత రోజు కాంగ్రెస్ పార్టీ మీద మరోసారి అటువంటి ఆరోపణే చేశారు. ప్రజల దగ్గర ఉన్న ఆస్తులను, బంగారాన్ని, నగలను ఆ పార్టీ లాగేసుకుంటుందని, దానిది మావోయిస్టు తరహా అని స్త్రీలను భయభ్రాంతులను చేసే విధంగా నిందించారు. కులగణనలో భాగంగా సామాజికార్థిక వివరాలను సేకరిస్తారనే కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రస్తావనను, ఆస్తుల వివరాలను సేకరించి అపహరిస్తారనే విధంగా వ్యాఖ్యానించారు. విమర్శించడం వేరు. వక్రీకరించడం వేరు.

సమాజంలోని ఒక వర్గం మీద తక్కిన ప్రజలకు ద్వేషాన్ని, వ్యతిరేకతను పెంచే వ్యాఖ్యలను ఎప్పుడూ ఎవరూ చేయకూడదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అసలే చేయకూడదు. ప్రజాప్రాతినిధ్యచట్టం సెక్షన్ 123(3), 123(3ఎ) ప్రకారం మతం, జాతి, కులం, భాష తదితర ప్రాతిపదికలమీద ఓటు వేయమని కానీ, వేయవద్దని కానీ చెప్పడం నేరం, పౌరులలో ద్వేషభావాన్ని, శత్రుత్వాన్ని రెచ్చగొట్టడం శిక్షార్హం. నేరం నిరూపణ జరిగితే, ఎన్నికలలో పోటీచేయకుండా ఆరేళ్లపాటు నిషేధించే అవకాశం ఉంది. ఎన్నికల సంఘం నిర్దేశించే నమూనా ప్రవర్తనా నియమావళి ప్రకారం కూడా, ప్రజలలో ఇప్పటికే ఉన్న వైషమ్యాలను పెంచడం కానీ, కొత్తవి కల్పించడం కానీ అనైతికం. చట్టాన్ని, నియమావళిని కూడా ఉల్లంఘించిన ఆరోపణలను స్వయంగా ప్రధానమంత్రి ఎదుర్కొనవలసిరావడం విచారకరం. ఈ విషయంలో ఇప్పటిదాకా ఎన్నికల సంఘం స్పందన కర్తవ్యనిష్ఠకు తగినట్టుగా కనిపించడం లేదు. మునుముందు ఎట్లా వ్యవహరిస్తుందో చూడాలి. దేశవ్యాప్తంగా ఈ వివాదం మీద వ్యక్తమవుతున్న ఆందోళనను గమనిస్తే, న్యాయవ్యవస్థ కూడా కల్పించుకోవలసిన పరిస్థితి రావచ్చుననిపిస్తుంది.

ఈ సారి బీజేపీ అభ్యర్థుల ఎంపికలో కొన్ని జాగ్రత్తలు పాటించి, గతంలో హద్దుమీరి మాట్లాడిన, వ్యవహరించిన వివాదాస్పదులైన నాయకులను పక్కనపెట్టింది. మరి మోదీ ఇప్పుడు, రెండో దశ పోలింగ్ ముందు ప్రచారంలో ఎందుకిటువంటి తీవ్ర ప్రచారానికి పాల్పడినట్టు? మొదటి దశ పోలింగ్ తీరు నిరాశ కలిగించిందా? మొత్తంగా ఉత్తరాదిలో, ప్రజాస్పందన గత ఎన్నికలకు భిన్నంగా కనిపించిందా? ఓటింగ్ శాతాలు తక్కువగా ఉండడం బీజేపీకి అనుకూల సంకేతాలా? అనుకూల ఓటర్ల నిరాసక్తతా? ఈ ప్రశ్నలనేకం ఉత్పన్నమవుతున్నాయి. నిన్నటి దాకా 400 సీట్ల లక్ష్యం గురించి మాట్లాడినవారు, ఇప్పుడు ఆకస్మాత్తుగా కాంగ్రెస్ అధికారానికి వచ్చే అవకాశం గురించి ఎందుకు జనాలను హెచ్చరిస్తున్నట్టు? అంచనాలలో ఏమి మార్పు వచ్చింది? ఒకవేళ, కొంత ఎదురుగాలి వీస్తున్నట్టు అనిపించినా, భయాందోళనలతో చివరి నిమిషంలో బాధ్యతారహితమైన ప్రచారాలకు ఒడిగట్టడం, పదేళ్లకు పైగా అధికారంలో ఉన్న పార్టీ స్థాయికి తగినది కాదు.

అమరావతితోనే అభివృద్ధి సాధ్యం

ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నా, అన్నిరంగాల్లో ప్రగతిపథంలో దూసుకుపోవాలన్నా రాజధాని అనేది చాలా కీలకం. ఒక దేశానికి గానీ, ఒక రాష్ట్రానికి గానీ రాజధాని నగరంతోనే ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. అందుకే విభజిత ఆంధ్రప్రదేశ్‌కు కూడా మహర్దశను పట్టించే రీతిలో బ్రహ్మాండమైన రాజధాని నిర్మించాలని చంద్రబాబు నాయుడు సారథ్యంలోని తెలుగుదేశం ప్రభుత్వం సంకల్పించి అమరావతి నిర్మాణం చేపట్టింది. అయితే రాష్ట్రప్రజల ఆశలను ఛిద్రం చేస్తూ, వారి ఆకాంక్షలను చిదిమేస్తూ జగన్ ప్రభుత్వం మూడు రాజధానులంటూ తీసుకున్న తుగ్లక్ నిర్ణయం అమరావతికి శరాఘాతంగా పరిణమించింది. ఈ నిర్ణయాన్ని మేధావులు, రైతుసంఘాలు, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, ప్రజలు ఐదేళ్ళ నుంచి ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూనే ఉన్నారు. అమరావతి నుంచి రాజధానిని మార్చి మూడు ముక్కలు చేయడమంటే రైతులకు వెన్నుపోటు పొడిచి రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని, దీనివల్ల ఏ ప్రాంతమూ అభివృద్ధి చెందదని ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అధికారంలోకి వస్తే అందరూ మెచ్చే రాజధానిని నిర్మిస్తామని 2019 ఎన్నికలకు ముందు జగన్ రాజధాని పరిసరగ్రామాల్లో పర్యటించినప్పుడు ఊదరగొట్టారు. రాజధానిని కేవలం 19 గ్రామాలకు పరిమితమయ్యేలా నగరపాలకసంస్థ ఏర్పాటుకు ప్రయత్నించడం, అమరావతి బృహత్ ప్రణాళికను దెబ్బతీసే కుట్రలు చేయడం వంటి ఎన్నో అరాచకాలకు పాల్పడుతూ, రాష్ట్రానికి రాజధాని అనేదే లేకుండా చేశారు.

ప్రజారాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన 29 వేల మంది రైతులను జగన్ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో అవమానించని రోజంటూ లేదు. 29 గ్రామాల పరిధిలో భూసమీకరణ కింద 34,322 ఎకరాల భూములు ఇచ్చిన 29,881 మందిలో చిన్న సన్నకారు రైతులే ఎక్కువ. ఈ ఐదేళ్ల వారు పడ్డ బాధలు వర్ణనాతీతం. కడుపునిండా తిండికి, కంటినిండా నిద్రకు నోచుకోని వీరిని పోలీసులు అడుగడుగునా దాడులు, అక్రమ కేసులు, అవమానాలతో వేధించారు. ఆ రైతులు ఎలాంటి దీక్షలు, ఆందోళనలు చేయడానికి వీల్లేదన్నట్టుగా జగన్ సర్కార్ నిరంకుశంగా వ్యవహరిస్తూ ఐదేళ్లలో వారిపై 800కు పైగా కేసులు బనాయించింది. దాదాపు 280 మంది రైతులు గుండెలు బద్దలై చనిపోయినా జగన్ సర్కార్ మనసు కరగలేదు. కౌలు చెల్లించకుండా వేధించటం, అసైన్డ్ భూముల రైతులకు వార్షిక కౌలును నిలిపివేయటం, భూసమీకరణ ఒప్పందంలో భాగంగా రైతులకు ఇవ్వాల్సిన స్థలాలను అభివృద్ధి చేయకుండా నిలిపివేయడం వంటి వికృత చర్యలకు పాల్పడింది. 144, 40సెక్షన్లు విధించి గ్రామాలను అష్టదిగ్బంధం చేస్తూ దొంగతనాల పరంపర కొనసాగించింది. కాంట్రాక్టు ఏజెన్సీలు నిల్వ చేసుకున్న కంకరను, మట్టిని అధికార పార్టీ నేతలు మాయం చేశారు. నిర్మాణాల్లోని ఇనుపచువ్వలు, ఇసుక, మట్టి తరలించుకుపోయారు. మాస్టర్ ప్లాన్‌ను విచ్ఛిన్నం చేస్తూ ఇతర ప్రాంతాలకు చెందినవారికి రాజధానిలో ఇళ్లస్థలాలు ఇవ్వడం, ఆర్-5 జోన్ ఏర్పాటుచేయడం, రైతులు ఇచ్చిన భూములను ఇష్టానుసారంగా అమ్మేయటం వంటి ఎన్నో చర్యలకు పాల్పడింది.



రాబోయే 50 ఏళ్లలో ప్రపంచం ఎలా ఉండబోతుంది అనేదానికి అమరావతి అద్దం పడుతుందని ఆర్కిటెక్చరల్ డైజెస్ట్ అనే పత్రిక ఇటీవల పేర్కొంది. అలాంటి ప్రజారాజధాని నిర్మాణాన్ని మధ్యలో ఆపేయటంతో వందలాది భవనాలు, రోడ్లు, పదుల సంఖ్యలో ప్రాజెక్టులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అమరావతికి వస్తున్న ప్రజానీకం ఆ నిర్మాణాల పరిస్థితిని, చెట్లు పొదలతో నిండి పాడుబడ్డట్టు ఉన్న రాజధాని ప్రాంతాన్ని చూసి ఎంతో కలత చెందుతున్నారు. ప్రజలు, న్యాయస్థానాలు మూడు రాజధానుల విధానాన్ని అడ్డుకోవడంతో జగన్ అరాచకపు అజెండాకు కొంతమేర అడ్డుకట్ట పడినా రాష్ట్ర భవిష్యత్తు కోసం నిర్మించ తలపెట్టిన అమరావతిని పూర్తి చేయలేని పాలకుడిని త్వరగా ఇంటికి పంపిస్తే మంచిది.


రాజధానిగా అమరావతిని కాపాడుకోవడానికి స్థానిక రైతులు సాగించిన ఉద్యమం దేశ ఉద్యమాల చరిత్రలోనే చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. కరోనాలు, తుఫానులు, నిర్బంధాలు, కర్ఫ్యూలు, పోలీసుల దౌర్జన్యాలు, దాష్టీకాలు, అక్రమ కేసులు, అరెస్టులు, వేధింపులు, లాఠీలదెబ్బలు ఇలా ఎన్ని ఆటంకాలు వచ్చినా అన్నదాతల పోరాటం అవిశ్రాంతంగా కొనసాగుతూనే ఉంది. రాబోయే 50 ఏళ్లలో ప్రపంచం ఎలా ఉండబోతుంది అనేదానికి అమరావతి అద్దం పడుతుందని ఆర్కిటెక్చరల్ డైజెస్ట్ అనే పత్రిక ఇటీవల పేర్కొంది. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రపంచస్థాయి నగరంగా అవతరించబోతున్న ఆంధ్రుల కలల రాజధానిని ఉద్దేశపూర్వకంగా పాడుబెట్టారు. అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాల్లో కూడా ఎక్కడా లేవు. రాజధాని మార్పు వల్ల ఎక్కువగా నష్టపోయేది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలేనని గుర్తించాలి. మరోవైపు అమరావతిలో పూర్తికాని నిర్మాణాలు పూర్తయినట్లు చూపించి వాటిలో అధికారులు, ప్రజాప్రతినిధులు నివాసం ఉంటున్నట్లుగా తప్పుడు జీవోలతో బ్యాంకులను బురిడీ కొట్టించే కుట్రలకు జగన్ ప్రభుత్వం పాల్పడుతోంది.

దేశంలోని ఏ రాష్ట్ర రాజధానిని తీసుకున్నా అది ఆ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు నందిస్తోంది. ముంబాయి వాణిజ్యకేంద్రంగా అభివృద్ధి చెందడం వల్ల మహారాష్ట్రకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. కోల్‌కతా దేశంలోనే అత్యుత్తమైన ప్రాంతంగా అభివృద్ధి చెందింది. హైదరాబాద్ ఐటి పరిశ్రమలు, ఫార్మాకంపెనీలు, విద్యాసంస్థలకు వేదికగా మారడంతో ఆ రాష్ట్రానికి అత్యంత కీలకమైన ఆదాయ వనరుగా మారింది. బెంగళూరు ఐటి పరిశ్రమలకు వేదికగా నిలవడంతో కర్ణాటకకు ప్రత్యేక ఆదాయాన్ని సమకూరుస్తోంది. విద్యాసంస్థలకు, వ్యాపారాలకు చెన్నై కేంద్రంగా ఉండి తమిళనాడు అభివృద్ధికి తోడ్పడుతోంది. అయితే ఆంధ్రప్రదేశ్‌కు ఉపాధి, సంపద సృష్టించే రాజధాని లేకపోవడంతో నేడు రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే అట్టడుగు స్థాయికి చేరింది.

ప్రజా రాజధాని నిర్మాణాన్ని మధ్యలో ఆపేయటంతో వందలాది భవనాలు, రోడ్లు, పదుల సంఖ్యలో ప్రాజెక్టులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అమరావతికి వస్తున్న ప్రజానీకం ఆ నిర్మాణాల పరిస్థితిని, చెట్లు పొదలతో నిండి పాడుబడ్డట్టు ఉన్న రాజధాని ప్రాంతాన్ని చూసి ఎంతో కలత చెందుతున్నారు. వేల కోట్ల ప్రజాధనాన్ని నాశనం చేసేశాడని జగన్‌ను దుమ్మెత్తిపోస్తున్నారు. ప్రజలు, న్యాయస్థానాలు మూడు రాజధానుల విధానాన్ని అడ్డుకోవడంతో జగన్ అరాచకపు అజెండాకు కొంతమేర అడ్డుకట్ట పడినా రాష్ట్ర భవిష్యత్తు కోసం నిర్మించ తలపెట్టిన అమరావతిని పూర్తి చేయలేని పాలకుడిని ఎంత త్వరగా ఇంటికి పంపిస్తే అంత మంచిది. ధర్మంపై అధర్మం ఎప్పటికీ విజయం సాధించదు. కుట్రలు, కుతంత్రాలు, కుయుక్తులతో అమరావతిని నాశనం చేయాలన్న జగన్ లక్ష్యానికి అడ్డుకట్ట వేసేది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనని అందరూ గ్రహించాలి.

● పెమ్మసాని చంద్రశేఖర్
గుంటూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి

నేతల భావ దారిద్ర్యం.. ఓటర్ల ఉదాసీనత





■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

అడుగు బయటికి పెడితే చాలు, వేడి గాలులు వేగంగా ముఖానికి తగులుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో సహా అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 42 నుంచి 46 డిగ్రీల మధ్య కొనసాగుతున్నాయి. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని జాతీయ విపత్తు నిర్వహణా సంస్థ (ఎన్డీఎంఏ) ప్రజలను హెచ్చరించింది. ఇలాంటి పరిస్థితుల్లో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో నేతలు తమ భవిష్యత్తును పరీక్షించుకునేందుకు ప్రజల మధ్య చెమటోడ్చి తిరుగుతున్నారు. చాలా చోట్ల ఎండిపోతున్న పంటలు, బోరు బావులు, కరువు పరిస్థితులు, మంచినీటి సమస్య, విద్యుత్ కోతల మధ్య ప్రజలు నేతల ప్రసంగాలను ఉదాసీనంగా వింటున్నారు. ఒకరు సామాజిక న్యాయం గురించి మాట్లాడుతుంటే మరొకరు అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారు. రైతులు, రైతుకూలీలే కాక, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న రోడ్లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారు. ప్రయాణీకులకోసం ఆశగా ఎదురు చూసే ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు, సెవెన్ సీటర్లు నడుపుకునేవారు, జోమాటో, స్విగ్గీ వంటి సంస్థల్లో పనిచేసే ప్లాట్ ఫారమ్ వర్కర్లు మండుటెండల్లో జీవనోపాధి చేసుకోవాల్సిందే. నీతీ ఆయోగ్ నివేదిక ప్రకారమే వీరు మొత్తం శ్రమజీవుల్లో 80 శాతం పైగా ఉంటారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వీరి జీవన పరిస్థితులు మెరుగుపడే అవకాశాలు తక్కువే.

ఈ పరిస్థితుల్లో తొలి దశలో 102 స్థానాలకు జరిగిన ఎన్నికలు చాలా పేలవంగా, అనాసక్తికరంగా జరగడంలో ఆశ్చర్యం లేదు. గతంలో కంటే ఈసారి నాలుగు శాతం తక్కువే ఓటింగ్ జరిగింది. దేశంలో ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడిందని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఇవే చివరి ఎన్నికలు అని ఇండియా కూటమి ప్రచారం చేస్తే, ఒక అధునాతన భారత నిర్మాణం కోసం తాను కృషి చేస్తున్నానని, 2047 కల్లా అగ్రరాజ్యంగా మార్చడమే తన లక్ష్యమని మోదీ ప్రచారం చేస్తున్నారు. కాని ఈ ప్రచారాలేవీ ఓటర్లపై ప్రభావం చూపడం లేదు. దేశ భక్తి, జాతీయ వాదం, వికసిత్ భారత్, సామాజికన్యాయం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఫాసిజం, లౌకిక వాదం వంటి పదాలు నేతల పెదాల నుంచి బయటపడి గాలిలో కలిసిపోతున్నాయి. కాని ఓటర్లు నిర్లిప్తంగా, నిర్వికారంగా, నిశ్చల దృక్కులతో అన్ని ప్రసంగాలను వినడం తప్ప చేయదగింది ఏమీ లేదు. మండుటెండలు, తమ ఈతిబాధల కన్నా నాయకుల భావ దారిద్ర్యాన్ని చూసే ఎన్నికల పట్ల వారు ఏవగింపు ప్రదర్శిస్తున్నారేమో అనిపిస్తోంది.

ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడిందని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఇవే చివరి ఎన్నికలు అని ఇండియా కూటమి హెచ్చరిస్తుంటే, 2047 కల్లా భారత్‌ను అగ్రరాజ్యంగా మార్చడమే తన లక్ష్యమని ప్రధాని మోదీ ప్రచారం చేస్తున్నారు. ఎవరి మాటలూ ఓటర్లపై ప్రభావం చూపడం లేదు. దేశ భక్తి, జాతీయ వాదం, వికసిత్ భారత్, సామాజికన్యాయం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఫాసిజం, లౌకిక వాదం వంటి పదాలు నేతల పెదాల నుంచి బయటపడి గాలిలో కలిసిపోతున్నాయి. ఓటర్లు నిర్లిప్తంగా, నిర్వికారంగా, నిశ్చల దృక్కులతో అన్ని ప్రసంగాలను వింటున్నారు.

గత ఎన్నికల్లో బీజేపీ మొత్తం సీట్లు గెలుచుకున్న మధ్యప్రదేశ్‌లో 20 ఏళ్లలో తొలిసారి తక్కువ ఓటింగ్ జరిగింది. రాజస్థాన్‌లో ఓటింగ్ 64 నుంచి 57 శాతానికి పడిపోయింది. బిహార్ లాంటి చోట్ల కేవలం 53 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. మోదీ అనేకసార్లు పర్యటించినా తమిళనాడులో గతంలో కంటే తక్కువ ఓటింగ్ శాతం నమోదైంది. కేవలం వేడి గాలులు, మండుటెండల వల్ల ఓటింగ్ శాతం తగ్గిందేమో అనుకుంటే ఉత్తరాఖండ్ వంటి పర్వత ప్రాంతాల్లో కూడా గతంలో కంటే ఆరు శాతం తక్కువగా నమోదైంది. ఓటు హక్కు విలువ గురించి సినిమా తారలనుంచి ఎందరో సెలబ్రిటీలతో ఉధృతంగా ప్రచారం చేయించినా ప్రయోజనం కనపడడం లేదు.

తన అద్భుత ప్రసంగాలకు ప్రజలు పరవశులై భారత దేశాన్ని శక్తిమంతమైన దేశంగా మార్చేందుకు పెద్ద ఎత్తున ముందుకు వస్తారని భావించి పెద్ద సంఖ్యలో ఓటు వేస్తారని భావించిన మోదీ మొదటి దశలో ఓటింగ్ జరిగిన తీరును చూసి నిరాశకు గురయ్యే ఉంటారు. యువ ఓటర్లను, ప్రధానంగా తొలిసారి ఓటర్లైన వారిని ఆకర్షించేందుకు ఆయన పదే పదే చేసిన ప్రసంగాలు వృథా అయినట్లు కనిపిస్తోంది. నిజానికి 18 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువతలో కేవలం 38 శాతం మంది మాత్రమే ఓటు హక్కుకు నమోదు చేసుకోవడమే ఈ దేశంలో యువతలో ఎన్నికల రాజకీయాల పట్ల ఏర్పడుతున్న అనాసక్తికి నిదర్శనం. మోదీ అధికారంలోకి వచ్చిన కొత్తలో ఆయన ఎక్కడకు వెళ్లినా 'మోదీ, మోదీ' అని నినాదాలిచ్చిన యువత ఎక్కడకు వెళ్లింది? మోదీ పట్ల యువతకు ఆసక్తి తగ్గిపోతోందా? పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న తీరు, మోదీ ఏకచత్రాధిపత్యం, ఎన్నికల్లో అక్రమాలు, అభ్యర్థులు, ప్రజాప్రతినిధుల కొనుగోళ్లు, ప్రభుత్వ దర్యాప్తు సంస్థల దుర్వినియోగం ఇవన్నీ ప్రజలకు ముఖ్యంగా యువతకు వ్యవస్థల తీరు పట్ల ఏహ్యభావం పుట్టిస్తున్నాయా?

ఎన్నికల ప్రక్రియ ఒక ప్రహసనంగా మారడం కూడా ఓటర్ల ఉదాసీనతకు కారణమేమో. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడాల్సి ఉన్నప్పటికీ సూరత్‌లో బీజేపీ అభ్యర్థి ముఖేశ్ దలాల్ గెలిచినట్లు ఎన్నికల కమిషన్ ఏకగ్రీవంగా ప్రకటించింది. కాంగ్రెస్ అభ్యర్థి నిలేష్ కుంభాని తనను ప్రతిపాదించిన ముగ్గురిలో ఒక్కరిని రిటర్నింగ్ అధికారి ముందుకు తీసుకువెళ్లడంలో విఫలమయ్యారు. దీనితో ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. ఆ వెంటనే పోటీలో ఉన్న బిఎస్‌పి అభ్యర్థి సహా మిగతా 8 మంది నాటకీయంగా తమ నామినేషన్లనూ ఉపసంహరించుకున్నారు. ఈ పరిణామం తర్వాత నీలేష్ కుంభానీ అదృశ్యమయ్యారు. ఎవరికీ ఫోన్‌లో కూడా దొరకకుండా తప్పించుకున్నారు. ఆయన ఇంటిముందు కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆయన ఏదో ఒకరోజు సుముహూర్తంలో బీజేపీలో చేరడం ఖాయమని వార్తలు వస్తున్నాయి. మోదీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ ఎన్నికల్లో బీజేపీకి తొలి విజయం ఈ రకంగా లభించింది. నెలన్నర క్రితం చండీగఢ్ మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీకి మేయర్ పీఠం దక్కేందుకు రిటర్నింగ్ అధికారి స్వయంగా బ్యాలట్ పత్రాలను చెరిపేసిన ఉదంతం జనం మరిచిపోకముందే సూరత్ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ గెలుచుకున్న తీరు ప్రజాస్వామ్య ప్రహసనానికి మరో నిదర్శనంగా నిలిచింది. మునిసిపల్ ఎన్నికలైనా, లోక్‌సభ ఎన్నికలైనా విజయం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు బీజేపీకి ఆ లక్ష్యం ఎలాగైనా సాధించేందుకు ప్రయత్నిస్తుంది. అందుకు అవలంబించే మార్గాలపై ఎన్ని తీవ్ర విమర్శలు ఎదురైనా అది విననట్లు నటిస్తుంది.

మొదటి దశ ఎన్నికల ప్రచారంలో అభివృద్ధి గురించి, ప్రతిపక్షాల కూటమి లోపాల గురించి ఎక్కువగా మాట్లాడిన మోదీ రెండవ దశలో తన శైలిని మార్చి ప్రజలను మత ప్రాతిపదికన తన వైపుకు తిప్పుకునేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. నిజానికి ఇదే ఆయన సహజ శైలి. గుజరాత్‌లో ఈ శైలి వల్లనే ఆయన హిందువుల ఓట్లను పూర్తిగా తన వైపునకు తిప్పుకుని విజయవంతం కాగలిగారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంపదను ముస్లింలకు పంపిణీ చేస్తుందని, హిందువుల స్త్రీల మంగళ సూత్రాలపై కూడా కాంగ్రెస్ నేతల కళ్లు పడతాయని ప్రధానమంత్రి అంతటి స్థాయి వ్యక్తి ఉత్తరాదిన ఎన్నికల ప్రసంగాల్లో విమర్శించడం మత ప్రాతిపదికన ఓట్లను చీల్చే ప్రయత్నంలో భాగమేనని ఎవరికైనా అర్థమవుతుంది. ప్రజల కష్టార్జితాన్ని, విలువైన వస్తువులను చొరబాటుదారులకు, ఎక్కువ మంది సంతానం ఉన్న వారికి దోచి పెట్టాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. వివిధ సామాజిక వర్గాలకు జరగాల్సిన న్యాయం గురించి మాట్లాడుతూ, వనరుల పంపిణీలో ముస్లింలకు తొలి హక్కు ఉంటుందని మన్మోహన్ సింగ్ 18 సంవత్సరాల క్రితం క్రింద అన్న వ్యాఖ్యల్నీ మోదీ తనకు అనుకూలంగా మార్చుకున్నారు.

జీ–20 లాంటి సమావేశాల్లో, సెమినార్లలో, మన్ కీ బాత్‌లో ఎంతో హుందాగా మాట్లాడుతున్నట్లు కనిపించే నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారం, ప్రత్యర్థులను ఎదుర్కోవడం వరకు వచ్చేసరికి ఆయనలో అపరిచితుడు కనిపిస్తారు. శ్రావణ మాసంలో ప్రతిపక్షనేతలు మాంసం తింటారనే వ్యాఖ్యల్నీ చేసేందుకు ఆయన వెనుకాడడం లేదు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్న అనేక అంశాలను విస్మరించి, దాన్ని ముస్లింలీగ్ మేనిఫెస్టోగా అభివర్ణించారు. గుజరాత్ ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా ప్రచారం చేసిన రోజుల నుంచి ఆయన ఈ వ్యూహాన్ని అవలంబిస్తున్నారు. మత ప్రాతిపదికన చేసే ప్రసంగాలకు ఒక స్థాయి అంటూ ఉండాలని ఆశించడం అమాయకత్వం. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా ఈ ప్రసంగాలకు అడ్డుకట్ట వేస్తుందని అనుకోవడం మరీ అమాయకత్వం. మోదీ వ్యాఖ్యల విషయమై ప్రతిపక్షాలు చేసిన ఫిర్యాదుపై మీడియా అడిగిన ప్రశ్నలకు కనీసం వ్యాఖ్యానించడానికి కూడా ఎన్నికల కమిషన్ నిరాకరించింది.

మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లో ఓటింగ్ శాతం చూసిన తర్వాత హిందువులను ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టడమే సరైన మార్గమని మోదీ భావించి ఉంటారా అన్న అనుమానాలకు ఆస్కారం కలుగుతోంది. గత ఎన్నికల్లో బీజేపీ మధ్యప్రదేశ్‌లో 29 సీట్లకు 28 సీట్లు, రాజస్థాన్‌లో 25కు 24 సీట్లు, ఉత్తరాఖండ్‌లో 5కు 5 సీట్లు గెలుచుకుంది. ఈ సారి బీజేపీ ఇవే ఫలితాలు తిరిగి సాధిస్తుందా అన్న చర్చ జరుగుతోంది. ఓటింగ్ శాతం తగ్గడంతో పాటు ఎగ్జిట్ పోల్స్ గురించి బీజేపీకి అనధికారికంగా కూడా సమాచారం లభించే ఉంటుంది. ఈ నేపథ్యంలో బీజేపీ ఆశిస్తున్న 400 సీట్ల లక్ష్యాన్ని ఎంత మేరకు సాధించగలదా అన్న చర్చ కూడా సాగుతోంది. మతపరమైన భావోద్వేగాలు కల్పించడం తప్ప తమకు వేరే మార్గం లేదని బీజేపీ భావిస్తోందా? ఈ మార్గంలోనైనా బీజేపీ సఫలీకృతం కాగలదా?

ఏమైనా ఒక్కో దశ సమీపిస్తున్న కొద్దీ దేశంలో బీజేపీతో సహా అన్ని రాజకీయ పార్టీలు లక్ష్మణ రేఖల్ని దాటి అన్ని రకాల మార్గాల్నీ అవలంబించడంలో ఆశ్చర్యం లేదు. అది వాటి జీవన్మరణ సమస్య. కాని ఈ క్రమంలో ప్రజాస్వామ్యం పట్ల ప్రజల విశ్వాసం మరణించకుండా చూసుకోవడం అందరికీ అవసరం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

గ్రామ రాజకీయాల స్థాయికి దిగజారిన రాష్ట్ర రాజకీయాలు!

వర్తమాన రాజకీయాలను చూస్తే ఐదారు దశాబ్దాల క్రితం గ్రామాల్లో నెలకొన్న పెత్తందారీ వ్యవస్థ రాజకీయాలను జ్ఞప్తికి తెస్తున్నాయి. ఎందరెందరో ప్రముఖ నాయకులు నిస్వార్థంగా రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించిన తెలుగు రాష్ట్రాలలో వర్తమాన రాజకీయాలు చూస్తుంటే జుగుప్సాకరమైన అసహనం, ఏమీ చేయలేని చేతకానితనం, భవిష్యత్తులో మరింకేమి కాబోతున్నదోనన్న ఆందోళన కలుగుతున్నదనడంలో బహుశా అతిశయోక్తి లేదేమో.

ఇటీవల ఎన్నికల ప్రచారంలో ఉన్న ఒక రాజకీయ నాయకుడి మీద జరిగిన రాళ్ల దాడి ఘటననే తీసుకుంటే– నమ్మశక్యం కాని సందేహంగా ఒకవైపు, ఒకవేళ అది నిజంగా ప్రతిపక్షంవారి పనే అయితే, ఇలాంటి చర్యలకు ప్రతిపక్షాలు పాల్పడవచ్చా అన్న మీమాంస మరోవైపు! రాష్ట్ర, దేశ రాజకీయాలలో దినదిన ప్రవర్ధమానమవుతున్న అసంబద్ధ ఆరోపణలు, ప్రత్యారోపణలు చూస్తుంటే అపనమ్మకమనే జీవాయుధం తీవ్రంగా పని చేస్తున్న రోజులు వచ్చాయనవచ్చు. ఈ తరహా దాడులు, 'కుళ్లు రాజకీయాలు' ఒకప్పుడు గ్రామ రాజకీయాలకే పరిమితమయ్యేవి. ఇప్పుడవి దేశ, రాష్ట్ర రాజకీయాలలో సర్వసాధారణమైపోయాయి.

ఈ సందర్భంగా ఐదారు దశాబ్దాల క్రితం అలనాటి ఖమ్మం జిల్లా, ఖమ్మం సమితి, గ్రామ రాజకీయాలు జ్ఞప్తికి వస్తున్నాయి. జిల్లా కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐఎం) మద్దతుతో శీలం సిద్దారెడ్డి; కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) మద్దతుతో జలగం వెంగళరావు వర్గాలుగా చీలిపోయారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో పెత్తందారుల కక్షలు కార్పణ్యాల వాతావరణం ఉండేది. మా గ్రామంలో కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐఎం) అభిమానులు ఉన్నప్పటికీ భూస్వాములకు భయపడి నిశ్శబ్దంగా ఉండిపోయేవారు. పంచాయితీ ఎన్నికలలో పోటీకి దిగే సాహసం చేయకపోయేవారు. నివురుగప్పిన నిప్పులా వ్యాపిస్తున్న తమమీద ఉన్న వ్యతిరేకత ఏ క్షణాన బహిర్గతమవుతుందో అన్న భయంతో, కమ్యూనిస్ట్ భావజాల కుటుంబ నేపథ్యం కలిగిన ఒక పెద్దమనిషిని, పెత్తందారీ గ్రామరాజకీయాలను నడుపుతున్న కాంగ్రెస్ పార్టీ పెద్దల ఆశీస్సులతో గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకునేవారు. గ్రామ నాయకత్వం జలగం వర్గానికి చెందిన వ్యక్తిగా చాలా మంచివాడైన గ్రామ పోలీసు పటేల్ చేతుల్లో ఉండేది.

పంచాయితీ ఎన్నికల తేదీ ప్రకటించగానే, రచ్చబండ దగ్గర అతడు నిర్ణయించిన అభ్యర్థి పేరే ప్రకటించి, గ్రామస్థుల ఆమోదం 'మూజువాణీ' పద్ధతిన పొంది, ఆయననే ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకునేవారు. గ్రామ రాజకీయాలను ఆసరాగా చేసుకుని, పెత్తందారులను అడ్డం పెట్టుకుని, గూండాగిరి చేస్తూ ఒక వ్యక్తి పటేల్‌కు సన్నిహితంగా వుంటూ, అతడి అండ చూసుకుని అందరి మీద పెత్తనం చేసేవాడు. తాగుడుకు బానిసై, గ్రామంలో ఇష్టారాజ్యంగా ప్రవర్తించేవాడు. సినిమాల్లో వలె పటేల్ అతడి ద్వారా పెత్తనం చెలాయించేవాడు. చివరకు ఇద్దరికీ బెడిసి ఒకరిని మరొకరు బెదిరించుకోవడం, పటేల్ మరో అనుచరుడు సైకిల్ చైన్‌తో అతడిని చితకబాదడం, మొత్తం వ్యవహారాన్ని పటేల్ తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేయడం ఫక్తు గ్రామ రాజకీయాల స్థాయిలో జరిగాయి. వర్తమాన రాష్ట్ర స్థాయి రాజకీయాలు ఈ స్థితిలోకి వచ్చాయిప్పుడు. తమపక్షంలో లేని వారిని, రానివారిని హింసకు గురిచేయడమే ఇప్పటి రాజకీయంగా మారింది!



అలనాటి గ్రామ రాజకీయాలు నేడు రాష్ట్ర స్థాయికి చేరుకున్నాయి. గుళ్లో ప్రమాణాలు, పార్టీ మార్పిడులు, కులం కార్డులు, బెదిరింపులు, క్యాంపు రాజకీయాలు, ప్రజాప్రతినిధుల కొనుగోళ్లు, అమ్ముడుపోవడం, ప్రత్యర్థుల మీద దాడులు, మద్యం ధనం విచ్చలవిడిగా వాడకం, 'దమ్ముందా, వెంట్రుక పీకలేవు' లాంటి పదజాలం విరివిగా ఉపయోగం... ఇలా ఎన్నో అతి జుగుప్సాకరమైన రాజకీయాలు రాష్ట్ర, దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్నాయి.

మొత్తం మీద గ్రామంలోని ఒకరిద్దరు మోతుబరి రైతులు, పటేల్ పెత్తనం చెలాయించడం విషయంలో ఆగ్రహంగా ఉన్న అతడి మాజీ అనుయాయి, సైకిల్ చైన్ దెబ్బలు తిన్న వ్యక్తి, గ్రామానికి చెందిన పలువురు ఉత్సాహవంతులైన యువకులు, చేతులు కలిపారు. 'పసుపు బియ్యాల'తో ప్రమాణం చేశారు. (ఇలాంటి ప్రమాణాలు ఇటీవల కాలంలో రాష్ట్ర స్థాయి రాజకీయాలలో ఆనవాయితీ అయిపోయింది. తడిగుడ్డలతో దేవాలయాలలో, స్వంత పిల్లల మీద, ఇలా రకరకాల విధాలుగా చోటు చేసుకుంటున్నాయి).

పంచాయితీ ఎన్నికలు రావడంతో పల్లెటూరి రాజకీయానికి తెరలేచింది. అప్పట్లో మూడంచెల పంచాయితీ వ్యవస్థ ఉండేది. గ్రామంలో మొదలు ఎన్నికలు జరిగేవి. వార్డు సభ్యులను ఎన్నుకునేవారు. ఓటింగ్ వార్డు వారీగా జరిగేది. అదే రోజు సాయంత్రం గెలిచిన వార్డు సభ్యులంతా సాధారణ మెజారిటీ పద్ధతిలో సర్పంచ్‌ను ఎన్నుకునేవారు. కొద్ది రోజుల తరువాత సర్పంచ్‌లంతా కలిసి సమితి అధ్యక్షుడిని ఎన్నుకునేవారు. ముందుగా సమితికి ఆరుగురు కో–ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకుని, అంతా కలిసి సమితి అధ్యక్షుడిని రహస్య బాలెట్ ద్వారా ఎన్నుకునేవారు. కో–ఆప్ట్ చేసుకున్న సభ్యులకు కూడా సమితికి పోటీ చేసే అర్హత ఉంటుంది.

ఆ తరువాత సమితి అధ్యక్షులంతా కలిసి ఇదే ప్రక్రియలో జిల్లా పరిషత్ అధ్యక్షుడిని ఎన్నుకునేవారు. అక్కడా కో–ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకునే పద్ధతి ఉంటుంది. జిల్లా పరిషత్ చైర్మన్‌ది చాలా పవర్‌ఫుల్ హోదా. కొందరు కాబినెట్ మంత్రులుగా రాజీనామా చేసి, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భాలున్నాయి. జిల్లా పరిషత్ చైర్మన్లకు ఎంత పలుకుబడి ప్రాబల్యం వుండేదంటే, వాళ్ల అంగీకారం లేకుండా ముఖ్యమంత్రి కావడం కూడా కష్టంగా ఉండేదారోజుల్లో. ఒకే ఒక్క గ్రామ సర్పంచ్ జిల్లా పరిషత్ ఎన్నికల భవితవ్యాన్ని మార్చగలిగే స్థితిలో ఉండేవారు అప్పుడప్పుడూ. సమితిలో ఒక్క ఓటుతో అదృష్టం తారుమారయ్యేది. అదే ఒక్క ఓటు జిల్లా పరిషత్‌లో కీలకమయ్యేది. ఇప్పుడు జెడ్పీ, మండల చైర్మన్లు ఉత్సవ విగ్రహాలే!

'పసుపు బియ్యాల మీద చేసిన ప్రమాణం' చేసినవారిలో కొందరు 'కులం కార్డు' ప్రాతిపదికగా, తిరిగి పటేల్ వర్గం కాంగ్రెస్ పార్టీలో చేరిపోయాడు. పటేల్ చేతిలో పరాభవం పొంది, దెబ్బలు తిని, పాతకాలపు గూండాగిరి మానిన వ్యక్తి కమ్యూనిస్ట్ పక్షాన ఒక వార్డులో పోటీ చేసి గెలిచాడు. తొమ్మిది వార్డులలో ఒక్క వార్డు మినహా, మిగతావన్నీ సీపీఐఎం–శీలం వర్గం కాంగ్రెస్ పార్టీకి దక్కాయి. ఇప్పటి శాసనసభా పక్షం నాయకుడి ఎన్నిక నేపథ్యంలో చోటుచేసుకునే రాజకీయాల తరయాలో, చివరి క్షణం వరకూ గెలిచిన వార్డు మెంబర్లను ప్రలోభపెట్టే ప్రయత్నం జరిగింది. అయినప్పటికీ, పటేల్‌కు అయిష్టమైన ఒకప్పటి ఆయన సహచరుడు, సర్పంచిగా ఎన్నికయ్యాడు.

ఈ నేపథ్యంలో ముగింపు మాత్రం వేరే విధంగా, ఇప్పటి 'రాష్ట్ర రాజకీయం', ఒకప్పటి 'గ్రామ రాజకీయం' శైలిలో జరిగింది. అచిర కాలంలోనే, మద్యానికి మరోసారి బానిసైన (అలా పటేల్ బానిసగా మలచిన) గ్రామ సర్పంచ్ (కులం కార్డు ప్రాతిపదికగా) పాతపగ మర్చిపోయి, మళ్లీ పటేల్ పక్షంలో చేరిపోయాడు. సమితిలో సగం గ్రామాలు కమ్యూనిస్ట్ (సీపీఐఎం), శీలం సిద్ధారెడ్డి కాంగ్రెస్ వర్గం మిగిలిన సగం గ్రామాలు కమ్యూనిస్ట్ (సీపీఐ), జలగం వెంగళరావు కాంగ్రెస్ వర్గం గెలుచుకున్నది. ఖమ్మం సమితి గెలిచిన వారి పక్షమే జిల్లాపరిషత్ గెలుచుకునే పరిస్థితి నెలకొంది.

సమితి ఎన్నిక ఐదారు రోజులే ఉందనగా జలగం, శీలం వర్గాలు తమ తమ సర్పంచ్‌లతో 'క్యాంపులు' పెట్టే చర్యలు చేపట్టారు. (విపరీతమైన వ్యయంతో ఇలాంటి క్యాంపు రాజకీయాలు నిర్వహించడం ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో సర్వసాధారణం). శీలం క్యాంపునకు మా గ్రామ సర్పంచ్ కూడా వెళ్లాలి. వెళ్లనని పేచీ పెట్టాడు. అప్పటికే (మనం–మనం ఒకే కులం అన్న ప్రాతిపదికన) పటేల్‌తో అతడికి రహస్య ఒప్పందం కుదిరిన విషయం బయటపడకుండా వుంచారు! చివరికి సర్పంచ్ క్యాంపునకు వెళ్లక తప్పలేదు.

పద్ధతి ప్రకారం నిర్ధారించిన తేదీ నాడు ఖమ్మం సమితి అధ్యక్ష ఎన్నికకు సర్వం సిద్ధమైంది. తొలుత ఆరుగురు కో–ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక జరగాలి. మా గ్రామ సర్పంచ్‌ను, ఇరు (శీలం, జలగం) వర్గాలవారు తమ ఓటు కింద వేసుకున్నారు. (ఇలా ఇరుపక్షాలు ఒకే వ్యక్తిని తమ పార్టీవాడిగా భావించడం రాష్ట్ర రాజకీయాలలో ఇప్పుడు చాలా చిన్న విషయం.) మొదటి కో–ఆప్టెడ్ సభ్యుడిగా శీలం-సీపీఐఎం అభ్యర్థి మా సర్పంచ్ వేసిన ఓటుతో గెలిచాడు.

రెండవ అభ్యర్థిగా శీలం-సీపీఐఎం పక్షాన ఒక ప్రముఖ సీపీఐఎం నాయకుడు, సమితి అధ్యక్ష అభ్యర్థి, పోటీలో ఉన్నాడు. ప్రలోభాలకు అప్పటికే గురైన మా గ్రామ సర్పంచ్ అతడికి ఓటు వేయనందున ఓడిపోయాడు. ఆ సమయంలో సర్పంచ్‌కు తీవ్రమైన హెచ్చరిక పోయింది. ఫలితంగా, ఆ తరువాత మిగిలిన నలుగురు కో–ఆప్టెడ్ సభ్యులుగా శీలం-సీపీఐఎం గ్రూపు వారే ఎన్నికయ్యారు. కమ్యూనిస్ట్ (మార్క్సిస్ట్) పార్టీకి సమితి దక్కకుండా చేద్దామని, జలగం గ్రూపు అభ్యర్థి సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించినా ఫలితం లేకపోయింది.

గెలిచిన వారిలో సీపీఐఎం పార్టీకి చెందిన ఒకరు సమితి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. జిల్లాపరిషత్ చైర్మన్ పదవికి శీలం వర్గానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి, వైస్ చైర్మన్‌గా కమ్యూనిస్ట్ (మార్క్సిస్ట్) పార్టీకి చెందిన వ్యక్తి ఎన్నికయ్యారు. ఇది అప్పట్లో ఒక్క మా గ్రామం, లేదా ఖమ్మం సమితి పరిస్థితి మాత్రమే కాదు. గ్రామ గ్రామాన ఇదే అనుభవం కొంచెం మార్పులు, చేర్పులతో!

అలనాటి గ్రామ రాజకీయాలు క్రమంగా మరింత దిగజారి నేడు రాష్ట్ర స్థాయికి చేరుకున్నాయి. గుళ్లో ప్రమాణాలు, పార్టీ మార్పిడులు, కులం కార్డులు, బెదిరింపులు, క్యాంపు రాజకీయాలు, ప్రజాప్రతినిధుల కొనుగోళ్లు, అమ్ముడుపోవడం, ప్రత్యర్థుల మీద దాడులు, మద్యం ధనం విచ్చలవిడిగా వాడకం, 'దమ్ముందా, వెంట్రుక పీకలేవు' లాంటి పదజాలం విరివిగా ఉపయోగం... ఇలా ఎన్నో అతి జుగుప్సాకరమైన రాజకీయాలు రాష్ట్ర, దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్నాయి. ఈ దిగజారుడు రాజకీయాలకు ఆద్యులెవారు, బాధ్యులెవరు? ఏ రాజకీయనాయకుడిని అడిగినా అవతలి పక్షం వారివైపు వేలు చూపిస్తున్నారు!

■ వనం జ్వాలా నరసింహారావు

కుడిచేత్తో చేసిన దానం ఎడమ చేతికి కూడా తెలియకూడదంటారు. కానీ, జగన్ సర్కార్ కుడిచేత్తో సాయం చేసి, ఎడమ చేత్తో అంతకు రెట్టింపును లాక్కుంటోందన్న విషయం చాలామందికి తెలియదు. ఇందుకు ఆటోవాలాలే ప్రత్యక్ష ఉదాహరణ. వాహనమిత్ర పేరిట ఆటోవాలాలకు ఏటా రూ.10 వేలు ఇస్తున్నామని గొప్పలు చెబుతున్న వైసీపీ ప్రభుత్వం తెరవెనుక ఎంత దోచుకుంటుందో తెలిస్తే నోరెళ్లబెట్టాల్సిందే.



ఘనంగా గిరిప్రదక్షిణ





వన్‌టౌన్ పురవీధుల్లో గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి రథోత్సవం (ఇన్‌సెట్‌లో) ఇంద్రకీలాద్రిపై ఆది దంపతుల కల్యాణోత్సవం

ప్రతినెలా పౌర్ణమి రోజు జరిగే దుర్గమ్మ గిరిప్రదక్షిణ మంగళవారం ఘనంగా జరిగింది. ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద నుంచి ప్రారంభమైన గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తుల రథోత్సవం వన్‌టౌన్ పురవీధుల మీదుగా తిరిగి ఇంద్రకీలాద్రి చేరుకుంది. ఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, చైత్రమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గంగా పార్వతి సమేత మల్లేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. ప్రధాన అర్చకుడు మల్లేశ్వరశాస్త్రి, యజ్ఞనారాయణశర్మ, ఆర్.శ్రీనివాసశాస్త్రి, ఇంకా పలువురు అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవో కేఎస్ రామారావు దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. అంతకుముందు ఎదుర్కోలు ఉత్సవం జరిగింది. సాహిత్య సమ్మిళితంగా, గంగా, పార్వతి, పరమేశ్వరుల రూపవర్ణ శోభితంగా పండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

- వన్‌టౌన్



ఒక ఆటోడ్రైవర్‌కు ఏటా ప్రభుత్వం ఇస్తున్నది : రూ.10,000

నెలకు జరిమానాల రూపంలో తీసుకుంటున్నది (సుమారు) : రూ. 5,000

సీఎన్‌జీ ధర అదనపు భారం వల్ల నెలకు లాక్కునేది (సుమారు) : రూ. 5,400

రోడ్డు సెస్సు ద్వారా ఏడాదికి చెల్లించాల్సింది : రూ. 2,160

ఇవికాక.. పన్నులు, పర్మిట్లు, ఇన్సూరెన్స్ ఫీజులు అదనం

ఆటోపాట్లు..!

ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం ఓ చేత్తో సాయం.. మరో చేత్తో దోపిడీ

- వాహనమిత్ర ద్వారా ఆటోడ్రైవర్లకు ఇచ్చేది నామమాత్రమే..
- తెరవెనుక దోచుకునేది భారీ మొత్తమే..
- ఏటా ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చేది రూ.10 వేలు
- ఐదేళ్లలో రెండు జిల్లాల్లోని 73 వేల మందికి రూ.365 కోట్లు
- ఇచ్చినట్టే ఇచ్చి జరిమానాలు, సీఎన్‌జీ, పన్నులతో దోపిడీ
- ఈ ఐదేళ్లలో గుంజుకున్న మొత్తం రూ.715.40 కోట్లు

సీఎన్‌జీ బాదుడు మరోలా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎన్‌జీ ధర రూ.55గా ఉంది. ప్రస్తుతం రూ.85కు చేరింది. ఏటా రూ.5, రూ.10, రూ.15 మేర పెరుగుతూ వస్తోంది. డీజిల్ ధరలకు అత్యంత దగ్గరగా సీఎన్‌జీ ధర చేరింది. పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా సీఎన్‌జీని ఉపయోగించి నాలుగు డబ్బులు వెనకేసుకుందాం అనుకునే ఆటోవాలాలకు పెద్ద భారంగానే మారింది. రోజూ ఆటోవాలాలు సగటున 200-250 కిలోమీటర్ల మేర ఆటోలు నడుపుతారు. ఇందుకు 6 కేజీల సీఎన్‌జీ అవసరం. పెరిగిన సీఎన్‌జీ భారం రూ.30తో రోజుకు రూ.180 చొప్పున నెలకు రూ.5,400 అదనపు భారం పడుతోంది. ఏడాదికి వచ్చేసరికి రూ.64,800 భారం అవుతోంది. కాగా, సీఎన్‌జీపై రాష్ట్ర ప్రభుత్వం కిలోమీటరుకు రూపాయి చొప్పున రోడ్డు సెస్సు వసూలు చేస్తోంది. ఈ రూపేణా ఒక్కో ఆటోవాలా నుంచి ఏడాదికి రూ.2,160 అదనంగా తీసుకుంటోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో 73 వేల ఆటోలు ఉన్నాయి. ఒక్కో ఆటోవాలాకు ప్రభుత్వం ఏడాదికి రూ.10 వేల చొప్పున వాహనమిత్ర కింద ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. వాస్తవానికి ఆటోవాలాలపై ప్రభుత్వం ఏటా రూ.98 వేల ఆర్థిక భారాన్ని మోపుతోంది. ఈ ఐదేళ్లలో 73 వేల మంది ఆటోడ్రైవర్లకు రూ.365 కోట్లు ఇచ్చి, రూ.715.40 కోట్లు వారి నుంచి లాక్కుంది. ఎలా అంటే..

జరిమానాల దోపిడీ ఇలా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిమానాలు చాలా తక్కువగా ఉండేవి. వైసీపీ వచ్చాక భారీగా పెరిగాయి. జరిమానాల ఫీజులు కూడా పెరిగాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.130 జరిమానా విధించేవారు. వైసీపీ వచ్చాక జరిమానా కనిష్ఠ ధర రూ.1,030 అయ్యింది. ఏకంగా పది రెట్లు పెరిగిందన్నమాట. నెలకు ఐదారు జరిమానాలు, ఒక్కోసారి పది వరకూ జరిమానాలు వేస్తున్నారు. దీంతో ఒక్క నెలలోనే ఒక్కో ఆటోవాలా నుంచి ప్రభుత్వం జరిమానాల రూపంలో సుమారు రూ.10 వేల వరకూ లాగేస్తోంది. ఒకవేళ నెలకు ఒక్క జరిమానా అనుకున్నా.. ఏడాదికి రూ.10 వేలు ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తోంది. పైగా గతంలో మాదిరిగా ట్రాఫిక్ డ్రైవ్స్ లేవు. ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసి చలానాలు ఆన్‌లైన్‌లో పంపుతున్నారు. తప్పు చేయకపోయినా ఫొటో చూపి, ఉల్లంఘనలకు పాల్పడినట్టుగా పేర్కొంటున్నారు. ఈ చలానాలు నాలుగైదు నెలలకు ఒకసారి వస్తాయి. ఈ భారమంతా ఆటోవాలాలపై ఒకేసారి పడుతోంది.

పన్నులు, పర్మిట్లతో గుంజుడే గుంజుడు

ఆటోవాలాలపై రాష్ట్ర ప్రభుత్వం పన్నుల పెంపు, పర్మిట్ల భారాన్ని మోపింది. ఇన్సూరెన్స్ ఫీజులను తగ్గించమని ఆటోవాలాలు మొత్తుకున్నా వినలేదు. హరిత పన్నును అమాంతంగా నాలుగైదు రెట్లు పెంచేసింది. పదిహేనేళ్ల కాలపరిమితి దాటిన వాహనాలకు విధించే ఈ పన్ను భారాన్ని తగ్గించాలని ఆటోవాలాలు కోరినా వినలేదు. ఇలా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆటోవాలాల నెత్తిన గుదిబండను మోపింది. ఇలా.. సగటున ఒక్కో ఆటోవాలాకు ఏడాదికి రూ.10 వేలకు పైగానే అదనపు భారం పడుతోంది.

నెలకు పది కేసులు రాస్తున్నారు



ఆటో డ్రైవర్లకు ఈ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదు. వాహనమిత్ర పథకం కింద ఏడాదికి రూ.10 వేలు ఇస్తున్నమాట వాస్తవమే. ఆ 10 వేలను తిరిగి పలు విధాలా లాక్కుంటున్నారు. నెలకు సగటున 10 జరిమానా కేసులు నమోదవుతున్నాయి. గతంలో ఉన్న జరిమానా ఫీజులను పెంచి వెయ్యి చేశారు. ఇక్కడే రూ.10 వేలు ప్రభుత్వానికి వసూలవుతున్నాయి. గతంలో ఈ మాదిరిగా అపరాధ రుసుములు వేసింది లేదు. - గరిమెళ్ల చిన్నా, ఆటోడ్రైవర్

సీఎన్‌జీ ధరను డీజిల్ ధరలా పెంచారు



గతంలో పెట్రోల్ ఆటోలను తోలేవాళ్లం. ఆ తర్వాత డీజిల్ వైపు వెళ్లాం. ఆ తర్వాత కాలంలో సీఎన్‌జీ ఆటోలు వచ్చాయి. సీఎన్‌జీ కేజీ రూ.35 ఉన్నపుడు ఆటోలను ఎక్కువ మంది కొన్నారు. ఇప్పుడు రూ.80కు చేరింది. దాదాపు డీజిల్ ధరతో పోటీ పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆటో డ్రైవర్లు సంక్షోభంలోకి వెళ్లిపోతున్నారు. ఎలక్ట్రికల్ ఆటోల వైపు వెళ్దామనుకుంటే.. వాటిపై కూడా లైఫ్ ట్యాక్స్ భారం వేస్తున్నారు. - కరణం సుబ్రహ్మణ్యం, ఆటోడ్రైవర్

అవుట్..!

సీపీ కాంతిరాణాపై ఈసీ బదిలీ వేటు

ఎట్టకేలకు పోలీస్ కమిషనర్ కాంతిరాణాపై ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేసింది. ఆది నుంచీ వివాదాస్పద నిర్ణయాలు, అధికారపక్షమైతే ఒకలా, ప్రతిపక్షమైతే మరోలా వ్యవహరిస్తున్న ఆయన తీరును విపక్షాలు వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. తాజాగా సీఎం జగన్‌పై గులకరాయి దాడి ఘటనలో ఆయన వైఖరి అతిగా ఉండటంతో ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది.

- వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు
- గులకరాయి దాడి కేసులో అతిగా స్పందించారనే విమర్శలు
- చెన్నుపాటి గాంధీపై దాడిలో కన్నుపోతే నామమాత్ర చర్యలు
- నందిగామలో టీడీపీ అధినేతపై రాయి దాడిలోనూ ఇదే వైఖరి



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) :

- మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీపై పటమటలంకలో వైసీపీ నాయకుడు గద్దె కల్యాణ్ దాడి చేశాడు. తాళంచెవితో గాంధీ కంట్లో పొడవడంతో ఆయన కన్ను కోల్పోయారు. దీనిపై పోలీసులు సాధారణ దాడి కేసు నమోదు చేశారు. బెయిలబుల్ సెక్షన్లు నమోదు చేశారు. దీనిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని టీడీపీ నాయకులు అప్పట్లో డిమాండ్ చేశారు.
- ఈనెల 13వ తేదీన అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి గులకరాయితో సీఎం జగన్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో సీఎం నుదురు ఎడమ వైపున గాయమైంది. ఆయనకు మూడు కుట్లు పడ్డాయి. దీనిపై పోలీసులు అతిగా వ్యవహరించారు. ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి డైరెక్షన్‌లో పోలీస్ కమిషనర్ కేసును దర్యాప్తు చేస్తున్నారని టీడీపీ ఆరోపించింది. ముందుగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో వేముల సతీష్ కుమార్‌ను ప్రధాన నిందితుడిగా చూపించి కోర్టులో హాజరుపరిచారు. మిగిలిన నలుగురు మైనర్లను ఇళ్లకు పంపారు. వారిని అదుపులోకి తీసుకున్న రోజే టీడీపీ బీసీ సెల్ సెంట్రల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వేముల దుర్గారావును అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో అతడు ఏ2 అని ప్రచారం చేశారు. మూడు రోజుల క్రితం అతడినీ వదిలిపెట్టారు. దుర్గారావును విడిచిపెట్టడానికి ముందు మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కార్యాలయం వద్ద హైడ్రామా నడిపారు. డీసీపీలు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కార్యాలయం వద్దకు భారీగా చేరుకోవడంతో అరెస్టు అనుమానాలు బలపడ్డాయి. అప్పటి వరకు కార్యాలయంలో ఉన్న ఉమా పోలీసుల హడావుడిని ముందే గ్రహించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ దాడిలో టీడీపీ నేతలను ఇరికించే ప్రయత్నాలు పోలీసులు చివరి వరకు చేశారని ఆరోపణలు వచ్చాయి.

నందిగామ ఘటనలోనూ..

ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా టీడీపీ ఆధ్వర్యంలో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' కార్యక్రమాన్ని చేపట్టారు. నందిగామలో జరిగిన ఈ కార్యక్రమాన్ని చంద్రబాబు నిర్వహించారు. చంద్రబాబు వాహనంపై నిలబడి ప్రసంగిస్తుండగా, గుర్తుతెలియని వ్యక్తి ఆయనపైకి రాయి విసిరాడు. ఇది సీఎస్‌వో మధుకు తగిలింది. ఆయనకు గడ్డం వద్ద రక్తపు గాయమైంది. ఈ ఘటనపై పోలీసులు తగిన విధంగా స్పందించలేదని ఆరోపణలు వచ్చాయి. జగన్‌పై రాయి దాడి జరిగితే హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు చంద్రబాబుపై రాయి దాడి ఘటనపై ఎందుకు ఆవిధంగా వ్యవహరించలేదని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

త్వరలో కొత్త కమిషనర్

కాంతిరాణా బదిలీతో ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు త్వరలో కొత్త కమిషనర్ రానున్నారు. వెంటనే కిందిస్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించాలని ఈసీ ఆదేశించింది. కాంతిరాణా.. 2021, డిసెంబరు 9వ తేదీన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆయన రెండేళ్ల నాలుగు నెలల పాటు విధులు నిర్వహించారు. కాగా, కొత్త కమిషనర్‌గా ఎవరు వస్తారన్న చర్చ కమిషనరేట్‌లో నడుస్తోంది. ముగ్గురు ఐజీ స్థాయి అధికారుల పేర్లను ప్రభుత్వం ఈసీకి పంపుతుంది. ఒకరిని ఈసీనే ఎంపిక చేస్తుంది.

తీరని భారం..!

ఎన్నికల ఖర్చంతా వీఆర్వోలపైనే..!

- అప్పుచేసి ఖర్చు పెడుతున్న వైనం
- ఎన్నికలయ్యాక చేతికందని నగదు
- గత ఎన్నికల్లో పరిస్థితి ఇదే..
- ఈసారి ఆదుకోండంటూ ఈసీకి విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సాధారణంగా ఎన్నికల ఖర్చుకు సంబంధించిన డబ్బును ఆర్వోలు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు విడుదల చేస్తుంటారు. ఆర్వోల నుంచి ఏఈఆర్వోలు, ఈఆర్వోలకు డబ్బు విడుదల అవుతుంటుంది. వీరిలో సహజంగా తహసీల్దార్లే ఉంటారు. తహసీల్దార్లు తిరిగి ఆర్ఐలకు పనులు పురమాయిస్తారు. ఆర్ఐలేమో ఆ పనులను వీఆర్వోలపై పెడతారు. అంతిమంగా ఆ ఖర్చు వీఆర్వోల మెడకు చుట్టుకుంటుంది. చాలాచోట్ల వీఆర్వోలు.. బీఎల్వోలుగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వీరంతా రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకోసం అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నుంచి నిధులేమీ రాకపోవడంతో ఎన్నికలయ్యే వరకూ ఓపిక పట్టాలని అప్పులిచ్చిన వారిని బతిమాలుకుంటున్నారు.



అన్ని ఖర్చులూ వారివే..

ఎన్నికల ప్రక్రియకు అవసరమయ్యే స్టేషనరీ, పేపర్ బండిల్స్ దరఖాస్తులు, ప్రింటింగ్ కాపీలు, ఎలక్టోరల్ రోల్స్, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, ర్యాంపులు, కేంద్రాల్లో పరిశుభ్రత, గోడలు దెబ్బతింటే బాగు చేయించడం, వాటికి రంగులు వేయించడం వంటివన్నీ వీఆర్వోలే చూసుకోవాలి. జిల్లా ఎన్నికల అధికారి, ఆర్వోలు వస్తే ప్రొటోకాల్ ప్రకారం వారి ఖర్చులన్నీ భరించాలి. పోలింగ్ సమయంలో భారీగా ఖర్చు ఉంటుంది. ఒక్కో మండలానికి సగటున 60 పోలింగ్ కేంద్రాలు ఉంటాయనుకుంటే, ఒక్కో కేంద్రానికి 12 మంది చొప్పున సిబ్బంది లెక్కన, 720 మందికి టిఫిన్లు, భోజనాలు, స్నాక్స్, మజ్జిగ వంటివి ఏర్పాటు చేయాలి. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలకు చేరుకునే సిబ్బందికి కూడా అల్పాహారాలు, భోజనాలు పెట్టాలి. ఇలా లక్షల రూపాయలను అప్పుచేసి ఖర్చు చేసినా చివరకు ఆ డబ్బు చేతికందక వీఆర్వోలు ప్రతి ఎన్నికల్లో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఎన్నికల సందర్భంలో ఇతర జిల్లాల తహసీల్దార్లు బదిలీపై వస్తుంటారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన డబ్బును తహసీల్దార్లు తీసుకుని వెళ్లిపోతుండటంతో వీఆర్వోలు నిండా మునిగిపోతున్నారు. గత ఎన్నికల్లోనూ ఇదే జరిగింది. కాగా, ఎన్నికల్లో ఎవరైతే డబ్బు ఖర్చు పెడతారో వారికే ఎన్నికల సంఘం డబ్బులివ్వాలని వీఆర్వోలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పడిన ఇబ్బందులు, ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లేందుకు వారంతా సిద్ధమవుతున్నారు.

ఆ సీటు నాకొద్దు..!

తూర్పులో పోటీ చేయనని స్పష్టం చేసిన సుంకర పద్మశ్రీ



- విజయవాడ ఎంపీ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న పద్మశ్రీ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక కొత్త మలుపు తిరిగింది. ఏపీసీసీ రెండు రోజుల క్రితం తూర్పు అభ్యర్థిగా పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ పేరును ప్రకటించారు. దీనిపై ఆమె మంగళవారం ఎక్స్ వేదికగా స్పందించారు. తాను విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయాలని ఆశించానన్నారు. తూర్పు అభ్యర్థిగా తనను సంప్రదించకుండానే పేరును ప్రకటించారని ట్వీట్ చేశారు. తనకు ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్న ఆలోచన లేదని, పార్టీ కోసం, అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని ట్వీట్ చేశారు. వాస్తవానికి పద్మశ్రీ విజయవాడ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాలని భావించారు. దానికి ఆమె దరఖాస్తు చేసుకున్నారు. ఈ సీటు కోసం ముగ్గురు, నలుగురు పోటీపడ్డారు. విజయవాడ ఎంపీ అభ్యర్థిగా వల్లూరి భార్గవ్ పేరును ఏపీసీసీ ప్రకటించింది. తూర్పు నియోజకవర్గం నుంచి సుంకర పద్మశ్రీ పోటీ చేయడానికి నిరాకరించడంతో కొత్త అభ్యర్థిని ఎంపిక చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. నగర కమిటీ అధ్యక్షుడిగా ఉన్న నరహరశెట్టి నరసింహారావును బరిలోకి దింపే సూచనలు ఉన్నాయి.

అట్టహాసంగా..

గుడివాడలో వెనిగండ్ల రాము నామినేషన్



గుడివాడ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము నామినేషన్ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. ర్యాలీలో మచిలీపట్నం పార్లమెంట్ కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, అన్న నందమూరి తారకరామా రావును స్ఫూర్తిగా తీసుకుని 1983 ఎన్నికల్లో గుడివాడ నుంచి ఆయన పోటీ చేసినప్పుడు నామినేషన్ కార్యక్రమానికి వేసుకున్న ఖాకీ దుస్తుల మాదిరిగానే వెనిగండ్ల రాము కూడా ఖాకీ దుస్తులు వేసుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - గుడివాడ

రాయి ఓ రాజకీయ డ్రామా

- సీఆర్పీసీ 160 నోటీసు ఇవ్వకుండా నిందితుడి అరెస్టు
- సెర్చ్ వారెంట్ జారీ తర్వాత కోర్టులో ప్రవేశపెట్టారు
- ఇదొక పొలిటికల్ ఆర్కెస్ట్రా : న్యాయవాది అబ్దుస్ సలీం

సతీష్ కస్టడీ పిటిషన్‌పై ముగిసిన వాదనలు.. నేడు తీర్పు

- 4లో..



సెలవులిచ్చారోచ్

ఎట్టకేలకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఎండలు మండిపోతున్నా కొద్దిరోజులుగా పాఠశాలల్లో తరగతులు జరుగుతూనే ఉన్నాయి. కాగా, మంగళవారం నుంచి జూన్ వరకూ సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఉత్సాహంగా ఎగురుకుంటూ ఇళ్లకు చేరారు. నగరంలోని బీఆర్టీఎస్ రోడ్డులో ఉన్న ఓ ప్రాథమిక పాఠశాలలో కేరింతలు కొడుతూ వస్తున్న విద్యార్థులు వీరు.

ఐదో రోజు అదే జోరు



గుడివాడలో వెనిగండ్ల నామినేషన్‌కు హాజరైన అశేష జనసందోహం

- కృష్ణాలో 28, ఎన్టీఆర్ జిల్లాలో 27
- గుడివాడలో పోలీసుల అత్యుత్సాహం.. ఉద్రిక్తత
- రేపటితో నామినేషన్ల స్వీకరణ పూర్తి
- నేడు వల్లభనేని బాలశౌరి నామినేషన్



గుడివాడ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న వెనిగండ్ల రాము

అట్టహాసంగా వెనిగండ్ల నామినేషన్

- భారీగా తరలివచ్చిన ప్రజలు, అభిమానులు
- పార్టీశ్రేణుల ర్యాలీ.. గుడివాడ పసుపు మయం

గుడివాడ, ఏప్రిల్ 23 : ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు అశేష జనవాహిని వెంటరాగా జనసేన, బీజేపీలు బలపరిచిన టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము నామినేషన్ గుడివాడలో అట్టహాసంగా జరిగింది. మంగళవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని వెనిగండ్ల స్వగృహంలో తొలుత సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై మచిలీ



పట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, తదితరులతో కలిసి వెనిగండ్ల భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ బైపాస్ రోడ్డు, ఏలూరురోడ్డు, నెహ్రూచౌక్, మార్కెట్ సెంటర్, వాసవీచౌక్, పాత మున్సిపల్ కార్యాలయం మీదగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంది. ఎండ సైతం లెక్కచేయక కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఐటీడీపీ కార్యకర్తలు బ్యాడ్జీలతో ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆర్డీవో కార్యాలయంలో టీడీపీ అభ్యర్థిగా వెనిగండ్ల రాము రిటర్నింగ్ అధికారి పి.పద్మావతికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయనతో పాటు పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, కొనకళ్ల నారాయణ, నెరుసు చింతయ్యలు పాల్గొన్నారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయిన తరువాత వెనిగండ్ల రాము స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ, స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. అనంతరం కోలుకుని విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

కులరాజకీయాలు రెచ్చగొట్టడం దారుణం : వెనిగండ్ల

నందమూరి తారకరామారావు జన్మించిన గడ్డపై తిరిగి తెలుగుదేశం జెండాను రెపరెపలాడిస్తానని వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం నామినేషన్ అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఎమ్మెల్యే కొడాలి నాని గత 20 ఏళ్లుగా నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా కుల, మత, ప్రాంతీయ విభేదాలకు తెరలేపారన్నారు. నాని కుటుంబసభ్యులను హైదరాబాద్‌లో ఉంచి.. చుట్టపుచూపుగా గుడివాడ వస్తున్నాడన్నారు. తనను వేరే ప్రాంతానికి చెందిన వాడిగా అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఓటమి భయంతో దిగజారి మాట్లాడుతున్న నానికి గుడివాడ ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. తనపై నమ్మకం ఉంచి ప్రజలు ఆశీర్వదించేందుకు నామినేషన్ కార్యక్రమానికి విచ్చేయడం తొలి విజయమని అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

- పోలీసుల అత్యుత్సాహం.. ర్యాలీలో స్వల్ప ఉద్రిక్తత
- టీడీపీ కార్యకర్తలపై లాఠీచార్జ్.. బారికేడ్లను తోసేసిన రావి

గుడివాడ : టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల నామినేషన్ సందర్భంగా ముందస్తుగా రూట్‌మ్యాప్‌ను ఇచ్చి పోలీసుల అనుమతి పొందారు. మంగళవారం ర్యాలీని స్థానిక బొమ్మరిల్లు థియేటర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వైసీపీ ఎన్నికల కార్యాలయం ఉండటంతో వేరే మార్గంలో వెళ్లాలని బారికేడ్లు ఏర్పాటు చేశారు. తాము శాంతియుతంగా వెళుతున్నామని, రూట్‌మ్యాప్‌కు అనుమతులిచ్చి ఆంక్షలు విధించడం తగదని టీడీపీ శ్రేణులు అసహనం వ్యక్తం చేశారు. తమకు అనుమతులున్నాయని, వేరే మార్గంలో వెళ్లే ప్రసక్తే లేదని కార్యకర్తలు పట్టుపట్టారు. దీంతో స్వల్ప వివాదం చోటుచేసుకోగా పోలీసులు లాఠీచార్జ్ చేశారు. పోలీసుల తీరుపై ఆగ్రహించిన మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు బారికేడ్లను పక్కకు తొలగించడంతో ర్యాలీ ముందుకు సాగింది.



పోలీసులతో టీడీపీ శ్రేణుల వాగ్వివాదం



సమావేశంలో మాట్లాడుతున్న వల్లభనేని బాలశౌరి

వైసీపీ అక్రమాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి : బాలశౌరి

మచిలీపట్నం టౌన్ : వైసీపీ నాయకుల అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఎంపీ, మచిలీపట్నం పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి పిలుపునిచ్చారు. మంగళవారం మాజీ మంత్రి కొల్లు రవీంద్ర కార్యాలయం వద్ద జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమీక్షా సమావేశంలో బాలశౌరి మాట్లాడారు. బుధవారం ఎంపీ, ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థుల నామినేషన్లకు పార్టీ శ్రేణులందరినీ ఆహ్వానించాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలన్నారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, పార్లమెంటు పరిధిలో వివిధ నియోజక వర్గాలనుంచి వస్తున్నందున కార్యకర్తలు ఓర్పుతో ర్యాలీకి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బందరు మండలం సుల్తానగరం ఆంజనేయస్వామి దేవాలయం నుంచి బుధవారం ఉదయం 8 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్, ఎండీ ఇలియాస్ బాషా, కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు, టీడీపీ నాయకులు కొరెడ్ల సుశీల, పల్లపాటి సుబ్రహ్మణ్యం, పీవీ ఫణికుమార్, సనకా నాగులు, కాగిత వెంకటేశ్వరరావు, కుంచే నాని, లంకే శేషగిరి, కట్టా అంజిబాబు, కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, జనసేన నియోజక వర్గం ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మాదివాడ రాము, గడ్డం రాజు, కొరియర్ శీను తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

వన్‌టౌన్, ఏప్రిల్ 23 : వేసవి దృష్ట్యా ఎన్టీఆర్ జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్టు కలెక్టర్ ఢిల్లీరావు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి తెలిపారు. మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి ప్రధాన కార్యదర్శి మంచినీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయా విభాగాధికారులతో కలిసి పాల్గొన్న కలెక్టర్ జిల్లాలో తీసుకున్న చర్యల గురించి వివరించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేదని, ఒకవేళ ఎక్కడైన అంతరాయం జరిగితే తక్షణమే పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఎక్కువ మంది కూలీలకు ఉపాధి హామీ పథకంలో పనులు కేటాయిస్తున్నట్టు అన్ని సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు.

కృష్ణా జిల్లాలో 28 నామినేషన్లు

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : కృష్ణా జిల్లా మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గంతో పాటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదో రోజు మంగళవారం 28 నామినేషన్లు దాఖలయ్యాయి. మరో రెండు రోజులే గడువు ఉండటంతో గురు, శుక్రవారాల్లో అధిక సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు సన్నద్ధమవుతున్నారు. మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి జనసేన అభ్యర్థిగా వల్లభనేని అనుదీప్ రెండుసెట్ల నామినేషన్లను, తెలుగు రాజ్యాధికార సమితిపార్టీ అభ్యర్థిగా ఆదోతు తులసీరామ్ రెండుసెట్ల నామినేషన్లు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా సింహాద్రి రామ్‌చరణ్, వల్లభనేని నాగపవన్‌కుమార్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా అంబళ్ల రాజకుమార్ నామినేషన్‌లను మంగళవారం దాఖలు చేశారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా..

గన్నవరం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా షేక్‌చాన్ బాషా, ప్రత్తిపాటి అరుణమారి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా సింహాద్రి రాఘవేంద్రరావు, నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పైలా అజయ్, సీపీఐ(ఎం) అభ్యర్థులుగా తెల్లాకుల వెంకట లక్ష్మణస్వామి, కళ్లం వెంకటేశ్వరరావు నామినేషన్‌లను దాఖలు చేశారు. గుడివాడ టీడీపీ అభ్యర్థిగా వెనిగండ్ల రాము, పామర్రు నుంచి పిరమిడ్‌పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా సబ్బిశెట్టి రేవతీదేవి, మచిలీపట్నం వైసీపీ అభ్యర్థిగా పేర్ని వాకసాయి కృష్ణమూర్తి(కిట్టు) మూడుసెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఈడే భాస్కరరావు, కోటప్రోలు సునీల్‌బాబు, తెలుగు రాజ్యాధికార సమితిపార్టీ అభ్యర్థిగా ఆదోతు తులసీరామ్ నామినేషన్‌లను దాఖలు చేశారు. అవనిగడ్డ నుంచి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థులుగా ముంగర వెంకట నాంచారయ్య, నాదెళ్ల గిరిధర్‌నాయుడు, బహుజన సమాజ్‌పార్టీ అభ్యర్థిగా గుంటూరు నాగేశ్వరరావు, పామర్రు రిపబ్లికన్‌పార్టీ ఆఫ్ ఇండియా(ఎ) అభ్యర్థిగా మంగం రాజమనోహర్, పెనమలూరు తెలుగు రాజ్యాధికార సమితి అభ్యర్థిగా మరీదు శశిధర్ నామినేషన్‌లను దాఖలు చేశారు.

ఎన్టీఆర్ జిల్లాలో 27 నామినేషన్లు ..

- రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్రుల తరపున భారీగా నామినేషన్ల దాఖలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఐదో రోజున 27 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ తరపున నాలుగు, వైసీపీ తరపున రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. మంగళవారం కూడా నామినేషన్ల జోష్ కొనసాగింది. రిజిస్టర్డ్ పార్టీల తరపున స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి మొత్తం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ అభ్యర్థికిగా షేక్ ఆసిఫ్ రెండు సెట్లు వేయగా.. బహుజన సమాజ్‌పార్టీ (బీఎస్‌పీ) అభ్యర్థిగా మద్దిరాల భూషణ్‌రాజు నామినేషన్ దాఖలు చేశారు. జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా పోతిన రామారావు, నవరంగ్ కాంగ్రెస్ అభ్యర్థిగా నక్కల సాయిబాబు, ఇండియన్ ముస్లిం లీగ్ అభ్యర్థిగా షేక్ కాజావలి నామినేషన్లు దాఖలు చేశారు. సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఐదురుగు నామినేషన్లు వేశారు. టీడీపీ తరపున బొండా ఉమామహేశ్వరరావు, బొండా సుజాతలు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా బొప్పన గాంధీ, కొణిజేటి ఆదినారాయణ, బి.వెంకట్ సాయి లక్ష్మీగణేష్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో స్వతంత్ర అభ్యర్థులుగా సుమ సుదర్శన్, ఎం.భార్గవ్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. స్టూడెంట్స్ యునైటెడ్ ఫర్ నేషన్ పార్టీ అభ్యర్థిగా వెంకటరెడ్డి గంగిరెడ్డి, జనవాహిని పార్టీ అభ్యర్థిగా ఎస్ఎస్ వరప్రసాద్‌బాబు దాస్యం ఒక్కో సెట్టు నామినేషన్లు దాఖలు చేశారు. మైలవరం అసెంబ్లీ పరిధిలో ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. జై భారత్ నేషనల్ పార్టీ తరపున ఓర్సు రామారావు, స్వతంత్ర అభ్యర్థులుగా నూనె సుధీర్ కుమార్ రెడ్డి, చింతపల్లి దాస్ ఒక్కో సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. నందిగామ పరిధిలో టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్య ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. తిరువూరు పరిధిలో వైసీపీ తరపున నల్లగట్ల సుధారాణి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా లక్కెపోగు వందన్‌కుమార్ ఒక్కో సెట్ నామినేషన్ వేశారు. జగ్గయ్యపేట పరిధిలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా శ్రీరాం రామకృష్ణ, స్వతంత్ర అభ్యర్థులుగా జె.ఆనందరావు, బి.ప్రకాష్ రావు, కె.బుజ్జిబాబు, వేల్పుల విజయ్‌లు ఒక్కో సెట్టు నామినేషన్ వేశారు.

నేడు వల్లభనేని బాలశౌరి నామినేషన్

మచిలీపట్నం పార్లమెంటు జనసేన అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి బుధవారం నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. కొల్లు రవీంద్రతో పాటు, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల టీడీపీ, జనసేన అభ్యర్థులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. మచిలీపట్నంలో భారీస్థాయిలో ర్యాలీ నిర్వహించేందుకు పెద్ద ఎత్తున జనమీకరణ చేస్తున్నారు. ఉదయం 8గంటలకు సుల్తానగరం అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి భారీర్యాలీగా కోనేరుసెంటర్, బస్టాండ్‌సెంటర్, లక్ష్మీటాకీస్ సెంటరు మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుంటారు.

టీడీపీ అధికారంలోకి రావడం తథ్యం : వసంత

ఇబ్రహీంపట్నం/రెడ్డిగూడెం, ఏప్రిల్ 23 : ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ చూస్తే టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని మైలవరం అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. కొండపల్లిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఇస్త్రీ చేసి.. మిషన్ కుట్టి.. మేదర్ల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అన్నేరావుపేట, పాతనాగులూరులో రోడ్డు షో నిర్వహించారు. నామినేషన్ అనంతరం రెడ్డిగూడెంల రాజగోపాలస్వామి ఆలయంలో ఆనవాయితీగా ప్రత్యేక పూజలు చేశారు. అడుగడుగునా ప్రజలు హారతులు పట్టి, పూలవర్షం కురిపించారు. ఈసందర్భంగా సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. తనతో పాటు విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)కి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జంపాల సీతారామయ్య, చుట్టుకుదురు శ్రీను, వాసు, కె.విజయబాబు, ముప్పిడి నాగేశ్వర రెడ్డి, వీరవల్లి రామకృష్ణ, ఖాదర్‌బాబు, బాణావతు రమేష్, బాణావతు ప్రశాంతి, మరీదు పుష్పావతి, జానలపాటి వేణుగోపాల్ రెడ్డి, నాదెళ్ల చెన్నకేశరావు (కేసుబాబు), పాలంకి మోహన్‌మురళీరెడ్డి, బొమ్మిన కోటేశ్వర రావు, కొండపల్లి బాబు, కొలుసు చిన్ని తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం : కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 23 : వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని రంగాలకు చెందిన కార్మికులు తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని మాజీ మంత్రి, మచిలీపట్నం టీడీపీ కూటమి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం కోనేరుసెంటర్, చల్లరస్తా తదితర ప్రాంతాల్లో కార్మికుల సమస్యలపై రవీంద్ర మాట్లాడారు. వైసీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం, జనసేన చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మోటమర్రి బాబా ప్రసాద్, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



కోనేరుసెంటర్‌లో దోశలు వేసి మాట్లాడుతున్న రవీంద్ర

నాన్ ఇంటర్ లాకింగ్ పనులు.. పలు రైళ్ల మళ్లింపు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 23 : దక్షిణ మధ్య రైల్వే విజయవాడ పరిధిలో నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా కాజీపేట వరకు ఉన్న మార్గంలో పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్టు డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం.మండ్రూప్కర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ ట్రాక్‌పై నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు చేపడుతున్న సందర్భంగా బొనకల్లు-చింతకాని-పందిళ్లపల్లి-యరుబాలెం-తొండలగోపవరం-మధిర స్టేషన్లపరిధిలో రైళ్లను మళ్లిస్తున్నారు. ఈ నెల 28, మే 9, 15, 21 తేదీల్లో విశాఖపట్నం-న్యూఢిల్లీ అప్‌అండ్ డౌన్ రైలును విజయనగరం-రాయగడ-టిట్లఘర్-రాయపూర్-నాగపూర్‌ల మధ్య మళ్లిస్తారు. విశాఖపట్నం-గాంధీదామ్ రైలును పూరీ-ఓఖా, విశాఖపట్నం-నిజాముద్దీన్ అప్‌అండ్‌డౌన్ రైళ్లను ఇదే మార్గంలో మళ్లించనున్నారు. విశాఖపట్నం-ఎన్‌టీటీ అప్ అండ్ డౌన్ రైలును, చార్మినార్ హైదరాబాద్ రైలును సికింద్రాబాద్-షాలిమార్ రైళ్లను విజయవాడ-కాజీపేట-సికింద్రాబాద్ మార్గం గుండా మళ్లిస్తారు. సీఎస్‌ఎంటీ-భువనేశ్వర్ అప్‌అండ్‌డౌన్ రైలును సికింద్రాబాద్-కాజీపేట-విజయవాడ రూట్‌లో మళ్లిస్తారు. యశ్వంతపూర్-టాటా రైలును విజయవాడ, గుంటూరు, నంద్యాల, గుంతకల్లు, బళ్లారిల మీదుగా మళ్లిస్తారు. విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సమయాలు రీ షెడ్యూల్ చేశారు.



కూలిపోయిన శిథిలాలను తొలగిస్తున్న సిబ్బంది

కూలిపోయిన అన్నదానం హాలు సీలింగ్

- తప్పిన పెను ప్రమాదం

మోపిదేవి, ఏప్రిల్ 23 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల అన్నదానం హాలు సీలింగు కూలి పెను ప్రమాదం తప్పిన ఘటన మంగళవారం ఉదయం జరిగింది. దేవస్థానం ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా అన్నదానం చేసేందుకు హాలు నిర్మాణం జరిగింది. హాలులో వేడి నివారణలో భాగంగా ఎనిమిది నెలల క్రితం 2.04 లక్షల దేవస్థానం నిధులతో ఇస్పాంతో సీలింగ్ ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో ఒక్కసారిగా సీలింగ్ కూలిపోయింది. ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పిందని భక్తులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం దేవస్థానం అధికారులు శిథిలాలను తొలగించి హాలులో అన్నదానం కొనసాగించారు. సీలింగ్ కూలటంపై కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చినట్టు ఆలయ ఈవో ఎస్.ఎస్.చక్రధరరావు తెలిపారు. తిరిగి సీలింగ్‌ను కాంట్రాక్టర్ చేతనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. 2023 డిసెంబరు నెలలో దేవదాయ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం బొడ్డు సత్యనారాయణచే అన్నదానం హాలును ప్రారంభించటం జరిగింది.

తాగునీటి చెరువులు నింపండి

- కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం,ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి) : వేసవిలోగ్రామీణ, పట్టణ ప్రాంతాలలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలోని పూర్తిస్థాయిలో చెరువులను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం కలెక్టర్‌లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాలునుంచి కలెక్టర్, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు గ్రామీణపాంతాల్లోని అన్ని తాగునీటి చెరువులను నింపామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. గుడివాడ, నందివాడ మండలాల్లో ఇంకా కొన్ని తాగునీటి చెరువులను నింపాల్సి ఉందని, ఈ ప్రాంతాలకు మరో నాలుగురోజులపాటు కాలువల ద్వారా విడుదల చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం కలక్టర్ అధికారులతో తన ఛాంబరులో సమావేశం నిర్వహించి తాగునీటి చెరువులను నింపడం, ఉపాధిహామీ పనులు జరుగుతున్న తీరుపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద ఈఏడాదికి సంబంధించి ఇప్పటివరకు 14లక్షల పనిదినాలకు కల్పించడం జరిగిందని, మరింతమందికి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు లక్షమందికిపైగా ఉపాధి పనులు కల్పించాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీపనులు చేసే ప్రాంతాల్లో పనులు చేసేవారు ఇబ్బందులు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్, విద్యుత్‌శాఖ ఈఈ భాస్కరరావు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, మచిలీపట్నం కార్పొరేషన్, ఉయ్యూరు మునిసిపల్ కమీషనర్‌లు బాపిరాజు, పి వెంకటశ్వరరావు, నీటిపారుదలశాఖ డీఈ మురళి తదితరులు పాల్గొన్నారు.

రాయి.. రాజకీయ డ్రామా

- సీఆర్పీసీ 160 నోటీసు ఇవ్వకుండా నిందితుడ్ని అరెస్టు చేశారు
- సెర్చ్ వారెంట్ జారీ తర్వాత కోర్టులో ప్రవేశపెట్టారు
- ఇదొక పొలిటికల్ ఆర్కెస్ట్రా
- న్యాయవాది అబ్దుస్ సలీం
- సతీష్ కస్టడీ పిటిషన్‌పై ముగిసిన వాదనలు
- తీర్పు నేటికి వాయిదా

విజయవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : "సీఎం జగన్‌పై ఈనెల 13వ తేదీన అజిత్ సింగ్‌నగర్ వివేకానంద స్కూల్ వద్ద జరిగిన రాయి దాడి ఓ రాజకీయ డ్రామా. ఈ కేసులో పోలీసులు అన్ని నిబంధనలను ఉల్లంఘించారు. ఒక పార్టీకి అనుకూలంగా పొలిటికల్ ఆర్కెస్ట్రా నడుపుతున్నా" అని వేముల సతీష్‌కుమార్ తరపున న్యాయవాది అబ్దుస్ సలీం వాదించారు. సతీష్‌ను వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో మంగళవారం వాదనలు జరిగాయి. సతీష్ తరపున సలీం వాదనలు వినిపించారు. పోలీసులు నిందితుడ్ని సీఆర్పీసీ 160 నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేశారన్నారు. "అతడ్ని ఎక్కడ ఉంచారో చెప్పలేదు. మీడియాలో వార్తలు వచ్చిన తర్వాత కూడా కోర్టులో ప్రవేశపెట్టలేదు. సెర్చ్ వారెంట్ దాఖలు చేసిన తర్వాత సతీష్‌ను కోర్టులో ప్రవేశపెట్టారు. సీఆర్పీసీ 40 ప్రకారం ఊరు పెద్ద, కుల పెద్దల సమక్షంలో నిందితుడ్ని అరెస్టు చేయాలి. సీఆర్పీసీ 41(బి) ప్రకారం ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలి. సీఆర్పీసీ41(డి) ప్రకారం న్యాయవాది సమక్షంలో విచారించాలి. కుటుంబ సభ్యులు అడిగితే ఆచూకీ చెప్పలేదు. ఇక్కడ సీఆర్పీసీ 502ని ఉల్లంఘించారు. ఒక పార్టీకి అనుకూలంగా వ్యవహరించడానికి ఇదంతా చేశారు. సీఆర్పీసీ 60(ఎ) ప్రకారం నిబంధనలు కచ్చితంగా పాటించాలి" అని న్యాయవాది వాదించారు. సీఆర్పీసీ164 పిటిషన్ పెండింగ్‌లో ఉండగా పోలీసు కస్టడీకి ఇచ్చే అవకాశం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణ కిషోర్ వాదనలు వినిపిస్తూ సతీష్‌కుమార్ పక్కా ప్రణాళికతో రాయితో సీఎంపై దాడి చేశాడన్నారు. కేసులో మరిన్ని వివరాలు సేకరించడానికి అతడ్ని విచారించాల్సి ఉందన్నారు. ఇరువురి వాదనలు విన్న అనంతరం తీర్పును బుధవారానికి వాయిదా వేశారు.



నగదును స్వాధీనపరచుకున్న నున్న సీఐ దుర్గాప్రసాద్

ఆధారాలు చూపని రూ.4.50 లక్షలు స్వాధీనం

పాయకాపురం, ఏప్రిల్ 23 : ఎన్నికల దృష్ట్యా మంగళవారం నున్న రూరల్ పోలీసులు నూజివీడు ప్రధాన రహదారి వెంబడి తనిఖీలు చేపట్టారు. ఎన్టీపీసీ చెక్‌పోస్ట్ వద్ద జరిపిన తనిఖీల్లో విస్సన్నపేట నుంచి నగరానికి వస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.4.50 లక్షలు స్వాధీన పరచుకున్నారు. భద్రాద్రి జిల్లాకు చెందిన దుంపకుంట్ల శ్రీనివాస్ బస్సులో వస్తుండగా అతడి వద్ద ఎటువంటి పత్రాలు లేని నగదును పోలీసులు గుర్తించి స్వాధీనపరచుకున్నారు. నగదును ట్రెజరీకి అప్పగించారు. సదరు వ్యక్తి తన వ్యాపార నిమిత్తం తీసుకువెళ్తున్నానని చెప్పగా అధికారులు విచారిస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

రూ. 5 లక్షల విలువైన 3840 మద్యం బాటిళ్లు స్వాధీనం

వీరులపాడు, ఏప్రిల్ 23 : వి.అన్నవరం చెక్‌పోస్టు వద్ద మంగళవారం నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై మహాలక్ష్మణుడు సిబ్బందితో కలిసి తనిఖీలు చేసి ఓ వాహనంలో తరలిస్తున్న 80 కేసుల 3840 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో ఏసీపీ రవికిరణ్ వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం మధిరలోని ఒక దుకాణం నుంచి మద్యం కొనుగోలు చేసి ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం వి.అన్నవరం చెక్‌పోస్టు దాటి చిలుకూరు గ్రామం వైపు వెళుతున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.5,08,800లు ఉంటుందని తెలిపారు. చిలుకూరు గ్రామానికి చెందిన జానపాటి శ్రీరాములు, అనంత మాధవలు అక్రమంగా మద్యం తరలిస్తున్నారని, చిలుకూరులో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న లగడపాటి శ్రీను, వైన్‌షాప్ ఓనర్ పరమేశ్వరరావులు పరారీలో ఉండగా వారిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

పామర్రులో వైఎస్ షర్మిల సభ నేడు

పామర్రు, ఏప్రిల్ 23 : పీసీసీ అధ్యక్షురాలి హోదాలో వైఎస్ షర్మిల తొలిసారిగా నేడు పామర్రు పట్టణానికి రానున్నారు. బుధవారం సాయంత్రం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో నిర్వహించే ఎన్నికల సభలో ఆమె ప్రసంగిస్తారు. ఈమేరకు జనసమీకరణ ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డీవైదాస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. పోలీసు బందోబస్తును గుడివాడ డీఎస్పీ పర్యవేక్షణలో కొనసాగనున్నట్టు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.80

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా



సత్యనారాయణపురం, ఏప్రిల్ 23: రోడ్లపై చెత్త వేసినా, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టినా, రోడ్లపై పెంపుడు జంతువులను ఉంచినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపైన మొబైల్ కోర్టు చర్యలు తీసుకుంటుందని కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి బి. విజయకుమార్ రెడ్డి అన్నారు. సత్యనారాయణపురం సర్కిల్ -2 కార్యాలయంలో మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 35 కేసులపైన విచారణ జరిపి రూ.17,010 జరిమానా విధించారు. కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారు శిక్షార్హులన్నారు. హెల్త్ ఆఫీసర్ -2 డాక్టర్ రామకోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెకర్లు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమంలో రాజీ లేదు

54వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో సుజనా చౌదరి

వన్‌టౌన్, ఏప్రిల్ 23: ముస్లిం మైనార్టీల సంక్షేమం విషయంలో రాజీపడేది లేదని కూటమి బలపరచిన విజయవాడ పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. మంగళవారం 54వ డివిజన్‌లో పర్యటించారు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు సయ్యద్ సలీం తాజుద్దీన్‌తో కలిసి పంజాసెంటర్, గాంధీబొమ్మ తదితర ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, షేక్ రషీద్ తదితరులు ఘన స్వాగతం పలికారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. దాడి అప్పారావు, దాడి మురళీకృష్ణ, సుజనాచౌదరికి మద్దతుగా పాల్గొన్నారు. అడ్డూరి శ్రీరామ్, ఎంఎస్ బేగ్, పైలా సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.



54వ డివిజన్‌లో పర్యటిస్తున్న సుజనాచౌదరి, పక్కన మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్

పాతరాజరాజేశ్వరి పేట: స్థానిక 55వ డివిజన్‌లోని నైజాంగేటు నుంచి పలుప్రాంతాల్లో మంగళవారం సుజనా చౌదరి డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మహమ్మద్ జావేద్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. వడ్డెర పోల మాంబ దేవి, గంగానమ్మ తల్లి ఆలయాలలో పూజలు చేశారు. కొండప్రాంత వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జిల్లాలో పుట్టి, పెరిగిన వ్యక్తిగా తనకు ఇక్కడ సమస్యలపై అవగాహన ఉందని, తనకు సేవ చేసుకునే అవకాశం కల్పిస్తే డివిజన్ రూపురేఖలు మారుస్తానని పేర్కొన్నారు. రెల్లి సంఘం జేఏసీ నాయకుడు భూపతినంద మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కార్మికుడు, డ్వాక్రా గ్రూపుల పొట్టలు కొట్టిందని, బ్లాక్ మార్కెట్‌లో ఉద్యోగాలకు రేట్లు నిర్ణయించి అమ్ముకున్నారని విమర్శించారు.

కొండప్రాంత సమస్యలు సుజనాతోనే పరిష్కారం

చిట్టినగర్: ప్రైజర్‌పేట కొండప్రాంతాల్లో సమస్యలన్నీ తన తండ్రి గెలుపుతోనే పరిష్కారం అవుతాయని పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి తనయుడు కార్తీక్ అన్నారు. మంగళవారం 49వ డివిజన్ ప్రైజర్‌పేట కొండప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రైజర్‌పేట, వందనంవీధి, ట్యాంక్‌రోడ్డు, చర్చివీధి తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రచారంలో 49వ డివిజన్ అధ్యక్షుడు బడుగు వెంకన్న, కార్యదర్శిలంకా శ్రీనివాసరావు, నాయకులు కత్తి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఎన్డీఏ కూటమితోనే సాధ్యం

భవానీపురం: కేంద్రంలోను, రాష్ట్రంలోనే ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తేనే అభివృద్ధి సంపూర్ణంగా జరుగుతుందని సుజనా చౌదరి సోదరి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. 43వ డివిజన్ ఊర్మిళానగర్ పోలేరమ్మ గుడిలో మంగళవారం పూజల అనంతరం పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ ఆమె ఏకలవ్యనగర్, ప్రజాశక్తినగర్, రెడ్డికాలనీ, ఊర్మిళానగర్‌ల్లో ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొనికి కొండయ్య, వల్లభనేని ప్రసన్నలక్ష్మి, జనసేన వివిధ డివిజన్ల అధ్యక్షులు తిరుపతి అనూష, బొమ్ము గోవిందలక్ష్మి, మల్లెపు విజయలక్ష్మి, రాష్ట్ర అధికార ప్రతినిధి రజనీలతో కలిసి సూపర్ సిక్స్ పథకాలను కరపత్రాలను, ఓటింగ్ తేదీ కరపత్రాలను పంచి అభ్యర్థించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.

దుల్హన్ పథకం జగన్ ఎందుకు రద్దు చేశాడు?

ప్రశ్నించిన కేశినేని శ్రీదేవి

పాతరాజరాజేశ్వరిపేట: జగన్ రాష్ట్రాన్ని దోచుకు తినడమే కాకుండా, చంద్రబాబు అమలు పరిచిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నిలిపివేసి మైనార్టీ, బీసీలకు ఎందుకు అన్యాయం చేశాడో సమాధానం చెప్పాలని కేశినేని శ్రీదేవి ప్రశ్నించారు. స్థానిక 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరి పేటలో మంగళవారం కూటమి విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి విజయాన్ని కాంక్షిస్తూ కేశినేని చిన్ని సోదరి కేశినేని శ్రీదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంలో కేశినేని శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి సాధించాలన్నా, సంక్షేమ పథకాలు తిరిగి అందాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. టీడీపీ నాయకులు ధనేకులు వెంకట సుబ్బారావు, ఈశ్వర్, శ్యామ్, పుల్లారావు, బీజేపీ, జనసేన, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబును గెలిపించుకోవాలని చూస్తున్నారు

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

భారతీనగర్, ఏప్రిల్ 23: అభివృద్ధి, సంక్షేమం గురించి అసలు పట్టించుకోని జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ సంక్షేమాన్ని అందించే చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్‌లోని కాపుల బజార్‌లో మంగళవారం గద్దె అనురాధ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ, జనసేన బలపరిచిన తూర్పునియోజక వర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాల్సిందిగా ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సంక్షేమ పాలన తెచ్చుకునేందుకు టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందామన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి గద్దె రామ్మోహన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తాడి బాబూ రావు, గుత్తికొండ కృష్ణమోహన్, బండి కోమలి, పూలదాసు మారుతీ మోహన్, శ్రీను నాయుడు, గద్దె రమేష్, రాజేంద్రప్రసాద్, ఈశ్వర్ పేరేపి పాల్గొన్నారు.

రామలింగేశ్వరనగర్: 15వ డివిజన్ రామలింగేశ్వర నగర్ లో మంగళవారం టీడీపీ, బీజేపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అవగాహన కలిగి, ప్రజల కష్టాలకు చలించి సాయం చేసే గుణం ఉన్న గద్దె రామ్మోహన్‌ను, శివనాథ్‌లను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న గద్దె అనురాధ

మొగల్రాజపురం: బీజేపీ, జనసేన బలపరచిన పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, అసెంబ్లీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ విజయాన్ని కాంక్షిస్తూ సైకిల్ గుర్తు మీద ఓటేయాలని కోరుతూ గద్దె రాజేష్ మంగళవారం 7వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కస్తూరిబాయి పేట, గాంధీబొమ్మల సెంటర్, సాయిరాం టిఫిన్ సెంటర్ ఏరియాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు సీఎం అవగానే అమలు చేయబోయే సంక్షేమపథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. పటమట సతీష్ చంద్ర, గుమ్మడి గురుప్రసాద్, పెనుగొండ శ్రీనివాస్, దోమకొండ జ్యోతి, నాగమోతు రాజా, అన్నే రాయులు, పరసా లక్ష్మణ్, రేపాకులశ్రీనివాస్, పటమట సాయి పవన్, శివలక్ష్మి, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

సగరులను బీసీ డీ నుంచి ఏలో చేరుస్తాం

● బొండా ఉమా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 23 : టీడీపీ అధికారంలోకి రాగానే సగరులను బీసీ డీ నుంచి ఏలోకి మారుస్తామని టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో మంగళవారం సగర సామాజిక వర్గానికి టీడీపీ అమలు చేయనున్న పథకాలను ముద్రించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ సగర కులస్తుల ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహకాలు పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్: అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ మహిళలతో బొండా సుజాత ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బొండా సుజాత మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ వీరమాచినేని లలిత, మాజీ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి, లబ్బా దుర్గ, పైడి తులసి, సందిరెడ్డి గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

బొండా సిద్ధార్థ ప్రచారం

అజిత్‌సింగ్‌నగర్: 59వ డివిజన్‌లో టీడీపీ నేతలు మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొండా సిద్ధార్థ ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న వివిధ పథకాలను స్థానిక ప్రజలకు వివరించారు. అనంతరం బొండా సిద్ధార్థ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు బంగారు నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పశ్చిమ ప్రజానీకంతో
కేశినేని చిన్ని, సుజనాచౌదరిల మాటామంతీ

చిట్టినగర్, ఏప్రిల్ 23: పశ్చిమలోని ప్రజానీకంతో బుధవారం సాయంత్రం 6గంటలకు పాలఫ్యాక్టరీ ఫంక్షన్ హాల్‌లో మాటామంతీ కార్యక్రమం ద్వారా సమస్యలు, భవిష్యత్ ప్రణాళికపై టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్, కూటమి ఎమ్మెల్యే సుజనా చౌదరిలు ప్రజలతో మాట్లాడనున్నారు. పశ్చిమంతోపాటు నగర అభివృద్ధి కార్యక్రమాలు, ప్రణాళికలపై నాయకులు మాట్లాడతారని ఆహ్వాన కమిటీ సభ్యులు తెలియజేశారు. కులమతాలలకు అతీతంగా అందరు ఆహ్వానితులేనని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



పోతిన వెంకట రామారావు నామినేషన్

వన్‌టౌన్, ఏప్రిల్ 23: జై భారత్ పార్టీ పశ్చిమ అభ్యర్థి పోతిన వెంకట రామారావు (రాము) మంగళవారం భారీ ర్యాలీతో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. తొలుత చిట్టినగర్ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు మహంత్ నాయర్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. నాయకులు కొడాలి ఏకాంబరం, రవికిరణ్, క్యాంపైన్ ఇన్‌ఛార్జి యేన్నేటి మహేష్, తమ్మిన శ్రీనివాస్, రాయన మణి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పోతిన వెంకటేశ్వరరావు రాజీనామా

వన్‌టౌన్, ఏప్రిల్ 23: వన్‌టౌన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ ప్రచార కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పోతిన వెంకటేశ్వరరావు శనివారం ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. గత కొంతకాలం నుంచి వెంకటేశ్వరరావును పార్టీ పట్టించుకోకపోవడంతో పాటు అవమానానికి గురిచేయడంతో ఆయన పార్టీకి రాజీనామా చేశారు. త్వరలో భవిష్యత్తు కార్యాచరణను తెలియజేస్తానని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు పోస్టు చేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

● నాలుగు బైక్‌లు, టీవీలు దగ్ధం

పటమట, ఏప్రిల్ 23 : స్థానిక 11వ డివిజన్ పటమట మరీదు పుల్లారావు రోడ్డులో మంగళవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఉయ్యూరు వెంకట సారథి ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఇంట్లో అద్దెకు ఉంటున్న వారి నాలుగు మోటార్ సైకిళ్లు దగ్ధం అయ్యాయి. టీవీలతో పాటు పలు ఎలక్ట్రికల్ సామాగ్రి కాలిపోయింది. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కోనేరు రాజేష్ సమాచారంతో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. పామర్తి కిషోర్, లంకా రేవంత్‌కుమార్, పట్నాల సదాశివరావులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి

విద్యాధరపురం, ఏప్రిల్ 23: భవానీపురంలోని 40వ డివిజన్ టీడీపీ కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా చనిపోయిన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికుల వివరాల మేరకు భవానీపురంలోని కనకదుర్గా ఫ్లైఓవర్ ఎంట్రన్స్‌లో ఓ వ్యక్తి రోడ్డు మధ్యలో పడి గాయాలు ఉండడంతో స్థానికులు అతనిని అక్కడ నుంచి పక్కకు తీసుకుని వెళ్లారు. కొద్దిసేపటి తరువాత చూడగా అతను చనిపోయాడు. స్థానికులు సమాచారం మేకు భవానీపురం పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని స్థానికులు చెప్పారు.

జీఎన్ఆర్ స్కూల్ విద్యార్థుల సత్తా

భవానీపురం, ఏప్రిల్ 23 : 44వ డివిజన్ లేబర్‌కాలనీలోని జీఎస్ఆర్ హైస్కూల్ నుంచి మొత్తం 74 మంది బాలబాలికలు టెన్త్ పరీక్షలు రాయగా ఇందులో 59 మంది ఉత్తీర్ణులై 80 శాతం ఉత్తీర్ణత శాతం నమోదు చేశారు.ముగ్గురు 550 పైగా మార్కులు సాధించగా, 9 మంది 500 మార్కులపైనే సాధించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

ఇళ్ల పట్టాల సమస్య పరిష్కరిస్తాం

● మధురానగర్ ఎన్నికల ప్రచారంలో కేశినేని జానకీ లక్ష్మి హామీ

మధురానగర్, ఏప్రిల్ 23: టీడీపీ అధికారంలోకి రాగానే మధురానగర్ ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరిస్తామని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) భార్య కేశినేని జానకీ లక్ష్మి హామీ ఇచ్చారు. బీజేపీ, జనసేన బలపరచిన పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్, అసెంబ్లీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం 29వ డివిజన్ మధురానగర్‌లో రమాదేవి పాఠశాల నుంచి కుమార్తె స్నిగ్ధతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. నేతాజీ కాలనీ ఏడు రోడ్లు, పీవీ సుబ్బారావు వీధిలో ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు సంబంధించి సూపర్ సిక్స్ పేరిట ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. నేతాజీ కాలనీలో పలు చోట్ల స్థానికులు ఇళ్ల పట్టాల సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. డివిజన్ అధ్యక్షులు పీవీఆర్, కార్యదర్శి సూరి, సింగం వెంకన్న, అంగిరేకుల రాంబాబు, మసిముక్కు శ్రీనివాస్, అరవింద్, ప్రసాద్, నారాయణ మూర్తి, ఝాన్సీ మాధవి, నోవా, జనసేన అధ్యక్షుడు కెంబూరి కృష్ణ, భవానీ, రమణ పాల్గొన్నారు.

పైలెట్ సర్వీస్ స్టేషన్‌లో పుస్తకాల పంపిణీ

లబ్బీపేట, ఏప్రిల్ 23: ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా బందర్‌రోడ్డులోని పైలెట్ సర్వీస్ స్టేషన్‌లో మంగళవారం వినియోగదారులకు, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇండియన్ ఆయిల్ సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్ మాట్లాడుతూ పుస్తక పఠనంతో మనిషి మేధస్సు పెరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా వినియోగదారులకు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. సర్వీస్ స్టేషన్ అధినేత ఎంవీవీ సత్యనారాయణ, మేనేజర్ కె.వెంకటప్పయ్య, నందకిషోర్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థికి పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉద్యోగులు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి

లయోల ఇంజనీరింగ్ కళాశాలలో...

భారతీనగర్: లయోల ఇంజనీరింగ్ కళాశాలలో లిటరరీక్లబ్, ఎన్‌డీఎల్‌బి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆంగ్ల రచయిత షేక్‌స్పియర్ జయంతి, ఆంగ్లభాషా దినోత్సవం కావడంతో ఆంగ్ల ప్రొఫెసర్ డాక్టర్ క్యాండీ సమక్షంలో షేక్‌స్పియర్ రచనలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకోండి

వన్‌టౌన్, గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఫ్లాగ్‌మార్చ్

వన్‌టౌన్, ఏప్రిల్ 23: ఎన్నికల సందర్భంగా నగరంలోని వన్‌టౌన్, గవర్నరుపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఈస్ట్ జోన్ డీసీపీ అదిరాజ్ సింగ్ రాణా పర్యవేక్షణలో మంగళవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కేంద్ర సాయుధ బలగాలతో పాటు పోలీసులు ప్రజలకు భరోసా కల్పిస్తూ ముందుకు సాగారు. ఏసీపీ జి.రత్నరాజు ఆధ్వర్యంలో గవర్నరుపేట సీఐ డి.వి రమణ, ఎస్ఐ పి.నారాయణమ్మ, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు దీనదయాళ్, జగదీశ్‌చంద్ర, ఆశిష్‌మిశ్రాల ఆధర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. లెనిన్ సెంటర్, అరండల్ పేట, బీసెంట్ రోడ్డు, గూడవల్లి వారి వీధి, ఆలీబేగ్ వీధి, ప్రకాశం రోడ్డు, అట్ట రత్తయ్య వీధి, గోపాలరెడ్డి వీధి, మ్యూజియం రోడ్డు, రాజుగోపాలచారి వీధి, సీఆర్‌డీఏ ఆఫీస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.



గవర్నరుపేట పీఎస్ పరిధిలో



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో

● వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సీఐ దుర్గాశేఖర్‌రెడ్డి బృందం సాయుధ పోలీసులతో కలిసి వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ శాంతి యుతంగా ఓటు హక్కు వినియోగిం చుకోవాలని ధైర్యం చెప్పేందుకు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించామని, అసాంఘిక కార్యకలాపాలకు పాటుపడిన వారిపైన, విధులకు ఆటంకం కలిగించిన వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూటమి విజయం కోసం హోమం

● 34వ డివిజన్‌లో టీడీపీ నాయకురాలు విజయలక్ష్మీ కూటమి కార్యాలయంలో

పాతరాజరాజేశ్వరి పేట, ఏప్రిల్ 23 : రాబోయే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి గెలవాలని టీడీపీ నాయకురాలు మహమ్మద్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. స్థానిక 34వ డివిజన్, కేదారేశ్వరపేట, 3వలైన్‌లో ఆదివారం టీడీపీ నాయకురాలు మహమ్మద్ విజయలక్ష్మీ ఏర్పాటు చేసిన కూటమి కార్యాలయంలో మంగళవారం చేపట్టిన హోమంలో ప్రముఖులు గంటా మాధవ చంగలరావు, ఆడపాల వసంత్‌లు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంలో విజయలక్ష్మీ మాట్లాడుతూ కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి గెలుపును కాంక్షిస్తూ హోమం నిర్వహిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు మహమ్మద్ సుభాని, డివిజన్ నాయకులు జగదీష్, శివ, తేజ, మహమ్మద్ కాజా పాల్గొన్నారు.

మోదీకి పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదు

సీపీఎం సెంట్రల్ అభ్యర్థి బాబూరావు

సత్యనారాయణపురం, ఏప్రిల్ 23: మత చిచ్చు రేపుతూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న మోదీకి పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని సీపీఎం సెంట్రల్ అభ్యర్థి సీహెచ్ బాబూరావు అన్నారు. 30వ డివిజన్ దేవీనగర్, రామకృష్ణాపురం ప్రాంతాల్లో బాబూరావు, సీపీఐ, కాంగ్రెస్ నేతలు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో స్విస్ బ్యాంక్‌లో ఉన్న నల్ల డబ్బుని వెలికి తీసి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని మోదీ నమ్మించారని, ఒక్క పైసా నల్లడబ్బును బయటకు తీయలేక పోయారని ఎద్దేవా చేశారు. సీపీఎం జిల్లాకార్యదర్శి డివి కృష్ణ, సీపీఐ నగర నాయకులు కేవీ భాస్కరరావు, సీపీఎం నేతలు ఎన్.శ్రీనివాస్, కల్యాణ్, వెంకటేశ్వరరావు, షకీలా, ఆశా తదితరులు పాల్గొన్నారు.

స్థాయి మరిచి విమర్శలు చేస్తే బుద్ధి చెపుతాం

జనసేన నేతలు అశోక్, అనిత హెచ్చరిక

లబ్బీపేట, ఏప్రిల్ 23: పోతిన మహేశ్ స్థాయి మరచి పవన్ కల్యాణ్, అమ్మిశెట్టి వాసుపై విమర్శలు చేస్తే సరైన రీతిలో బుద్ధి చెబుతామని జనసేన నేతలు అశోక్, అనితలు హెచ్చరించారు. బందర్ రోడ్డులోని జనసేన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో 7వ డివిజన్ జనసేన నేత అశోక్, జనసేన పొలిటికల్ ఎఫైర్స్ సంయుక్త కార్యదర్శి అనితలు మాట్లాడుతూ జనసేన పార్టీ వలన పేరు తెచ్చుకుని స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారి జనసేన అధినేత పవన్ పై విమర్శలు చేయడం హేయమైన చర్య అన్నారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసుపైన అసత్య ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. పోతిన మహేశ్ అవాకులు, చవాకులు పేలటం మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. నాయకులు మట్టా వివేక్ కుమార్, పల్లి దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.






ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు నియోజకవర్గమైన జగ్గయ్యపేట బరిలో ఈ సారి పాతకాపులే తలపడుతున్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి శ్రీ రాం రాజగోపాల్ (తాతయ్య), వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పోటీ చేస్తున్నారు. గత మూడు ఎన్నికల నుంచి వీరిద్దరే ప్రధాన పార్టీల తరపున ఢీకొంటున్నారు. వీరి మధ్య జరిగిన పోరులో రెండుసార్లు తాతయ్య గెలుపొందగా సామినేని ఒకసారి మాత్రమే గెలిచారు. గత ప్రభుత్వంలో తాను పేటకు చేసిన అభివృద్ధి, ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ చరిష్మా తనకు ఓట్లు కురిపిస్తాయని తాతయ్య గెలుగు ధీమాతో ఉండగా, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను మాత్రం పార్టీ అధిష్టానం నుంచి పూర్తి విశ్వాసం అందుకోలేకపోవడం, అంతర్గత కుమ్ములాటలు, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని విమర్శలు ఎదుర్కొంటున్నారు. జగ్గయ్యపేటలో ఆది నుంచి ఒక సారి ఓడిపోయిన వ్యక్తిని తిరిగి గెలిపించిన చరిత్ర లేదు. ఈ సెంటిమెంట్‌ను బ్రేక్ చేసిన వ్యక్తిగా 2009లో గెలిచి ఉదయభాను ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ సారి తాతయ్య ఆ మేజిక్‌ను పునరావృతం చేస్తారా.. పేట మేస్త్రీ కిరీటం దక్కించుకుంటారా.. వేచి చూడాలి.

ఈ పేటకు ఎవరో మేస్త్రీ..!

- పాతకాపుల మధ్యే నాలుగోసారి పోటీ
- ప్రభుత్వ వ్యతిరేకత, గత అభివృద్ధిపై తాతయ్య ఆశలు
- కలిసిరానున్న జనసేన, బీజేపీతో పొత్తు

జగ్గయ్యపేట: పేట అసెంబ్లీ బరిలో నాలుగోసారి పాత ప్రత్యర్థులే నిలిచారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా జనసేన, బీజేపీ మద్దతుతో తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), వైకాపా అభ్యర్థిగా ప్రభుత్వ విప్, టీటీడీ బోర్డు సభ్యుడు సామినేని ఉదయభాను తలపడుతున్నారు. వీరితో పాటు బీఎస్పీ తరఫున కొదమల ప్రభుదాస్ పోటీలో ఉండగా, ఇండియా కూటమి తరఫున ఇంత వరకు అభ్యర్థి ఖరారు కాలేదు. జై భారత్ భీం పార్టీ తరఫున కరిశే మధు అనే విద్యావంతుడు పోటీకి సిద్ధమైయ్యారు. అభ్యర్థులు ఎందరున్నా ప్రధాన పోటీ తాతయ్య, ఉదయభాను మధ్యే. వీరిద్దరు 2009 నుంచి పోటీ పడుతున్నారు. ఒకప్పుడు ఇద్దరు కాంగ్రెస్ పార్టీలో కొనసాగినా 2009లో అనూహ్యంగా మునిసిపల్ చైర్మన్‌గా ఉన్న తాతయ్య తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అప్పటికే కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న ఉదయభానుపై పోటీ చేసి తొలిసారి 9678 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. 2014లో ఉదయభాను కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై కొట్టి వైసీపీ తరఫున బరిలో నిలిచి టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్యపై రెండోసారి 3846 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. 2019లో తిరిగి వారిద్దరే వైసీపీ, టీడీపీ అభ్యర్థులుగా మూడోసారి పోటీచేయగా ఉదయభాను 4778 ఓట్ల తేడాతో విజయం సాధించి జగ్గయ్యపేట చరిత్రను తిరగరాశారు. అప్పటి వరకు పేట అసెంబ్లీ బరిలో పోటీ చేసి ఓడిపోయిన వారెవ్వరినీ ప్రజలు మళ్లీ ఆదరించి, అందలం ఎక్కించిన దాఖలాలు లేవు. ఒక్క ఉదయభాను మాత్రమే ఓడి గెలిచారు. వైసీపీ గాలిలోనూ తాతయ్య గట్టి పోటీ ఇచ్చారు. ఈదఫా కూడా శ్రీరాం తాతయ్య టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. అప్పటి నుంచి తాతయ్య వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వచ్చారు. ప్రభుత్వ వ్యతిరేకత, 2014లో చేపట్టిన అభివృద్ధిపై ఆశలు పెట్టుకున్నారు. జనసేన, బీజేపీతో పొత్తు కలిసే అవకాశం ఉంది. ఇక ఉదయభాను విషయానికి వస్తే సిట్టింగ్ ఎమ్మెల్యే అయినా చివరివరకు ఆయన సీటు ఖరారు విషయంలో అధిష్టానం నాన్చుడు వైఖరీ ఇబ్బందిగా మారింది. స్థానికంగా అందుబాటులో లేకపోవటం, పార్టీలో పట్టు సడలటం, కొంత మంది బహిరంగంగా ఆయన వైఖరిని తూర్పారబట్టడం వంటివి ప్రతికూలంగా మారాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కర్నాటి అప్పారావుని పోటీలో ఉంచటంతో సంప్రదాయ వైఐసీపీ ఓటు బ్యాంకులో చీలిక వచ్చే అవకాశం ఉంది. 2019లో బీజేపీ, జనసేన వేర్వేరుగా పోటీ చేశాయి. జనసేన నుంచి ధరణికోట వెంకటరమణ కుమార్ పోటీ చేసి 1316 ఓట్లు, బీజేపీ నుంచి అన్నెపాగ ప్రఫుల్ల శ్రీకాంత్ 578 ఓట్లు సాధించారు. ఇప్పుడు రెండు పార్టీలు టీడీపీకి మద్దతుగా ఉండటంతో టీడీపీకి కలిసి వచ్చే అంశం. శ్రీరాం తాతయ్య మరోసారి గెలిచి ఉదయభానులాగే సెంటిమెంట్‌ను తిరగరాస్తారా లేదా అనేది భవిష్యత్‌లో తేలనుంది. నియోజకవర్గంలో బీసీ, కమ్మ సామాజికవర్గం ప్రధానంగా ఉంది. తర్వాత కాపులు, ఆర్యవైశ్యులు, దళితులు, ముస్లింలు నిలిచారు. జనసేన టీడీపీకి మద్దతు పలకటంతో కాపు ఓట్లలో చీలిక అదే సామాజిక వర్గానికి చెందిన ఉదయభానుపై పడే అవకాశం ఉంది. ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబు మద్దతివ్వటం, మందా కృష్ణమాదిగ టీడీపీ కూటమిని గెలిపించాలని ఇచ్చిన పిలు పు దళితుల్లో సింహభాగం ఉన్న మాదిగల మద్దతు టీడీపీకి లభిస్తుందని, ప్రభుత్వ వ్యతిరేకత ఎలాగు ఉ న్నట్టేనని టీడీపీ శ్రేణులు అభిప్రాయ పడుతున్నారు.



ముక్త్యాల రాజా

పిల్లలమర్రి వెంకటేశ్వర్లు


నెట్టెం రఘురాం

కమ్యూనిస్టుల కోటలో టీడీపీ పాగా

నాడు కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న జగ్గయ్యపేట.. టీడీపీ ఆవిర్భావం తర్వాత టీడీపీకి పెట్టని కోటగా మారింది. మధ్యలో కొంతకాలం కాంగ్రెస్ గెలుపొందినా ఆధిపత్యాన్ని మాత్రం కొనసాగించలేకపోయింది. 1951లో నియోజకవర్గ పునర్విభజనలు జరిగాక జగ్గయ్యపేట నియోజకవర్గంగా ఏర్పడింది. తొలుత మద్రాసు రాష్ట్ర అసెంబ్లీలో జగ్గయ్యపేట కార్మిక నియోజకవర్గంగా ఉండేది. కమ్యూనిస్టు యోధుడు పిల్లలమర్రి వెంకటేశ్వర్లు జగ్గయ్యపేట మొదటి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అంతకు ముం దు 23ఏళ్ల పాటు మద్రాసు అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా వ్యవహరించారు. 1957లో జగ్గయ్యపేట కంచికచర్ల నియోజకవర్గంలోకి మారింది. తిరిగి 1962లో ఎస్సీలకు రిజర్వ్ కావడంతో గాలేటి వెంకటేశ్వర్లు కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యారు. 1967లో జనరల్‌గా మారిన తరవాఆత కాంగ్రెస్ నుంచి ప్రము ఖ స్వాతంత్ర్య సమరయోధుడు రేపాల బుచ్చిరామయ్యశేష్టి ఎన్నికైయ్యారు. 1972లో ముక్త్యాల రాజా వాసిరెడ్డి రామగోపాల కృష్ణమహేశ్వరప్రసాద్ ఇండిపెండెంట్‌గా నిలబడి విజయం సాధించారు. కొంతకాలానికి ఆయన దివంగతులు కావటంతో జరిగిన ఉప ఎన్నికలో ఇందిరా కాంగ్రెస్ తరఫున ఆయన సతీమణి వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ విజయం సాధించారు. 1978లో కాంగ్రెస్ పార్టీ తరఫున బొద్దులూరి రామారావు ఎన్నికకాగా, 1983లో టీడీపీ ఆవిర్భావం తర్వాత అక్కినేని లోకేశ్వరరావు ఒకసారి వియం సాధించారు. 1985 నుంచి 1989, 1994లో నెట్టెం రఘురాం వరుసగా 3 సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా, నియోజకవర్గం నుంచి తొలి క్యాబినెట్ మంత్రి గా చంద్రబాబు హయాంలో పనిచేశారు. 1999, 20 04లో వరుసగా కాంగ్రెస్ తరఫున సామినేని ఉదయభాను విజయం సాధించారు. 2009, 2014లో తెలుగుదేశం పార్టీ తరఫున శ్రీరాం రాజగోపాల్ (తాత య్య) వరుసగా 2 సార్లు విజయం సాధించారు. 2019లో తిరిగి వైకాపా తరఫున ఉదయభాను ఎన్నికయ్యారు. 2024లో వారిద్దరూ మరోసారి బరిలో నిలిచారు.

ఇదీ నియోజవకర్గ చరిత్ర..

పేట నియోజకవర్గం ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో ఉంది. పేట నుంచి 5-15 కి.మీలు దాటితే తెలంగాణ రాష్ట్రం వచ్చేస్తుంది. పాలేరు, మునేరు, కృష్ణానదుల ప్రవాహంతో వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగుతుంది. సున్నపురాయి, కాకిరాయి నిల్వలతో 1980 తర్వాత సిమెంట్ కర్మాగారాల నిర్మాణంతో పారిశ్రామికవాడగా, సిమెంట్ సిటీగా ఖ్యాతి గడించింది. సమీపంలో ధనంబోడు అనే బౌద్ధారామం ఉండటంతో చారిత్రకంగా విశిష్ట స్థానంలో ఉంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన వేదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, తిరుమలగిరిలో శ్రీ వేంకటేశ్వర స్వామి, పెనుగంచిప్రోలు శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానాలతో పాటు పట్టణం 108 దేవాలయాలతో టెంపుల్ సిటీగా ఖ్యాతి గడించింది. శ్రీ మహాలక్ష్మీ, కోట మైసమ్మ తల్లి దేవస్థానం రాష్ట్రంలోనే ఏకైక వెండి దేవాలయంగా ప్రత్యేకతను చాటుకుంది. సంగీత వాయిద్య పరికరాల తయారీతో మరో ఘనతను చాటుకుంది. ఒకప్పుడు పేట మునగాల పరగాణాలో ఉండటంతో కమ్యూనిస్టుల ప్రభావం ఉండేది. తొలినుంచి బంగారం వ్యాపారానికి ప్రసిద్ధి. ఇప్పటికీ వెయ్యి మంది స్వర్ణకారులు, చేతివృత్తులవారు పనిచేస్తున్నారు. విజయవాడ కంటే ముందే జగ్గయ్యపేట 1890లోనే జిల్లాలో గ్రామ పంచాయతీగా గుర్తించబడింది. ఆధ్యాత్మిక, చారిత్రక, పారిశ్రామికంగా, వర్తకవాణిజ్య కేంద్రంగా గుర్తించబడింది. ఆంధ్ర, తెలంగాణకు సరిహద్దుగా ఉండటంతో ఇక్కడ రెండు ప్రాంతాల మిశ్రమ సంస్కృతి కనిపిస్తుంది. బతుకమ్మల సంబరాలు తెలంగాణలోని పల్లెలకు దీటుగా జరుగుతాయి.



ఓటరన్న మేలుకో.. భవిష్యత్తును మార్చుకో..!

ఓటు విలువ తెలుసుకోవాలని, ఇది రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని, అమ్ముకోవద్దంటూ భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకుడు వైవీ మురళీకృష్ణ క్లాత్ బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న సీతారామ రేడియో స్టోర్స్ వద్ద ఏర్పాటు చేసిన ఈ బ్యానర్ అటువైపుగా వెళ్లేవారిని ఆకర్షిస్తోంది. - గుడివాడ

గద్దె సెంటిమెంట్!

- పుట్టగుంట సతీశ్ చేతుల మీదుగా బీఫారం
- 1994 నుంచి అదే సెంటిమెంట్ అనుసరిస్తున్న గద్దె

విజయవాడ - ఆంధ్రజ్యోతి: రాజకీయ నేతల సెంటిమెంట్లు ఎక్కువ. విజయవాడ తూర్పు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ తన బీఫారంను తన చేతుల మీదుగా కాకుండా తనకు సన్నిహితుడైన ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీశ్ చేతుల మీదుగా తీసుకోవడం సెంటిమెంట్. 1994లో తొలిసారి ఎన్నికల బరిలో నిలిచినప్పటి నుంచి గెలిచినా.. ఓడినా గద్దె రామ్మోహన్ అదే సెంటిమెంట్‌ను అనుసరిస్తున్నారు. తాజాగా పార్టీ అధినేత చంద్రబాబు ఇటీవల టీడీపీ అభ్యర్థులందరికీ బీఫారాలు అందజేశారు. గద్దె రామ్మోహన్ హాజరైనా బీఫారం తీసుకోలేదు. మంగళవారం విజయనగరం జిల్లా ఎస్.కోటలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబును గద్దె రామ్మోహన్, సతీశ్ కలిశారు. తన బీఫారాన్ని చంద్రబాబు చేతుల మీదుగా సతీశ్‌కు ఇప్పించారు. అనంతరం బీఫారంను దుర్గగుడిలో అమ్మవారి చెంత ఉంచి పూజలు నిర్వహించిన అనంతరం గద్దె రామ్మోహన్ తీసుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయనున్నారు. కేవలం బీఫారం మాత్రమే కాదు.. ఎన్నికల్లో గెలిచిన తర్వాత డిక్లరేషన్‌ను కూడా సతీశ్ చేతుల మీదుగా అందుకోవడం గద్దెకు సెంటిమెంట్‌గా వస్తోంది. గద్దె రామ్మోహన్ 1994లో గన్నవరం స్వతంత్ర అభ్యర్థిగా, 1999లో టీడీపీ తరఫున విజయవాడ ఎంపీగా గెలుపొందగా, 2004లో కంకిపాడు నుంచి ఓటమి పాలయ్యారు. 2009 నుంచి విజయవాడ తూర్పు నుంచే గద్దె పోటీ చేస్తున్నారు. ఆ ఎన్నికల్లో ఓటమి చవిచూసినా వరుసగా 2014, 2019 ఎన్నికల్లో విజయం సాధించారు.



బీ-ఫారం అందుకుంటున్న సతీష్

ఉమ్మడి కృష్ణాలో రికార్డు మెజార్టీ సాధించాలి: చంద్రబాబు

పటమట: విజయనగరం జిల్లా శృంగవరపుకోట పర్యటనలో ఉన్న చంద్రబాబు హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు బీ-ఫారం అందజేశారు. రాష్ట్రంలో మంచి మెజార్టీలో గెలిచే అభ్యర్థుల్లో గద్దె రామ్మోహన్ ఒకరని, ఉమ్మడి కృష్ణాలో ఎక్కువ మెజార్టీతో రావాలని, ఆ దిశగా పనిచేయాలని చంద్రబాబు సూచించినట్లు గద్దె రామ్మోహన్ తెలిపారు.

కూటమి.. జోష్!



అభ్యర్థులు బీ ఫారం తీసుకున్నప్పటి నుంచి నేతలు, కార్యకర్తల్లో జోష్ ఆకాశాన్నంటుతోంది. అభ్యర్థులు తమ పార్టీ నేతలు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా ఓట ర్లను వివిధ రూపాల్లో ఆకర్షిస్తు న్నారు. ఈ సందర్భంగా గుడివాడలో వెనిగండ్ల రాము నామినేషన్ సందర్భంగా ఓ కార్యకర్త ఉమ్మడి పార్టీల జెండాలను, గుర్తులను ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.

స్కిల్‌కు ఏదీ ధీమా..!

జగ్గయ్యపేట రూరల్: కళాశాల చదువుల్లో ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యం కొరవడటంతో నిరుద్యోగులుగా మిగులుతున్న యువత భవిష్యత్తును తీర్చిదిద్దాలనే సంకల్పంతో గత టీడీపీ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలకు శ్రీకారం చుట్టింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటికి గ్రహణం పట్టించింది. నియోజకవర్గ పరిధిలో అనేక కర్మాగారాలున్నా ఈ ప్రాంతంలో సరైన శిక్షణ లేక ఉద్యోగాలు రావటం లేదని అప్పటి ప్రజా ప్రతినిధులు నేతల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు కేంద్రాలను మంజూరు చేశారు. చిల్లకల్లుకు రూ.కోటి, గంద్రాయిలో రూ.50లక్షలతో పనులు ప్రారంభించి పూర్తవుతున్న సమయంలో ప్రభుత్వం మారింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు వాటిని పట్టించుకునే వారు లేకపోయారు. ఇప్పటికే స్థానికంగా ఉద్యోగాలు లేక వలసలు పోతుంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇక్కడ ఉద్యోగాలు చేస్తున్నారు. స్థానిక కంపెనీలో ఉద్యోగాలు వస్తే కుటుంబాలకు ఆసరాగా ఉంటారని నైపుణ్యం లేకపోవటంతోనే సమస్య తలెత్తిందని పలువురు అంటున్నారు. వచ్చే ప్రభుత్వంలోనైనా వీటికి మహర్దశ వస్తేనే ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని అంటున్నారు.



అసంపూర్తిగా చిల్లకల్లులోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్



అసంపూర్తిగా గంద్రాయిలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

ఎందుకీ పైలాన్..!

- మున్సిపల్ నిధులు దుర్వినియోగం
- ఉపయోగపడని ఫ్రూట్ మార్కెట్

నందిగామ: ప్రచారార్భాటం కోసం నందిగామ మునిసిపల్ నిధులు దుర్వినియోగం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పట్టణానికి చెప్పుదగిన నిధులు మంజూరు కాలేదు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు జనరల్ ఫండ్స్ ద్వారా సమీకరించే అరకొర నిధులతో పాలన సాగిస్తున్నారు. ప్రభుత్వం బాగా పని చేస్తుందని గొప్పలు చెప్పుకోనేందుకు పాలకులు మునిసిపల్ నిధుల నుంచి రూ.18 లక్షలు వెచ్చించి సాగునీటి ప్రాజెక్టుల పైలాన్ నిర్మించారు. ఈ పైలాన్‌పై దివంగత సీఎం రాజశేఖరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. జగన్ పాలనలో సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి నందిగామలో పైలాన్‌కు ఖర్చు పెట్టిన మేర నిధులు కూడా కేటాయించలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇది చాలదన్నట్టు మునిసిపాలిటీకి ఏ సంబంధం లేని కేంద్రీయ విద్యాలయానికి రూ.70 లక్షల నిధులు మళ్లించారు. కేంద్రం ఏర్పాటు చేసే ఈ విద్యాలయానికి నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా నిధులు మళ్లించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఫ్రూట్ మార్కెట్ పేరుతో రూ.35 లక్షల వ్యయంతో రైతుబజార్‌లో షాపులు నిర్మించారు. వాటిలో 10 శాతం మాత్రమే వ్యాపారులు వ్యాపారం చేసుకుంటున్నారు. మిగిలిన షాపులన్నీ నిరుపయోగంగా పడి ఉన్నాయి. అభివృద్ధి విషయంలో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోనేందుకు మునిసిపల్ నిధులను ఫణంగా పెట్టారు.



ప్రభుత్వ ప్రచారానికి నిర్మించిన పైలాన్



నిరుపయోగంగా ఉన్న ఫ్రూట్ మార్కెట్

ఎమ్మెల్యే సర్.. ఓట్లు అడగనన్నారుగా...?

- సామాజిక మాధ్యమాల్లో ఎమ్మెల్యేపై సెటైర్లు
- నెరవేరని 'ఎదురుమొండి' ఆకాంక్ష

అవనిగడ్డ: ఎదురుమొండి వాసుల చిరకాల ఆకాంక్ష 'ఎదురుమొండి - ఏటిమొగ వారధి'. దీన్ని పూర్తి చేసిన తర్వాతే 2024 ఎన్నికల్లో ఓట్లు అడుగుతానంటూ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేసిన వ్యాఖ్యలు నేడు నెట్టింట వైరలవుతున్నాయి. కృష్ణానదీ గర్భంలో దీవుల సమూహమైన ఎదురుమొండి వాసులు బాహ్య ప్రపంచానికి రావాలంటే నాటు పడవలే ఆధారం కావటంతో దీవుల్లోని మూడు పంచాయతీల్లోని దాదాపు 10వేల మంది జనాభా రక్షణను దృష్టిలో పెట్టుకుని వంతెన నిర్మించాలని 2018లో తెలుగుదేశం పార్టీ అంచనాలు రూపొందించి ఏషియల్ ఇన్‌ఫ్రాసెక్టర్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌ను వారధి నిర్మాణానికి నిధులకు ఒప్పించింది. 2019లో వైసీపీ అధికారంలోకి రావటంతో ప్రభుత్వ విధానాలు నచ్చక ఏషియన్ ఇన్‌ఫ్రాసెక్టర్ బ్యాంక్ రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహించలేమని వెనుతిరిగటంతో వారధి ఆకాంక్ష మళ్లీ అటకెక్కింది. అప్పటి నుంచి ఇదిగో.. అదిగో.. అంటూ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రకటనలు చేయగా, ఎంపీ వల్లభనేని బాలశౌరి నాబార్డుతో మాట్లాడి రూ.109 కోట్ల నిధులు విడుదల చేయించారు. ఆ మొత్తం నుంచి దాదాపు రూ.20కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగించుకుందన్న ఆరోపణలున్నాయి. రెండేళ్ల క్రితం ఓ టీవీ ఛానల్‌కు ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే రమేష్‌బాబు ఎదురుమొండి వారధి పూర్తి చేసే తిరిగి ఓట్లు అడుగుతానన్నారు. వైసీపీ సొంత ఛానల్‌లో వారధికి శంకుస్థాపన చేసిన తర్వాతే ఓట్లు అడుగుతానన్నారు. గతేడాది నవంబరు, డిసెంబర్‌లో 2 సార్లు రాష్ట్ర ప్రభుత్వం వారధి నిర్మాణానికి టెండర్లు పిలువగా, ఎవరు ముందుకు రాలేదు. కారణం నాబార్డు నిధుల్లో కొంత రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించటమేనని ఎంపీ బాలశౌరి అంటున్నారు. ఎమ్మెల్యే చెప్పినట్టు ఇప్పటి వరకు వారధి పూర్తి కాదు కదా.. కనీసం శంకుస్థాపన జరగలేదు. దీంతో చెప్పిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యే దీవుల్లో ఓట్లు అడిగేందుకు వెళ్లరని అందరూ భావించారు. అనూహ్యంగా ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే పర్యటించి మరో అవకాశం ఇస్తే వారధి నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి వచ్చారు. వారధి నిర్మిస్తేనే దీవుల్లో ఓట్లు అడగనన్నావు. ఇప్పుడెలా అడుగుతావు సారూ అని దివి ప్రజలు సామాజిక మాధ్యమాల్లో సెటైర్లు వేస్తున్నారు.



పంటుపైనే ప్రజల రాకపోకలు



వాజిద్‌ను స్తంభానికి కట్టేస్తున్న యువకులు, దెబ్బలు తాళలేక విలపిస్తున్న వాజిద్

పశువధ శాలలో యువకుడికి చిత్రవధ!

▸ హిందూపురంలో అమానవీయ ఘటన

హిందూపురం, ఏప్రిల్ 23: అసలే అది అక్రమంగా నిర్వహిస్తున్న పశువధ శాల. అధికార పార్టీ నేతల అండతో బరితెగించి బహిరంగంగానే నిర్వహిస్తున్నారు. అక్కడ పనిచేసే ఓ యువకుడు పశు వధకు నిరాకరించాడని దుస్తులు ఊడదీసి, స్తంభానికి కట్టేసి చితకబాదారు. ఈ అమానవీయ ఘటన శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు, పరిగి మండల పరిధిలో మదీన మసీదు ప్రాంతానికి చెందిన వాజిద్ పరిగిలో చికెన్ సెంటర్ నడిపేవాడు. అక్కడ వ్యాపారం తగ్గడంతో ఇటీవల హిందూపురంలోని వధశాలలో చాందు అనే వ్యక్తి వద్ద చేరాడు. సోమవారం పదుల సంఖ్యలో ఆవులను తీసుకువచ్చి.. వాటిని వధించాలని చాందు సూచించాడు. అందుకు వాజీద్ నిరాకరించాడు. ఆవులను వధించిన విషయం పోలీసులకు తెలిస్తే తనకు ఇబ్బంది అన్నాడు. అర్ధరాత్రి మరోసారి ఒత్తిడి చేసినా, వాజిద్ నిరాకరించడంతో ఇద్దరు యువకులు వాజిద్‌ను వైరుతో చితకబాది.. ఒంటిపై దుస్తులు ఊడదీయించారు. ఆ తరువాత స్తంభానికి కట్టేసి మరోసారి కొట్టారు. వేడుకుంటున్నా కనికరించలేదు. సమీపంలో ఉన్న చర్మాలను నిల్వ ఉంచే గదిలో అతన్ని బంధించారు. అక్కడి నుంచి తప్పించుకున్న బాధితుడు, పరిగికి చేరుకుని కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. కుటుంబ సభ్యులు మంగళవారం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అనంతరం హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడి దృశ్యాలను ఒకరు రహస్యంగా తమ సెల్‌ఫోన్‌లో బంధించారు. ఈ వీడియోలు బయటకు రావడంతో దాడిచేసిన వారు పరారైనట్లు తెలిసింది. పోలీసులు ఆటువైపు కన్నెత్తి చూడరని కూడా చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు కూడా అటువైపు వెళ్లరని స్థానికులు చెబుతున్నారు.

ద్వారంపూడి అనుచరుల వీరంగం

▸ కాకినాడలో మత్స్యకారుడిపై దాడి.. సోమవారం రాత్రి ఘటన



యువకుడి గాయాలు చూపిస్తున్న జనసేన నాయకుడు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 23: రాష్ట్రంలో వైసీపీ నాయకుల అరాచకాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. కాకినాడలో జనసేన మద్దతుదారుడైన ఓ మత్స్యకార యువకుడిపై స్థానిక ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అనుచరులు సోమవారం రాత్రి దాడి చేసి చితక్కొట్టుకుంటూ ఈడ్చుకెళ్లారు. ఈ విషయాన్ని కాకినాడలోని జనసేనకు చెందిన మత్స్యకార నాయకుడు సంగాడి ఈశ్వరరావు మంగళవారం సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారు. కాకినాడ ఏటిమొగ ప్రాంతలోని అపార్ట్‌మెంట్లలో సోమవారం రాత్రి వైసీపీ నాయకుల సమావేశం జరుగుతోంది. ఈ సమయంలో మత్స్యకార యువకుడు రవివర్మ ఆ దారి గుండా వెళ్తున్నాడు. వైసీపీకి చెందిన ఐదుగురు వ్యక్తులు అతడ్ని ఆపి వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటు వేస్తావని అడగ్గా తెలుగుదేశానికి వేస్తానని చెప్పాడు. దీంతో ద్వారంపూడి అనుచరులు అతన్ని చితక్కొట్టుకుంటూ ఈడ్చుకెళ్లారు. అక్కడి టీడీపీ వాళ్లు అడ్డుకోవడంతో అతడ్ని వదిలేసి వెళ్లిపోయారు. దీనిపై ఈశ్వరరావు మాట్లాడుతూ ఆ యువకుడిని స్థానిక పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్లినా చీటీ రాయకుండా వైసీపీ నాయకులు నెట్‌వర్క్ నడిపారన్నారు.

టీడీపీ నేతను బూతులు తిట్టిన ఎస్ఐ

బాపట్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ.. కొందరు పోలీసులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్ష నేతలపై జులుం ప్రదర్శిస్తున్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం నామినేషన్‌ను దాఖలు చేశారు. అయితే, ఈ ప్రక్రియ కొంతమేర పెండింగ్ ఉండడంతో దానిని పూర్తి చేయడానికి మరోమారు మంగళవారం ఆర్వో కార్యాలయం వద్దకు వచ్చారు. ఆ సమయంలో అక్కడ బందోబస్తు విధుల్లో ఉన్న ఎస్ఐ నాగశివారెడ్డి పర్చూరు మండల టీడీపీ అధ్యక్షుడు షంషుద్దీన్‌ను అకారణంగా బూతులు తిట్టారు. నొచ్చుకున్న షంషుద్దీన్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఎస్సై తీరుపై ఏలూరి మండిపడ్డారు. "బూతులు తిట్టే హక్కు మీకెక్కడిది" అని నిలదీశారు. దీనిపై ఎస్పీ వకుల్‌జిందాల్‌కు ఫోన్‌లోనే ఫిర్యాదు చేశారు. అయితే, ఎస్ఐ మాత్రం తాను ఎవరినీ తిట్టలేదని, లోపలికి అనుమతి లేదని మాత్రమే చెప్పానని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. స్పందించిన ఎస్పీ.. ఘటనపై బాపట్ల డీఎస్పీ నేతృత్వంలో విచారణకు ఆదేశించారు. ఎస్ఐని తన కార్యాలయానికి పిలిపించి వివరణ అడిగినట్లు తెలిసింది. అంతేకాకుండా, ఆర్వో కార్యాలయం విధుల నుంచి తప్పించి, గతంలో పని చేసిన చెక్‌పోస్టు డ్యూటీకే అటాచ్ చేసినట్లు ఎస్పీ కార్యాలయం తెలిపింది.

టీడీపీలోకి పోలీస్ హౌసింగ్ చైర్మన్

అమరావతి(ఆంధ్రజ్యోతి), మంగళగిరి ఏప్రిల్ 23: ఉదయగిరి నియోజకవర్గంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి మంగళవారం తన పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. వెను వెంటనే మంగళగిరి వచ్చి, ఎన్నికల ప్రచారంలో ఉన్న యువనేత లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. చిరంజీవిరెడ్డి, ఆయన అనుచరులకు లోకేశ్ పసుపు కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి విధానాలు నచ్చక, తన పదవికి, వైసీపీకి రాజీనామా చేసినట్లు చెప్పారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందని, పోలీసుల సంక్షేమానికి కృషి జరుగుతుందని నమ్మి, టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు.

వైసీపీ నేత ఇంట్లో 384 మద్యం సీసాల పట్టివేత

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 23: శ్రీకాకుళం నగరంలో ప్రముఖ వైద్యుడు, వైసీపీ నేత డాక్టర్ పైడి మహేశ్వరరావు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 384 బాటిళ్ల మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు తన బృందంతో మంగళవారం కత్తెర వీధిలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మహేశ్వరరావు ఇంట్లో 4 కేసుల ఎంహెచ్ (మ్యాన్షన్ హౌస్) క్వార్టర్ సీసాలు 192, రాయల్ గ్రీన్ 192 సీసాలు మొత్తం కలిపి 384 సీసాలు దొరికాయి, వీటి విలువ రూ.84,480 ఉంటుందని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు పైడి మహేశ్వరరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

అంటే... ఎన్డీయేకే జగన్ జై!

ఉక్కు కార్మికులతో భేటీలో పరోక్షంగా అంగీకారం

స్టీల్‌ప్లాంట్ కార్మిక నేతలు:

'విజయనగరం జిల్లా గర్భాంలో మాంగనీస్ గనులను, పక్కనే సారిపల్లిలో ఇసుక గనుల లీజు కాలం ముగిసిపోయినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని రెన్యువల్ చేయడం లేదు. వాటిని త్వరగా రెన్యువల్ చేయండి'.

సీఎం జవాబు:

'నాకు సిమెంట్ ప్లాంటు ఉంది. అందులో జిప్సం 0.5 శాతం నుంచి 1 శాతం వాడతాను. అలాగే మీరు స్టీల్ తయారీలో ఐరన్ ఓర్ 98 శాతం వాడుతూ, మిగిలిన ముడి పదార్థాలు రెండుశాతం వాడతారు. కాబట్టి మీరు ఐరన్‌ఓర్ గనులపై దృష్టిపెట్టండి. వీటి సంగతి మరిచిపోండి'.

ఎన్డీయేకు మెజారిటీ సీట్లు రాకపోతే వైసీపీ ఎంపీల మద్దతు అవసరమవుతుంది

▸ అప్పుడు ఉక్కుసమస్య పరిష్కారానికి అవకాశం
▸ తనను కలిసిన కార్మిక నేతలతో జగన్ వ్యాఖ్యలు
▸ స్టీల్‌ప్లాంటు నష్టాల్లో ఉందా.. అని అమాయక ప్రశ్న
▸ ప్రభుత్వ గనుల రెన్యువల్‌కు జగన్ నిరాకరణ
▸ విద్యుత్ బిల్లుల చెల్లింపు గడువుకూ ఇవ్వని హామీ



సీఎం జగన్‌కు విశాఖలో వినతిపత్రం ఇస్తున్న స్టీల్‌ప్లాంటు ఉద్యోగ, కార్మిక సంఘ నాయకులు

విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటు కార్మిక సంఘాల నాయకులకు సీఎం జగన్ పెద్ద ఝలక్ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్ సమస్యలు పరిష్కరించాలని నేతలు కోరగా, ఆయన విచిత్రమైన సమాధానం ఇచ్చారు. "ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి 230-240 కంటే ఎక్కువ సీట్లు రాకూడదని ప్రార్థన చేయండి. అప్పుడు వైసీపీ మద్దతుతో బీజేపీ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేస్తుంది. మీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది" అని జగన్ సెలవిచ్చారు. తద్వారా కేంద్రంలో ఎన్డీయేకే తన మద్దతు ఉంటుందనే విషయాన్ని సూటిగా చెప్పేశారు. గత ఎన్నికల సమయంలో 25 ఎంపీ సీట్లు తనకు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదాను సాధిస్తానని చెప్పిన జగన్, ఆ తర్వాత మాత్రం.. 'దేవుడి దయ మనకు లేదు. కేంద్రంలో బీజేపీకి మన అవసరం లేకుండా పోయింది' అని చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూడా అదే పాట పాడటం గమనార్హం. తమ సమస్యలు పరిష్కరించాలని వచ్చిన 'ఉక్కు' కార్మికులతో.. 'స్టీల్ ప్లాంటు నష్టాల్లో ఉందా?' అని చిత్రంగా ప్రశ్నించారు. వాస్తవానికి గత రెండ్రోజులుగా విశాఖ పర్యటనలో ఉన్న ఆయన, స్టీల్‌ప్లాంటు సమస్యపై గానీ, అదానీ గంగవరం పోర్టులో కార్మికుల సమ్మెపై గానీ ఎక్కడా మాట్లాడలేదు. ఎన్నికల సమయం కావడం, స్టీల్ ప్లాంటు ఉద్యోగులు, కార్మికులు ఓట్లు కలిపి 50 వేలకు పైగా ఉండడం, ఇప్పుడు వారి సహకారం అవసరం కావడంతో వైసీపీ నాయకులు.....సీఎంతో భేటీకి ఉక్కు సంఘాల నాయకులకు అపాయింట్‌మెంట్ ఇప్పించారు. అన్ని కార్మిక సంఘాలకు చెందిన 20 మంది నాయకులు మంగళవారం ఉదయం ఎండాడలో బస వద్ద జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం పరిష్కరించదగిన సమస్యలనే వారు ప్రస్తావించారు. విజయనగరం జిల్లా గర్భాంలో మాంగనీస్ గనులను, పక్కనే సారిపల్లిలో ఇసుక గనుల లీజు కాలం ముగిసిపోయినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని రెన్యువల్ చేయడం లేదు. వాటిని త్వరగా రెన్యువల్ చేయాలని నాయకులు కోరగా, వాటిని రెన్యువల్ చేయలేమని పరోక్షంగా స్పష్టంచేశారు. బొగ్గు కొరత వల్ల తాము ప్రతి నెల 80 కోట్ల నుంచి రూ.90 కోట్ల విద్యుత్ వినియోగిస్తున్నామని, అందుకు ఏ నెలకా నెల చెల్లించాలని ఈపీడీసీఎల్ నోటీసులు ఇస్తూ ఒత్తిడి పెడుతోందని, వాటిని వాయిదాలో చెల్లించడానికి అనుమతించాలని ఉక్కు నాయకులు కోరారు. దానికీ సీఎం నిరాకరించారు. 'డిస్కమ్‌లకు రూ.లక్ష కోట్ల అప్పులు ఉన్నాయి. మీరు కాకపోతే బిల్లులు సకాలంలో ఇంకెవరు కడతారు?' అంటూ ఎదురు ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందులు చాలా ఉన్నాయని, ఈ నెల 50 శాతం జీతాలే ఇచ్చారని, సంస్థ నష్టాల్లో ఉందని నాయకులు వివరించగా...జగన్ స్టీల్ ప్లాంటు నష్టాల్లో ఉందా? అంటూ రెండు మూడుసార్లు రెట్టించి అడిగారు. దాంతో నాయకులు అవాక్కయ్యారు. 2020-21 ఆర్థిక సంవత్సరం తరువాత వరుసగా నష్టాలు వస్తున్నాయనీ, ఇప్పటికి రూ.6 వేల కోట్ల నష్టాల్లో ఉంటే..ఆ విషయమే తెలియదన్నట్టుగా జగన్ మాట్లాడడం వారు జీర్ణించుకోలేకపోయారు.

వైసీపీని గెలిపించాలి...

"స్టీల్‌ప్లాంటు సమస్యలు పరిష్కారం కావాలంటే.. మీరు ఎన్డీయే అభ్యర్థులను ఓడించాలి. ఎన్డీయేకు మెజార్టీ సీట్లు రాకపోతే వైసీపీ ఎంపీల మద్దతు అవసరమవుతుంది. అలా జరిగితే... ఒడిశా నుంచి ఐరన్‌ఓర్ సరఫరాకు ఏకంగా పైపులైన్ వేయించేస్తా" అని జగన్ అన్నారు. ఇదంతా 'చేతిలో ఉన్న చిల్లిగవ్వ ఇవ్వడుగానీ బంగారం ముద్దలు పెడతాడంటా' అన్నట్లుగా ఉందని కార్మిక నేతలు వెనుదిరిగారు.

రాష్ట్రంలో సెగలు

▸ 66 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు
▸ ప్రయాణికుల రక్షణకు చర్యలు తీసుకోండి
▸ రైల్వే శాఖకు వాతావరణ శాఖ సూచన

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రత, వడగాడ్పుల పెరుగుతున్నాయి. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అనకాపల్లి తదితర జిల్లాల్లోని 66 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచాయి. రాష్ట్రవ్యాప్తంగా 84 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. నంద్యాల జిల్లా చాగలమర్రిలో 45.1, విజయనగరం జిల్లా జామిలో 44.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అనకాపల్లి జిల్లాల్లోని 46 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని, శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు 143 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రైల్వే శాఖను భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అప్రమత్తం చేసింది. రైలు ప్రయాణికులు వడదెబ్బకు గురవుతారని హెచ్చరించింది. తాగునీరు అందుబాటులో ఉంచాలని, చల్లని వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, వైద్య బృందాలు, మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించింది. రైలు ప్రయాణికులు తగినంత నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు తీసుకువెళ్లాలని సూచించింది.

నేటి నుంచి వేసవి సెలవులు

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు విద్యా సంవత్సరం ముగిసింది. బుధవారం నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. తిరిగి జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

కిర్గిజ్‌స్తాన్‌లో మాడుగుల యువకుడి దుర్మరణం



దాసరి చందు

అనకాపల్లి, ఏప్రిల్ 23: కిర్గిజ్‌స్తాన్ చదువుకునేందుకు వెళ్లిన అనకాపల్లి జిల్లా యువకుడు ప్రమాదవశాత్తు ఐస్‌లో చిక్కుకుని మృతి చెందాడు. జిల్లాలోని వీ మాడుగుల దాసరి వీధికి చెందిన ప్రముఖ హల్వా వ్యాపారి దాసరి ప్రసాద్ సోదరుడు భీమరాజు రెండో కుమారుడు చందు (21). రష్యాలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో ఆదివారం జలపాతం వద్దకు వెళ్లాడు. అక్కడ గడ్డ కట్టిన మంచులో కూరుకుపోయిన చందు మృతి చెందాడు. మృత దేహాన్ని స్వగ్రామం రప్పించడానికి కుటుంబ సభ్యులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహాయం కోరారు. ఆయన కిర్గిజ్‌స్తాన్ అధికారులతో మాట్లాడారు. చందు మృతదేహం గురువారం వీ మాడుగుల చేరుకోనుందని సమాచారం.

1న ఇంటింటికీ పింఛన్ అందాలి

మాటిస్తే తల ఎగిరినా వెనక్కి తీసుకునే వ్యక్తిని కాదు. ఏ పదవీ లేకుండా పదేళ్లపాటు పార్టీని నడిపిన వ్యక్తిని దేశంలో నేనొక్కడినే. నా శ్రమంతా పేదల కోసమే. - పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)



టీడీపీ, బీజేపీ నేతలతో కలిసి పిఠాపురంలో నామినేషన్ వేసేందుకు వెళ్తున్న పవన్ కల్యాణ్

నియోజకవర్గం జనసేన అభ్యర్థిగా ఆయన మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. రాత్రికి ఉప్పాడ బహిరంగ సభలో ప్రసంగించారు. జగన్ వద్ద లక్ష కోట్లు ఉన్నాయని, అదంతా ప్రజల డబ్బేనన్నారు. మత్స్యకారులు కష్టాలు పడుతున్నా పట్టించుకోని సీఎం.. తన పత్రికకు ఐదేళ్లలో రూ.930 కోట్లు దోచిపెట్టారని మండిపడ్డారు.ఈ ఎన్నికలు రాష్ట్రానికే కాదు.. భావి తరాలకు ఎంతో కీలకమైనవని.. అందుకోసమే టీడీపీ, బీజేపీలతో కలిసి వెళ్తున్నామన్నారు. మండపేట, రామచంద్రాపురం, పెద్దాపురం లాంటి 40 నియోజకవర్గాల్లో బలమైన ప్రజానాయకులు పార్టీలో ఉన్నా.. పొత్తు కారణంగా విరమించుకోవలసి వచ్చిందన్నారు. ఇంకా ఏమన్నారంటే.

వైసీపీ కట్లపాము..

వైసీపీ కట్లపాములాంటిది. తన గుడ్లు తనే తినేస్తుంది. రాష్ట్రంలో అభివృద్ధి చేయకుండా వదిలేసింది. నేను రాజకీయాల్లోకి రావడానికి కారణం ఎస్ఈజెడ్‌లు. కాకినాడ సెజ్ కోసం నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పది వేల ఎకరాలు లాక్కున్నారు. ఇంతవరకు అందులో పరిశ్రమలు రాలేదు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రతి రైతుకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటా. ఉప్పాడలో మత్స్యకారుల కోసం హార్బర్ నిర్మించడానికి రూ.422 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేదు. జగన్ తన సొంతపత్రికకు ఐదేళ్లలో రూ.930 కోట్లు మళ్లించారు. ఇదంతా ఎవరి డబ్బు? మత్స్యకారుల బతుకులపై కొట్టారు.

మీ ఇంట్లో జరగవని అనుకోవద్దు..

జగన్ తన సొంత చెల్లిని కూడా వదల్లేదు. సోషల్ మీడియాలో ఆ పార్టీ నేతలు ఆమెపై రకరకాల బురదజల్లారు. చంద్రబాబు భార్యను తిట్టారు. రాజకీయాల్లో లేని నా భార్యనూ ఆడిపోసుకుంటున్నారు. ఇదంతా చూసి నవ్వుకుంటే వైసీపీ వాళ్ల భవిష్యత్‌లో మీ ఇంటికి కూడా వస్తారు. అటువంటివి మీ ఇంట్లో జరగవని అనుకోకండి. ఇప్పటికే రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారు. అందుకే ఆడపడుచులంతా ఆలోచించాలి. వైసీపీని అంతమొందించాలి. జగన్ మాట్లాడితే నా భార్యను తిడుతున్నారు. నాలుగు పెళ్లిళ్లు అంటున్నారు. ఆయనకు ఎలా చెప్పాలో తెలియడం లేదు. నాకు పెళ్లిళ్లు అయ్యాయి. కాదనలేదు. కొన్ని జీవితాలకు కుదరదంతే. విడిపోయాం. ఒకరు వేరే పెళ్లి చేసుకుని బిడ్డను కూడా కన్నది. వాళ్లంతా గుట్టుగా బతుకుతున్నారు. కానీ పెళ్లాలు అని తిడుతున్నారు. మేం మాత్రం ముఖ్యమంత్రి భార్యను గౌరవంగా పిలుస్తున్నాం.

భారీ ర్యాలీతో పిఠాపురంలో నామినేషన్

పిఠాపురం జనసేన అభ్యర్థిగా పవన్ కల్యాణ్ మంగళవారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేశారు. పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రామసుందరరెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. అంతకుముందు చేబ్రోలు నివాసం నుంచి భారీ ర్యాలీతో గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల మీదుగా ఆయన తరలివచ్చారు. 216వ జాతీయ రహదారితోపాటు పట్టణాల రహదారులన్నీ జనసంద్రంగా మారాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ ఇన్‌చార్జి బుర్రా కృష్ణంరాజు, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, కె.నాగబాబు పాల్గొన్నారు.

ప్రతి చేతికీ పని.. ప్రతి చేనుకూ నీరు

చంద్రబాబును అకారణంగా జైల్లో పెట్టారు. అప్పుడు చాలా ఆలోచించి కూటమి పురుడుపోసుకునేలా చేశాను. రాష్ట్రంలో ప్రతి చేతికి పని.. ప్రతి చేనుకు నీరు అందేలా కూటమి తరఫున ఎజెండాగా నిర్ణయించుకున్నాం. మాట్లాడితే బటన్ నొక్కానని జగన్ అంటున్నారు. ఆయనేమన్నా తన తాతది తెచ్చి పంచుతున్నారా? మేం వచ్చాక పోలవరం పూర్తిచేస్తాం. డీఎస్సీపై తొలి సంతకం చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. అదీ అమలు చేస్తాం. అన్న క్యాంటీన్లకు తోడు డొక్కా సీతమ్మ పేరుతో క్యాంటీన్లు తెరుస్తాం. బీసీలకు రిజర్వేషన్లు 24 శాతం నుంచి 34 శాతం వరకు పెంచుతాం. మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం పెంచుతాం. వేటకు వెళ్లి చనిపోయిన వారికి త్వరగా మరణ ధ్రువీకరణ పత్రం జారీ అయ్యేలా చేస్తాం. రాయితీపై వలలు, ఇంజన్లు అందిస్తాం. కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తాం.

సజ్జలది ఆధిపత్యపు అహంకారం..

ప్రభుత్వ సలహాదారు సజ్జలకు ఆధిపత్యపు అహంకారం ఎక్కువైంది. దేశం గర్వించదగ్గ అవార్డులు తీసుకున్న చిరంజీవిని ఆయన తిట్టారు. చిరంజీవి జోలికి రావొద్దు. ఆయన గురించి ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు. నోటికి ఏదొస్తే అది మాట్లాడొద్దు. మీలాంటి గూండాలను చాలామందిని చూశాను.



సాయి స్వతేజ్, సాయి నిఖిత, మహ్మద్ జయాన్, రజియా సుల్తానా, ప్రశాంత్, భావన, రోషిణి

'పది' ఫలితాల్లో 'కేశవరెడ్డి' ప్రభంజనం

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో కేశవరెడ్డి విద్యా సంస్థల విద్యార్థులు మరోసారి టాప్ మార్కులతో చరిత్ర సృష్టించారు. ఈ విద్యా సంస్థలకు చెందిన యస్.సాయి స్వతేజ్ 597 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, టి.సాయి నిఖిత, వి.యస్.రోషిణి, యస్.రజియా సుల్తానా, యస్.ప్రశాంత్, కె.భావన 596 మార్కులు, యస్.మహ్మద్ జయాన్ 595 మార్కులతో వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. 49 మంది విద్యార్థులు టాప్ 10లో నిలిచి సరికొత్త రికార్డ్ సృష్టించారు. ఒక్క అత్యధిక మార్కులే కాక ప్రతి ఐదుగురు విద్యార్థుల్లో ముగ్గురు 500కు పైగా మార్కులు, ప్రతి సబ్జెక్టులో సగానికి పైగా విద్యార్థులకు 90 శాతానికి పైగా మార్కులు, లాంగ్వేజ్‌లో సగటున 82.6 శాతం, నాన్ లాంగ్వేజ్‌లో సగటున 85.3 శాతం మార్కులు సాధించడం కేశవరెడ్డి విద్యా సంస్థల విద్యా ప్రమాణాల నాణ్యతకు అద్దం పడుతోందని విద్యాసంస్థల ఫౌండర్ ఛైర్మన్ యస్. కేశవరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, అందుకు విశేషంగా కృషిచేసిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

వైభవంగా కోదండరాముని రథోత్సవం



ఒంటిమిట్ట, ఏప్రిల్ 23: ఆంధ్రా భద్రాద్రి ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం సాయంత్రం కోదండరాముడి రథోత్సవం వైభవంగా సాగింది. ఈ రథోత్సవానికి వేలాది మంది భక్తజనం హాజరై సీతారాములను చూసి పునీతులయ్యారు. అంతకుముందు సీతారాముల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథశాలకు తరలించారు. సాయంత్రం సీతాలక్ష్మణ సమేత కోదండరాముడు రథాన్ని అధిష్ఠించి మాడవీధుల్లో విహరించారు. కోలాటాలు, చెక్కభజనలు, భజన బృందాలు, భక్తుల రామనామ స్మరణల మధ్య రథోత్సవం కన్నులపండువగా సాగింది.

తిరుమలలో ముగిసిన వసంతోత్సవాలు



ఉత్సవ మూర్తుల ఊరేగింపు

తిరుమల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మూడు యుగాలకు చెందిన శ్రీనివాస, శ్రీరామ, శ్రీకృష్ణుల దర్శనంతో భక్తజనం పులకించిపోయారు. శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల్లో చివరిరోజైన మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామితో పాటు సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులను కూడా ఆలయం నుంచి ఊరేగింపుగా వసంతోత్సవ మండపానికి తీసుకెళ్లారు. ముందుగా ఆస్థానం నిర్వహించి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వసంతోత్సవ అభిషేకాదులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరిగి సాయంత్రం ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లడంతో వసంతోత్సవాలు ముగిశాయి.

'శిరోముండనం' కేసు విచారణ వాయిదా

▸ బాధితులను ప్రతివాదులుగా చేర్చండి
▸ వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దళిత యువకులకు శిరోముండనం చేసిన ఘటనలో విశాఖపట్నం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దాఖలు చేసిన అప్పీలు మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. బాధితుల తరఫున న్యాయవాదులు ఎస్.అశ్వనీ కుమార్, జవ్వాజి శరత్‌చంద్ర వాదనలు వినిపిస్తూ... ఎస్సీ ఎస్టీ చట్టంలోని సెక్షన్ 15(ఏ) ప్రకారం బాధితులను ప్రతివాదులుగా చేర్చకుండా లేదా వారికి నోటీసులు ఇవ్వకుండా అప్పీలుపై విచారణ జరపడానికి వీల్లేదని పేర్కొన్నారు. బాధితులు తమ వాదనలు చెప్పుకొనే అవకాశం ఇవ్వాల్సి ఉందని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు బాధితులను ప్రతివాదులుగా చేర్చాలని అప్పీలుదారుల తరఫు న్యాయవాదులను ఆదేశించారు. విచారణను మే 1కి వాయిదా వేశారు. దళిత యువకులకు శిరోముండనం చేయడంతో పాటు వారి మీసాలు, కనుబొమలు తొలగించిన ఘటనలో వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరో ఎనిమిది మందిని దోషులుగా నిర్ధారించి విశాఖపట్నం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు వారికి 18 నెలలు జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.42 వేలు చొప్పున జరిమానా విధించింది. జరిమానా చెల్లింపులో విఫలమైతే మరో 6 నెలలు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరో ఎనిమిది మంది హైకోర్టులో అప్పీలు దాఖలు చేశారు.

ఆర్థిక నేరాల విజయసాయి

▸ మనీలాండరింగ్ కేసులు సహా 11 సీబీఐ, 8 ఈడీ నమోదు
▸ సాయిరెడ్డి ఆస్తులు రూ.37 కోట్లు.. అఫిడవిట్‌లో పేర్కొన్న వైసీపీ నేత

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

వైసీపీ కీలక నేత, నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తున్న వేణుంబాకం విజయసాయిరెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలు వెల్లడించారు. దీని ప్రకారం.. సాయిరెడ్డిపై మొత్తం 21 ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. వీటిలో 11 కేసులు సీబీఐ, 8 ఈడీ నమోదు చేసినవే. సీబీఐ నమోదు చేసిన వాటిలో సెక్షన్లు 120-బీ, రెడ్ విత్ 409, 420, 468 ఐపీసీ, అవినీతి నిరోధక చట్టం కేసులు ఉన్నాయి. ఇవన్నీ హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టులో విచారణ దశలో ఉన్నాయి. ఈడీ నమోదు చేసిన వాటిలో మనీలాండరింగ్ కేసులు ఉన్నాయి. ఇవి కూడా హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో విచారణ దశలో ఉన్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు మరో 2 కేసులు కందుకూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో నమోదయ్యాయి. వివిధ వర్గాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారన్న అభియోగాలతో సెక్షన్లు 171ఈ ఐపీసీ, 125, 123(3) రెడ్ విత్ 136(2)(బీ) ఆర్‌పీఏ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. కాగా, విజయసాయిరెడ్డి తన కుటుంబానికి రూ.37 కోట్ల ఆస్తులున్నట్లు పేర్కొన్నారు. సాయిరెడ్డి పేరు మీద రూ.46.73 లక్షలు, ఆయన సతీమణి సునంద పేరు మీద రూ.6.57 కోట్ల విలువైన చరాస్తులున్నాయి. అలానే, సాయిరెడ్డి పేరుతో రూ.21.90 కోట్లు, ఆయన సతీమణి పేరుతో రూ.7.57 కోట్ల విలువైన స్థిరాస్తులున్నాయి. ఇక, విజయసాయిరెడ్డికి రూ.10.34 లక్షలు, ఆయన సతీమణికి రూ.12.50 లక్షల అప్పులు ఉన్నాయి.

నామినేషన్లు వేసిన నేతలు

▸ నెల్లూరు రూరల్‌లో వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.
▸ తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సిటీ నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్ నామినేషన్ దాఖలు చేశారు. అఫిడవిట్ ప్రకారం ఆయన భార్య మోనాకు పాన్ కార్డు లేదు. కానీ, ఆమె పేరుతో రూ.35 లక్షల చరాస్తులున్నాయి. భరత్‌పై 3 ఎఫ్ఐఆర్‌లు ఉండగా.. అవన్నీ కోడ్ ఉల్లంఘనలకు చెందినవే. 2019-20లో రూ.3.06 లక్షల ఆదాయం ఉండగా, 2023-24కి రూ.8.71 లక్షలకు పెరిగింది. భరత్‌కు రూ.1.46 కోట్ల విలువైన పలు కార్లు ఉన్నాయి.

పవన్ ఆస్తులు రూ. 164 కోట్లు

▸ అఫిడవిట్‌లో పేర్కొన్న జనసేనాని

పిఠాపురం, ఏప్రిల్ 23: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆస్తులు, అప్పుల వివరాలతో కూడిన అఫిడవిట్‌ను ఆయన సమర్పించారు. దీనిలో పేర్కొన్న వివరాల మేరకు పవన్ కల్యాణ్‌కు రూ.164.51 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. రూ.65.77 కోట్ల అప్పులు ఉన్నాయి. బ్యాంకు డిపాజిట్లు, బంగారం ఇతర చరాస్తుల విలువ రూ.41.65 కోట్లు. భార్య అన్నాలెజినోవా పేరు మీద రూ.కోటి రూపాయల ఆస్తి ఉంది. పవన్ పేరిట రూ.94.41 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. భార్య పేరుతో రూ.1.95 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. పవన్‌కు రూ.14 కోట్ల విలువైన 9 కార్లు, ఒక ట్రక్కు, హార్లీ డేవిడ్సన్ బైక్ ఉన్నాయి. పిల్లల విషయానికి వస్తే.. దేశాయ్ అఖిరా నందన్ పేరుతో రూ.89.38 లక్షల ఆస్తులు ఉన్నాయి. దేశాయ్ ఆద్య ఆస్తులు రూ.87.77 లక్షలు, కొణిదెల పొలెనా అంజనా పవనోవా ఆస్తుల విలువ రూ.11.89 కోట్లుగా పేర్కొన్నారు. కొణిదెల మార్క్ శంకర్ పవనోవిచ్ ఆస్తుల విలువ రూ.11.86 కోట్లుగా ఉంది. పవన్‌వద్ద 1.68 కిలోల బంగారం ఉండగా 114 క్యారెట్‌ల వజ్రాభరణాలు, భార్యవద్ద 215 గ్రాముల బంగారం, డైమండ్, సిల్వర్, ప్లాటినం ఆభరణాలు ఉన్నాయి. ఐదేళ్లలో పవన్‌కల్యాణ్‌కు సినిమాలు, ఇతరాల ద్వారా 114.76 కోట్లు ఆదాయం రాగా, దీనికి ఆదాయపు పన్ను 47.07 కోట్లు, జీఎస్టీగా రూ.26.85 కోట్లు చెల్లించారు.

వదిన సురేఖ నుంచి అప్పు

పవన్‌కు 64.27 కోట్ల అప్పులు ఉన్నాయి. వీటిలో బ్యాంకుల నుంచి తీసుకున్నవి 17.57 కోట్లు. ప్రైవేటు వ్యక్తుల నుంచి 46.70 కోట్లు. వీరిలో వీఆర్ విజయలక్ష్మి నుంచి అత్యధికంగా 8 కోట్లు, వదిన కొణిదెల సురేఖ నుంచి 2 కోట్లు, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నుంచి 6.35 కోట్లు, లీడ్ ఐటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి 6 కోట్లు, ఎంవీఆర్ఎస్ ప్రసాద్ నుంచి 3.5కోట్లు, ఎర్నేని నవీన్ నుంచి రూ.5.5 కోట్లు, ఎం.ప్రవీణ్‌కుమార్, మైత్రీ మూవీమేకర్స్, శ్రీయశ్వంత్ ఫైనాన్షియర్స్ నుంచి రూ.3 కోట్ల చొప్పున అప్పులు ఉన్నాయి.

కేసులు ఇవీ..: తనపై ఎనిమిది కేసులు ఉన్నట్టు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వలంటీర్లపై వ్యాఖ్యల నేపథ్యంలో మూడు ప్రైవేటు కేసులు ఉన్నట్టు తెలిపారు. వీటితోపాటు ఏలూరు, కృష్ణలంక, తాడేపల్లి పీఎస్‌ల్లో మూడు క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారు. తెలంగాణలోని తొర్రూరు, బంజారాహిల్స్ పీఎస్‌లలో రెండు క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారు.



అబ్ కీ బార్?

బంగ్లాదేశ్ నుంచి వచ్చిన హిందువులు, బౌద్ధులకు భారత పౌరసత్వం ఇస్తే పశ్చిమ బెంగాల్ సీఎం మమతకు, కాంగ్రెస్ పార్టీకి వచ్చిన సమస్య ఏంటి? బెంగాల్‌లోకి చొరబాటుదారులు ప్రవేశించకుండా, సందేశ్‌ఖాలీ లాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే మోదీ మళ్లీ ప్రధానిగా రావాలి. గత ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి 18 సీట్లు ఇచ్చారు. మోదీ రామ మందిరం తీసుకువచ్చారు. ఈసారి 35 సీట్లు ఇవ్వండి రాష్ట్రంలోకి చొరబాట్లను ఆపేస్తాం. బీజేపీకి ఓటేస్తే దీదీ గుండాలు తలకిందులుగా వేలాడదీస్తాం. - అమిత్ షా



అమేఠీ నుంచి రాహుల్ గాంధీ పోటీ?



అమేఠీలోని రాహుల్ నివాసంలో మరమ్మతులు

లఖ్‌నవూ, ఏప్రిల్ 23: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అమేఠీ నుంచి పోటీ చేయనున్నారా? అమేఠీలోని ఆయన నివాసాన్ని శుభ్రపరచడంతో పాటు మరమ్మతులు చేస్తుండడంతో సామాజిక మాధ్యమాల్లో ఈ విషయమై ఊహాగానాలు వ్యాపించాయి. అమేఠీ నివాసాన్ని శుభ్రం చేస్తున్న కూలీలతో మాట్లాడినప్పుడు కాంగ్రెస్ వారు తమను పనిలో పెట్టుకున్నారని చెప్పారు. రాహుల్ భయ్యా త్వరలో ఇక్కడికి వస్తారని, అందుకే మరమ్మతులు చేస్తున్నామని అన్నారు.

మణిపూర్ హింసపై అమెరికా నివేదిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: మణిపూర్‌లో జాతుల ఘర్షణలో జరిగిన ఘోరాలను అగ్రరాజ్యం అమెరికా మానవ హక్కుల నివేదిక-2023 తూర్పారబట్టింది. మెజారిటీలైన మైతీలు, గిరిజన కుకీ తెగ మధ్య జాతుల వైరంతో యథేచ్ఛగా జరిగిన మూక దాడులు, సామూహిక అత్యాచారాలను నివేదిక ప్రస్తావించింది. కనీసం 175 మంది చనిపోయారని, 60 వేల మంది వరకు సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారని నివేదిక వెల్లడించింది. భారతదేశంలో విలేకరులపై దాడులు, అక్రమ అరెస్టులు, అసమ్మతివాదుల గొంతు నొక్కేందుకు క్రిమినల్ చట్టాలను ప్రయోగించడంపైనా అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. గుజరాత్ అల్లర్లకు సంబంధించి 'ఇండియా: ది మోదీ క్వశ్చన్' పేరిట డాక్యుమెంటరీని ప్రసారం చేసిన తర్వాత బీబీసీ కార్యాలయాల్లో ఆదాయపన్ను శాఖ సోదాలు నిర్వహించడం, విలేకరుల సామగ్రిని సీజ్ చేయడాన్నీ నివేదిక ప్రస్తావించింది. కెనడాలో సిక్కు ఉద్యమకారుడు హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు గురైన విషయాన్నీ పేర్కొంది. ఆ హత్యలో ప్రభుత్వ ఏజెంట్ల పాత్ర ఉందని ఆక్షేపించింది.

మసాలాల నిషేధంపై నివేదిక ఇవ్వండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: భారత్‌కు చెందిన ఎవరెస్ట్, ఎండీహెచ్ సంస్థల మసాలాలపై హాంకాంగ్, సింగపూర్ దేశాలు నిషేధం విధించడంపై కేంద్రం అప్రమత్తమైంది. ఎవరెస్ట్, ఎండీహెచ్ సంస్థలు ఎగుమతి చేసిన కొన్ని మసాలాల్లో ఇథిలీన్ ఆక్సైడ్ అనే హానికరమైన రసాయనం ఉందంటూ హాంకాంగ్, సింగపూర్‌కు చెందిన ఆహార నియంత్రణ సంస్థలు ఆయా మసాలాలపై నిషేధం విధించాయి. దీంతో, నిషేధం విధించడానికి దారితీసిన కారణాలపై తమకు ఓ నివేదిక ఇవ్వాలని సింగపూర్, హాంకాంగ్ ఆహార నియంత్రణ సంస్థలను కేంద్ర వాణిజ్య శాఖ కోరింది.

నూడుల్స్‌లో రూ.6 కోట్ల బంగారం, వజ్రాలు

ముంబై, ఏప్రిల్ 23: ముంబై విమానాశ్రయంలో రూ. 6.46 కోట్ల విలువైన బంగారం, వజ్రాలను నూడుల్స్ ప్యాకెట్లలో, శరీర భాగాల్లో దాచి అక్రమంగా తరలిస్తున్న నలుగురిని కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారు. ముంబై నుంచి బ్యాంకాక్ వెళ్తున్న ఓ ప్రయాణికుడు... నూడుల్స్ పొట్లాల్లో ఏకంగా రూ.2 కోట్ల విలువైన వజ్రాలను తరలిస్తూ పట్టుబడ్డాడు. అలాగే రూ. 4.04 కోట్ల విలువైన 6.199 కేజీల బంగారాన్ని శరీర భాగాలు, రెక్టమ్‌లో దాచిన మరో ముగ్గురిని కూడా అరెస్టు చేశారు. మరోవైపు కొలంబో నుంచి ముంబైకి వచ్చిన ఓ మహిళ తన లోదుస్తుల్లో దాచిన 321 గ్రాముల బంగారు బిస్కెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

చైల్డ్ కేర్ లీవ్స్ ఇవ్వాల్సిందే: సుప్రీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: దివ్యాంగులైన పిల్లల సంరక్షణ కోసం తల్లులకు చైల్డ్ కేర్ లీవ్స్ (సీసీఎల్)ను నిరాకరించడం తీవ్రమైన విషయమని సోమవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ సెలవులు ఇవ్వకపోవడం అంటే శ్రామిక శక్తిలో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించాలన్న రాజ్యాంగ విధిని ప్రభుత్వం ఉల్లంఘించినట్టవుతుందని పేర్కొంది. హిమాచల్‌ప్రదేశ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఓ మహిళకు జన్మతః జన్యుపర లోపాలు ఉన్న కుమారుడు జన్మించాడు. దాంతో పుట్టినప్పటి నుంచే పలు ఆపరేషన్లు చేయాల్సి వచ్చింది. ఇందుకోసం ఆమె సెలవులు అన్నింటినీ వాడేశారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ ప్రకారం ఆమెకు చైల్డ్ కేర్ లీవ్స్‌ను అధికారులు నిరాకరించారు. దాంతో ఆమె సుప్రీంను ఆశ్రయించగా సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలాల ధర్మాసనం విచారణ జరిపింది. ఇలాంటి సందర్భాల్లో సీసీఎల్‌లు ఇవ్వకపోవడమేంటని ప్రశ్నించింది. దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకోవడానికి హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కమిటీ వేయాలని ఆదేశించింది.

అలీగఢ్ వర్సిటీకి మహిళా వీసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం వర్సిటీ వీసీగా నైమా ఖాతూన్ నియమితులయ్యారు. వందేళ్ల చరిత్రలో ఈ వర్సిటీకి మహిళా వీసీని నియమించడం ఇదే తొలిసారి. రాష్ట్రపతి ఆమోదం అనంతరం విద్యాశాఖ ఈ నియామకం చేపట్టినట్లు అధికారులు సోమవారం తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ నియామకానికి ఎన్నికల సంఘం అనుమతి కూడా తీసుకున్నారు.

కాంగ్రెస్ వాటా.. ముస్లిం కోటా

- దళితులు, ఆదివాసీల రిజర్వేషన్ల కత్తిరింపు!
- ఇప్పుడు కాంగ్రెస్ వస్తే.. మళ్లీ అదే ప్రయత్నం చేస్తుంది: మోదీ

జైపూర్/రాయ్‌పూర్, ఏప్రిల్ 23: దేశంలో మతపరమైన రిజర్వేషన్లకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, మీ (హిందువుల) ఆస్తులను ఎక్స్‌రే చేసి, ఎంపిక చేసిన వర్గానికి (ముస్లింలకు) పంచాలని చూస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. దేశాన్ని విభజించాలన్నట్లుగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో హనుమాన్ చాలీసాను వినడం కూడా నేరంగా మారిందని (కర్ణాటకలో), రామనవమి వేడుకలపై రాళ్లదాడులు జరిగేవని (కాంగ్రెస్ పాలనలో రాజస్థాన్‌లో) విమర్శించారు. మంగళవారం ఆయన రాజస్థాన్‌లోని టోంక్‌లో.. ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. 2004 నుంచి ముస్లిం రిజర్వేషన్లే ఎజెండాగా కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. "2004లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పైలట్ ప్రాజెక్టుగా తన ప్రయత్నాలను ప్రారంభించింది. అక్కడ(ఏపీలో) దళితులు, గిరిజనుల కోటాను తగ్గించి, ముస్లింలకు రిజర్వేషన్లను కల్పించాలని నాలుగుసార్లు ప్రయత్నించింది. న్యాయపరమైన చిక్కులు ఎదురవ్వడంతో ఆ ప్రయత్నాలు సఫలమవ్వలేదు" అని మోదీ వివరించారు. 2011లో కాంగ్రెస్ సర్కారు ఏకంగా దేశవ్యాప్తంగా ముస్లిం రిజర్వేషన్లకు ప్రయత్నించిన విషయాన్ని గుర్తుచేశారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని, ఆ దిశలో చర్యలు తీసుకున్న కాంగ్రెస్ పార్టీ.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానపరిచిందంటూ మండిపడ్డారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు. ఇతరుల సంపదను దోచి, ముస్లింలకు పంచడం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల కోటాను తగ్గించి, మతపరమైన రిజర్వేషన్లను అమలు చేయడమే కాంగ్రెస్ సిద్ధాంతమని ఆరోపించారు. కర్ణాటకలో బీజేపీ అధికారంలోకి రాగానే ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. "నేను దేశ ప్రజలందరికీ హామీ ఇస్తున్నా. ఇది మోదీ గ్యారెంటీ..! ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కొనసాగుతాయి. అంబేడ్కర్ ఆశయాలను కాపాడుతాం" అని మోదీ వివరించారు. తాను మూడ్రోజుల క్రితం రాజస్థాన్‌లో 90 సెకన్లపాటు ఇచ్చిన ఉపన్యాసంతో (కాంగ్రెస్ వస్తే.. మహిళల మెడల్లోని మంగళసూత్రాలను కూడా లాక్కొంటుంది అని మోదీ వ్యాఖ్యానించారు) కాంగ్రెస్ పార్టీలో.. ఇండియా కూటమిలో కల్లోలం మొదలైందన్నారు. "అవును.. నేను చెబుతున్నా.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. ఆస్తులను ఎక్స్‌రే చేసి, వాటిని ఎంపిక చేసుకున్న కొందరికి పంచిపెడుతుంది. కాంగ్రెస్ ఓటుబ్యాంకు కుతంత్రాలను నేను బహిర్గతం చేశాను. నేను నిజం చెబితే.. కాంగ్రెస్‌లో జంకు ఎందుకు? నేను వారి(కాంగ్రెస్) రహస్య ఎజెండాను బయటపెట్టాననేనా?" అని మోదీ ప్రశ్నించారు. "కేంద్రంలో 2014లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే.. ఇప్పటికీ జమ్మూకశ్మీర్‌లో జవాన్లపై ప్రజలు రాళ్లు రువ్వేవారు. శత్రువులు సరిహద్దుల్లో కాల్పులు జరిపేవారు" అని వ్యాఖ్యానించారు.

దళితులను అవమానించిన కాంగ్రెస్

తాము ఒక విజన్‌తో ముందుకు వెళ్తున్నామని, గడిచిన పదేళ్లలో దేశాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని, కాంగ్రెస్‌కు గానీ, ఇండియా కూటమికి గానీ ఒక లక్ష్యమంటూ లేదని ఎద్దేవా చేశారు. "కాంగ్రెస్ నినాదాలిస్తుంది. గరీబీ హఠావో అని పిలుపునిచ్చి.. 60 ఏళ్లుగా ఆ నినాదాన్ని పాతిపెట్టింది. మేము(బీజేపీ) నినాదాలపై ఆధారపడేది లేదు. ఏదైనా చేతల్లో చూపిస్తాం. అయోధ్యలో రామ మందిర కలను సాకారం చేశాం. కానీ, కాంగ్రెస్ మాత్రం రాముడిని అవమానించింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రామభక్తురాలు, గిరిజన మహిళ శబరిని అవమానించింది. బీజేపీ అధికారంలోకి రాగానే.. దళితుడైన రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా చేస్తే.. కాంగ్రెస్ ఆయనను అవమానించింది. ఆ తర్వాత గిరిజన మహిళ అయిన ద్రౌపది ముర్మును రాష్ట్రపతి ఎన్నికల సమయంలోనే అవమానించింది" అని ప్రధాని నిప్పులు చెరిగారు. పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు ఉండడం కాంగ్రెస్‌కు నచ్చని విషయమని వివరించారు.

దేశాన్ని విభజించడమే కాంగ్రెస్ సిద్ధాంతమా?

దేశాన్ని విభజించడమే కాంగ్రెస్ సిద్ధాంతమా అని ఛత్తీస్‌గఢ్ ర్యాలీలో మోదీ ప్రశ్నించారు. "దేశాన్ని ఒకసారి మతప్రాతిపదికన విడదీశారు. ఇటీవల కర్ణాటకకు చెందిన ఓ కాంగ్రెస్ నేత దక్షిణాదిని విడదీయాలన్నారు. తాజాగా గోవాలో ఎన్నికల బరిలో ఉన్న మరో కాంగ్రెస్ నేత(విరియాటో ఫెర్నాండెజ్) తమపై రాజ్యాంగాన్ని బలవంతంగా రుద్దామన్నారు. గోవా విడిగా ఉండాలన్నారు. అంటే.. కాంగ్రెస్ తనకు ఓటు బ్యాంకు అధికంగా ఉన్న ప్రాంతాలను విడదీసి, పాలించాలని భావిస్తోందా?" అని నిలదీశారు. కాంగ్రెస్ నేతలు మాటలు అంబేడ్కర్‌ను అవమానించడమేనన్నారు.

లోకం తీరు



కేజ్రీవాల్‌కు ఇన్సులిన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తిహాడ్ జైలులో ఉన్న సీఎం కేజ్రీవాల్‌కు జైలు అధికారులు ఎట్టకేలకు ఇన్సులిన్ ఇచ్చారు. షుగర్ స్థాయిలు పెరగడంతో తక్కువ మోతాదులో ఇన్సులిన్ ఇచ్చినట్టు వారు మంగళవారం వెల్లడించారు. ఎయిమ్స్ వైద్యుల సలహా మేరకు సోమవారం సాయంత్రం లో డోస్ ఇన్సులిన్ రెండు యూనిట్లు ఇచ్చినట్టు తెలిపారు. హనుమాన్ జయంతి రోజున తమకు ఈ వార్త ఎంతో ఆనందం కలిగించదని ఆమ్ ఆద్మీ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. హనుమంతుడు తన భక్తుడైన కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ అందేలా చేశారని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు.

బిహారీలు జైకొట్టేదెవరికి?

ఎన్డీయేను మళ్లీ ఆదరిస్తారా.. ఇండియా కూటమిని నిలబెడతారా

ప్రాచీన భారతదేశంలోని మొట్టమొదటి సామ్రాజ్యం మగధ..! అతి పెద్ద విశ్వవిద్యాలయం నలందా..! షోడశ జనపదాలు మొదలు.. మౌర్యులు.. ఆ తర్వాతి రాజ వంశాలు ఏలిన ప్రదేశాల్లో మగధతోపాటు.. మిథిల, వైదేహి వంటి రాజ్యాలూ గొప్ప చారిత్రక ఘట్టాలకు నిలువుటద్దాలు..! బిహార్ కీర్తికి ఇవి మచ్చుతునకలు. అంతేనా.. ఆధునిక భారతదేశంలోనూ చంపారన్ వంటి ఉద్యమాలకు పురిటిగడ్డ..! అలాంటి బిహార్‌లో ఏడు దశల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు ఈ సారి ఉత్కంఠను రేపుతున్నాయి.



ఎన్డీయే వ్యూహాలు ఫలిస్తాయా?

బిహార్‌లో 40 లోక్‌సభ స్థానాలున్నాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో జేడీయూ, లోక్ జనశక్తి పార్టీ(ఎల్‌జేపీ) ఎన్నికల బరిలో ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 17, జేడీయూ 16, ఎల్‌జేపీ ఆరు స్థానాల్లో విజయం సాధించాయి. ఒకే ఒక్క సీటు విపక్షానికి దక్కింది. ఈ సారి 400 సీట్లను సాధిస్తామని ఎన్డీయే ధీమా వ్యక్తం చేస్తున్నా.. బిహారీలు ఆ కూటమికి గత ప్రాభవాన్ని తిరిగి ఇస్తారా? లేక ఇండియా కూటమిని ఆదరిస్తారా? అనే ఉత్కంఠ అన్ని పార్టీల్లోనూ సాగుతోంది. ఈ సారి బీజేపీ తన సిటింగ్ స్థానాల్లో(17) పోటీకి సిద్ధమైంది. నితీశ్ పార్టీ జేడీయూ కూడా గతంలో గెలిచిన స్థానాల్లోనే పోటీలో ఉంది. ఎల్‌జేపీ ఒక స్థానాన్ని తగ్గించుకుని, ఐదు చోట్ల బరిలో నిలుస్తోంది. మిగతా రెండు స్థానాల్లో మాజీ సీఎం జీతన్ రామ్ మాంఝీ పార్టీ హిందుస్థాన్ అవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ పోటీ చేయనున్నాయి.

అనుకూలాంశాలు

ఓబీసీల అభ్యున్నతికి ఆద్యుడిగా పేరున్న కర్పూరికి భారతరత్న ఇవ్వడం ఎన్డీయేకు ప్రధానమైన అనుకూలాంశం. ఇక మిత్రపక్షాల మధ్య సీట్ల సర్దుబాటులో పెద్దగా విభేదాలేమీ లేవు. అయితే.. రామ్‌విలాస్ పాసవాన్ తనయుడు చిరాగ్ పాసవాన్‌కు ఆయన మేనమామ పశుపతి పారస్‌కు మధ్య మొదట్లో సీట్ల విషయంలో విభేదాలు కనిపించాయి. కానీ, తర్వాత పారస్ ఈ విభేదానికి తెరదించారు. "ఆర్‌ఎల్‌జేపీ ఎప్పటికీ ఎన్డీయేలో భాగమే. ఈ సారి 400కు పైగా స్థానాలను ఎన్డీయే గెలుస్తుంది" అని తాను మోదీతో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేశారు. బిహార్‌లో 7 దశల్లో పోలింగ్ ఉండడం ఎన్డీయేకు కలిసివచ్చే అంశం. అన్ని దశల్లో మోదీ స్వయంగా ప్రచారానికి వచ్చే అవకాశాలున్నాయి.

ప్రతికూలాంశాలు

మాటిమాటికీ కూటములను మార్చిన నితీశ్‌కుమార్ ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోయారనే ప్రచారం జరుగుతోంది. చిరాగ్ పాసవాన్ కూడా రామ్‌విలాస్ పాసవాన్ మాదిరిగా ప్రభావం చూపుతారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు 2019 మాదిరిగా ఎన్డీయే ఊపు లేదని చెబుతున్నారు. బిహార్‌లో 63% ఉన్న ఓబీసీలు, 17% ఉన్న ముస్లింలు సంఘటితంగా ఓటువేసే అవకాశాలున్నాయని.. అదే నిజమైతే.. బీజేపీకి సవాలేనని భావిస్తున్నారు. 2019 మాదిరిగా బిహార్‌లో నరేంద్రమోదీ ఆకర్షణ ఎంతవరకు పనిచేస్తుంది? అనే చర్చ జరుగుతోంది.

'ఇండియా'లో లుకలుకలే ప్రధాన సమస్య?

ఇండియా కూటమి విషయానికి వస్తే.. ఎన్నికలు అయ్యేదాకా పొత్తు ధర్మం కొనసాగుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమిలోని పార్టీల మధ్య విభేదాలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. నిజానికి ఇండియా కూటమిని నిలబెట్టాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ కొంత వెనక్కి తగ్గింది. ఆర్జేడీకి 26 స్థానాలను కేటాయించింది. కాంగ్రెస్ కేవలం 9 చోట్ల పోటీ చేస్తోంది. మిగతా ఐదు స్థానాలను వామపక్షాలకు కేటాయించింది. సీపీఐ(ఎంఎల్) మూడు చోట్ల బరిలో దిగుతుండగా.. సీపీఐ, సీపీఎంలు చెరో స్థానం నుంచి పోటీ చేస్తున్నాయి. 2019లో ఆర్జేడీకి ఒక్క సీటు కూడా దక్కలేదు. ఒకేఒక్క స్థానంలో కాంగ్రెస్ విజయం సాధించింది.

అనుకూలాంశాలు

కులగణన జరపడం చరిత్రాత్మక అంశం. ఈ నేపథ్యంలో వర్గసమీకరణాలు, ఓబీసీ, మైనారిటీ ఓటర్లపై ఇండియా కూటమి ఆశలు పెట్టుకుంది. వామపక్షాలకు సిటింగ్ ఎమ్మెల్యే స్థానాలు ఉండడంతో.. వారి ఓట్లు కూడా కూటమికే పడే అవకాశాలున్నాయి. ఆర్జేడీ చీఫ్ లాలూ తనదైన శైలిలో రాజకీయ వ్యూహాలకు పదును పెడితే.. విజయం తమదేనని 'ఇండియా' భావిస్తోంది.

ప్రతికూలాంశాలు

సీట్ల పంపిణీతో కాంగ్రెస్ ఆశావహులు కొందరు రెబెల్స్‌గా మారారు. మరికొందరు రాజీనామా బాట పట్టారు. బిహార్ కాంగ్రెస్ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు అజయ్‌సింగ్ పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్ బలంగా ఉన్న ఔరంగాబాద్, పూర్ణియా స్థానాలను ఆర్జేడీకి ఇవ్వడమే అందుక్కారణం. పూర్ణియాలో పప్పూయాదవ్ రెబెల్‌గా బరిలో ఉన్నారు. 2019తో పోలిస్తే బిహార్‌లో కాంగ్రెస్‌కు అవకాశాలు ఎక్కువే ఉన్నా అసంతృప్తుల బెడద వేధిస్తోంది.

'టైటిల్'తో రైతన్నకు ఉరి!

(మొదటి పేజీ తరువాయి)

అని రైతు నిరూపించుకోవాలి. లేదంటే ఆ భూమిని వివాదాస్పద రిజిస్టర్ (డిస్ప్యూట్)లో నమోదు చేస్తారు. ఇక ఆ వివాదం పరిష్కారం కోసం దేవుడే దిగిరావాలి. న్యాయం కోరుతూ రైతు కోర్టులను ఆశ్రయించడానికి అవకాశం లేదు. పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరగాలి. వారు దయదలిస్తే భూమి దక్కుతుంది. లేదంటే శాశ్వత వివాదాస్పద భూమి జాబితాలోకి వెళ్లిపోతుంది. వివాదాలు లేని భూమి హక్కులు ఇస్తామన్న జగన్ చేసిన నిర్వాకం ఇది. దీనివల్ల రైతుకు తిండిపెట్టే భూమిపైనే భరోసా లేకుండాపోయే పరిస్థితి వచ్చింది. భూముల సర్వే పూర్తి కాకముందే టైటిల్ చట్టం అమల్లోకి తీసుకురావడంపై రైతులు, రైతు సంఘాలు, న్యాయవాదులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

కేంద్రం పేరు చెప్పి చట్టం

ప్రతీ రైతు తన భూమిపై శాశ్వత హక్కు కోరుకుంటున్నారు. ఇది జరగాల్సిందే. ఇప్పుడు జగన్ సర్కారు తీసుకొచ్చిన టైటిల్ చట్టం ప్రకారం హక్కులు ఇవ్వాలనుకుంటే చాలా సమస్యలొస్తాయి. చట్టంలోని అనేక క్లాజుల ప్రకారం రెవెన్యూ అధికారులు సూపర్ పవర్‌గా మారుతారు. భూబకాసురులు, కబ్జాకోరులు, రాజకీయ పలుకుబడి ఉన్నవారు భూ వ్యవహారాల్లో దర్జాగా వేలు పెట్టి కావాల్సిన మేరకు వివాదాలు సృష్టించే అవకాశముంది. ఇలాంటివి జరిగేందుకు ఆస్కారం కలిగించేలా కొత్త చట్టం తయారు చేశారు. చట్టంపై తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తాక జగన్ సర్కారు కొత్త వాదన తెరమీదకు తీసుకొచ్చింది. కేంద్రం సూచన మేరకే చట్టం చేశామని, నీతి ఆయోగ్ ఆమోదించిన ముసాయిదా నివేదిక ప్రకారమే నడుచుకున్నామని చెబుతోంది. ఇది పచ్చి అబద్ధం. రైతులకు భూములపై టైటిల్ గ్యారెంటీ ఉండాలని కేంద్రం చెప్పింది. కానీ జగన్ సర్కారు తీసుకొచ్చిన చట్టం ప్రకారం హక్కులు కల్పించాలని చెప్పలేదు. పైగా నీతి ఆయోగ్ ఆమోదించిన ముసాయిదాలోని అంశాలకు విరుద్ధంగా ఏపీ టైటిల్ చట్టం ఉంది. సివిల్ కోర్టుల ప్రమేయం లేకుండా టైటిల్ చట్టం ఉండాలని కేంద్రం చెప్పలేదు. నీతి ఆయోగ్ అలా సిఫారసు చేయలేదు. కానీ జగన్ సర్కారు ఆ పని చేసింది.

రాజస్థాన్ బిల్లు నుంచి కాపీ

రాజస్థాన్ సర్కారు 2016లో తయారు చేసిన అర్బన్ ల్యాండ్ టైటిల్ బిల్లును ఆధారంగా చేసుకొని జగన్ సర్కారు చట్టం తయారు చేసింది. ఈ చట్టానికి మూలాధారమైన టైటిల్ బిల్లును ఎలా తయారు చేశారో తెలిస్తే విస్తుపోవాల్సిందే. నాటి సర్వే శాఖ అధికారి ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఓ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్‌తో ముసాయిదా బిల్లును తయారు చేయించారు. రాజస్థాన్ అర్బన్ టైటిల్ బిల్లులోని అంశాలను ఏపీ బిల్లులో మక్కీ మక్కీ దింపారు. ఆ తర్వాత ఆ ముసాయిదా బిల్లును ఉలవపాడు, మంగళగిరిలో పనిచేసిన మాజీ తహసీల్దార్లలో ఓకే చేయించారు. దాన్ని న్యాయ శాఖ పరిశీలన, అధ్యయనానికి పంపించకుండానే 2019 జూలైలో అసెంబ్లీలో బిల్లును ఆమోదించారు. ఆ తర్వాత కేంద్రం ఆమోదం కోసం పంపించారు.

కేంద్రం తిరస్కరణ

జగన్ సర్కారు పంపిన టైటిల్ బిల్లును కేంద్రం తిరస్కరించి వెనక్కి పంపించింది. టైటిల్ బిల్లుపై కేంద్ర భూవనరుల విభాగం, హోం శాఖలు అభ్యంతరం తెలిపాయి. భారత స్టాంపు చట్టం-1899, సర్వే, సరిహద్దుల చట్టం-1923, ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదార్ పాసుపుస్తకం చట్టం-1971, రిజిస్ట్రేషన్ చట్టం-1908, పరిమిత దాయిత్వ చట్టం-1963, భూ సేకరణ, పునరావాస చట్టం-2013.. ఇలా అనేక కీలకమైన కేంద్ర, రాష్ట్రాల చట్టాల్లోని అంశాలకు పోటీగా, వాటిని తీవ్రంగా ప్రభావితం చేసే అంశాలు టైటిల్ బిల్లులో ఉన్నాయని కేంద్ర సంస్థలు ఆక్షేపించాయి. కేంద్ర చట్టాలతో వైరుధ్యం వస్తుందని తెలిసి 8 అంశాలు ఎందుకు చేర్చారంటూ కేంద్ర హోం శాఖ ప్రశ్నించింది. అప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వం టైటిల్ బిల్లును న్యాయ పరిశీలనకు పంపాలి. అయితే ఆ పనిచేయకుండా పలు అంశాలనే అటూ ఇటూ మార్చి కొత్తగా మరో సవరణ బిల్లును 2021లో అసెంబ్లీలో ఆమోదించారు. కేంద్రం రెండోసారి కూడా ఆ బిల్లును ఆమోదించకుండా అనేక అభ్యంతరాలు వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నాటి వక్ఫ్ బోర్డు సర్వే జాయింట్ కమిషనర్‌ను కేంద్రంలోని సీనియర్ ఐఏఎస్‌లతో చర్చించేందుకు పంపించింది. కేంద్ర రిజిస్ట్రేషన్ చట్టం-1908, కేంద్ర స్టాంప్ చట్టం-1899లను ధిక్కరించే క్లాజులను బిల్లులో ఎందుకు ప్రస్తావించారన్న ప్రశ్నలకు ఆ అధికారి సమాధానం ఇవ్వలేక తిరుగుటపాలో విజయవాడకు వచ్చారు. ముచ్చటగా మూడోసారి అంటే.. 2022లో బిల్లులో మరోసారి సవరణలు చేసి అసెంబ్లీలో ఆమోదం పొందారు. తర్వాత కూడా కేంద్రం ఆ బిల్లును ఆమోదించకుండా నిలిపివేసింది. పైరవీలు, లాబీయింగ్ చేయడంలో దిట్ట అయిన సర్వే అధికారి ఒకరు ఢిల్లీలో అనేక ప్రయత్నాలు చేశారు. ఏం జరిగిందో కానీ కేంద్రం అభ్యంతరాలకు సరైన సమాధానం చెప్పలేదని తెలిసినా ఆ బిల్లును ఆమోదించారు.

నల్సార్ నిపుణుల అభ్యంతరం

ఏపీ టైటిల్ బిల్లుపై కేంద్రం లేవనెత్తిన అభ్యంతరాలకు 2019, 2021, 2022లో సవరించారు. ఈ సమయంలో సర్వే శాఖ ఈ బిల్లుపై నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం నిపుణులను సంప్రదించింది. సివిల్ కోర్టుల ప్రమేయం లేకుండా బిల్లును ఎలా తయారు చేస్తారంటూ న్యాయ నిపుణులు ప్రశ్నించారు. కేంద్రంలోని 4చట్టాలను ధిక్కరించి రెవెన్యూ అధికారులకు ట్రైబ్యునల్స్‌లో సూపర్ పవర్ కట్టబెట్టడం సరికాదని సూచించారు. ఈ అంశాలను మార్చుకోవాలని ప్రతిపాదించారు. తమ అభిప్రాయాలను నిక్కచ్చిగా రాశారు. అయితే సర్వే శాఖ ఈ విషయాలను పట్టించుకోలేదు.

చట్టం తీసుకొచ్చే విధానం ఇదేనా?

రాష్ట్రంలో కోట్లాది మంది రైతులకు ఉపయోగపడే చట్టాన్ని తీసుకురావాలంటే సర్కారు న్యాయ, రెవెన్యూ నిపుణులతో ఓ కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేయించాలి. కమిటీ ఇచ్చే సిఫారసులతో ముసాయిదా బిల్లును రూపొందించాలి. ఈ ప్రక్రియలోనూ రెవెన్యూ, న్యాయ నిపుణులు పాల్గొనేలా సర్కారు చర్యలు తీసుకోవాలి. కానీ జగన్ సర్కారు అడ్డగోలుగా ముసాయిదా బిల్లును తయారు చేయించిందన్న విమర్శలున్నాయి. నిపుణులు, మేధావుల ప్రమేయం లేకుండానే బిల్లు రూపొందించింది. కేంద్రం తిరస్కరించిన తర్వాత అయినా ముసాయిదా బిల్లును సమీక్షించుకోకుండా, నిపుణుల కమిటీతో అధ్యయనం చేయించకుండా మళ్లీ కేంద్ర ఆమోదానికి పంపించింది.

కోర్టుల జోక్యం ఉండదు

భూమిపై హక్కు అంటే.. యజమానికి భూమిపై పరిపూర్ణమైన హక్కులను కల్పించి దానికి చట్టబద్ధమైన గ్యారెంటీ కల్పించడం. ఉదాహరణకు ఓ రైతుకు పది ఎకరాల భూమిపై హక్కు ఉంటే హక్కుల రిజిస్టర్‌లో ఆ వివరాలను నమోదు చేసి అధికారిక నోటిఫికేషన్ ద్వారా బహిరంగంగా ప్రకటిస్తారు. ఎలాంటి అభ్యంతరాలు, వివాదాలు రాకుంటే ఆ భూమిపై ఆ రైతుకు ఉన్న హక్కు శాశ్వతమవుతుంది. ఆ భూమికి అన్ని డాక్యుమెంట్లు పక్కాగా ఉన్నా.. ఆ భూమిపై ఎవరైనా వివాదం రాజేసి, తనకు హక్కు ఉందని పత్రాలు ఇస్తే యజమానికి చిక్కులు తప్పవు. ఆ భూమిని వివాదాస్పద రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ఇక ఆ భూమి తనదేనని యజమాని పోరాటం చేయాలి. వివాదాన్ని జిల్లా, రాష్ట్ర స్థాయి ట్రైబ్యునల్స్‌లో పరిష్కరించుకోవాలి. ట్రైబ్యునల్‌లో రెవెన్యూ అధికారులే కేసులు పరిష్కరిస్తారు. ఈ క్రమంలో రైతులు సివిల్ కోర్టులకు వెళ్లడానికి వీల్లేదు. రాష్ట్రస్థాయి ట్రైబ్యునల్‌లో కూడా న్యాయం దక్కకపోతే అప్పుడు రైతులు హైకోర్టును ఆశ్రయించాలి. ఓ సామాన్య రైతు తన భూమి వివాదం పరిష్కారం కోసం హైకోర్టుకు వెళ్లిపోరాటం చేయాలంటే అయ్యే పనేనా? వివాదం తేలేవరకు అసలు హక్కుదారులకు గ్యారెంటీ ఇవ్వరు. ఇది రైతులను తీవ్రంగా కలవరపెడుతున్న అంశం.

రీ సర్వేతో తకరారు

ప్రస్తుతం రాష్ట్రంలో భూముల సర్వే జరుగుతోంది. రీ సర్వే అనంతరం ఇస్తున్న పాస్‌పుస్తకాల్లో భారీగా తప్పులు ఉంటున్నాయి. భూమి విస్తీర్ణం, కొలతలు, సరిహద్దుల నమోదులో తప్పులు వస్తున్నా రెవెన్యూ యంత్రాంగం సరిచేయడం లేదు. పైగా ఒకే భూమిపై ఇద్దరికి పాస్‌పుస్తకాలు ఇచ్చిన ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు హక్కుదారుకు టైటిల్ వస్తుందా? లేదా? అన్న సందేహాలు వెంటాడుతున్నాయి. టైటిల్ రిజిస్ట్రేషన్‌కు రీ సర్వే రికార్డులనే ప్రామాణికంగా తీసుకోబోతున్నారు. తప్పుల తడక రికార్డులను పరిగణనలోకి తీసుకుని టైటిల్ ఇస్తే మరిన్ని భూ వివాదాలు వస్తాయని రైతు సంఘం నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూ వివాదాల పరిష్కారానికి ఏర్పాటు చేసే అప్పిలేట్‌లలో రిటైర్డ్ అధికారులను నియమించే క్లాజు ఉంది. దీన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. సర్వీసులో ఉన్నవారు తప్పులు చేస్తేనే చర్యలు తీసుకోలేకపోతున్నారని, ఇక రిటైర్డ్ అధికారులు తప్పులు చేస్తే వారిపై ఏం నియంత్రణ ఉంటుందని రెవెన్యూ వర్గాలే ప్రశ్నిస్తున్నాయి.

చాలా ప్రమాదకర చట్టం

నీతి ఆయోగ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు సంబంధించిన డ్రాఫ్ట్ రిపోర్టును అన్ని రాష్ట్రాలకు పంపింది. దీనివల్ల ప్రజలకు చట్టబద్ధంగా అన్యాయం జరుగుతుందని భావించి దేశంలోని ఏ రాష్ట్రమూ దీనిని అంగీకరించలేదు. ఒక్క మన రాష్ట్రంలోనే దీనికి అంగీకారం తెలుపుతూ చట్టం చేసి, నోటిఫికేషన్ ఇచ్చారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా భూ హక్కుల చట్టం రూపకల్పన చేశారు. న్యాయవ్యవస్థను పరిధి నుంచి పూర్తిగా తొలగించి ప్రభుత్వ అదుపు ఆజ్ఞల్లో ఉండే రెవెన్యూ శాఖకు ఆస్తి నిర్ధారణ హక్కులు అప్పగించారు. కేంద్ర ప్రభుత్వ చట్టాలలో మార్పులు చేయకుండా ఆస్తి హక్కును నిర్ధారించే అధికారం, రెవెన్యూ అధికారులు నిర్ధారించిన ఆస్తిహక్కు నిర్ధారణ చెల్లుబాటు కావు.

- న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు

ఇళ్లల్లోకి దూరండి!

- ఇష్టారాజ్యంగా తనిఖీలు చేయండి
- జగన్ వచ్చే దారిలో ఎవరినీ వదలొద్దు
- వంటింట్లో కత్తులూ వదలద్దు
- పోలీసులకు అసాధారణ అధికారాలు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడిని అడ్డు పెట్టుకుని విపక్ష నేతలను టార్గెట్ చేసేలా రాష్ట్ర హోం శాఖ సంచలన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి పర్యటిస్తున్నారంటే.. ఆ ప్రాంతం పరిధిలో ఎవరూ ఆందోళన చేయకుండా, నిరసన తెలపకుండా విపక్ష నేతలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. అయితే, ఇక నుంచి ఇళ్లలోకి సైతం దౌర్జన్యంగా వెళ్లి తనిఖీలు చేసేలా.. అనుమానం వచ్చిన వారిని అదుపులోకి తీసుకునేలా, వస్తువులను స్వాధీనం చేసుకునేలా హోం శాఖ అసాధారణ అధికారాలు కల్పించింది. కీలక ఎన్నికల వేళ.. ప్రతిపక్షాల కీలక నేతలను కట్టడి చేసేందుకే పోలీసులకు ఎన్నడూ లేని ఇలాంటి అధికారాలు కట్టబెడుతున్నారని రిటైర్డ్ అధికారులు ఆరోపిస్తున్నారు.

విషయం ఇదీ..

మీ అందరి బిడ్డనని చెప్పుకునే జగన్‌కు ప్రజలపై నమ్మకం లేదు. మావోయిస్టులు, ఉగ్రవాదుల కన్నా సామాన్య ప్రజలతోనే తనకు ప్రాణహాని ఉందని నమ్ముతున్నట్టున్నారు. అందుకే గులకరాయి దెబ్బతో తనకు తానే భారీగా భద్రతను పెంచేసుకున్నారు. దేశ ప్రధానికి కూడా లేనంత సెక్యూరిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఇక, ఇప్పుడు తాజాగా మరో అడుగు ముందుకేశారు. జిల్లా ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, భారీగా పోలీసుల బలగాలతో రక్షణ కవచం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే.. ఇవి సాధారణ ఉత్తర్వులు కావు. జగన్ ప్రయాణించే మార్గంలో ఏ ఇంట్లోకి అయినా వెళ్లి సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు చేసే అసాధారణ అధికారాలు కల్పించారు. అనుమానితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు, ఇళ్లలో కూరగాయలు తరిగే కత్తులు, ఇతర బ్లేడ్‌లు ఉన్నా స్వాధీనం చేసుకునే అవకాశం ఇచ్చారు. ప్రస్తుతం బస్సు యాత్రలో ఉన్న సీఎం జగన్ బుధవారంతో పర్యటన ముగించుకుని గురువారం పులివెందులకు వెళతారు. తర్వాత రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో సీఎం పర్యటించే ప్రాంతాల్లో ఏ ఇంట్లోకి అయినా వచ్చి వీఐపీ సెక్యూరిటీ పేరిట సిబ్బంది తనిఖీ చేస్తారు. అనుమానం వస్తే ప్రశ్నిస్తారు. వస్తువులను స్వాధీనం చేసుకుంటారు. ఎన్నికల సమయం కావడంతో ప్రతిపక్ష పార్టీల వారి ఇళ్లల్లోకి ఉద్దేశ పూర్వకంగా దూరి తనిఖీలు చేసినా ఆశ్చర్యం లేదు.

గులకరాయి వంక!

పోలీసులకు అసాధారణ అధికారాలు కల్పించడం పట్ల రిటైర్డ్ ఉన్నతాధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఇప్పటి వరకు జగన్ ముఖ్యమంత్రి హోదాలో బయటికి వచ్చింది తక్కువ. నాలుగేళ్లకుపైగా తాడేపల్లి ప్యాలెస్‌కు పరిమితమైన ఆయన అప్పుడప్పుడు వైసీపీ నేతల కుటుంబాల్లో పెళ్లిళ్లు, ఫంక్షన్లు జరిగితే వచ్చేవారు. అప్పుడు కూడా గంటల తరబడి ట్రాఫిక్ ఆపేసి ప్రజలకు నరకం చూపించేవారు. బటన్ నొక్కే కార్యక్రమం పెడితే బారికేడ్లతోపాటు పరదాలు కట్టి, మహిళలు వస్తే వారి చున్నీలు సైతం తీయించిన ఘనత జగన్ సెక్యూరిటీకి దక్కుతుంది. ఇంత రక్షణ ఉండే ఆయనకు ఇప్పుడు అసాధారణ భద్రత ఎందుకంటే.. 'గులకరాయి దెబ్బ' అని హోం శాఖ వర్గాలు చెబుతున్నాయి.

నోటీసులిచ్చినా

అదే నోటి దురుసు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. పైగా తామిచ్చిన నోటీసులపై జగన్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని వెల్లడించారు. నోటీసులిచ్చిన తర్వాత కూడా వైసీపీ సిద్ధం సభల్లో జగన్ విపక్షాలపై నోరుపారేసుకుంటున్నారని, టీడీపీ అధినేత చంద్రబాబుపై, జనసేనాని పవన్ కల్యాణ్‌పై ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా అనుచిత వ్యాఖ్యలు కొనసాగిస్తూనే ఉన్నారని ఆ నివేదికలో పేర్కొన్నారు. జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను తన నివేదికతో జత చేస్తున్నట్టు తెలిపారు. రాజకీయ ప్రసంగాల్లో జగన్ వ్యాఖ్యలు... టీడీపీ, జనసేన అధినేతలు, ఇతర నాయకుల వ్యక్తిగత పరువుప్రతిష్ఠలను దెబ్బతీసేలా ఉన్నాయని, దీనివల్ల ఎన్నికల రణరంగంలో ఆ రెండు పార్టీలకు సమాన అవకాశాలు దెబ్బతినే ప్రమాదముందని మీనా పేర్కొన్నారు. చంద్రబాబుపై తరచూ అవమానకరమైన వ్యాఖ్యలు చేస్తున్న జగన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఏప్రిల్ 5న ఈసీకి లేఖ రాశారు. దీనిపై ఎన్నికల సంఘం స్పందించింది. 48 గంటల్లోగా తన వివరణ సమర్పించాలని జగన్‌కు నోటీసు పంపింది. లేనిపక్షంలో తదుపరి చర్య కోసం సీఈసీకి నివేదిక పంపిస్తామని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. జగన్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని, ఆయనపై తదుపరి చర్యలకు సిఫారసు చేస్తున్నట్టు తన నివేదికలో మీనా తేల్చిచెప్పారు.

ఇలాగే మాట్లాడతారట!

రాజకీయ ప్రసంగాల్లో తాను వాడిన భాష, చంద్రబాబును సినిమాల్లోని క్యారెక్టర్లతో పోల్చిన విధానం రాజకీయ పరిభాష అంటూ జగన్ తన వ్యాఖ్యలు సమర్థించుకున్నారని సీఈవో పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వ విధానాల వైఫల్యాలను ఎత్తిచూపడమే తన వ్యాఖ్యల ఉద్దేశమని, అది వ్యక్తిగత దాడి కిందకు రాదని వాదించారని తెలిపారు. పైగా ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యంలో ఇలా మాట్లాడడం సర్వసాధారణమేనన్న ఆయన వివరణ ఎంతమాత్రం ఆమోదయోగ్యంగా లేదు. జగన్ ఇచ్చిన వివరణ పూర్తిగా పరిశీలించానని, ఎక్కడా కూడా చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయలేదని చెప్పలేదన్నారు.

పదేపదే అదే తప్పు

ఈ నెల 2, 3, 4 తేదీల్లో మదనపల్లె, పూతలపట్టు, నాయుడుపేటలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభల్లో చంద్రబాబుపై జగన్ పలు అనుచిత వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. బాబు హంతకుడు అని, ప్రజలను మోసం చేయడం అలవాటని, శాడిస్ట్ అంటూ వ్యాఖ్యానించారు. వీటిని పరిశీలించిన సీఈవో.. ఈ వ్యాఖ్యలు కోడ్ ఉల్లంఘన కిందకు వస్తాయని ప్రాథమికంగా తేల్చారు. నోటీసులిచ్చాక కూడా జగన్ తీరు మార్చుకోలేదని స్పష్టంగా చెప్పారు. 16న భీమవరంలోనూ జగన్ నోరుపారేసుకున్నారు. పవన్ కల్యాణ్‌ని ఉద్దేశించి చంద్రబాబుకు దత్తపుత్రుడని, కార్లు మార్చినట్టు భార్యలను మారుస్తున్నారని, అలాగే, ఇప్పుడు నియోజకవర్గాలను అదేవిధంగా మారుస్తున్నారంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని. కాబట్టి జగన్‌పై తదుపరి చర్యలు తాను సిఫారసు చేస్తున్నట్టు మీనా పేర్కొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై ఈసీకి నివేదిక

ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు తన ప్రసంగాల్లో సీఎం జగన్‌ను ఉద్దేశించి చేస్తున్న వ్యాఖ్యలపై వైసీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారని సీఈసీకి పంపిన నివేదికలో మీనా తెలిపారు. దీనిపై వివరణ కోరగా, తాను ఆ వ్యాఖ్యలు చేయలేదన్నట్టుగా చంద్రబాబు వివరణ ఇచ్చారని, కానీ, వీడియోలు అందుబాటులో ఉన్నాయని నివేదించారు. ఆ వివరణ సంతృప్తికరంగా లేదని పేర్కొన్నారు. చంద్రబాబు తన ప్రసంగాల్లో చేస్తున్న వ్యాఖ్యలు...వైసీపీ, ఆ పార్టీ నాయకుల వ్యక్తిగత ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని తెలిపారు. దీని వల్ల ఎన్నికల్లో వైసీపీ.. సమాన అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నివేదికలో చంద్రబాబు వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సాక్ష్యాలు జత చేస్తున్నట్టు మీనా పేర్కొన్నారు. ప్రసంగాల్లో ఇంకా అనుచిత వ్యాఖ్యలు కొనసాగుతున్న నేపథ్యంలో చంద్రబాబుపై తదుపరి చర్యలకు సిఫారసు చేస్తున్నట్టు మీనా వెల్లడించారు.

ఎన్నికల అక్రమాలపై నిఘా!

- రంగంలోకి సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ
- 13 ఉమ్మడి జిల్లాలకు పరిశీలకులు



గుంటూరులో ఓటర్ల చైతన్య లఘు చిత్రాలను ఆవిష్కరిస్తున్న నిమ్మగడ్డ రమేశ్ కుమార్

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 23: ఎన్నికల్లో అక్రమాలను నివారించడానికి నిష్ఠాతులైన విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులతో ఎన్నికల నిఘా కార్యక్రమానికి శ్రీకారం చుట్టుతున్నట్లు సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ (సీడీఎఫ్) కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ తెలిపారు. ఓటర్లను చైతన్యపరచడానికి రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు, శ్రీకారం కళాపరిషత్ రూపొందించిన ఐదు లఘు చిత్రాలను మంగళవారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లఘు చిత్రాల ద్వారా ఓటర్ల ఆలోచన, భావాల్లో పెను మార్పులు తీసుకురావచ్చన్నారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ తరఫున ఎన్నికల అక్రమాలపై నిఘాకు మే 9 నుంచి పరిశీలకులు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని తెలిపారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ కృషి ఫలితంగా వలంటీర్లను ఎన్నికల విధులకు దూరం చేయగలిగామని చెప్పారు. మే 1, 2 తేదీల్లో పెన్షన్‌దారులకు ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఓటు అమ్ముకోవద్దని, విద్యావంతులు తప్పకుండా ఓటింగ్‌లో పాల్గొనాలని, మంచి పరిపాలన, అభివృద్ధికి తోడ్పడే అభ్యర్థులను గెలిపించుకోవాలనే ఆలోచనలను లఘు చిత్రాలు అందించాయని చెప్పారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రంగయ్య, పారదర్శక ఎన్నికల పర్యవేక్షణ సమితి కన్వీనర్ పి.వి.మల్లికార్జున రావు, ప్రముఖ ఇంజనీర్ కుర్రి రామసుబ్బారావు, సూర్య ఇన్వెస్టిగేషన్ వ్యవస్థాపకుడు కాళహస్తి సత్యనారాయణ, తెలుగు భాషోద్యమ సమాఖ్య కన్వీనర్ వి.సింగారావు, ప్రముఖ రంగస్థల నటుడు నాయుడు గోపి, ప్రముఖ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు, ప్రముఖ దర్శకుడు చిట్టినేని శివకోటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

ఒకటో తేదీనే ఇంటి వద్ద పింఛన్లు ఇవ్వాలి

- వలంటీర్లను పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోనీయొద్దు.. సీఈవోను కోరిన ఎన్డీయే బృందం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు వచ్చే నెల ఒకటో తేదీనే ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎన్డీయే కూటమి బృందం ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసింది. టీడీపీ లోగో, చంద్రబాబు ఫొటోతో టీడీపీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న కడప వైసీపీ కార్యకర్త మన్విత్ కృష్ణారెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసింది. వలంటీర్లను పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోనీయొద్దని సూచించింది. సర్వేపల్లిలో దొరికిన 4,500 మద్యం సీసాల ఘటనపై విచారణ జరపాలని కోరింది. పవన్ కల్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న పోసాని కృష్ణమురళి, వాసిరెడ్డి పద్మ, సజ్జల రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు మంగళవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర సీఈవో మీనాకు కూటమి బృందం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేసింది. టీడీపీ తరఫున పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకరరావు, బీజేపీ అధికార ప్రతినిధి విల్సన్ ఈ వినతిపత్రాలు అందజేశారు. తెలుగు రైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మన్నవ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా

దళిత జడ్పీ చైర్‌పర్సన్‌కు ఘోర అవమానం

- పార్టీ మారటంతో కన్నెర్ర చేసిన వైసీపీ అధిష్ఠానం
- సమావేశానికి ముఖం చాటేసిన ఆ పార్టీ జడ్పీటీసీలు
- కోరం లేకపోవడంతో వాయిదా వేసిన వైనం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 23: కదిలితే నా దళితులు.. నా క్రిస్టియన్‌లు అంటూ ఊదరగొట్టే జగన్ పాలనలో దళితురాలైన గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనాకు ఘోర అవమానం ఎదురైంది. కొద్ది రోజుల క్రితం క్రిస్టీనా, ఆమె భర్త సురేష్ టీడీపీలో చేరారు. కీలక సమయంలో పార్టీ మారారన్న అక్కసుతో వైసీపీ అధిష్ఠానం ఆమెపై కన్నెర్ర చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ సాధారణ సమావేశాన్ని అధికార పార్టీ జడ్పీటీసీలు బహిష్కరించారు. గుంటూరు జిల్లా పరిషత్‌లో ఆ పార్టీకి మొత్తం 53 మంది జడ్పీటీసీలు ఉండగా, కేవలం ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. కోరం లేకపోవడంతో జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశం ఆరంభానికి ముందు జిల్లా పరిషత్‌కు వచ్చిన జడ్పీటీసీలు భోజనాలు బాగో లేవంటూ చైర్‌పర్సన్ చాంబర్ వద్దకు వచ్చి గొడవ చేశారు.

రాష్ట్రంలో లక్ష కోట్ల లిక్కర్ స్కాం

- బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌చార్జి సిద్ధార్థ్‌నాథ్ సింగ్



మోదీ గ్యారంటీ అనే బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ పాలనలో రూ.లక్ష కోట్ల లిక్కర్ స్కామ్ జరిగిందని బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌చార్జి సిద్ధార్థ్ నాథ్ సింగ్ ఆరోపించారు. మైనింగ్, ఇసుక, తదితర వనరులు మొత్తాన్ని దోచేసిన జగన్‌రెడ్డి ప్రతి ఓటరుపై రూ.3.25 లక్షల అప్పు భారం మోపారని అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్నికల సమన్వయకర్త పేరాల శేఖర్, అధికార ప్రతినిధి సాదినేని యామినీ శర్మ తదితరులతో కలసి పార్టీ ఎన్నికల మేనిఫెస్టో తెలుగు కాపీని విడుదల చేశారు. 'జగన్ హయాంలో రాష్ట్రంలో ఏకంగా 3,000 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మోదీ ఇచ్చిన రూ.6,000 సైతం తన ఖాతాలో వేసుకుని అన్నదాతల్ని వంచించారు. పదేళ్ల నరేంద్ర మోదీ పాలనలో రైతులు, పేదలు, చిరు వ్యాపారులు, గిరిజనులు, దళితులు అన్ని వర్గాలకు మేలు జరిగింది' అని అన్నారు.

ఒకే ఆరోపణపై రెండోసారి ఎలా సస్పెండ్ చేస్తారు?

- ఏబీవీ సమాధానాన్ని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?
- ఏపీ ప్రభుత్వాన్ని నిలదీసిన క్యాట్... విచారణ 29కి వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఒకేరకమైన కారణాలు, ఆరోపణలతో సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును రెండోసారి ఎలా సస్పెండ్ చేస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(క్యాట్) ప్రశ్నించింది. ఏబీవీ సస్పెన్షన్ చట్టవిరుద్ధమని ఒకసారి సుప్రీంకోర్టు చెప్పిన తర్వాత మళ్లీ అవే ఆరోపణలతో రెండోసారి సస్పెండ్ చేయడంపై నిలదీసింది. ప్రభుత్వం సమర్పించిన నోట్‌ఫైల్‌లో పాత ఆరోపణలు తప్ప కొత్తగా ఏమీలేదని.. ప్రభుత్వం సమర్పించిన రికార్డు అడ్వకేట్ జనరల్ వాదనలతో పొంతన లేకుండా ఉందని అభ్యంతరం వ్యక్తం చేసింది. తనను సస్పెండ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు హైదరాబాద్ క్యాట్‌లో దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారణ కొనసాగింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ అందుబాటులో లేకపోవడంతో విచారణ ఈ నెల 29కి వాయిదా పడింది.

సీతంపేట ఐటీడీఏ పీవోపై బదిలీ వేటు

పార్వతీపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వోగా ఉన్న సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనా కుమారికి ఆకస్మికంగా బదిలీ అయ్యింది. ఆమెను జీఏడీలో రిపోర్టు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆమె విధుల నుంచి రిలీవ్ అయ్యారు. కల్పనాకుమారి ఆకస్మిక బదిలీకి కారణాల తెలియరాలేదు. ఇదిలావుంటే, సీతంపేట ఐటీడీఏ పీవోగా శుభం బన్సల్‌ను నియమిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

గిరిశాపై విచారణకు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఉప ఎన్నికల్లో అక్రమాలకు సంబంధించి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా ఉన్న పి.ఎస్.గిరిశాను కేంద్ర ఎన్నికల సంఘం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన తనపై ఉన్న అభియోగాలను తొలగించి, సస్పెన్షన్ ఎత్తివేయాలని ఈసీకి విన్నవించారు. దీంతో అతనిపై సస్పెన్షన్ ఎత్తివేసిని ఈసీ.. విచారణ కొనసాగించాలని ఆదేశించింది.పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్‌ను విచారణాధికారిగా నియమించింది.

ఎంతమంది వలంటీర్లు రాజీనామా చేశారు?

- ఆ వివరాలను సమర్పించండి.. ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన హైకోర్టు

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): "వలంటీర్లు తమ జేబులో సొమ్ము ఏమీ లబ్ధిదారులకు ఇవ్వడం లేదు కదా? వారు చెప్పిన మాటలు విని ఓటు వేసేంత బలహీనంగా ఓటరు ఉన్నారా?" అని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. రాజీనామాతో వలంటీరు, లబ్ధిదారుకు మధ్య ఉన్న అనుబంధం పోతుందని, అలాంటి వ్యక్తి మాట విని ఏ లబ్ధిదారుడు ఓటు వేస్తారని వ్యాఖ్యానించింది. పోలింగ్ బూత్‌కు వెళ్లే వరకు మాత్రమే ప్రభావితం చేయగలరుగానీ, ఒకసారి బూత్‌లోకి ప్రవేశించిన తరువాత తన విచక్షణ మేరకే ఓటరు తన ఓటు హక్కు వినియోగించుకుంటారని గుర్తు చేసింది. ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని కేంద్ర ఎన్నికల సంఘం సర్క్యులర్ జారీ చేశాక ఎంత మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారనేది పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచాలని ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ మంగళవారం ఆదేశాలు ఇచ్చారు. ఏపీలో ఎన్నికలు ముగిసేవరకు గ్రామ-వార్డు వలంటీర్ల రాజీనామాలను ఆమోదించకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ కమిషనర్, గ్రామ-వార్డు సచివాలయశాఖ ముఖ్యకార్యదర్శికి సూచించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా, పిటిషనర్ తరఫున న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపించారు. "వైసీపీకి గ్రామ-వార్డు వలంటీర్లు అనుకూలంగా ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో వారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఇప్పటికే సర్క్యులర్ జారీ చేసింది. ఈసీ సర్క్యులర్‌ను అపహాస్యం చేస్తూ వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు. ఇప్పటికే 44వేల మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వీరు వైసీపీకి అనుకూలంగా లక్షలమంది ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రమాదం ఉంది. రాజీనామాల వెనుక కుట్రకోణం దాగి ఉంది. వలంటీర్లుగా ఉండి వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తే వారిపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది. దీంతో వారు రాజీనామాలు చేసి వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారు. అధికరణ 324 మేరకు ఎన్నికల కమిషన్ తనకు ఉన్న విశేష అధికారాలను వినియోగించి వలంటీర్ల రాజీనామాలు ఆమోదించకుండా ప్రభుత్వానికి సూచించేలా ఆదేశించండి" అని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. "ఐఏఎస్ అధికారులు సైతం ఉద్యోగాలకు రాజీనామా చేసి తమకు ఇష్టమైన రాజకీయ పార్టీలలో చేరుతున్నారు. ఆ వెంటనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన తరువాత వారిని ప్రభుత్వం నియంత్రించలేదు. పిటిషనర్ ఊహాజనిత ఆరోపణలు చేస్తున్నారు. వలంటీర్లు ఉద్యోగాలకు రాజీనామా చేసిన తరువాత ఓ పార్టీ తరఫున ప్రచారం చేస్తున్నట్లు పిటిషనర్ ఎలాంటి ఉదంతాలనూ కోర్టు ముందు ఉంచలేదు" అని తెలిపారు.

ఆ నిబంధన ఎందుకు తొలగించారు?

- పతంజలి కేసులో కేంద్రాన్ని నిలదీసిన సుప్రీం
- డీఎంఆర్ యాక్ట్‌లోని రూల్ నంబర్ 170 కింద చర్యలు తీసుకోవద్దన్న లేఖపై ఆగ్రహం
- ఆ లేఖపై వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పతంజలి వాణిజ్యప్రకటనల కేసు విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు.. కేంద్రంపైన, పతంజలి సంస్థపై పిటిషన్ వేసిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)పైనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. 'డ్రగ్స్ అండ్ మ్యాజికల్ రెమెడీస్ (అబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్‌మెంట్స్) యాక్ట్ (డీఎంఆర్ యాక్ట్)లోని 170వ నిబంధనను ఎందుకు తొలగించారో చెప్పాలంటూ కేంద్రాన్ని నిలదీసిన ధర్మాసనం.. 'ఇతరులను వేలెత్తి చూపే ముందు మీ ఇంటిని చక్కదిద్దుకోండి' అంటూ ఐఎంఏకు తలంటింది. డీఎంఆర్ యాక్ట్‌లోని 170వ నిబంధన ప్రకారం.. తమ ఔషధానికి అద్భుతసామర్థ్యం ఉందంటూ మందుల కంపెనీలు వాణిజ్య ప్రకటనలు ఇవ్వడం నిషిద్ధం. అలాగే, ఆ నిబంధన ప్రకారం ఆయుర్వేద, సిద్ధ, యునాని సంస్థలు తమ ఔషధాలకు సంబంధించిన ప్రకటనలు ఇచ్చే ముందు సంబంధిత ప్రభుత్వ విభాగాల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ.. కీలకమైన ఆ నిబంధనను తొలగిస్తున్నట్టుగా పేర్కొంటూ ఆయుష్ మంత్రిత్వ శాఖ గత ఏడాది ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాయడాన్ని జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఆ నిబంధన కింద ఎలాంటి చర్యలూ తీసుకోవద్దని కోరడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఒక చట్టం అమల్లో ఉన్నప్పుడు దాంట్లో ఒక నిబంధనను అమలు చేయొద్దనడం దాన్ని ఉల్లంఘించడం కాదా అని నిలదీసింది. చూడబోతే.. ప్రభుత్వం దృష్టి అంతా ఆదాయం మీదనే ఉన్నట్టు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలా ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారకాలు ఉన్నాయంటూ ఇటీవల వార్తలు వచ్చిన నేపథ్యంలో.. కొన్ని ఎఫ్ఎంసీజీ (ఫాస్ట్‌మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్) కంపెనీలు కూడా తప్పుదోవ పట్టించే వాణిజ్య ప్రకటనలు ఇస్తున్న విషయాన్ని కోర్టు ఈ విచారణ సందర్భంగా గుర్తుచేసింది. ప్రజలను అలా మోసపోనివ్వబోమని స్పష్టం చేసింది. అలాంటి ప్రకటనల ద్వారా ఎఫ్ఎంసీజీ కంపెనీలు వినియోగదారుల చట్టాలను దుర్వినియోగం చేయకుండా తీసుకుంటున్న చర్యలేమిటో చెప్పాలని.. కేంద్రాన్ని ఆదేశించింది. రూల్ 170 కింద ఎలాంటి చర్యలూ తీసుకోవద్దన్న లేఖపై వివరణ ఇవ్వాలని ఆయుష్ మంత్రిత్వ శాఖను ఆదేశించింది. ఈ కేసులో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు సహప్రతివాదులుగా ఇంప్లీడ్ కావాలని ఆదేశించింది.



మంగళవారం సుప్రీంకోర్టు ఆవరణలో రాందేవ్ బాబా

క్షమాపణ ప్రకటనలూ ఆ సైజులోనే ఉన్నాయా?

తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో బేషరతు క్షమాపణలు చెబుతూ తమ క్లయింట్లు సోమవారంనాడు 67 వార్తాపత్రికల్లో ప్రకటనలు ఇచ్చారని, అవసరమైతే మరిన్ని ప్రకటనలు కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని రాందేవ్ బాబా, బాలకృష్ణ తరఫున వాదనలు వినిపించిన ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అయితే.. ఆ ప్రకటన ఇవ్వడానికి వారం రోజుల సమయం ఎందుకు పట్టిందని ధర్మాసనం నిలదీసింది. అలాగే.. ఆ ప్రకటనల పరిమాణం గురించి కూడా కోర్టు ప్రశ్నించింది. "క్షమాపణ ప్రకటనలు కూడా పతంజలి సంస్థ ఎప్పుడూ ఇచ్చే ప్రకటనల పరిమాణంలోనే ఉన్నాయా?" అని అడిగింది. ఆ పేపర్లను రెండురోజుల్లోగా ఫైల్ చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను 30వ తేదీకి వాయిదా వేసింది.

కడప జిల్లా కోర్టు

గీత దాటింది!

- విచారణ పరిధి దాటి ఉత్తర్వులు
- హైకోర్టులో సునీత, టీడీపీ నేత బీటెక్ రవి పిటిషన్లు
- వివేకా హత్యపై ప్రజా బాహుళ్యంలోని వివరాలనే ప్రస్తావించాం
- వ్యాఖ్యలపై అభ్యంతరం ఉంటే ఈసీని ఆశ్రయించాలి
- నేరుగా కోర్టులో దావా వేయడం చెల్లదు
- ఓ పార్టీకి అనుచిత లబ్ధి చేకూర్చేలా కడప కోర్టు ఆదేశాలు
- వాటిని రద్దుచేయాలని అభ్యర్థన.. నేడు విచారణ




అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య విషయంలో వైసీపీ అధ్యక్షుడు/సీఎం జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నేతలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న ఏ కేసుల గురించీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడవద్దంటూ కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి రవీంద్రనాథ్‌రెడ్డి(బీటెక్ రవి) హైకోర్టులో సవాల్ చేశారు. వేర్వేరుగా పిటిషన్లు (సివిల్ మిసిలేనియస్ అప్లికేషన్) దాఖలు చేశారు. ఆ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు చట్టవిరుద్ధంగా ఉన్నాయని.. విచారణ పరిధిదాటి కోర్టు ఆదేశాలిచ్చిందని తెలిపారు. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా దావాలోని ప్రతివాదుల వాదనలు వినకుండానే ఏకపక్షంగా తాత్కాలిక మధ్యంతర ఉత్తర్వులిచ్చిందన్నారు. 'పరువుకు నష్టం కలిగించినందుకు పరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైఎస్ఆర్ కడప జిల్లా వైసీపీ అధ్యక్షుడు దాఖలు చేసిన వ్యాజ్యానికి విచారణార్హత లేదు. అలాంటి వ్యాజ్యంలో ఈ తరహా ఉత్తర్వులు ఇవ్వడానికి వీల్లేదు. ఈ ఏడాది మార్చి 16న ఎన్నికల నోటిఫికేషన్ అమల్లోకి వచ్చింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం నిబంధనలకు విరుద్ధంగా సూట్‌లోని ప్రతివాదులు ఎన్నికల్లో అవినీతి కార్యకలాపాలు, నేరాలకు పాల్పడలేదనే విషయాన్ని కడప కోర్టు గుర్తించి ఉండాల్సింది. ప్రతిపక్ష నేతల వ్యాఖ్యలపై అభ్యంతరాలుంటే బాధిత వ్యక్తులు వ్యక్తిగతంగా పిటిషన్ (సూట్) వేసుకుని ఉండాల్సింది. పార్టీ తరఫున దాఖలు చేసిన సూట్‌లో కోర్టు ఉత్తర్వులు ఇచ్చి ఉండాల్సింది కాదు. వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈసీ వద్ద వారు ఎలాంటి ఫిర్యాదులూ చేయలేదు. ప్రత్యామ్నాయ పరిష్కార మార్గంగా ఈసీని ఆశ్రయించేందుకు అవకాశం ఉండగా నేరుగా కోర్టులో దావా వేయడం చెల్లుబాటు కాదు. వాక్ స్వాతంత్ర్యాన్ని హరించేలా కడప కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు విరుద్ధంగా ఉన్నాయి. ఇలాంటి ఉత్తర్వులు ఇచ్చేందుకు ఆ కోర్టు పేర్కొన్న కారణాలు సహేతుకంగా లేవు. దావాలో పిటిషనర్లు కోరని అభ్యర్థనలను కూడా మంజూరు చేసి పరిధికి మించి వ్యవహరించింది. సీబీఐ దాఖలు చేసిన చార్జిషీటులోని అంశాలు, ప్రజాబాహుళ్యంలో ఉన్న వివరాల ఆధారంగానే దావాలోని ప్రతివాదులు వివేకా హత్యకు సంబంధించి ప్రకటనలు చేశారు. ఈ విషయాన్ని గుర్తించడంలో కడప కోర్టు విఫలమైంది. ఎన్నికల నేపథ్యంలో ఆ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ఓ రాజకీయ పార్టీపై అసమ్మతి వ్యక్తం చేయకుండా నిరోధించేలా, దానికి అనుచిత లబ్ధి చేకూర్చేలా ఉన్నాయి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయండి' అని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యాలపై అత్యవసరంగా విచారణ జరపాలని సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు, న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు మంగళవారం జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎస్.విజయ్‌తో కూడిన ధర్మాసనాన్ని అభ్యర్థించారు. బుధవారం ఈ వ్యాజ్యాలు విచారణకు రానున్నాయి.

ఏపీ ఎన్నికల ప్రత్యేకం-2024
ప్రజా అజెండా
ఆంధ్రజ్యోతి
బుధవారం ◇ 24-4-2024

జన చైతన్యం





భవన నిర్మాణ రంగం... ఉపాధి కల్పనలో మర్రిచెట్టు లాంటిది. పేరుకే ఇది ఒక రంగం. కానీ... తాపీ మేస్త్రీ, రాడ్ బెండింగ్, సెంట్రింగ్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, టైల్స్ మేస్త్రీ, పెయింటర్ ఇలా 36 రకాల నిపుణులకు నిర్మాణ రంగం ఉపాధి కల్పిస్తుంది. జగన్ జమానాలో వీరంతా పనుల్లేక అల్లాడిపోయారు.

జగన్ అధికారంలోకి రాగానే... 'మద్యం' పాలసీని మార్చేశారు! కానీ... ఒక్కరోజంటే ఒక్కరోజు కూడా మద్యం షాపులు మూతపడలేదు. మందుబాబులు ఇబ్బంది పడలేదు. రాత్రికి రాత్రి ప్రైవేటు షాపులు పోయి, ప్రభుత్వ మద్యం దుకాణాలు వచ్చేశాయి. మద్యానికి జగన్ ఇచ్చిన విలువ ఇది!

జగన్ వచ్చీ రాగానే... ఇసుక విధానాన్ని మార్చేశారు. కానీ... కొత్త పాలసీ వచ్చేదాకా ఇసుక బంద్! ఒకరోజు, రెండు రోజులు కాదు! దాదాపు ఆరునెలలు ఎక్కడా అధికారికంగా ఇసుక దొరకలేదు. దీంతో నిర్మాణరంగం కుదేలైంది. ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. నిర్మాణ రంగానికి జగన్ ఇచ్చిన ప్రాధాన్యం ఇది!

భవన నిర్మాణ రంగాన్ని కూల్చేశారు!

కట్టనివ్వను.. కొల్లకుతింటూ..



60 లక్షల మందిని వేధించిన జగన్

ఇసుక దోపిడీ కోసం 'స్కెచ్'.. కొత్త విధానం పేరిట రీచ్‌లు బంద్
అమరావతి దెబ్బకు రియల్ రంగం ఢామ్.. అస్థిర విధానాలతో ఆగిన నిర్మాణాలు
పనుల్లేక ఇతర రాష్ట్రాలకు వలసలు.. సుమారు వెయ్యి మంది ఆత్మహత్య
టీడీపీ హయాంలో చేతినిండా పనులు.. కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు
ఆ నిధులనూ దారి మళ్లించిన జగన్.. నేటికీ కుదుట పడని నిర్మాణ రంగం

భవన నిర్మాణ రంగానికి కీలకం ఇసుక! ఇసుక లేకుంటే నిర్మాణం ఆగినట్లే! 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక ఉచితం! లోడింగ్, రవాణా ఖర్చులతో 4 టన్నుల ఇసుక ట్రాక్టర్ రూ.2వేలు, 20 టన్నుల ఇసుక లారీ రూ.10వేలు ఉండేది. జగన్ వచ్చాక... ఈ ధర అనేక రెట్లు పెరిగిపోయింది.



విజయవాడ-ఆంధ్రజ్యోతి

కట్టడం కాదు... కూల్చడం!
నేను కట్టను!... మిమ్మల్ని కట్టుకోనివ్వను!
..ఇదీ ఐదేళ్లపాటు జగన్ అనుసరించిన విధానం!
దీని ఫలితం... రాష్ట్రంలోని సుమారు 60 లక్షల మంది భవన నిర్మాణరంగ కార్మికులకు ఆకలి కేకలు, తీరని కష్టాలు!
ఇసుకను భోంచేయడమే లక్ష్యంగా కొత్త విధానాన్ని రూపొందించిన జగన్... కార్మికుల పొట్టకొట్టారు.

ఉపాధి కల్పనలో భవన నిర్మాణరంగానిది మూడో స్థానం. సుమారు 60 లక్షల మంది కార్మికులు ఈ రంగంపై ఆధారపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత ఐదేళ్లు భవన నిర్మాణ రంగం ఒక వెలుగు వెలిగింది. అమరావతిలో రాజధాని పనుల నిర్మాణంలో వేల మంది కార్మికులు పాల్గొన్నారు. అదే సమయంలో... గుంటూరు, విజయవాడ చుట్టుపక్కల జోరుగా రియల్ ఎస్టేట్ వెంచర్లు, భవన నిర్మాణాలు మొదలయ్యాయి. ఇటు ప్రకాశం జిల్లా నుంచి అటు తూర్పు గోదావరి వరకు 'అమరావతి' ప్రభావంతో రియల్ బూమ్ రంకెలేసింది. బిల్డర్లు పెద్దసంఖ్యలో కొత్త ప్రాజెక్టులు చేపట్టారు. పోలవరం వంటి సాగునీటి ప్రాజెక్టులు, పల్లెల్లో సిమెంటు రోడ్లు, పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం... ఇలా ప్రభుత్వపరంగానూ రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణరంగం కళకళలాడింది. ఇక్కడ కూలీలు సరిపోక ఇతర రాష్ట్రాల నుంచీ తెప్పించుకునేవారు. సొంత ఇళ్ల నిర్మాణం ఊపందుకుంది. టీడీపీ సర్కారు అమలు చేసిన 'ఉచిత ఇసుక' విధానం నిర్మాణ రంగానికి ఎంతో ఊతమిచ్చింది. ఇలా ఐదేళ్లపాటు కళకళలాడిన భవన నిర్మాణ రంగం... వైసీపీ అధికారంలోకి రాగానే కుదేలైపోయింది.

జగన్ కొట్టిన 'ఇసుక' దెబ్బ

ఇసుక.. ప్రకృతి వనరు! పైసా పెట్టుబడి లేదు! తవ్వుకోవడం... రవాణా చేసి అమ్ముకోవడం! కోట్లకు కోట్లు వెనకేసుకునే అవకాశం! అందుకే దీనిపై వైసీపీ పెద్దలు ఎప్పటి నుంచో కన్నేశారు. 'అధికారంలోకి వస్తే ఇసుక నుంచి కోట్లు పిండుకునేది ఎలా?' అనే వ్యూహం రచించుకున్నారు. పీఠం చేజిక్కగానే దానిని అమలు చేశారు. ఉచిత ఇసుకకు మంగళం పలికారు. 'కొత్త విధానం తీసుకొస్తాం' అంటూ కాలయాపన మొదలుపెట్టారు. దీంతో ఇసుకే బంగారమైంది. అప్పటికే కొనసాగుతున్న నిర్మాణ పనులకు ఇసుక కరువైంది. దీనిని వైసీపీ నాయకులు బాగా సొమ్ము చేసుకున్నారు. ఒక దశలో లారీ ఇసుక లక్ష రూపాయలకు చేరుకుంది. ఇసుక ఖర్చు భరించ లేని వాళ్లు పనులు ఆపి వేశారు. కొత్తగా శంకుస్థాపనలు ఆగిపోయాయి. దీంతో కార్మికులకు కష్టాలు మొదలయ్యాయి. దాదాపు ఐదు నెలలపాటు రాష్ట్రంలో ఇసుక రీచ్‌లు బంద్! ఇక్కడ చేయడానికి పనుల్లేక భవన నిర్మాణ కార్మికులు ఇతర రాష్ట్రాలకు వలస పోయారు. జగన్ సర్కారు 2019 సెప్టెంబరు 5 నుంచి కొత్త ఇసుక పాలసీని తెచ్చింది. ఇసుక దోపిడీని కేంద్రీకరించి... సొంతం దోచుకోవడమే లక్ష్యంగా ఈ పాలసీ రూపొందింది. ప్రజలకు మేలు చేయడంకాదు... జేబులు నింపుకోవడమే దీని ఉద్దేశం! దీనివల్ల ఇసుక ధరలు తగ్గలేదు. దోపిడీ ఆగలేదు. మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు కరోనా రెండేళ్లపాటు భవన నిర్మాణ రంగాన్ని కుదేలు చేసింది.

నిర్మాణాలపై సమ్మెట!

ఒకవైపు ఇసుక దెబ్బ.. మరోవైపు జగన్ విధ్వంసకర విధానాల పోటు! ఈ రెండింటితో నిర్మాణరంగం పూర్తిగా కుదేలైంది. 'అమరావతి'ని అటకెక్కించడంతో రియల్ ఎస్టేట్ ఢామ్ అంది. అంతకుముందు ఒకేసారి రెండుమూడు ప్రాజెక్టులు చేపట్టిన బిల్డర్లు.. ఆ తర్వాత రెండేళ్లలో ఒక్కటీ పూర్తి చేయలేని స్థితికి వచ్చారు. రివర్స్ టెండరింగ్‌తో ప్రభుత్వ పనులు ఆగిపోయాయి. బటన్ నొక్కితే చాలని భావించిన జగన్... అభివృద్ధి పనులను ఆపివేశారు. ఫలితంగా నిర్మాణ రంగం ధ్వంసమైంది. కార్మికులకు కష్టాలే మిగిలాయి.

వెయ్యిమంది ఉసురు పోసుకున్న జగన్

రాష్ట్రంలో పనులు లభించక రాయలసీమ జిల్లాల్లోని చాలా మంది భవన నిర్మాణ కార్మికులు, కూలీలు తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలకు వలస వెళ్లిపోయారు. ఉత్తరాంధ్ర జిల్లాల వారు ఒడిసా వంటి రాష్ట్రాలకు పొట్టచేత పట్టుకుని వెళ్లారు. కోస్తా జిల్లాల కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఆత్మహత్యకు పాల్పడిన వారి సంఖ్య వెయ్యికిపైనే ఉంటుందని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోనా రాజ్ తెలిపారు.

ఆదుకోవాల్సింది పోయి...

కష్టాల్లో ఉన్న కార్మికులను ఆదుకోవాల్సిందిపోయి... వారిపై కక్షగట్టినట్లుగా వ్యవహరించారు. అంతకుముందు టీడీపీ అమలు చేసిన పథకాలు, తీసుకున్న చర్యలకు సమాధి కట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన సమయానికి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఖాతాలో రూ.1850 కోట్లు ఉండేవి. కార్మికులు సహజ మరణం చెందితే కుటుంబ సభ్యులకు రూ.80 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5.20 లక్షల ఆర్థిక సాయం అందించేవారు. ఇక... కార్మికుల కుటుంబంలో ఆడ పిల్లలకు వివాహమైనప్పుడు, ప్రసవమైనప్పుడు టీడీపీ ప్రభుత్వం రూ.20 వేలు ఇచ్చేది. అయితే కార్మికుల బోర్డు నిధులను వైసీపీ సర్కారు దారి మళ్లించింది. దీంతో... మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పరిహారం అందడంలేదు.



విజయవాడ బెంజ్ సర్కిల్ నిర్మాణ కూలీలకు అడ్డా! టీడీపీ హయాంలో ఉదయం 9లోపు అడ్డా మొత్తం ఖాళీ అయ్యేది. ఎంత మంది వస్తే అంతమందికీ ఏదో ఒక పని దొరికేది. ఇప్పుడు... మధ్యాహ్నం 12 దాకా కూలీలు పనులకోసం బెంజ్ సర్కిల్ అడ్డాలో ఎదురు చూస్తూనే ఉంటున్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి గురించి చెప్పేందుకు ఈ ఉదాహరణ చాలు!

రోజుల తరబడి పస్తులు!



20 ఏళ్లకు పైగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నా. ఇసుక లేక నెలల తరబడి పనులు దొరకని దుస్థితిని నా వృత్తి జీవితంలో 2019లోనే తొలిసారి చూశా. తాపీ మేస్త్రీలతోపాటు భవన నిర్మాణ కూలీలకూ పనులు దొరకలేదు. ఓ వైపు ఇసుక కొరత, మరోవైపు కరోనా మమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొచ్చాం. పస్తులతో గడిపిన రోజులు కూడా ఉన్నాయి. కూలీలు ఏ రోజుకారోజు పనిచేసుకుని కుటుంబాన్ని పోషించుకునే వారే. ఇప్పటికీ కార్మికుల పరిస్థితి గాడిన పడలేదు.

– బి.నాగరాజు, తాపీ మేస్త్రీ, మచిలీపట్నం, కృష్ణాజిల్లా

నెలలో 15 రోజులు పని ఉండడం లేదు



ఇసుక కొరతతో పనులు లేకుండా పోయాయి. దీనికి తోడు మిషన్లు రావడంతో పనులు పూర్తిగా తగ్గిపోయాయి. గతంలో ఇంట్లో పనుల వల్లో, ఆరోగ్యం బాగోలేక వెళ్లక పోతే తప్ప పని లేదనే బాధ ఉండేది కాదు. ఇప్పుడు నెలలో 15 రోజులు కూడా పనులు ఉండటం లేదు.

– వేముల పార్వతి, కూలీ, విజయవాడ

అలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదు

"40 ఏళ్లుగా సిమెంట్ వ్యాపారంలో ఉన్నాను. 2019 నుంచి రెండేళ్ల పాటు ఎదుర్కొన్న దుస్థితిని తలచుకుంటే ఇప్పటికీ భయమేస్తోంది. 2019 మే నెల ముందు వరకు రోజుకు లారీ లోడు సిమెంట్ అమ్మేవాడిని. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇసుక కొరతతో నిర్మాణ రంగం కుదేలవడంతో వారానికి ఒక లోడుకూడా అమ్మలేకపోయాం. ఆ ప్రభావం ఇప్పటికీ వెంటాడుతోంది!'

– విజయవాడకు చెందిన సిమెంటు వ్యాపారి

ఓరి దేవుడా!



పండగొస్తే ఇంట్లో పూజలు చేస్తాం. బయట ఉన్న గుడులకు వెళతాం. కానీ... జగన్ తీరే వేరు. ఆయన ఏకంగా తన క్యాంపు కార్యాలయంలోనే గుడిని 'కట్టేశారు'. దేవుళ్లను 'రప్పించారు'! ఈ 'సంబరమంతా' మొన్న సంక్రాంతికి జరిగింది. జగన్ సతీమణి భారతి ఏనాడూ బయట గుడులకు వచ్చిందీ లేదు. వారిద్దరూ కలిసి జంటగా పూజలు చేసిందీ లేదు. కానీ... ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ సంక్రాంతికి తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో కలిసి పూజలు చేశారు. చుట్టు పక్కల గుడులే లేనట్లు దీనికోసం భారీ సెట్టింగులు వేశారు. తిరుమల ఆనంద నిలయాన్ని పోలిన సెట్టింగ్... చుట్టూ మండపాలు... ఈ హంగామా అంతా ఇంతా కాదు. విజయవాడలో, చుట్టుపక్కల ఆలయాలే లేనట్లుగా, ఇంట్లోనే 'కృతిమ' ఆలయాన్ని సృష్టించారు. దీనికోసం రూ.కోటిన్నర దాకా ఖర్చు పెట్టినట్లు తెలిసింది.





చిత్రబో!



చింటూ: పెన్షను మూడువేలు తెలుసా?
చిన్నూ: కరెంటు చార్జీలు, బస్సు చార్జీలు, పన్నులు, సర్‌చార్జీలు ఎంతెంత పెరిగాయో తెలుసా?

చింటూ: వాహన మిత్ర ఇస్తాడు తెలుసా?
చిన్నూ: పక్క రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ రేట్లు నీకు తెలుసా?

చింటూ: ఎన్నెన్నో పథకాలు! తెలుసా?
చిన్నూ: పాత పథకాలకే పేర్లుమార్చాడని నీకు తెలుసా?

చింటూ: బటన్ నొక్కుతున్నాడు కదరా?
చిన్నూ: బతుకులూ నొక్కుతున్నాడు లేరా!

చింటూ: పట్టి కోతలేనంటావా?
చిన్నూ: గట్టి వాతలు కూడా!

చింటూ: మరి.. తిప్పలూ?
చిన్నూ: అప్పులు కూడా!



సమ్‌థింగ్ స్పెషల్

రంప మన్యంలో ఎయిర్ లిఫ్టింగ్

- నక్సల్స్ సమస్యాత్మక ఏడు పోలింగ్ కేంద్రాలు
- అక్కడికి సిబ్బంది తరలింపునకు హెలికాప్టర్లు
- ఆర్మీ సాయంతో పోల్ నిర్వహణకు సన్నాహాలు



గుర్తేడులోని ఓ పోలింగ్ కేంద్రం (ఫైల్)

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సెగ్మెంట్ పరిధిలోని నక్సల్స్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని తరలించడం ఈసీకి ప్రతిసారీ సవాలే. దట్టమైన అటవీ ప్రాంతంలో, సాయంత్రం ఐదు దాటితే అంధకారంలోకి జారిపోయే ఈ ప్రాంతంలో పోలింగ్ నిర్వహణ కత్తి మీద సామే. ఈ పరిస్థితుల్లో అక్కడకు ఏటా మాదిరిగానే ఈసారీ ఎయిర్ లిఫ్టింగ్ చేపట్టాలని ఈసీ నిర్ణయించింది. అలాంటి పోలింగ్ కేంద్రాలు ఏడింటిని ఎన్నికల అధికారులు గుర్తించారు. అక్కడికి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి 14 ఈవీఎంలను, ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు ఎన్నికల యంత్రాంగం ఒకటి నుంచి రెండు హెలికాప్టర్లను వినియోగించేందుకు వీలుగా ఏర్పాట్లుచేస్తున్నారు. వాటిని ఆర్మీ సమకూర్చనుంది. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని గుర్తేడులోని 5, 7, 9, 10 నంబర్లు గల పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఇరవై ఆవాసాల్లోని 2,867 మంది ఓటర్ల కోసం, పాతకోటలోని 6వ నంబరు పోలింగ్ కేంద్రం పరిధిలోని నాలుగు ఆవాసాల్లోని 930 మంది ఓటర్ల కోసం, బొడ్డగండిలోని 8వ నంబరు పోలింగ్ కేంద్రం పరిధిలోని ఎనిమిది ఆవాసాల్లోని 647 మంది ఓటర్ల కోసం, ఇర్లవాడ (దారగడ్డ)లోని 11వ నంబరు పోలింగ్ కేంద్రం పరిధిలో ఐదు ఆవాసాల్లోని 1,101 మంది ఓటర్ల కోసం ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. మరీ సమస్యాత్మకంగా గుర్తించిన బొడ్డగండిలోని 8వ నెంబరు పోలింగ్ కేంద్రాన్ని ఏకంగా గుర్తేడుకు మారుస్తున్నారు. ఇక పాతకోట కేంద్రానికి ఈవీఎమ్‌లను, సిబ్బందిని గుర్తేడు నుంచి రోడ్డు మార్గాన తరలించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. రంపచోడవరం సబ్‌కలెక్టరు ప్రశాంతకుమార్ తాజాగా రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. ఈసీ ప్రతిపాదనను పార్టీలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించాయి.

-రంపచోడవరం

ప్రజాస్వామ్యంలో ఒక ఓటరు అవివేకం అందరి భద్రతనూ దెబ్బతీస్తుంది.



- జాన్ ఎఫ్. కెనడీ



- వైఎస్ జగన్మోహన్ రెడ్డి

అబ్బ-ఛా!

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై రాజీలేని పోరు

విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో మాది రాజీ లేని ధోరణి. ఈ సమస్యపై మొదటిసారిగా గళమెత్తింది రాష్ట్ర ప్రభుత్వమే. తొలిసారి మేమే ఈ అంశంపై ప్రధానికి లేఖ రాశాం. విశాఖ స్టీల్ ప్లాంట్ పునర్వైభవం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాం.

రాజులు, రాజ్యాల కాలం నుంచి ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రులదాకా... పాలకులు ఏదో ఒక రూపంలో ప్రజలను కలవడం, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం ఒక రివాజు! వైఎస్ రాజశేఖర రెడ్డి 'ప్రజా దర్బార్' పేరుతో ప్రజలను కలిశారు. చంద్రబాబు 'ప్రజా వేదిక' పెట్టారు. కానీ... ప్రజలను కలవడం సంగతి అటుంచి, వారిని ఆమడ దూరం పెట్టిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి! ఇప్పుడు ఎన్నికలురాగానే బస్సులో బయలుదేరి... అక్కడక్కడా 'ఐప్యాక్ అరేంజ్డ్' బాధితులు కనిపించగానే... బస్సు ఆపి, కిందికి దిగి మరీ వారి చేతుల్లోని వినతిపత్రాలు తీసుకుంటున్నారు. 'నేను ఉన్నాను... నేను విన్నాను' అని అధికారంలోకి వచ్చిన జగన్ తీరిది! ఈ ఐదేళ్లు ఎక్కడున్నారు? ఏం విన్నారు?

- ఐదేళ్లు పరదాలు, బారికేడ్ల మాటునే
- ప్రజాదర్బార్ లేదు... ప్రజా వేదికా లేదు
- జనాన్ని ఆమడ దూరంలో పెట్టిన జగన్
- ఎన్నికలు రాగానే మళ్లీ జనంలోకి
- బుల్లెట్ ప్రూఫ్ బస్సు దిగి వినతి పత్రాల స్వీకరణ
- వాటిపై చర్యలు తీసుకునేంత సీన్ ఉందా?

ఐదేళ్లూ ఎక్కడ ఉన్నావ్.. ఎప్పుడు విన్నావ్?

ఎన్నికల ప్రేమలు 2.0















పరదాలు.. పోలీసు పహారా మధ్య జగన్ పర్యటన సాగేదిలా..!

● బారికేడ్లు, పరదాలే...

బటన్ నొక్కుడు కార్యక్రమాలకు వెళ్లినప్పుడు... 'ఎంపిక చేసి, శిక్షణ ఇచ్చిన' వాళ్లను వేదికపై కలవడం తప్పితే... ఒక్కసారీ సామాన్య ప్రజలను జగన్ కలిసిందే లేదు. పైగా... ఆయన బయట అడుగు పెట్టారంటే కర్ఫ్యూ వాతావరణమే! చెట్లు కొట్టడం, బారికేడ్లు పెట్టడం, పరదాలు కట్టడం... అంతా ఆంక్షల చట్రం. పోనీ సచివాలయంలో సీఎం జగన్‌ను కలిసే అవకాశముందా అంటే.. అదీ లేదు. కేబినెట్ సమావేశాలున్నప్పుడు తప్ప జగన్ సెక్రటేరియట్ వైపు చూసిందే లేదు. ఆయన తాడేపల్లి ప్యాలెస్‌కే పరివితం. ఆ దరిదాపులకు సామాన్యులు వచ్చే అవకాశమే లేదు. కృష్ణా నది కరకట్టపై ఉన్న పేద ప్రజలను అక్కడి నుంచి తరిమేశారు. వెరసి... సామాన్య ప్రజలు సీఎంకు తమ గోడు విన్నవించుకునే ఆస్కారమే లేకుండా పోయింది! ఒక దశలో తండ్రి వైఎస్ లాగానే జగన్ కూడా 'ప్రజా దర్బార్' నిర్వహిస్తారంటూ ఒక ప్రకటన వెలువడింది. 'రచ్చబండ'లో కూడా పాల్గొంటారని ప్రచారం చేశారు. తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయానికి సమీపంలో గత ఏడాది ప్రజాదర్బార్ వేదికను కూడా ఏర్పాటు చేశారు. కానీ... దాని తలుపులు మాత్రం తెరుచుకోలేదు.

● ఎన్నికలు రాగానే...

సార్వత్రిక ఎన్నికలు రాగానే 'పరదాల' నుంచి ముఖ్యమంత్రి జగన్ బయటికి వచ్చేశారు. బస్సుయాత్ర చేపట్టారు. అంతే... మరోసారి జగన్ మార్కు 'పలకరింపులు' మొదలయ్యాయి. ముద్దులు, బుగ్గలు నిమరడం, నెత్తిమీద ఎడమ చెయ్యి వేసి ఆశీర్వదించడం.. ఇలా బస్సు యాత్రలో కరుణ రసాత్మక నాటకాలు ప్రదర్శిస్తున్నారు. అంతకుముందు సమస్యలు చెప్పుకొనేందుకు జనం రోడ్డుపక్కన నిలబడినా పట్టించుకోకుండా ముందుకెళ్లిన జగన్... ఇప్పుడు టకీమని బస్సును ఆపి, ఫుట్‌బోర్డుపై కూర్చుని, నాటకీయంగా పలకరిస్తూ, వినతిపత్రాలు స్వీకరిస్తున్నారు. అదేం చిత్రమో కానీ.. ఒకరోజు వికలాంగులు, ఇంకో రోజు మైనారిటీ మహిళ, మరో రోజు వృద్ధుడు ఇలా బాధితులు ఒక స్కీమ్ ప్రకారం మారుతున్నారు. ఇవి కూడా ఐప్యాక్ అరేంజ్డ్ పరామర్శలనే అనుమానాలూ ఉన్నాయి. ఇంతకీ.. ఎన్నికల ముందు ఈ ఆపద్ధర్మ ముఖ్యమంత్రి తీసుకుంటున్న వినతిపత్రాలు ఏమవుతున్నాయి? వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? 'కోడ్' ఉండగా ఏమైనా చర్యలు తీసుకునే అవకాశముందా? ఉత్తుత్తినే కాగితాలు తీసుకుంటున్నారా? ఈ ప్రశ్నలేవీ అడగొద్దు! ఎందుకో మీకూ తెలుసు!

- అమరావతి, ఆంధ్రజ్యోతి

నోట్ దిస్ పాయింట్!





12 — 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి వైసీపీ అభ్యర్థి ఆళ్ల రామకృష్ణారెడ్డికి వచ్చిన మెజారిటీ ఇది.

25 — 2019 ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ వైసీపీ అభ్యర్థి మల్లాది విష్ణుకు వచ్చిన మెజారిటీ ఇది

నా ఓటు నాకే..

అదే నా చిరకాల కోరిక

నిప్పట్లు విక్రయించే ఉమాదేవి ఎమ్మెల్యేగా నామినేషన్



పిండి వంటలు చేస్తూ..

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా వీధుల్లోని హోటళ్లలో దోశలు, బజ్జీలు వేయడం, టీ తయారు చేయడం వంటివి చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తుంటారు. 'మీ ఓటు నాకే వేయాలి' అని కోరుతుంటారు. అయితే.. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం సుభాష్‌రోడ్డు వీధిలోని వెలవలూరి ఉమాదేవి (64) కాస్త భిన్నం. చిన్న హోటల్‌లో నిప్పట్లు (అత్తిరాసాలు) వేసి విక్రయించే ఉమాదేవి.. మాత్రం తన ఓటు తనకే వేసుకోవాలనే కోరికతో ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. దీనికోసం రూ.10 వేలు డిపాజిట్ కట్టి మదనపల్లె ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఆమె ఇలా నామినేషన్ వేయడం ఇది వరుసగా మూడోసారి. కనీసం ఐదో తరగతి కూడా చదవని ఉమాదేవి తన కష్టార్జితంతో బిడ్డలకు పెళ్లిళ్లు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటు తనకే వేసుకోవాలనేది ఆమె చిరకాల కోరిక. స్నేహితులు, బిడ్డల ప్రోత్సాహంతో 2014 ఎన్నికల్లో మదనపల్లెలో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసిన ఉమాదేవికి 170 ఓట్లు పడ్డాయి. 2019 ఎన్నికల్లో కూడా నామినేషన్ వేశారు. అయితే నామినేషన్ పత్రంలో తప్పులు ఉండటంతో రిజెక్ట్ చేశారు. 2024 ఎన్నికల్లో కూడా ఉమాదేవి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సారి తన నామినేషన్ రిజెక్ట్ కాకుండా లాయర్ ద్వారా నాలుగు సెట్ల పత్రాలు పూర్తి చేయించారు. సోమవారం ఒక సెట్టు నామినేషన్ పత్రాలు దాఖలు చేయగా, మరో మూడు సెట్లు బుధవారం ఇవ్వనున్నారు.

- మదనపల్లె టౌన్



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందిస్తున్న ఉమాదేవి

రెక్కలు.. ముక్కలు



- ఐదేళ్లూ.. ఆగిన గన్నవరం ఎయిర్‌పోర్టు అభివృద్ధి
- అంతర్జాతీయ సర్వీసులు లేవు.. ప్రయాణికులూ తగ్గారు
- టీడీపీ హయాంలో మిలియన్ మార్క్‌కు వృద్ధి
- ఇప్పటికీ డిమాండ్ ఉన్నా నడపలేని దుస్థితి
- ఐదేళ్లయినా శాశ్వత టెర్మినల్ పూర్తికాని వైనం
- నిర్వాసితులపై జగన్ సర్కారు నిర్దయ
- అద్దె కట్టడం లేదు.. కౌలూ ఇవ్వడం లేదు

భూములిచ్చిన రైతులపై కర్కశం

విమానాశ్రయ అభివృద్ధికి భూములిచ్చిన రైతుల పట్ల, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల పట్ల వైసీపీ ప్రభుత్వం కాఠిన్యం చూపింది. భూసమీకరణలో భూములు అప్పగించిన వారిలో చాలామందికి అమరావతిలో ఇప్పటికీ రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వలేదు. రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చిన వారికి వార్షిక కౌలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. కౌలు అందని, రిటర్నబుల్ ప్లాట్లూ రాని రైతులు తమ భూములను మళ్లీ సాగు చేసుకుంటున్నారు. విమానాశ్రయ నిర్వాసితులైన 400 మందికి టీడీపీ ప్రభుత్వం చిన్న అవుటపల్లిలో 48 ఎకరాల భూములు కొని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా లే అవుట్ వేసి, మౌలిక సదుపాయాలు కల్పించారు. మోడల్ ఇళ్లు కట్టేందుకు డిజైన్లు వేయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక డబ్బులిస్తాం మీరే ఇళ్లు కట్టుకోమని చెప్పింది. ఇందుకు రెండు విడతల్లో రూ.9 లక్షలు ఇస్తామని చెప్పింది. దీనిపై ఉత్తుత్తి జీవోలను ఇచ్చింది. దీంతో నిర్వాసితులు ఇప్పటికీ అద్దె ఇళ్లలో ఉంటున్నారు.

వెంకయ్య సూచనతో..

నవ్యాంధ్రకు అమరావతిని రాజధానిగా ప్రకటించిన తర్వాత అక్కడే గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం కట్టాలని చంద్రబాబు భావించారు. అయితే, అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు...కొత్త విమానాశ్రయం నిర్మించే కంటే విజయవాడ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సూచనను పరిగణనలోకి తీసుకుని, విమానాశ్రయ అభివృద్ధిపై చంద్రబాబు దృష్టి సారించారు. రాష్ట్ర విభజనకు ముందే విజయవాడ విమానాశ్రయాన్ని విస్తరించటానికి ఎయిర్‌పోర్టు అథారిటీ ప్రణాళికను రూపొందించుకుంది. దీనికి ఐదొందల ఎకరాలకు పైగా భూములు కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్, ఆతర్వాత వచ్చిన రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి కూడా దీనిని పట్టించుకోలేదు.



(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

నవ్యాంధ్ర రాజధాని అమరావతికి తలమానికంగా నిలిచిన విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం భవిష్యత్తును వైసీపీ ప్రభుత్వం కాలరాసింది! టీడీపీ ప్రభుత్వం చూపించిన శ్రద్ధతో ఎయిర్‌పోర్టు కొత్త రెక్కలు తొడుక్కుంది. నవ్యరూపం సంతరించుకుని అంతర్జాతీయ సర్వీసులను ఆకర్షించింది. జగన్ ప్రభుత్వం దీనికి రివర్స్‌లో విమానం రెక్కలు విరిచేసింది.

● నాటి విమానాల మోత ఇప్పుడేది ?

టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ విమానాశ్రయం నుంచి దేశీయంగా మొత్తం 54 విమాన సర్వీసులు నడిచేవి. ప్రస్తుతం 38 విమానాలు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ విమానాలు కూడా ఎటొచ్చీ ఒక ఏడాది కాలంగానే! అంతకుముందు అయితే డజనులోపే విమానాలు నడిచాయి. దాదాపుగా విజయవాడ నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులనేవి ఇప్పుడు లేవు. శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగు పనులు అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాతగానీ ప్రారంభించలేదు. ఇప్పటికీ సగం పనులు కూడా కాలేదు.

● అప్పట్లో శరవేగంగా..

రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం విమానాశ్రయ అభివృద్ధికి 700 ఎకరాల భూములను సమీకరించింది. కేవలం 6 నెలల్లో 700 ఎకరాలను సమీకరించి 'ఏఏఐ'కు అప్పగించటంతో విస్తరణకు శ్రీకారం జరిగింది. మాస్టర్ ప్లాన్ రూపుదిద్దుకుంది. ముందుగా ఇంటీరియం టెర్మినల్ బిల్డింగ్, రన్‌వే విస్తరణ, ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్, నైట్ ల్యాండింగ్, పాత విమానాశ్రయ టెర్మినల్ బిల్డింగ్ ఆధునీకరణ వంటి అనేక పనులు జరిగాయి. రాజధానికి వచ్చే వారితో విజయవాడ ఎయిర్‌పోర్టుకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇంటీరియం టెర్మినల్ బిల్డింగ్ ప్రారంభోత్సవానికి ఏడాది పట్టింది. శాశ్వత ప్రాతిపదికన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మించాల్సిందిగా చంద్రబాబు కోరటంతో ఏఏఐ అధికారులు ఓకే చెప్పారు. ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌ను 15 ఏళ్ల తర్వాత నిర్మించాల్సి ఉండగా, అనూహ్యంగా పెరిగిన వృద్ధి కారణంగా వెంటనే రెండో టెర్మినల్ బిల్డింగ్‌కు శ్రీకారం చుట్టారు. ఎన్నికల ముందే ఈ బిల్డింగ్ పనులకు శంకుస్థాపన జరిగింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో విమానాశ్రయం వృద్ధి చూస్తే కళ్లు తిరగాల్సిందే! దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసుల పెంపుదల వంటి అనేక చర్యలు చేపట్టడం ద్వారా 2017-18లో 10 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఇది ఆల్ టైమ్ రికార్డు! ఈవిధంగా టీడీపీ ప్రభుత్వం దీనికి అంతర్జాతీయ హోదాను సాధించి పెట్టింది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం స్థాయి పెరిగిన తర్వాత బైలేట్రల్ ట్రాఫిక్ రైట్స్ లేనప్పటికీ విజయవాడ నుంచి సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసును వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ విధానంలో నడపటానికి సహకరించింది. ఈ క్రమంలో ఎన్నికలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం విమానాశ్రయాభివృద్ధిని గాలికొదిలేసింది.

టీడీపీ హయాంలో చురుగ్గా సాగిన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులు వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇలా నిలిచిపోయాయి.



మీది ప్రచారం.. మాది వ్యాపారం!



ఒకరిది ప్రచార ఆర్భాటం... మరొకరికి ఆకలి తీరే మార్గం. ఎన్నికల ప్రచార హోరులో రంగు రంగుల బెలూన్లకు భారీ గిరాకీ ఏర్పడింది. దాంతో ఏ పార్టీ ప్రచారం సాగుతుంటే ఆ పార్టీ రంగు బెలూన్లు విక్రయిస్తూ చిరు వ్యాపారులు ఉపాధి పొందుతున్నారు. విజయనగరంలో టీడీపీ ప్రచార కార్యక్రమంలో పసుపు బెలూన్ల విక్రయిస్తున్న చిరు వ్యాపారి గ్యాస్ సిలిండర్‌ను కూడా తనతో తీసుకొచ్చి అప్పటికప్పుడు బెలూన్లు సిద్ధం చేసి ఇస్తున్నారు.

సై సై.. జోడెడ్ల బండి..!

కారులు, బస్సులు, హెలికాప్టర్లు, విమానాల్లో సాగిపోతున్న ఎన్నికల ప్రచార హోరులో ఓ జోడెడ్ల బండి కనిపించింది. భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి బాలరామాంజినేయులు మంగళవారం ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిపై.. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్ వేసేందుకు వచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న ఆయన.. కర్ణాటక నాగేపల్లి సర్కిల్ నుంచి పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వరకు డప్పుల వాయిద్యాలతో ఎడ్లబండిపై ర్యాలీగా వచ్చారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో భాగ్యరేఖకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

- పుట్టపర్తి





వైసీపీ సోషల్ మీడియా విభాగంతో సమావేశమైన జగన్

ఏమని చెప్పను షెల్లెమ్మా!

- వ్యాపారవేత్తగా తన ప్రస్థానంపై జగన్ మౌనం
- యువతి ప్రశ్నకు దిక్కులు చూసిన ముఖ్యమంత్రి
- సజ్జల భార్గవ కల్పించుకుని సొంత సమాధానం
- ఇంటర్నెట్‌లో చూసి తెలుసుకోవాలని సలహా

(విశాఖపట్నం/అమరావతి - ఆంధ్రజ్యోతి)

"సర్.. మీరు పొలిటీషియన్ అవకముందు ఒక మంచి వ్యాపారవేత్త! ఇవన్నీ ఎలా హ్యాండిల్ చేస్తున్నారు? యువత మీలా అంత్రప్రెన్యూర్ కావడానికి ఏవైనా సలహాలు ఇస్తారా?"... విశాఖలో ఒక యువతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని అడిగిన ప్రశ్న ఇది! దీనికి సమాధానం చెప్పలేక ఆయన సతమతమయ్యారు. తనదైన మార్కు నవ్వులు చిందిస్తూ.. వేదికపైన ఉత్తర దక్షిణాలు చూశారు! 'ఏమని చెప్పను చెల్లెమ్మా!' అన్నట్లుగా మౌనం వహించారు! మంగళవారం విశాఖపట్నం ఆనందపురంలోని ఒక కన్వెన్షన్ హాలులో వైసీపీ సోషల్ మీడియా విభాగంతో జగన్ సమావేశమయ్యారు. ఒక యువతి 'మీలాగా మంచి అంత్రప్రెన్యూర్ అయ్యేందుకు యూత్‌కు సలహాలు ఇవ్వండి' అని అడిగారు. అర్థమైనా కానట్టు జగన్ మొహం పెట్టగా.. వైసీపీ సోషల్ మీడియా సారథి సజ్జల భార్గవ రెడ్డి... ఆ యువతి తెలుగులో అడిగిన ప్రశ్నకు కొంత ఇంగ్లీషు కలిపి వివరించారు. కానీ.. జగన్ దీనికి బదులివ్వకుండా నవ్వుతూ దిక్కులు చూశారు. దీంతో... సజ్జల భార్గవరెడ్డి తన 'సమయస్ఫూర్తి' ప్రదర్శించారు. "సీఎం గారి తరఫున నేనే బదులిస్తాను. ఆయన రాజకీయ ప్రస్థానం ఎంత ఇన్‌స్పైరింగో... అంత్రప్రెన్యూర్ జర్నీ కూడా అంతే ఇన్‌స్పైరింగ్. ఇంటర్నెట్‌లో చూడండి! ఆయన జీవితం ఒక పాఠంలాంటిది' అన్నారు.

ఇంటర్నెట్‌లో ఏం చూడాలబ్బా!

వ్యాపారవేత్తగా జగన్ జర్నీ ఎప్పుడు మొదలైనా... ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎం అయ్యాకే అది 'ట్రాక్‌లో పడింది. అంతకుముందు ఆయన కర్ణాటకలో 'సండూర్ పవర్' అనే మూతపడిన విద్యుత్ ప్రాజెక్టును కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో చిన్నాచితక జల విద్యుత్ ప్రాజెక్టులు కూడా ఉన్నాయని అంటారు. అంతకుమించి జగన్ చేసిన వ్యాపారాలేమిటో ఎవరికీ తెలియదు. కానీ... వైఎస్ సీఎం కాగానే సీన్ మారిపోయింది. జగన్ అనేక కంపెనీలు ఏర్పాటు చేశారు. ముడుపులే పెట్టుబడులుగా చకచకా ఎదిగారు. 'క్విడ్‌ప్రోకోయే ఆయన సీక్రెట్ ఆఫ్ సక్సెస్' అని సీబీఐ, ఈడీ తేల్చేశాయి. 'జగన్ జీవిత పాఠాల నుంచి యువత చాలా నేర్చుకోవాలి' అని సజ్జల భార్గవ రెడ్డి చెప్పడం, ఇంటర్నెట్‌లో చూసి తెలుసుకోవాలనడం మొత్తం ఎపిసోడ్‌కే హైలైట్! ఆయన చెప్పినట్లు జగన్ గురించి ఇంటర్నెట్‌లో చూస్తే సీబీఐ చార్జిషీట్లు, క్విడ్‌ప్రోకో కథలే కనిపిస్తాయి!

డ్వాక్రాలకు 10 లక్షలు


ఆముదాలవలసలో మంగళవారం నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన జనం, చంద్రబాబు అభివాదం

ప్రజాస్వామ్యంలో ఉద్యోగులూ భాగస్వాములే. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, పెన్షనర్ల బకాయిలను క్లియర్ చేసే బాధ్యత నాది. ఒకటో తారీఖున జీతం, పెన్షన్ ఇస్తా. పీఆర్సీని ముందుకు తీసుకెళ్తాం.

జగన్ తెచ్చిన రూ.13 లక్షల కోట్ల అప్పు ఎవరు కడతారు? రేపు ఓడిపోతే ఆయన ఉంటాడా? ప్రజలే పన్నుల రూపంలో చెల్లించాలి. ఒక్కో కుటుంబంపై రూ.10 లక్షల అప్పు ఉంది. - చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

పాతపట్నం, ఆమదాలవలసల్లో భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గంలో బొండపల్లిలో నిర్వహించిన మహిళాగళంలోనూ మాట్లాడారు. ఆమదాలవలస సభ చివరిలో 'సైకో పోవాలి.. సైకిల్ రావాలి' పాటకు జనంతో కలిసి చంద్రబాబు చేతులు కలిపి స్టెప్పులు వేయడం విశేషం. భవిష్యత్ గ్యారంటీ విధానంలో కూడా మహిళలకు ప్రధాన భూమిక ఉండేలా చూస్తానని.. వారిని శక్తిమంతులను చేసి రాష్ట్రాభివృద్ధిలో వారి పాత్ర పెంచుతానని ఆయన తన ప్రసంగాల్లో హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు తీసుకొచ్చింది టీడీపీయేనని గుర్తు చేశారు. మహాశక్తి ద్వారా 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తాం. ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున.. ఐదేళ్లలో రూ.90 వేలు ఇస్తాం. ఆ 90 వేలను రూ.9 లక్షలు చేసే బాధ్యత నాది' అని చెప్పారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామని.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. పింఛన్‌ను రూ.4 వేలకు పెంచి ఏప్రిల్ నుంచే ఇస్తానని పునరుద్ఘాటించారు. ఇంకా ఏమన్నారంటే..

మహిళల్లో అంకితభావం..

జనాభాలో సగం ఉన్న అక్క చెల్లెమ్మలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం ఉండాలి. వారిలో అంకితభావంతో పనిచేసే తత్వం ఉంటుంది. అందుచేతనే టీడీపీ హయాంలో రేషన్ కార్డు మొదలుకొని ఏ సంక్షేమ కార్యక్రమం చేపట్టినా మహిళల పేరుమీదే పంపిణీ చేశాం. ఆస్తి హక్కులో మగవారితో సమానంగా మహిళలకు హక్కులు కల్పించినది ఎన్టీఆర్. డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేశా. ఈ గ్రూపుల సభ్యులను అప్పట్లో గ్రామాల్లో హేళన చేసేవారు. ఇప్పుడు వారు ఆర్థికంగా ఎదిగి బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా వివిధ వ్యాపారాలు చేస్తున్నారు. వీరిపై నమ్మకంతోనే ఇసుక రీచ్‌లను కూడా అప్పగించాం. వారి ద్వారా మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయించి వారిని ఆర్థికంగా లక్షాధికారులను చేస్తాం. వివాహ వయస్సు వచ్చినప్పుడు తల్లిదండ్రులకు ఆడబిడ్డ భారం కాకూడదని భావించి బాలికా సంరక్షణ పథకాన్ని అమలు చేశాం. మళ్లీ ఇటువంటి మెరుగైన పథకాన్ని తీసుకొస్తాం. సంపద కొందరికే పరిమితం కారాదు. టాటా, అదానీ, రిలయన్స్ వారే వ్యాపారవేత్తలు కాదు. వ్యాపారంలో మహిళామణులు నిలదొక్కుకునేలా కార్యక్రమాలు తీసుకొస్తాం. మరెన్నో వినూత్న పథకాలు అమలు చేసి, మహిళా శక్తిని ఇనుమడింపజేస్తాం.

స్వేచ్ఛ లేదు..

జగన్ ప్రభుత్వంలో మద్యాన్ని డోర్ డెలివరీ చేసి ఆడపిల్లల తాళ్లు తెంచుతున్నారు. సైకో పాలనలో మహిళలకు రక్షణ కరువైంది. స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం కోల్పోయారు. జగన్ ఊరికో గొడ్డలి ఇచ్చి అరాచకాలు అలవాటు చేస్తున్నాడు. చెల్లెలికి ఆస్తి ఇవ్వకుండా అప్పు ఇచ్చిన వ్యక్తి. ప్రశాంతంగా ఉండే ఉత్తరాంధ్రను గంజాయి రాజధానిగా చేశాడు. జె బ్రాండ్ చీప్ లిక్కర్‌ను విక్రయించి మరణాలకు కారణం అవుతున్నాడు. గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా సరఫరా జరుగుతోంది. ఉపాధి ఉద్యోగాలు కల్పించడం లేదు సరికదా.. పిల్లలను మద్యం, మత్తు పదార్థాలకు బానిసలను చేస్తున్నాడు.

బాదుడు లేకుండా చేస్తాం..

ప్రజలపై పన్నుల బాదుడు లేకుండా చేస్తాం. చెత్త పన్ను రద్దుచేస్తాం. ఇంటిపన్నులు నియంత్రిస్తాం. నిత్యావసరాల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించి ఆదుకుంటాం. జలగ జగన్.. మద్యపాన నిషేధం చేస్తామని చెప్పాడు.. చేశాడా..? కానీ మందుబాబులకు ఇప్పుడు మద్యం ధర రూ. 200పైబడి పెంచారు. ఐదేళ్లలో తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచారు. టీడీపీ హయాంలో రూ.200 కరెంటు బిల్లు ఇప్పుడు రూ.వెయ్యి అయింది.

ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలిస్తాం

ఏడాదికి 4 లక్షలు ఉద్యోగాలు.. ఐదేళ్లలో 20 లక్షలు ఉద్యోగాలు ఇస్తాం. మీరు విదేశాలకు పోనక్కర్లేదు. ఇక్కడే కూర్చుని వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పిస్తాం. ప్రభుత్వ ఉద్యోగాలిస్తాం. పెట్టుబడులు తెస్తాం. అధికారంలోకి వచ్చాక తొలిసంతకం డీఎస్సీపైనే. నేను 14 ఏళ్లలో ఎనిమిది సార్లు డీఎస్సీ పెట్టాను. ఉద్యోగాలివ్వడమే నాకు తెలుసు. గంజాయి తేవడం జగన్‌కు తెలుసు. 19 రోజులు ఉంది. అందరూ సైకిలెక్కి. టీడీపీ, బీజేపీ, జనసేన జెండాలు పట్టుకోండి. గాజు గ్లాసులో టీ తాగండి. ఎవరైనా ఎదురొస్తే సైకిల్ స్పీడ్ పెంచండి. కమలం పువ్వు సైకిల్‌కు పెట్టుకోండి. ఐదేళ్లలో మీరు ఊహించని విధంగా అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటా.

మే 1న ఇంటి వద్దే పింఛన్ ఇవ్వాలి..

సైకో జగన్‌ను డిమాండ్ చేస్తున్నా. మే ఒకటో తేదీన ఇంటివద్దే పింఛన్ ఇవ్వాలి. శవరాజకీయాలు చేయొద్దు.. జగన్.. ఉత్తరాంధ్రకు ఒక్క పరిశ్రమైనా తెచ్చావా? ఒక్క ప్రాజెక్టునూ పూర్తిచేయలేదు. బస్సుయాత్ర విడిచిపెట్టి ప్రజల్లోకి రా. ఉత్తరాంధ్రకు ఈ ఐదేళ్లలో ఏం చేశావో చెప్పుకోగలవా? మా హయాంలో రూ.2 వేల కోట్లు ఖర్చుచేశాం.

నిజజీవితంలోనూ పవన్ హీరోయే..

పవన్ కల్యాణ్‌కు.. జగన్‌కూ పోలిక ఉందా? జగన్ నెత్తిన రూపాయిపెట్టి వేలం వేస్తే కొనేవాడు కూడా లేడు. ప్రజాజీవితంలో నిజమైన హీరో పవన్. చిరంజీవిని, రాజమౌళిని అవమానించేంతగా జగన్‌కు ఒళ్లంతా కొవ్వుపట్టేసింది. ఈ కొవ్వును కరిగించాల్సిన బాధ్యత ప్రజలదే. రాష్ట్రంలో ఎక్కడ చూసినా శ్రీకాకుళం జిల్లావారే.. వీళ్లందరూ వలసలు వెళ్లిపోతున్నారు. ఇక్కడి పిల్లలు మట్టిలో మాణిక్యాలు. మంచి ఇంజనీరింగ్ కళాశాలలు, మెడికల్ కళాశాలలు, ఐటీ కళాశాలలు పెట్టి చదివించుకుంటే ఇక్కడే చదువుకుని జీవితాలు బాగుచేసుకుంటారు. జగన్ చేసిన విధ్వంసం చూశారు. రాష్ట్రం నష్టపోయింది. ప్రజలు కూడా వ్యక్తిగతంగా నష్టపోయారు. నాకేం రాజకీయాలు కొత్తకాదు. 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా. 14 ఏళ్లు సీఎంగా ఉన్నా. ఇప్పుడు రాష్ట్రం నష్టపోయింది. పాలన గాడి తప్పిపోయింది. నేను సీఎం పదవికోసం రాలేదు. ఈ రాష్ట్రాన్ని కాపాడుకోవాలి. ఇక్కడి పిల్లల భవిష్యత్ బంగారం కావాలి.

సీమ నేతలకు బీ-ఫారాలు

శృంగవరపుకోట, ఏప్రిల్ 23: విజయనగరం జిల్లా శృంగవరపుకోట రిసార్ట్‌లో చంద్రబాబును కొందరు రాయలసీమ టీడీపీ అభ్యర్థులు కలిశారు. ఆయన నుంచి పరిటాల సునీత (రాప్తాడు), పయ్యావుల కేశవ్ (ఉరవకొండ), అమరనాథ్‌రెడ్డి (పలమనేరు) బీ ఫారాలు అందుకున్నారు. ఇటీవల మంగళగిరి పార్టీ కార్యాలయంలో బి.ఫారాలు అందించించిన సమయంలో వీరు హాజరు కాకపోవడంతో ఇక్కడకు వచ్చి తీసుకున్నట్లు తెలిసింది. కాగా, కుప్పంలో తన నామినేషన్ అఫిడవిట్‌కు సంబంధించి చంద్రబాబు మంగళవారమిక్కడ గజపతినగరం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ కోర్టులో ప్రమాణం చేశారు. ఉదయం 11.45 గంటలకు కోర్టుకు చేరుకున్న ఆయన న్యాయాధికారి బి.కనకలక్ష్మి సమక్షంలో ప్రమాణం చేసి ఆ పత్రాన్ని సమర్పించారు.

జగన్ విధ్వంసంతో 30ఏళ్లు వెనక్కి

- అయనకు మరో చాన్స్ ఇస్తే అంధకారమే
- చంద్రబాబుతోనే రాష్ట్రం తిరిగి గాడిలోకి: లోకేశ్



మంగళగిరి, ఏప్రిల్ 23: జగన్ అయిదేళ్ల అస్తవ్యస్త పాలనతో గాడి తప్పిన రాష్ట్ర భవిష్యత్తును విజనరీ లీడర్ చంద్రబాబు తిరిగి గాడిలో పెడతారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. మంగళవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉన్న కొండపనేని టౌన్‌షిప్ వాసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ విధ్వంసక విధానాల కారణంగా రాష్ట్రం 30ఏళ్ల పాటు వెనుకబడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీకి రాజధాని ఏదో కూడా చెప్పుకోలేని దుస్థితికి జగన్ దిగజార్చారని మండిపడ్డారు. ఈ దీనస్థితి నుంచి ఏపీని గట్టెక్కించడం ఒక్క చంద్రబాబుకే సాధ్యమనే విషయాన్ని ప్రజలందరూ ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారని తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చేశారని ఆరోపించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీని ప్రక్షాళన చేసి పేదలకు మెరుగైన వైద్యాన్ని అందజేస్తామని లోకేశ్ భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో జగన్ మరోమారు అధికారంలోకి వస్తే అంధకారం రాజ్యమేలుతుందని హెచ్చరించారు. చేనేత కేంద్రమైన మంగళగిరిలో మగ్గాల సంఖ్యను 5వేలకు పెంచి ఈ ప్రాంతానికి గత వైభవాన్ని కచ్చితంగా తీసుకొస్తామని తెలిపారు.

నేటితో ముగియనున్న జగన్ యాత్ర

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ బస్సు యాత్ర శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో బుధవారం ముగియనుంది. గత నెల 27న కడప జిల్లా ప్రొద్దుటూరులో మొదలైన బస్సు యాత్ర మంగళవారం 21వ రోజుకు చేరుకుంది. సాయంత్రం వరకు విజయనగరం జిల్లాలో పర్యటన సాగించి, రాత్రికి శ్రీకాకుళం జిల్లాలోకి ఆయన ప్రవేశించారు. ఎచ్చెర్ల నియోజకవర్గం అక్కివలసలో బస చేశారు. టెక్కలిలోని అక్కవరం ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే 'మేమంతా సిద్ధం' ముగింపు సభలో జగన్ పాల్గొంటారు. అధికార పార్టీ నాయకులు వాహనాల పార్కింగ్ కోసం సమీపంలోని పొలాల గట్లను యంత్రాలతో తొలగించారు. దీనిపై శ్యామసుందరాపురం తదితర గ్రామాల రైతులు నిరసన తెలిపారు. కాగా, 25న పులివెందులలో జగన్ నామినేషన్ వేస్తారు. 26 లేక 27వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా బహిరంగ సభలు నిర్వహించాలని జగన్ భావిస్తున్నారు.

పాడైన వ్యవస్థను సరిచేయగలిగేది చంద్రబాబే

- కోస్తాలో విజయం రాయలసీమలోనూ రావాలి: రఘురామ

రేణిగుంట/తిరుపతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో పాడైపోయిన వ్యవస్థలను సరిచేయగలిగే నాయకుడు చంద్రబాబేనని ఎంపీ రఘురామకృష్ణరాజు చెప్పారు. నామినేషన్ వేసిన సందర్భంగా శ్రీవారి దర్శనార్థం మంగళవారం సాయంత్రం ఆయన తిరుపతి వచ్చారు. ఈ సందర్భంగా చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నానీ ఇంటి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా ఎవరి ఆస్తి వాళ్ల దగ్గర ఉంటుందనే నమ్మకం లేదన్నారు. లిటిగేషన్ పెట్టి బలవంతులైన వాళ్లే తీసుకోవచ్చన్నారు. దీనిపై కోర్టుకు వెళ్లాలంటే జీవితకాలం సరిపోదన్నారు. 'రాజకీయంగా నెలరోజులుగా విపరీతమైన ఒడిదుడుకులు వచ్చినప్పుడు ఎవడైతే నాకు సీటు రాకుండా ప్రభావితం చేయగలిగాడో వాడి ముందు, వాడి అనుచరుల ముందు తలెత్తుకునేలా చేసింది చంద్రబాబే. అయనకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా' అని రఘురామ అన్నారు. చంద్రబాబు భారీ మెజార్టీతో గెలవాలని స్వామిని కోరుకోవడం కోసం తిరుమలకు వచ్చానన్నారు. కోస్తాలో కూటమికి ఉన్న విజయం రాయలసీమలోనూ రావాలన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందని రఘురామ చెప్పారు.

ఊరికి ఉపకారియట!

- రైతు బాంధవున్ని అన్నట్టు బిల్డప్
- ధాన్యంపై గద్దల్లా దళారులు
- కానీ, వారితోనే రైతులకు 'మద్దతు' అట!
- విజయనగరం బస్సుయాత్రలో సీఎం జగన్ అబద్ధాల తీరు ఇదీ



విశాఖ పరిధిలో చంద్రంపాలెం వద్ద రోడ్డు పక్కన నిల్చున్నవారికి నమస్కారం చేస్తున్న సీఎం జగన్

విజయనగరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కళ్లు ఆర్పకుండా అబద్ధాలాడే కళను విజయనగరం జిల్లా పర్యటనలో సైతం సీఎం జగన్ ప్రదర్శించారు. 130 సార్లు బటన్ నొక్కానని సీఎం అన్నప్పుడు, తమకు ఇంకా రూ.18,750 పడలేదని కొంతమంది పెద్దగా అరవడం వినిపించింది. మంగళవారం సాయంత్రం విజయనగరం జిల్లాలోకి జగన్ బస్సు యాత్ర ప్రవేశించింది. చెల్లూరు వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో జగన్ మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని ఏకరువు పెట్టారు. నిజానికి, గ్రామాలు అభివృద్ధి చెందకుండా చేసిన ఘనత జగన్‌దే. పంచాయతీలకు మంజూరైన నిధులు, కేంద్రం అందించే నిధులు సైతం పక్కదారి పట్టించి గ్రామాలు అభివృద్ధికి నోచుకోకుండా చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు వంటి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు విలువ లేకుండా చేశారు. కానీ తమ హయాంలో గ్రామాభివృద్ధి పరుగులు తీస్తోందంటూ అబద్ధాలు వల్లించారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు పెట్టామనీ, రైతులకు భారీగా సంక్షేమ పథకాలు అమలు చేశామని చెప్పుకొచ్చారు. అయితే.. రైతులకు అందించాల్సిన వైఎస్సార్ జలసిరి, సూక్ష్మవ్యవసాయ రాయితీలు, యాంత్రీకరణ రాయితీలు ఎత్తివేసిన విషయం కావాలనే విస్మరించారు. రైతులు పండించే ధాన్యం కొనుగోలు బాధ్యతను దళారులకే అప్పగించి మద్దతు ధర కల్పించామనేది మరో అబద్ధం. కానీ, ఆరుకిలోలు అదనంగా దళారులు తూకం వేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. తమ హయాంలో పక్కా ఇళ్లను నిర్మించినట్టు చెప్పుకొచ్చారు. కానీ జగనన్న కాలనీల్లో ఎక్కడ చూసినా మొండి గోడలు, ఖాళీ స్థలాలే కన్పిస్తున్నాయి. జగన్ తమ అభ్యర్థులను పరిచయం చేస్తూ సౌమ్యులు.. మంచివారు.. మనస్సు వెన్న... అంటూ సంబోధించారు. జిల్లాలో భూ కుంభకోణాలు, ఇసుక మాఫియా, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నవారిని ఆయన పరిచయం చేసిన తీరు సభికులను విస్మయపరిచింది. స్థానిక సమస్యలు ఒక్కటీ ప్రస్తావించకపోవడంతో స్థానికులు నిరాశ చెందారు. జగన్ సభ కోసం వందలాది ఆర్టీసీ బస్సులు తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జగన్‌కు మరో షాక్!

(మొదటి పేజీ తరువాయి)


బాధ్యతలు అప్పగించి... రిలీవ్ కావాలని ఆదేశించింది. కోడ్ వెలువడిన తర్వాత ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఆరుగురు ఐపీఎస్‌లు, ముగ్గురు ఐఏఎస్‌లను పక్కకు తప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు... మరో ఇద్దరు ఐపీఎస్‌లపై బదిలీ వేటు వేయడం, అందులోనూ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులునే పక్కన పెట్టడం జగన్‌కు పెద్ద షాక్ అని ఐపీఎస్ వర్గాలు చెబుతున్నాయి. పీఎస్సార్, కాంతిరాణాపై అందిన ఫిర్యాదులను పరిశీలించి, వారిపై ఆరోపణలను ధ్రువీకరించుకున్న తర్వాతే ఈసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఎవరీ పీఎస్సార్?



పీఎస్సార్ ఆంజనేయులు పేరుకే ఇంటెలిజెన్స్ చీఫ్! కానీ... మొత్తం పోలీసు యంత్రాంగం ఆయన 'కంట్రోల్'లోనే ఉందని చెబుతారు. డీజీపీని కూడా డమ్మీగా మార్చేసి... ఎస్పీలను తన చుట్టూనే తిప్పుకుంటారని ఆరోపణ ఉంది. ఎన్నికలను 'మేనేజ్' చేసే బాధ్యతలను కూడా జగన్... పీఎస్సార్‌కు అప్పగించినట్లు వార్తలు వచ్చాయి. వీటన్నింటి నేపథ్యంలోనే ఆయనపై ఈసీ వేటు వేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర విభజనకు ముందు కేంద్ర సర్వీసులకు వెళ్లిన పీఎస్సార్... జగన్ సీఎం కాగానే రాష్ట్రానికి చేరుకున్నారు. ఆయనకు అత్యంత కీలకమైన పోస్టు ఇస్తారని ప్రచారం జరిగినప్పటికీ అలా జరగలేదు. ఇతర పోస్టుల్లో ఉన్నా... ముఖ్యమంత్రికి నచ్చని వారిని ఇబ్బందులకు గురిచేస్తూ వచ్చారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన వ్యక్తుల్లో ప్రభుత్వ పెద్దకు నచ్చని వారి జాబితా సేకరించి అసలు పని ప్రారంభించారు. అసెంబ్లీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కుటుంబాన్ని ఇరుకున పెట్టడం నుంచి తాజాగా టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారు రాజేశ్‌పై నిఘా వరకూ పీఎస్సార్ పాత్రే కీలకమని చెబుతారు. మాజీ న్యాయమూర్తి కుమార్తెలపై కేసు పెట్టడం, విద్యాశాఖలో ఉన్నతస్థాయి వ్యక్తిని డమ్మీ చేయడం, అధికార పార్టీ ఎమ్మెల్యేలకు సైతం ఫోను చేసి సున్నితంగా హెచ్చరించడం ఆయన తీరుకు నిదర్శనం అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఆంజనేయులు రవాణా కమిషనర్‌గా ఉన్నప్పుడే... కోడెల కుమారుడి ద్విచక్ర వాహనాల షోరూమ్‌పై గురిపెట్టారు. చిన్న చిన్న తప్పులను పట్టుకుని హింసించారు. అదే సమయంలో... ఆ షోరూమ్‌లో అసెంబ్లీ ఫర్నిచర్ ఉందని ప్రభుత్వానికి ఉప్పందించారు. తనపై 'దొంగ' అనే ముద్ర వేయడాన్ని భరించలేక కోడెల ఈ లోకాన్నే వీడి వెళ్లిపోయారు. ఇక.. జేసీ కుటుంబాన్నీ పీఎస్సార్ లక్ష్యంగా చేసుకున్నారు. పొరుగు రాష్ట్రాల్లో కొనుగోలు చేసిన వాహనాలకు సంబంధించి జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడు అస్మిత్ రెడ్డిపై కేసులు పెట్టారు. వారిని అరెస్టు చేయించి జగన్ మెప్పు పొందారు. ఆ తర్వాత ఆయనను ఏసీబీ చీఫ్‌గా, ఏపీపీఎస్సీ కార్యదర్శిగా నియమించారు. అక్కడా విపక్ష నేతలే లక్ష్యంగా విధులు నిర్వహించారు. అప్పటి ఏపీపీఎస్సీ చైర్మన్‌ను ముప్పు తిప్పలు పెట్టారు. జగన్ విపక్షంలో ఉండగా ఆయనను గట్టిగా నిలువరించిన అచ్చెన్నాయుడును ఈఎస్ఐ మందుల కేసులో ఇరికించారు. అనారోగ్యానికి గురై, ఆపరేషన్ చేయించుకున్న అచ్చెన్నను రాష్ట్రానికి ఆ చివర నుంచి గుంటూరు వరకు వాహనంలో తీసుకొచ్చారు. 'సంగం' డెయిరీలో అక్రమాలు జరిగాయంటూ టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రపై కేసు పెట్టి, అరెస్టు చేయించారు. ఇక.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్టు చేసింది కొల్లి రఘురామిరెడ్డి అయినప్పటికీ... మొత్తం స్కెచ్ ఆంజనేయులుదే అనేది బహిరంగ రహస్యం.

కాంతి రాణా కథేంటి..



'వైసీపీ నేతలకు కొమ్ముకాయడం... విపక్ష నాయకులను వేధించడం'... ఐదేళ్లుగా ఐపీఎస్ కాంతిరాణా తాతా ఎదుర్కొంటున్న ఆరోపణ ఇది! విజయవాడ నగర పోలీసు కమిషనర్‌గా ఉన్న ఆయన... 'జగన్‌పై ఈగ వాలినా సహించలేను' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఐపీఎస్ అధికారుల సంఘమంటే తానే అన్నట్లుగా ఖండనలు, ప్రకటనలు జారీ చేస్తుంటారు. ఇటీవల... ఈసీకి ఫిర్యాదు కూడా చేశారు. తాజాగా గులకరాయి కేసులోనూ వెనుకబడిన వర్గాల కు చెందిన అమాయక యువకులను వేధించినట్లు ఆరోపణలు వచ్చాయి. అనంతపురం రేంజ్ డీఐజీగా ఉంటూ చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలో అనంతపురం నుంచి దొంగ ఓటర్లను తీసుకెళ్లే వాహనాలకు రైట్ రైట్ చెప్పింది ఆయనే అనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ఎన్నికల సందర్భంగా కుప్పంలో వైసీపీ చేసిన అరాచకాలకూ ఆయన మద్దతు ఉందని చెబుతారు. తమిళనాడు నుంచి రప్పించిన దొంగ ఓటర్లతో స్థానికుల పేరుపై ఉన్న ఓట్లు వేయించినా పోలీసులు అడ్డుకోలేదు. వైవీ సుబ్బారెడ్డి ఆశీర్వాదంతో విజయవాడ సీపీగా పోస్టింగ్ తెచ్చుకున్నట్లు సమాచారం.

ఎంతమంది ఆడపడుచుల పుస్తెలు తెంచావ్ జగన్!



బాపట్ల నియోజకవర్గం కర్లపాలెంలో మాట్లాడుతున్న షర్మిల

- తెనాలి, కర్లపాలెం బహిరంగ సభల్లో షర్మిల ధ్వజం

తెనాలి/బాపట్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి ఏం చేశావని నీకు ఓటెయ్యాలంటూ సీఎం జగన్‌ను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిలదీశారు. మంగళవారం బాపట్ల జిల్లా చీరాలలో పర్యటించిన ఆమె బాపట్ల మండలం కర్లపాలెం, గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించిన బహిరంగ సభల్లో మాట్లాడారు. 'మద్యాన్ని నిషేధించకుండా ఓటు అడగనన్నావు.. చివరకు సర్కారీ మద్యంతో లైసెన్స్‌డ్ మద్యం వ్యాపారిగా మారిపోయావు. కల్తీ మద్యం నువ్వే తయారుచేసి రాష్ట్రంలో 25శాతం అదనపు మరణాలతో ఎందరో అక్కచెల్లెమ్మల పుస్తెలు తెగడానికి కారణమయ్యావు" అని షర్మిల విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డికి జగన్ అనే పిల్లి పిల్ల పుడితే, తాను పులి పిల్లనని, ఇక్కడ జగన్‌రెడ్డి చేస్తున్న అరాచకాలను ప్రశ్నించడానికి వచ్చానని చెప్పారు. సొంత చిన్నాన్నను చంపిన వ్యక్తిని వెంటేసుకుని ఊరేగుతున్న జగన్... ఇంక జనానికి ఏం చేస్తాడని ప్రశ్నించారు. "సంక్రాంతి వచ్చినప్పుడల్లా జాబ్ కేలెండర్ వస్తుందని జగన్ హామీ ఇచ్చాడు. అయన అధికారంలోకి వచ్చాక ఐదు సంక్రాంతులు వచ్చివెళ్లాయి. ఒక్కసారి కూడా జాబ్ కేలెండర్ రాలేదేం?" అని షర్మిల నిలదీశారు. రైతులను జగన్ ఎక్కడ ఆదుకున్నారు? వైఎస్ జపం చేస్తూ గెలిచిన జగన్ కనీసం డ్రిప్పునకు కూడా సబ్సిడీ ఇవ్వలేకపోయాడు. ఏటా రూ.3,000కోట్లతో ఏర్పాటు చేస్తానన్న ధరల స్థిరీకరణ నిధి ఎక్కడ? పెట్టుబడి రాయితీకి ఏటా రూ.4వేల కోట్లు తీసి పక్కన పెడతానన్నావ్... గత ప్రకృతి విపత్తులకు 70వేల హెక్టార్లలో పంట దెబ్బ తింటే పరిహారం ఇవ్వలేదు. మొన్న గుంటూరు దగ్గర దెబ్బతిన్న పంటకు రూ. 50వేలు రైతులకిచ్చి ఇదిగో నీ కన్నీరు తుడిచానంటావా? ఇవన్నీ చూస్తే నీకంటే కుంభకర్ణుడే నయమనిపించడం లేదా? ఐదేళ్లు పడుకుని ఎన్నికలొచ్చాయని మళ్లీ సిద్ధమంటూ ఊరేగడానికి బయటికొచ్చావా' అంటూ షర్మిల ఎద్దేవా చేశారు. సిద్ధం అంటే దేనికి సిద్ధమో అర్థం కావటంలేదన్నారు. 'మద్యం వ్యాపారం మరింత పెంచుకుని జనాన్ని చంపడానికా సిద్ధం.... పోలవరం, రాజధాని, ప్రత్యేక హోదాను బీజేపీకి తాకట్టు పెట్టటానికి సిద్ధమా? రూ.8లక్షల కోట్లు అప్పులు చేయటానికా సిద్ధం... లిక్కర్, శాండ్, ల్యాండ్ మాఫియా, ఇవి చాలవన్నట్లు హత్యా రాజకీయాలు చెయ్యడానికి సిద్ధమయ్యావా?' అని నిలదీశారు.

దోపిడీదారులకే మళ్లీ టికెట్లు

'రాష్ట్రంలో దొంగల రాజ్యం... దోపిడీ రాజ్యం నడుస్తోంది. దోచుకున్న వాళ్లకే మళ్లీ టికెట్లు ఇచ్చారు. మనకు చెప్పుకోవడానికి రాజధాని లేదు గానీ చేతిలో చిప్ప మాత్రం ఉంది" అని షర్మిల మండిపడ్డారు. కుంభకర్ణుడు ఆరు నెలల నిద్ర పోతాడు... ఆరు నెలలు పనిచేస్తాడు... కానీ ఈ సీఎం మాత్రం ఐదేళ్లూ నిద్రలోనే ఉన్నాడని ఎద్దేవా చేశారు. "ఓటు మీ చేతిలో ఉన్న ఆయుధం. మీరు వేయబోయే ఓటు మీ పిల్లల భవిష్యత్తును నిర్దేశించడంతో పాటు రాష్ట్ర గమనాన్ని కూడా నిర్ణయిస్తుంది. అందుకే ఆలోచించి ఓటు వేయండి" అని ఓటర్లను కోరారు. ఐదేళ్ల పాలనలో ప్రత్యేక హోదా గురించి జగన్ ఒక్కరోజైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. జగన్ పులి కాదని, బీజేపీ చేతిలో పిల్లిగా మారిపోయారని షర్మిల ఎద్దేవా చేశారు. 'బాపట్ల ఎమ్మెల్యే ఇసుక మొదలుకొని భూ దందాలతో విపరీతంగా దోచుకున్నారు. పేదలకిచ్చిన ఇళ్ల స్థలాలను కూడా తక్కువ మొత్తానికి తీసుకున్నారు. తిరిగి ఆయనకే ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. ఆయనపై ఇన్ని ఆరోపణలు ఉంటే ఒక్క విచారణ అయినా వేశారా?' అని ఆమె ప్రశ్నించారు.

షర్మిలకు స్వల్ప అస్వస్థత...

చీరాల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ ఇంటి నుంచి షర్మిల ర్యాలీగా బయలుదేరారు. ఆమంచికి స్వయంగా బీ-ఫాంను అందించారు. ర్యాలీ చీరాలలోని గడియార స్తంభం వద్దకు చేరుకునే సరికి మధ్యాహ్నం 2గంటలు దాటింది. ఎండ తీవ్రతతో జనం తిరుగుముఖం పట్టారు. ఉదయం నుంచి ర్యాలీలో ఉన్న షర్మిల స్వల్ప అస్వస్థతకు లోనవడంతో చీరాల బహిరంగ సభలో మాట్లాడకుండానే బాపట్లకు వచ్చారు. అక్కడి ఇంజనీరింగ్ కళాశాలలో సాయంత్రం వరకు విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం 5 గంటలకు కర్లపాలెం బహిరంగ సభలో షర్మిల మాట్లాడారు. కాగా, సభలో జనం రాకుండా అడ్డుగా పెట్టిన బారికేడ్లను తీసేయాలని ఆమె పోలీసులకు సూచించారు. అయినా పోలీసులు స్పందించకపోవడంతో 'నన్ను తీయమంటారా... మీరు తీస్తారా..' అని ఆమె అనడంతో ఎట్టకేలకు వాటిని తొలగించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మునిసిపల్ కమిషనర్లతో సమావేశమైన ఎన్నికల సాధారణ పరిశీలకురాలు మంజూరాజ్ పాల్

ఎన్నికల సాధారణ పరిశీలకురాలు మంజూరాజ్ పాల్ రాక

వన్‌టౌన్, ఏప్రిల్ 23 : ఎన్‌టీఆర్ జిల్లాలోని తిరువూరు, విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకురాలిగా నియామకమైన మంజూరాజ్ పాల్ మంగళవారం నగరానికి విచ్చేశారు. మునిసిపల్ స్టేట్ గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి స్వాగతం పలికారు. అనంతరం ఆమె వీరితోపాటు డీఆర్‌వో శ్రీనివాసరావు, తిరువూరు ఆర్డీవో కె.మాధవి, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవాని శంకర్ తదితరులతో సమావేశం నిర్వహించారు.

పోతిన మహేశ్.. వైసీపీ జెండా కూలీ

● బొలిశెట్టి వంశీకృష్ణ



మాట్లాడుతున్న వంశీకృష్ణ

ధర్నాచౌక్, ఏప్రిల్ 23 : పోతిన మహేశ్ వైసీపీ జెండా కూలీ అని జనసేన నేత బొలిశెట్టి వంశీకృష్ణ విమర్శించారు. గాంధీనగర్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. జనసేన పార్టీలో ఎనిమిదేళ్లు అనేక పదవులు అనుభవించిన ఆయన పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. పవన్ నా దేవుడు అని గతంలో వ్యాఖ్యానించిన పోతిన మహేశ్, ఇప్పుడు రాక్షసుడు అనడాన్ని ఖండించారు. పార్టీలో ఉంటూనే వైసీపీ నేత వైవీ.సుబ్బారెడ్డిని కలిసింది, అయోధ్యరామిరెడ్డి వద్ద ప్యాకేజీ తీసుకుంది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. మరోసారి పవన్ కల్యాణ్‌పై అవాకులు చవాకులు పేలితే చూస్తు ఊరుకోబోమని హెచ్చరించారు. కామెళ్ల సోమనాథం, దాకమర్రి నాగేష్, నల్లారి సాయినాగు, యాంపాటి ప్రభు, దాసరి నాగరాజు, కెంబూరి కృష్ణ, ఆలియా బేగం, పాల రజనీ, పసుపులేటి విజయలక్ష్మీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 23 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం కేదారేశ్వరపేట ప్రాంతానికి చెందిన రౌతు కిషోర్‌బాబు (21) బీఆర్‌టీఎస్ రోడ్డులోని ఫుడ్ కోర్టులో బిర్యానీ పాయింట్ నడుపుతున్నాడు. సోమవారం రాత్రి తన వ్యాపారాన్ని ముగించుకుని కిషోర్, అతని బంధువు ఏపీ 39 ఎల్‌పి 1881 నెంబరు గల ద్విచక్రవాహనంపై ఇంటికి పయనమయ్యారు. పైపులరోడ్డు వద్దనున్న అలంకార్ బేకరీ వద్ద కిషోర్ బంధువును ఇంటి వద్ద దింపి కేదారేశ్వరపేటలోని ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అజిత్ సింగ్‌నగర్ ఫ్లైఓవర్ ఎక్కుతుండగా ఎదురుగా వస్తున్న ఏపీ 20 యూ 9232 నెంబరు గల ట్రాక్టర్ కిషోర్‌బాబు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన యువకుడిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే కిషోర్‌బాబు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ట్రాక్టర్‌తో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ముఠా కార్మికులతో మాట్లాడుతున్న కేశినేని చిన్ని

కృష్ణవేణి క్లాత్ మార్కెట్‌లో కేశినేని చిన్ని, సుజనా చౌదరి ప్రచారం

వన్‌టౌన్, ఏప్రిల్ 23 : విజయవాడ కొత్తపేటలోని కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్‌లో మంగళవారం సాయంత్రం విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), అసెంబ్లీ అభ్యర్థి సుజనా చౌదరి వేరువేరుగా పర్యటించి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్ని మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణం కాకపోవడంతో విజయవాడలో వ్యాపారాలు దెబ్బతిన్నాయని, ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే వ్యాపారస్తులకు చంద్రబాబు అండగా నిలుస్తారని తెలిపారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ఓట్లను అభ్యర్థించారు. తనతో పాటు సుజనా చౌదరికి కూడా ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మార్కెట్‌లోని గుమాస్తాలతో హమాలీ ముఠా కార్మికులతో, టీ కొట్టు యాజమానులతో శివనాథ్ మాట్లాడారు. తాము అధికారంలోకి రాగానే ఇల్లు లేని పేదలకు ఇల్లు అందిస్తామని తెలిపారు.

● సుజనా చౌదరి పర్యటన

కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. మంగళవారం ఆయన మార్కెట్‌ను సందర్శించి ఓట్లను అభ్యర్థించారు. తొలుత బచ్చు వెంకటనరసింహారావు కాంస్య విగ్రహానికి నివాళులు సమర్పించారు.

పద్మశాలీల అభివృద్ధికి కృషి : సుజనా చౌదరి

విద్యాధరపురం, ఏప్రిల్ 23 : పద్మశాలీ సామాజికవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కూటమి బలపరచిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. విజయవాడ ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని ఎస్.కన్వెన్షన్ హాలులో పద్మశాలీయ సంఘం నాయకుడు దివి మురళీకృష్ణ అధ్యక్షతన అవ్వారు శ్రీనివాసరావు (బుల్లబ్బాయి) సారథ్యంలో జరిగిన పద్మశాలీయ సామాజికవర్గ ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను నాయకులు ఘనంగా సత్కరించారు. సామాజిక వర్గం పరంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. అనంతరం సుజనా చౌదరి స్పందిస్తూ తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆ తరువాత పద్మశాలీలకు అర్హత మేరకు పథకాలు అమలు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి భాస్కరరావు, నాయకులు వెంగళ లక్ష్మీకోటేశ్వరరావు, ఎస్‌బి ప్రసాద్, నీలి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ద్రోహి జగన్

● కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని

పాతరాజరాజేశ్వరి పేట, ఏప్రిల్ 23 : జగన్ తన స్వప్రయోజనాల కోసం బడుగు, బలహీన వర్గాల ప్రజల భవిష్యత్తును తాకట్టు పెట్టాడని కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) విమర్శించారు. స్థానిక వించిపేటలో 54, 55వ డివిజన్‌ల ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నా ఎస్సీ నా ఎస్టీ, నా మైనార్టీ బిడ్డలంటూ ఆ సామాజిక వర్గాలకే జగన్ తీవ్ర అన్యాయం చేశాడన్నారు. 54, 55 డివిజన్‌ల వైసీపీ అభిమానులు కర్రిబాబు అండ్ శంకర్ ఫ్రెండ్ సర్కిల్ అధికసంఖ్యలో కేశినేని శివనాథ్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికి శివనాథ్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మధురానగర్ ఆర్‌యూబీ ఇంకెప్పుడు?



ఆర్‌యూబీలోపల మెట్ల మార్గం నిర్మాణం చేయాల్సిన ప్రాంతం

- టీడీపీ హయాంలో నిధులు మంజూరు
- అప్పుడే పనులు ప్రారంభించిన బొండా ఉమా
- వైసీపీ అధికారంలోకి రాగానే నిధులకు బ్రేక్
- బిల్లులు రాక పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- ఆరేళ్లుగా నరకం చూస్తున్న ప్రజలు

విజయవాడ — నగరంలోని మధురానగర్ ఆర్‌యూబీ పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ట్రాఫిక్ సమస్య లేకుండా చేసేందుకు టీడీపీ ప్రభుత్వం చేపట్టిన ఆర్‌యూబీ నిర్మాణాన్ని వైసీపీ అధికారంలోకొచ్చాక నిధులు తొక్కిపెట్టి ఆపేసింది. ఆరేళ్లుగా నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఎన్నికలొచ్చినప్పుడు ఏదో చేస్తున్నట్టు హడావిడి చేయడం.. ఎన్నికలయ్యాక అటకెక్కించడం వైసీపీకి వెన్నతోపెట్టిన విద్యే కదా! ఆర్‌యూబీ విషయంలోనూ అదే జరుగుతోంది.

(మధురానగర్) : టీడీపీ ప్రభుత్వంలో మధురానగర్ ఆర్‌యూబీ నిర్మాణానికి పునాది పడింది. 2019 జనవరిలో అప్పటి ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. రైల్వే శాఖ రూ.9.78 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.17.42 కోట్లుతో ఈ పనులు మొదలయ్యాయి. 2019 ఎన్నికలకు ముందు రైల్వే శాఖ పనులు ప్రారంభించింది. కొంతవరకు పనులు జరిగాయి. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. వైసీపీ అధికారంలోకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులను ఆపేసింది. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశాడు. రైల్వే శాఖ పరిధిలో పనులు పూర్తి అయినా మిగిలిన పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతో రాకపోకలు స్తంభించాయి. తరువాత ప్రజల నుంచి వత్తిడి వస్తుండటంతో స్థానిక వైసీపీ శాసనసభ్యుడు మల్లాది విష్ణు అప్పటి మున్సిపల్ మంత్రి



ఇంకా పూర్తి స్థాయిలో జరగని ఆర్‌యూబీ రిటైనింగ్ వాల్ నిర్మాణం

బొత్స సత్యనారాయణను తీసుకొచ్చి ఆర్‌యూబీ దుస్థితిని చూపించారు. తరువాత ఆయన 2020 సెప్టెంబర్‌లో మరోసారి అప్రోచ్ రోడ్డు డ్రైయిన్‌ల పనుల పేరిట శంకుస్థాపన చేశారు. ఈలోగా కార్పొరేషన్ ఎన్నికలు రావడం, కొద్ది రోజులు చేస్తున్నట్టు హడావుడి చేయడం తరువాత ఆగిపోవడం షరా మామూలైంది. ప్రస్తుతం పనులు చేస్తున్న కాంట్రాక్టర్ కూడా రెండు సంవత్సరాల నుంచి పనులు చేస్తూనే ఉన్నాడు. బిల్లులు రాకపోవడంతో భారీ పెట్టుబడులు పెట్టలేక పనులు సాగదీస్తున్నాడు.

● ఆరేళ్లుగా జనం నరకయాతన

2019లో మొదలైన ఆర్‌యూబీ పనుల వల్ల రైలు పట్టాలకు రెండువైపులా ఉన్న సింగ్‌నగర్, దేవినగర్, వాంబేకాలనీ, మధురానగర్, శ్రీనగర్, పసుపుతోట ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. రైల్వే గేట్లు లేక కొన్నాళ్లు, తాత్కాలిక గేట్లు ఏర్పాటు చేసిన తరువాత కొన్నాళ్లు.. ఇలా దాదాపు ఐదేళ్లుగా నరకం అనుభవిస్తున్నారు. ఇటీవల తాత్కాలిక గేట్ల నుంచి ఉన్న మార్గాన్ని తారు రోడ్డుగా వేయడంతో కాస్తంత ఊరట లభించింది. కానీ ఆర్‌యూబీ నిర్మాణ సమస్య అలాగే ఉంది.

● ఆర్‌యూబీ నిరుపయోగమేనా?

ఆర్‌యూబీ ప్రస్తుత పరిస్థితి చూస్తే భవిష్యత్‌లో దానివల్ల సమస్యలే తప్ప ప్రజలకు ఉపయోగపడే అవకాశం లేదని వాదనలు వినబడుతున్నాయి. రైలు మార్గం కింద బాక్సులతో రెండు మార్గాలుగా విడగొట్టారు. అక్కడి నుంచి బయటకు వచ్చే రెండువైపులా రోడ్డు మధ్యలో నాలుగు అంగుళాల మందంతో ఒకఅడుగు ఎత్తులో డివైడర్ పేర చిన్న కాంక్రీట్ గోడను నిర్మిస్తున్నారు. ఒకేసారి రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా వస్తే మధ్యలో అడుగు దూరం కూడా ఉండదని అంటున్నారు. గులాబీతోట వైపు నుంచి మధురానగర్ వైపునకు వెళ్లే మార్గంలో రిటైనింగ్ వాల్ వెండు ఉండటంతో అక్కడ సమస్య తీవ్రంగా ఉంటుందని అంచనా.

● చేయాల్సిన పనులు ఇవీ

ఎన్నికల నాటికి వాహనదారులను ఆర్‌యూబీ నుంచి వదలాలని రోడ్డు పనులు పూర్తి చేస్తున్నారు. కానీ రెండువైపులా అప్రోచ్ గోడలు ఇంకా పూర్తి కాలేదు. వర్షం నీరు ఆర్‌యూబీలో నిల్వ ఉండకుండా రెండు 10 హెచ్‌పీ మోటార్లు ఏర్పాటు చేయాలి. ఇందుకోసం ప్లాన్‌లో ఉన్న విధంగా రెండు భారీ సంపులు నిర్మించాలి. రైలు మార్గానికి రెండువైపులా అప్రోచ్ రోడ్ల నిర్మించాలి. అప్రోచ్‌లో నుంచి వచ్చే పాదచారులు రైలు గేటు దాటడానికి వీలుగా అప్రోచ్‌లో నుంచి ఆర్‌యూబీలోకి దిగడానికి మెట్లమార్గాలు ఏర్పాటు చేయాలి. అప్రోచ్‌లతోపాటు సైడు డ్రైయిన్‌లు నిర్మించాలి.

తక్కువ ధరకు కార్ల పేరుతో టోకరా

● మోసగాడి అరెస్టు

పెనమలూరు, ఏప్రిల్ 23 : 'ఢిల్లీ నుంచి సెకండ్ హ్యాండ్ కార్లు తెచ్చి తక్కువ ధరకు అమ్ముతాం, విజయవాడ చుట్టుపక్కల స్థలాలు తక్కువ ధరకు ఇప్పిస్తాం' అని మభ్యపెట్టి రూ.కోట్లు కొట్టేసే మోసగాడిని పెనమలూరు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాలు... పోరంకి లక్ష్మీపురం కాలనీలో నివాసముండే మేలురెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటి ఎదురు ఫ్లాట్‌లోకి అల్లూరి శరత్‌చంద్రవర్మ తన కుటుంబంతో కొన్నాళ్ల క్రితం అద్దెకు దిగాడు. శ్రీనివాసరెడ్డి ఆర్థిక స్థితిని గమనించిన శరత్‌చంద్రవర్మ అతని భార్య జ్యోత్స్నప్రియ అతని కుటుంబంతో బాగా పరిచయం పెంచుకొన్నట్టు నటించి నకిలీ పత్రాలతో ఒక క్రిటా కారును, నున్న సమీపంలో ఎకరా పొలాన్ని తక్కువ ధరకు ఇప్పిస్తాం అని నమ్మించి రూ.92 లక్షలు జ్యోత్స్న ప్రియ, శరత్‌చంద్ర తండ్రి వెంకట సంజీవరాజు కొట్టేశారు.

ఫిర్యాదుదారునికి అనుమానం వచ్చి ప్రశ్నించే సమయానికి జ్యోత్స్నప్రియ అమెరికా చెక్కేసింది. శరత్‌చంద్రవర్మ, సంజీవరాజులు కనిపించకుండా పోయారు. మంగళవారం తాడిగడప వద్ద కనిపించిన శరత్‌చంద్రను పోలీసులు అరెస్టు చేశారు. గతంలో శరత్‌చంద్రపై పెనమలూరుకు చెందిన తేలప్రోలు శ్రీనివాస్ తన కారు దొంగిలించుకుపోయాడని ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● ఇలాంటి నేరస్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీఐ రామారావు

అల్లూరి శరత్‌చంద్రవర్మ, తండ్రి సంజీవరాజు పశ్చిమగోదావరి జిల్లా ఉండి ప్రాంతం నుంచి వచ్చారని, విజయవాడలో వాహనాలు, స్థలాలు, ఉద్యోగాలంటూ అమాయకులను కోట్ల రూపాయలు మోసం చేస్తున్నారని, వీరి వాహనాలపై హైకోర్టు జడ్జి, ఎమ్మెల్యే స్టిక్కర్లు వేసుకొని తిరుగుతూ మోసాలకు పాల్పడుతున్నారని, ఇంకా ఎవరైనా బాధితులుంటే పోలీసులను కలవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి చెస్‌లో పలువురికి పతకాలు

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 23 : కానూరులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -17 చెస్ టోర్నీలో మారుతీనగర్‌లోని ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ విద్యార్థులు వివిధ ఏజ్ గ్రూప్‌ల్లో పతకాలను సాధించారని అకాడమీ డైరెక్టర్ పి.రేణుక, చీఫ్ కోచ్ ఎంఎస్.ఫణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.



చెస్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు

అండర్-7లో కె. సుహ్రీత్ (స్వర్ణం), గోకుల్ నందన్‌రెడ్డి (రజతం), కె. సురార్చిత్ (నాలుగోస్థానం), అండర్-9లో బి. వశిష్ట (రజతం), అండర్-11లో ఏ.సుహాస్ (రజతం), జె.లాలన(కాంస్యం)లను సాధించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలతో సత్తా చాటాలని వారు అభినందించారు.

'వీఆర్ సిద్ధార్థ'లో బీటెక్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

పెనమలూరు, ఏప్రిల్ 23 : డీమ్డ్ టు బీ యూనివర్సిటీగా రూపాంతరం చెందిన వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలోని బీటెక్ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను మంగళవారం అకాడమీ సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రతిభావంతులయిన విద్యార్థులకు ప్రవేశాల అనంతరం ఉపకార వేతనాలను అందిస్తామని తెలిపారు. అకాడమీ ఉపాధ్యక్షులు మలినేని రాజయ్య మాట్లాడుతూ బీటెక్ ప్రవేశాలకు దేశవ్యాప్తంగా నిర్వహించిన సీ-2024 పరీక్షకు విశేష స్పందన లభించినట్లు తెలిపారు. జేఈఈ మెయిన్స్ ఫలితాలు, ఎంసెట్ ఫలితాలు, ఇంటర్ మార్కులను పరిగణనలోకి తీసుకొని విద్యార్థులకు పదిహేను శాతం నుంచి వంద శాతం ఉపకారవేతనాలు అందించనున్నట్టు ఆయన తెలిపారు.



కలెక్టర్ దిల్లీరావుకు మొక్కను బహూకరిస్తున్న బ్యాంకర్ల కమిటీ కన్వీనర్ భాస్కర్

సంక్షేమం, అభివృద్ధిలో ఎస్‌ఎల్‌బీసీ కీలకం

వన్‌టౌన్, ఏప్రిల్ 23 : ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) కీలకమని కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. ఎస్ఎల్‌బీసీ నూతన కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన సీ.వీఎస్ భాస్కర్ మంగళవారం కలెక్టర్ ఢిల్లీరావును ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. బ్యాంకు లింకేజీ, ఆర్థిక అవగాహనలను ప్రజలకు చేరువ చేయడంలో లీడ్ బ్యాంకులు సహకరిస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ పటిష్టంగా అమలవుతోందని, ఈ సందర్భంలో అనుమానిత, అసాధారణ లావాదేవీల డేటాను విశ్లేషించడంలో లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంకులు దృష్టి సారించాలన్నారు.

నేడు దుర్గగుడిలో బ్రహ్మోత్సవాల ముగింపు

వన్‌టౌన్, ఏప్రిల్ 23 : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. బుధవారం ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి, ధాన్యకోట్నోత్సవము, వసంతోత్సవము, అవభృత స్నానం, మూకబలి, ధ్వజావరోహణం తదితర కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాల పూర్తవుతాయని దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 4 గంటల నుంచి హంసవాహనంపై గంగా, పార్వతి, మల్లేశ్వరుల తెప్పోత్సవాన్ని కృష్ణానదిలో నిర్వహించనున్నారు.

వైసీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బెజవాడ గణేష్

ధర్నాచౌక్, ఏప్రిల్ 23 : వైసీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా బెజవాడ గణేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనపై నమ్మకంతో ఈ పదవిని కేటాయించిన సీఎం జగన్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అదే విధంగా బీసీల అభివృద్ధికి తన వంతు సహకారం అందించడంలో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఆ ప్రకటనలో గణేష్ పేర్కొన్నారు.

జగన్ ఓటమే మాదిగల పంతం

● ఎమ్మార్పీఎస్ నేతలు

ధర్నాచౌక్, ఏప్రిల్ 23 : రాబోయే ఎన్నికల్లో జగన్ ఓటమే మాదిగల పంతంగా పని చేసి ఎన్డీఏ కూటమి గెలుపుకు కృషి చేస్తామని ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల నేతలు స్పష్టం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ మాట్లాడుతూ సీట్ల కేటాయింపుల్లో మాదిగలకు సీఎం జగన్ అన్యాయం చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉండటమే కాకుండా మాదిగలకు రాజ్యాధికారంలో భాగస్వాములు చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబుకు అండగా ఉంటామన్నారు. మందకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొనే ఈనెల 30న విజయవాడలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంద వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ గత ఐదేళ్లు మాదిగలను జగన్ అణగదొక్కారని మండిపడ్డారు.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి

● దశరథరామిరెడ్డి

ధర్నాచౌక్, ఏప్రిల్ 23 : ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రత్యేక హోదా సాధనే తమ లక్ష్యమని ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దశరథరామిరెడ్డి తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు బీజేపీకి దాసోహమై రాష్ట్ర ప్రయోజనాలను కాలరాస్తున్నాయని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రత్యేక హోదా నినాదంతో గెలిచిన వైసీపీ అధికారంలోకి వచ్చాక కేంద్రానికి తొత్తులా వ్యవహరిస్తోందని విమర్శించారు. విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి సమ్మర్ చెస్ కోచింగ్ క్యాంప్‌లు

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 23 : గ్లోబల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి ఉచిత సమ్మర్ చెస్ కోచింగ్ క్యాంప్‌లను నగరంలోని మూడు చోట్ల నిర్వహించనున్నట్టు అకాడమీ కార్యదర్శి ఎస్‌కే.ఖాసీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. మొగల్రాజపురంలోని గ్లోబల్ చెస్ అకాడమీ, పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలోను, గొల్లపూడి వన్‌సెంటర్‌ల్లో సమ్మర్ చెస్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహించనున్నట్టు వివరించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈ శిక్షణ కేంద్రాల్లో చెస్ నేర్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 98495 14138 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విలేకరులకు జోగి రమేష్ తాయిలాలు

పెనమలూరు, ఏప్రిల్ 23 : రాష్ట్రంలో మీడియా ప్రతినిధులపై వైసీపీ నేతలు ఒకవైపు దాడులు చేస్తూనే మరో వైపు వారిని ప్రసన్నం చేసుకొనేందుకు తాయిలాలు ఎరవేస్తున్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని గంగూరు వైసీపీ కార్యాలయంలో మంగళశారం మంత్రి జోగి అనుచరులు విలేకరులను పిలిచి గిఫ్టులు అందజేశారు. ఆ గిఫ్టుల్లో ఒక ప్యాంటు, షర్టు క్లాత్, చీరె, రూ.5000 నగదు ఉన్నాయి.



అందించిన గిఫ్టుల్లో ప్యాంటు, షర్టు క్లాత్, చీర



సెలవులొచ్చాయ్..!

విద్యార్థులకు ఇక కేరింతలే. పుస్తకాలతో పనిలేదు. తరగతులు వెళ్లే అవసరం లేదు. బడికి పోవాల్సిన పనిలేదు. అలుపొచ్చేదాకా ఆటలు ఆడుకోవచ్చు. వేసవి టూర్లకు వెళ్లొచ్చు. పర్యాటక ప్రదేశాలు చుట్టి రావొచ్చు. స్నేహితులతో ఊరంతా తిరిగొచ్చు. ప్రభుత్వం బుధవారం నుంచి పాఠశాలలకు సెలవులివ్వడంతో నగరంలోని విద్యా సంస్థల వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు.



కొమ్మా సీతారామయ్య జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద విద్యార్థినుల కేరింతలు

షర్మిల, సునీత ప్రాణాలకు...
మా ప్రాణాలను అడ్డేస్తాం: నారాయణ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 23: 'వైఎస్ వివేకా హత్య కేసులో న్యాయం కోసం పోరాడుతున్న షర్మిల, సునీత ప్రాణాలకు మా ప్రాణాలను అడ్డేస్తాం' అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. 'వివేకా హత్య కేసులో మా ప్రాణాలకు తెగించి పోరాడుతున్నాం' అంటూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. గుంటూరులో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... 'వైఎస్ వివేకాను ఎవరు చంపారో ప్రతి ఒక్కరికీ తెలుసు. సీబీఐ చెప్పిన విషయాలనే షర్మిల, సునీతలు చెబుతున్నారు. వారేమీ కొత్త విషయాల్ని చెప్పడం లేదు. జగన్ రాక్షస పాలనపై షర్మిల మాట్లాడుతుందే తప్ప, కుటుంబ విభేదాలు గురించి ఎక్కడా ఆమె ప్రస్తావించడం లేదు' అని నారాయణ అన్నారు.

అసెంబ్లీకి పోటీ చేయను: సుంకర పద్మశ్రీ

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తన కేటాయించిన విజయవాడ తూర్పు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయడానికి ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ నిరాకరించారు. అదే విషయాన్ని ఆమె మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. అలాగే బీ ఫామ్ తీసుకోవాలంటూ మంగళవారం తనకు ఫోన్ చేసిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యక్తిగత కార్యదర్శికి కూడా పద్మశ్రీ తేల్చి చెప్పారు. 'నేను విజయవాడ లోక్‌సభకు పోటీ చేస్తానని దరఖాస్తు చేసుకున్నా. అదే విషయాన్ని పార్టీ నాయకత్వానికి తెలియజేశాను. నేను అసెంబ్లీ స్థానానికి పోటీ చేయను. కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తా. నా నిర్ణయాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం సహృదయంతో అర్థం చేసుకుంటుందని ఆశిస్తున్నా' అంటూ ఆమె మంగళవారం ఓ ప్రకటన చేశారు.

మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న ప్రధాని మోదీ: మధు

గన్నవరం, ఏప్రిల్ 23: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశ సంపదను ముస్లింలకు దోచిపెడతారని ప్రధాని మోదీ అనడం దుర్మార్గమని సీపీఎం మాజీ ఎంపీ మధు అన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశంలో తిరిగి అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీని ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఐదేళ్ల పాటు ముదనష్టపు పాలన సాగించిన వైసీపీని, బీజేపీకి అంటకాగుతున్న టీడీపీని నమ్మకూడదన్నారు. గన్నవరం సీపీఎం కార్యాలయంలో ఇండియా కూటమి సమావేశం మంగళవారం టీవీ లక్ష్మణస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రాజస్థాన్ ఎన్నికల సభలో రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా మతాన్ని రెచ్చగొట్టే విధంగా మోదీ వ్యాఖ్యలు చేయటంపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు.

పంచాయతీల్లో ఉపాధి పనులు: సీఎస్

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉపాధి పనులు చేపట్టాలని సీఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో తాగునీరు, ఉపాధి హామీ పనులు, నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, పరిస్థితులపై ఆయన మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి పనులు నిర్వహించిన కూలీలకు సకాలంలో కూలి సొమ్ము చెల్లించాలని చెప్పారు. ప్రకాశం బ్యారేజి నుంచి నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలవ ద్వారా విడుదల చేసిన నీటితో సకాలంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు.

కూటమి గెలుపుతోనే దేశాభివృద్ధి: మురుగన్

కైకలూరు, ఏప్రిల్ 23: కూటమితోనే రాష్ట్ర, దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ప్రజలంతా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర మత్స్య శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ అన్నారు. మంగళవారం ఏలూరు జిల్లా కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ నామినేషన్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురుగన్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే కొల్లేరు సమస్యల పరిష్కారం, అలాగే ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

వైసీపీ పాలనలో దళితులపై దమనకాండ: మల్లెల

పిడుగురాళ్ల, ఏప్రిల్ 23: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎందరో దళితులపై దాడులు, హత్యాయత్నాలు, మహిళలపై అత్యాచారాలతో పాటు దమనకాండ జరిగిందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకటరావు తెలిపారు. 'రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దమనకాండ పూర్తిగా తొలగిపోవాలన్నా, సంక్షేమ పథకాలు అర్హులకు అందాలన్నా టీడీపీ పాలనతోనే సాధ్యమవుతుంది. మాస్క్ అడిగిన పాపానికి విశాఖలో డాక్టర్ సుధాకర్‌ను తీవ్రంగా హింసించి మరణానికి కారణమయ్యారు. దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేశారు. న్యాయం కావాలని వేడుకున్న మరికొందరు నేతలకు శిరోముండనం చేశారు. ఈ ఘటనలన్నీ వైసీపీ పాలనలోనే జరిగాయి. ఇలాంటి దమనకాండ, అన్యాయాలు మరలా జరుగకుండా ఉండాలంటే వైసీపీ నేతలకు బుద్ధి చెప్పాలి' అని పిలుపునిచ్చారు.

నవరత్నాల చాటున మోసం: కోవూరి లక్ష్మి

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో నవరత్నాల చాటున చాలా మోసం జరుగుతోంది. మహిళలపై అరాచకాలు జరుగుతున్నాయి. మహిళలు ఎవరూ మోసపోవద్దు' అని ఢిల్లీలో వేలు కోసుకుని నిరసన వ్యక్తం చేసిన కోవూరి లక్ష్మి అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్యతో కలసి ఆమె విలేకరులతో మాట్లాడారు. 'నేను నివసిస్తున్న ప్రత్తిపాడు స్వర్ణభారతి నగర్‌లో మైనర్ బాలికలకు జరుగుతున్న అన్యాయం అంతా, ఇంతా కాదు. వారిని గంజాయికి అలవాటు చేసి, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మార్చారు. తల్లిదండ్రులు పనికివెళ్తే, ఇంట్లో ఉండే మైనర్ బాలికలను సైతం గంజాయికి అలవాటు చేసి, అఘాయిత్యాలకు పాల్పడ్డారు' అని లక్ష్మి అన్నారు. వర్ల మాట్లాడుతూ, 'దళిత బిడ్డలకు స్వేచ్ఛగా తిరిగే హక్కు లేదా? మనం ఆధునిక సమాజంలో ఉన్నామా? ఆటవిక సమాజంలో ఉన్నామా? ఆటవిక సమాజానికి మారు పేరు జగన్ పాలన' అని విమర్శించారు.

3 పేరుతో 400 కోట్లు నొక్కేశారు: గుర్నాథం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మూడు రాజధానులు పేరు చెప్పి ప్రవాసాంధ్రుల నుంచి రూ.400 కోట్లు వసూలు చేసి వైసీపీ నాయకులే నొక్కేశారని బహుజన పరిరక్షణ సమితి అధ్యక్షుడు, ఎత్తేసిన మూడు రాజధానుల శిబిరం మాజీ నిర్వాహకుడు మాదిగాని గురునాథం ఆరోపించారు. మూడు రాజధానుల ఉద్యమం తానే చేయిస్తున్నట్లు సజ్జల, జగన్‌ను నమ్మించి అనంతవరం ఇసుక ర్యాంప్ నజరానాగా పొందారని ఆరోపించారు. జగన్, సజ్జల, కొడాలి నాని, నందిగం సురేశ్‌లు అమరావతిని అడ్డం పెట్టుకుని సర్వం దోచేశారని తెలిపారు. మూడు రాజధానుల ఉద్యమ నేతలకు ఇళ్ల స్థలాలు, రూ.25 లక్షలు, కార్లు ఇస్తామని ట్రాప్ చేసి ఆశ చూపారన్నారు. మూడు రాజధానులు శిబిరానికి వచ్చే ఒక్కొకరికి రూ.500లు ఇస్తున్నట్లు దొంగ లెక్కలు రాసి ఆ డబ్బు కూడా నందిగం సురేశ్, సజ్జల, కొడాలి నాని కూటమి నొక్కేసిందన్నారు.

చిత్తుగా ఓడతామని
జగన్‌కు అర్థమైంది: మాణిక్యాలరావు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోతున్నామని జగన్‌కు బాగా అర్థమైందని టీడీపీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు అన్నారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి తీరాలనే ఉద్దేశంతో జగన్ దళితులపై ప్రేమ ఉన్నట్లు వారిలో భ్రమలు కల్పించారన్నారు. ఆ భ్రమలో పడి దళితులు ఓట్లు వేయడంతో జగన్ గెలిచారన్నారు. 2019 ఎన్నికల్లో దళితులకు, తనకు రక్త సంబంధమున్నట్లు సెంటిమెంట్‌తో నమ్మించారని, ఇప్పుడు ఓటమి భయంతో దళితులపై దాడులకు వైసీపీ శ్రేణులను పురిగొల్పుతున్నారని ఆరోపించారు. దళితులపై మల, మూత్ర విసర్జన, అంటరానితనం లాంటి దుర్మార్గపు, అవమానకరపు క్రియలన్నీ జగన్ పాలనలో జరిగాయన్నారు. జగన్ పాలన పోయి ఈసీ పాలన వచ్చినప్పటికీ దళితుల మీద దాడులు, హత్యలు ఆగడం లేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని, చట్టాలను కాపాడాల్సిన బాధ్యత ఈసీపై ఉందని, జగన్ సాగించిన అరాచకాలకు శిక్ష పడాలని మాణిక్యాలరావు పేర్కొన్నారు.

ఇంకో రూ.3,000 కోట్ల అప్పు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం మంగళవారం కొత్తగా ఇంకో రూ.3,000 కోట్ల అప్పు తెచ్చింది. రిజర్వు బ్యాంకు నిర్వహించిన వేలంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు అమ్మి ఈ రుణం తీసుకొచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలలకు గాను రాష్ట్రానికి కేంద్రం రూ.47,000 కోట్ల అప్పులకు అనుమతిచ్చింది. ఇందులో ఏప్రిల్ 2న రూ.4వేల కోట్ల అప్పులు తెచ్చారు. ఇప్పుడు మరో రూ.3వేల కోట్లు రుణం తీసుకున్నారు. అంటే 20 రోజుల్లోనే రూ.7వేల కోట్లు అప్పులు తెచ్చినట్లయింది.

పక్క రాష్ట్రాలకూ వైసీపీ కిక్కు!

- వైసీపీ పెద్దల చేతిలో ఎస్పీవై డిస్టిలరీ
- దాని నుంచి ఈఎన్‌ఏ ఎగుమతికి అనుమతి
- 75శాతం అమ్మకానికి గ్రీన్‌సిగ్నల్
- ఎన్నికల సమయంలో అనుమతి జారీ
- మాజీ ఎండీ ప్రతిపాదనకు ఇప్పుడు ఓకే



అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం వ్యాపారం చేస్తున్న వైసీపీ పెద్దల కన్ను ఇప్పుడు పక్క రాష్ట్రాలపై పడింది. సార్వత్రిక ఎన్నికల వేళ దేశవ్యాప్తంగా మద్యానికి విపరీతమైన డిమాండ్ ఏర్పడిన తరుణంలో రాష్ట్రంలోని అతి పెద్ద డిస్టిలరీ నుంచి మద్యం తయారీకి ముడిసరుకైన ఈఎన్‌ఏను ఎగుమతి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే అది అనధికారికంగా వైసీపీ పెద్దల చేతుల్లో ఉండటమే ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డికి చెందిన నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రో డిస్టిలరీని వైసీపీ అధికారంలోకి వచ్చాక పార్టీ పెద్దలు అనధికారికంగా తమ చేతుల్లోకి తీసుకున్నారు. డిస్టిలరీ యాజమాన్యానికి కొంత నగదు చెల్లిస్తూ.. అందులో ఎక్కువగా జే బ్రాండ్లు తయారు చేస్తున్నారు. ఆ మద్యాన్నే రాష్ట్రంలోని షాపుల్లో అమ్మిస్తున్నారు. అంతటితో ఆగకుండా ఇప్పుడు బయటి రాష్ట్రాలకు ఈఎన్‌ఏను ఎగుమతి చేసుకునేందుకు ఎక్సైజ్ శాఖ అనుమతి మంజూరు చేసింది. ఈమేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్పత్తి చేసే ఈఎన్‌ఏలో 75శాతం బయటకు ఎగుమతి చేసుకోవచ్చని స్పష్టం చేసింది. రాష్ట్రంలోని డిస్టిలరీల్లో ఎస్పీవై డిస్టిలరీ అతి పెద్దది. ఏడాదికి పది కోట్ల లీటర్లకుపైగానే ఈఎన్‌ఏ ఉత్పత్తి చేసే సామర్థ్యం దీనికి ఉంది. అంటే అందులో 7.5 కోట్ల లీటర్లకు తక్కువ కాకుండా బయటి రాష్ట్రాలకు అమ్ముకోవచ్చు. అందుకుగాను ఎగుమతి సుంకం కింద రాష్ట్రానికి లీటరుకు ఒక రూపాయి చెల్లిస్తారు. ఆయా రాష్ట్రాల్లో మద్యం అవసరాలకు అనుగుణంగా ఈఎన్‌ఏను ఎగుమతి చేసి, డిమాండ్‌కు అనుగుణంగా ధర వసూలు చేస్తారు. ఈఎన్‌ఏ లీటరు ధర ప్రస్తుతం రూ.70 నుంచి రూ.75 ఉంది. ఇప్పుడు ఎన్నికలు కావడంతో ఇంకా ఎక్కువ పలికే అవకాశం ఉంది. ఇలా ఎగుమతులకు అనుమతులివ్వడం సాధారణమే అయినా, ఎన్నికల వేళ అందులోనూ కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఇంత పెద్ద డిస్టిలరీకి ఎందుకు అనుమతిచ్చారన్నదే అనుమానాలకు ఆస్కారం ఇస్తోంది. బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి అనేక ఆరోపణలతో బదిలీ అయ్యాక ఈ అనుమతులు జారీ కావడం గమనార్హం. ఆయన ఉన్నప్పుడు పెట్టిన ప్రతిపాదనలకు ఇప్పుడు అనుమతులు జారీ చేశారు. అయితే ఇది ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని అంటున్నారు.

ఎస్పీవైదే అత్యధిక వాటా

లిక్కర్ ఉత్పత్తి చేసే డిస్టిలరీలు రాష్ట్రంలో 20 ఉన్నాయి. అన్ని డిస్టిలరీల ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 4,187 లక్షల లీటర్లు. అందులో ఒక్క ఎస్పీవై డిస్టిలరీ ఉత్పత్తి సామర్థ్యమే వెయ్యి లక్షల లీటర్లు. అంటే మొత్తం డిస్టిలరీల్లో నాలుగో వంతు వాటా ఒక్క ఎస్పీవైదే. అందుకే కావాల్సినంత మద్యం ఉత్పత్తి చేసుకోవచ్చని వైసీపీ నేతలు ఎస్పీవై డిస్టిలరీని వాడుకుంటున్నారు. ఇప్పుడు దాని నుంచి ఎగుమతికి అనుమతులు కూడా తెచ్చుకున్నారు.

మొత్తం వారి చేతుల్లోనే

ఎస్పీవై డిస్టిలరీకి గత ప్రభుత్వంలోనే అనుమతులు లభించినా ఈ ప్రభుత్వంలోనే మద్యం ఉత్పత్తి ప్రారంభమైంది. భారీ సామర్థ్యం కలిగిన కొత్త డిస్టిలరీ కావడంతో అధికార పార్టీ నేతలు దానిని అనధికారికంగా చేతుల్లోకి తీసుకున్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన జే బ్రాండ్ల తయారీకి దానిని వేదికగా చేసుకున్నారు. రాయలసీమకు చెందిన ఇద్దరు మంత్రులు, ఒక ఎంపీ ఇందులో కీలకంగా ఉన్నారు. ఇంతకాలం ఎడాపెడా మద్యం తయారు చేయించి, ఇప్పుడు మిగులు ఈఎన్‌ఏను ఎగుమతి చేసుకునే అనుమతులు పొందారు. డిస్టిలరీల్లో తయారయ్యే ఈఎన్‌ఏలో 50శాతం ఎగుమతి చేసుకునేందుకు గత ప్రభుత్వంలో అనుమతి ఉండేది. దానిని వైసీపీ ప్రభుత్వం 75శాతానికి పెంచింది. తద్వారా ఎగుమతి సుంకాన్ని పెంచుకుని అదనపు ఆదాయాన్ని పొందుతోంది. దాంతోపాటు డిస్టిలరీలకు అనధికారికంగా మేలు చేస్తోంది.

ఖమ్మం బరిలో ప్రియాంక?

- అవకాశాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రోజుకో మలుపు తిరుగుతున్న ఖమ్మం సీటు పంచాయితీ.. చివరికి అనూహ్యమైన మలుపు తీసుకోనుందా? అక్కడి నుంచి కాంగ్రెస్ అధిష్ఠానం ఏకంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీనే బరిలోకి దింపే అవకాశం ఉందా? రాహుల్‌గాంధీ నిర్ణయం పైనే ఇది ఆధారపడి ఉందా?- ప్రస్తుతం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్రంగా నడుస్తున్న చర్చ ఇది. యూపీలోని అమేఠీ, రాయ్‌బరేలీ సీట్లలో మొదటి నుంచీ గాంధీ కుటుంబమే పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. గత ఎన్నికల్లోనూ అమేఠీ నుంచి రాహుల్‌గాంధీ, రాయ్‌బరేలీ నుంచి సోనియాగాంధీ పోటీ చేశారు. అమేఠీతోపాటు వయనాడ్‌లో పోటీ చేసిన రాహుల్ వయనాడ్‌లో గెలిచి అమేఠీలో మాత్రం స్మృతీ ఇరానీ చేతిలో ఓటమి పాలయ్యారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లోనూ వయనాడ్ నుంచి రాహుల్‌గాంధీ ఇప్పటికే నామినేషన్ వేశారు. అమేఠీని రాహుల్‌గాంధీ నిర్ణయం కోసం అధిష్ఠానం పెండింగ్‌లో పెట్టింది. మరోవైపు, సోనియాగాంధీ రాజ్యసభకు వెళ్లడంతో రాయ్‌బరేలీ సీటు కూడా పెండింగ్‌లో ఉంది. ఈ రెండు సీట్లనూ రాహుల్, ప్రియాంకల కోసమే అధిష్ఠానం పెండింగ్‌లో ఉంచింది. అమేఠీ నుంచి రాహుల్‌గాంధీ పోటీ చేయడానికి అంగీకరిస్తే.. ప్రియాంకను సైతం రాయ్‌బరేలీతో పాటుగా దక్షిణాది రాష్ట్రాల్లో ఏదో ఒక నియోజకవర్గం నుంచి బరిలోకి దించే అంశాన్ని అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా గెలిచే సీటైన ఖమ్మం నుంచే ప్రియాంకను ఎందుకు బరిలోకి దించకూడదన్న ఆలోచనా చేస్తున్నట్లు చెబుతున్నారు. ఒకవేళ రాహుల్‌గాంధీ.. వయనాడ్‌కే పరిమితమైన పక్షంలో ప్రియాంక అమేఠీ లేదా రాయ్‌బరేలీల్లో ఒకదాని నుంచి బరిలోకి దిగుతారని పేర్కొంటున్నారు.

'బొత్స' కబ్జాలో
విశాఖ స్టీల్ గనులు: పట్టాభి

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి అనుబంధంగా విజయనగరం జిల్లాలో ఉన్న మాంగనీసు, సిలికా గనులను మంత్రి బొత్స కుటుంబం చెరపట్టిందని టీడీపీ ఆరోపించింది. ఈ గనులపై తమకు ఉన్న లీజు హక్కులు పొడిగించాలని ఉక్కు ఫ్యాక్టరీ యాజమాన్యం ఎన్నిసార్లు లేఖలు రాసినా సీఎం జగన్ వాటిని బుట్ట దాఖలు చేసి తమ మంత్రుల అడ్డగోలు దోపిడీకి సహకరించారని టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి విమర్శించారు. ముఖ్యమంత్రి సీట్లో కూర్చుని వ్యాపారం చేసుకొంటున్న జగన్‌కు విజయనగరం జిల్లాకు వెళ్లి ఓట్లు అడగడానికి ఏం నైతిక హక్కు ఉందని ఆయన ప్రశ్నించారు. 'గనుల్లో జగన్ దోపిడీని ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా అందిపుచ్చుకొని అయినకాడికి పిండుకొంటున్నారు. విజయనగరం జిల్లాలోని మెరక ముడిదాం మండలంలోని 1,000 ఎకరాల గర్భామ్ మాంగనీసు గనిని మంత్రి బొత్స కుటుంబం కబ్జా చేసింది. ఈ గని ఇప్పటిదాకా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి క్యాప్టివ్ గనిగా ఉంది. 2022 అక్టోబరులో ఈ లీజు గడువు ముగిసింది. అప్పటి నుంచి ఆ గనిని బొత్స కుటుంబం కబ్జా చేసి తన ఆధీనంలో పెట్టుకొంది. గని చేతిలో లేకపోవడంతో విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ ఒక టన్ను మాంగనీసును రూ.14- 15 వేలకు బయట కొనాల్సి వస్తోంది. ఈ ఏడాదిన్నరలో ఆ గనిలో ఎంత మాంగనీసును బొత్స కుటుంబం ఎంత అక్రమంగా తవ్వి ఎంత సంపాదించిందో ఆ లెక్కలు వారికీ, జగన్‌కు మాత్రమే తెలుసు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత దుర్మార్గంగా వ్యవహరించలేదు' అని పట్టాభి చెప్పారు.

వైసీపీ అభ్యర్థి వంగా గీతకు చుక్కెదురు

- సమస్యలు పరిష్కరించకుండా ఓట్లడగడానికి వస్తారా?
- గొల్లప్రోలులో నిలదీసిన మహిళలు



గొల్లప్రోలు, ఏప్రిల్ 23: పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతాకు చేదు అనుభవం ఎదురైంది. సమస్యలు పరిష్కరించకుండా ఓట్లడగడానికి వస్తారా అంటూ మహిళలు నిలదీశారు. పిఠాపురంలోని గొల్లప్రోలు పట్టణంలోని 20వ వార్డులో సోమవారం ఈ పరిస్థితి ఎదురైంది. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెనుక వీధిలో ప్రచారం నిర్వహిస్తూ రోడ్డు పక్కన ఇళ్లలో ఉన్న మహిళలను పిలిచారు. తమకు తాగునీరు లేదు, రోడ్లు, డ్రైన్లు అధ్వానంగా ఉన్నాయని, సుద్దగడ్డ కాలువలకు వరదలు వస్తే వరద నీటితో సహవాసం చేస్తున్నామని, ఇన్ని సమస్యలతో సతమతమవుతున్నా పరిష్కరించరు కానీ.. మీరు ఓట్లడగడానికి వస్తే మేము రావాలా అంటూ స్థానిక మహిళలు నిలదీశారు.





తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైన కారు, ఢీకొట్టిన బస్సు

తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం

తిరుమల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో ఆగి ఉన్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం కారులో మంగళవారం మధ్యాహ్నం అలిపిరి నుంచి తిరుమలకు బయలుదేరారు. వినాయక స్వామి ఆలయం దాటిన తర్వాత ఓ మలుపువద్ద సాంకేతిక సమస్యతో కారు నిలిచిపోయింది. ఆ సమయంలో వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆగి ఉన్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని ఆరుగురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

కోడ్ ఉల్లంఘనలపై 'త్రిబుల్ సీ' నిఘా

- సీఈవో కార్యాలయం నుంచే జీపీఎస్ ట్రాకింగ్
- మద్యం అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ఠ చర్యలు
- సీఈవో ఎంకే మీనా ప్రత్యేక పర్యవేక్షణ



కమాండ్ కంట్రోల్ రూంను సందర్శించి అక్కడి సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి ఎంకే మీనా

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకూ తావులేకుండా ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలనే లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(త్రిబుల్ సి) ద్వారా రాష్ట్రాన్ని జల్లెడపడుతున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. మంగళవారం ఈ మేరకు సీఈవో కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం.. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా కార్యాలయంలో అత్యాధునిక సాంకేతికత అనుసంధానంతో ఏర్పాటైన ఈ 'త్రిబుల్ సి' ద్వారా ఎంసీసీ ఉల్లంఘనలు, మద్యం అక్రమ రవాణా, సీజర్లపై పటిష్ఠమైన పర్యవేక్షణ, నియంత్రణ ఉంటుంది. అంతర్-రాష్ట్ర సరిహద్దులు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 424 చెక్ పోస్టుల నుంచి వెళ్లే వాహనాల కదలికలను వెబ్ కాస్టింగ్ ద్వారా ఈ కేంద్రం నుండే పర్యవేక్షణ చేస్తున్నారు. దీని ఫలితంగా రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి నేటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక మొత్తంలో రూ.141 కోట్ల విలువకు పైబడి నగదు, లిక్కర్, డ్రగ్స్, విలువైన మెటల్స్, ఫ్రీ బీస్, ఇతర వస్తువులను జప్తు చేసినట్లు సీఈవో కార్యాలయం ప్రకటించింది. 2019 ఎన్నికల నిర్వహణ సందర్భంగా జప్తు చేసిన అక్రమ ఆస్తుల విలువ కంటే ఇది దాదాపు రెండు రెట్లు అధికమని స్పష్టం చేసింది. ఎన్నికల నిర్వహణకు ముందు ఇంత పెద్ద మొత్తంలో అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకోవడమనేది రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఒక రికార్డుగా పేర్కొంది. ఎన్నికల సందర్భంగా ఓటర్లపై మద్యం ప్రభావం ఏమాత్రం ఉండకూడదనే లక్ష్యంతో మద్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకునట్లు ఈసీ స్పష్టం చేసింది. రాష్ట్రంలోని మద్యం తయారీ సంస్థల గోడౌన్ల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లలో ఏర్పాటు చేసిన వెబ్ కెమెరాల ద్వారా మద్యం తయారీ సంస్థల నుంచి గోదాములకు, షాపులకు, బార్లకు లేదా ఇతర సంస్థలకు మద్యం సరఫరా చేస్తున్న వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(త్రిబుల్ సి) ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు స్పష్టం చేసింది. క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలుపర్చాలనే లక్ష్యంతో నిరంతరం పర్యటిస్తున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, సెక్టోరల్ అధికారులు వినియోగించే దాదాపు 1680 వాహనాలు, ఈవీఎంల రవాణాకు వినియోగించే డీజీటీ వాహనాల కదిలకలను జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా సీఈవో కార్యాలయంలోని త్రిబుల్ సీ కేంద్రం ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ప్రముఖ ఎలక్ట్రానిక్ తెలుగు చానళ్లలో నిరంతరాయంగా ప్రసారమయ్యే వార్తాంశాలపై ప్రత్యేక దృష్టి సారించడమే కాకుండా ఎన్నికల ప్రతికూల వార్తలపై తక్షణ చర్యలు తీసుకోవడానికి ఇద్దరు ఏఎస్‌ఓలతో పాటు దాదాపు 25 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు షిఫ్టుల వారీగా ఈ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అదే విధంగా ప్ర ముఖ ఆంగ్ల, తెలుగు దినపత్రికల్లో ప్రతికూల వార్తాంశాలపై కూడా తగు చర్యలు తీసుకుంటున్నట్లు సీఈవో కార్యాలయం తెలిపింది.

సీసీసీలో నిరంతర పర్యవేక్షణ..

కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులు, ఆ సెంటర్ కార్యక్రమాలన్నింటినీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆ సెంటర్‌లో అధికారులు, సిబ్బంది పనితీరును మరింత మెరుగుపర్చే విధంగా వారికి ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. మే నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి దోహదపడతాయని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా అభిప్రాయపడ్డారు. అదే సమయంలో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేలా రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు సహకరిస్తే రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో ఎంతో స్వేచ్ఛగా, జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

రూ.1.3 కోట్లకు టోకరా!

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో లాజిస్టిక్స్ వ్యాపారి

ఎండాడ, ఏప్రిల్ 23: విశాఖ నగరానికి చెందిన ఓ లాజిస్టిక్స్ వ్యాపారి సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి రూ.1,30,30,639 పోగొట్టుకున్నాడు. 1930 హెల్ప్ లైన్‌కి కాల్ చేయడంతో సకాలంలో స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు రూ.85,70,923ను హోల్డ్ చేయగలిగారు. ఈ నెల 20న జరిగిన ఈ ఘటనకు సంబంధించి సైబర్ క్రైం పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన లాజిస్టిక్స్ వ్యాపారికి ఈ నెల 20న ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ముం బైలో ఫెడెక్స్ కొరియర్ ప్రతినిధినని, ముంబై నుంచి తైవాన్‌కు మీపేరుపై పార్శిల్ బుక్ అయిందని, అందులో నిషేధిత, చట్టవిరుద్ధ వస్తువులు, ఫేక్ పాస్‌పోర్టులు, క్రెడిట్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్‌లతోపాటు 720 గ్రాముల డ్రగ్స్ ఉన్నట్టు కస్టమ్స్ అధికారులు గుర్తించారని బెదిరించాడు. అటువంటి పార్శిల్ తాను బుక్ చేయలేదని లాజిస్టిక్ వ్యాపారి చెప్పడంతో, అతడి వివరాలు, ఎక్కడ ఉంటున్నదీ, ఫోన్ నంబర్లు కూడా చెప్పడంతో కంగారు పడ్డాడు. అంతేకాకుండా పార్శిల్ మీద ఎఫ్ఐఆర్ నంబరు ఎంహెచ్ 1085/1223 బుక్ అయిందని, నార్కోటిక్ పోలీసులకు కాల్ బదలాయిస్తున్నామని చెప్పాడు. విచారణ నిమిత్తం ముంబైకి రావాల్సి ఉంటుందని తెలిపాడు. అయితే తాను అంత దూరం రాలేనని బాధితుడు బదులివ్వడంతో ఉన్నతాధికారికి ఫోన్ కలుపుతున్నామని, ఆన్‌లైన్‌లో విచారణ చేస్తారని బదులిచ్చాడు. వెంటనే మరో వ్యక్తి లైన్‌లోకి వచ్చి ఓ స్కైప్ ఐడీ ఇచ్చి అందులో లాగిన్ కావాలని చెప్పాడు. మీరు ఎవరితోనూ మాట్లాడకూడదని, తాము చెప్పినట్టు నడుచుకోవాల ని చెప్పడంతో బాధితుడు అలానే చేశారు. మీ బ్యాంకు ఖాతా ద్వారా మనీల్యాండరింగ్ జరిగిందని, మీ అకౌంట్స్ నుంచి తీవ్రవాదులకు డబ్బులు అందాయని చెబుతూనే, ప్రస్తుతం మీ అకౌంట్‌లో ఉన్న డబ్బును మాకు ట్రాన్స్‌ఫర్ చేస్తే ఆర్బీఐ నిబంధనల ప్రకారం ఖాతాను చెక్ చేసి, తిరిగి అకౌంట్‌లో జమ చేస్తామని నమ్మబలికారు. దీనికితోడు ఆర్బీఐకి సంబంధించిన లెటర్‌ని బాధితునికి ఆన్‌లైన్‌లో పంపించాడు. వారు చెప్పినట్టే బాధితుడు తన ఖాతాలోని రూ.1,30,30,639 నగదును వారి ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. అయితే దీనిపై అనుమానం వచ్చి వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడంతో సైబర్ క్రైం జోన్-2 సీఐ జి.శ్రీనివాసరావు బృందం వివరాలు సేకరించి, నగదులో రూ.85,70,923 మొత్తాన్ని హోల్డ్ చేయించారు.

ఎడాపెడా కరెంటు కొనుగోలు

- రాష్ట్రంలో భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్
- రూ.29 కోట్లు చెల్లించి 39 ఎంయూ కొనుగోలు
- సోమవారం 245.9 ఎంయూల డిమాండ్

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతుంటే.. విద్యుత్తు డిమాండ్ కూడా అదేస్థాయిలో ఉంటోంది. డిమాండ్‌కు సరిపడా సరఫరా పేరిట రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు స్వల్పవ్యవధి కింద బహిరంగ మార్కెట్లో ఎడాపెడా కరెంటును కొనుగోలు చేస్తున్నాయి. సోమవారం రాష్ట్రంలో 245.957 మిలియన్ యూనిట్ల (ఎంయూ) డిమాండ్ నమోదైంది. ఈ రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ సంస్థలకు సెంట్రల్ పూలింగ్‌తో కలుపుకొని విద్యుత్ ఉత్పత్తి 203 ఎంయూ మాత్రమే ఉంది. దీంతో డిస్కమ్‌లు రూ.29.676 కోట్లు చెల్లించి 39.636 ఎంయూల విద్యుత్‌ను కొనుగోలు చేశాయి. ఎస్టీపీఏ కింద రూ.15.805 కోట్లతో 20.651 ఎంయూలు, టెర్మ్ ఎహెడ్ కింద రూ.10.182 కోట్లు చెల్లించి 13.151 ఎంయూలు కొనుగోలు చేశాయి. డీఏఎమ్ కింద రూ.2.988 కోట్లతో 5.010 ఎంయూలు, ఆర్‌టీఎం కింద రూ.0.701 కోట్లతో 0.794 మిలియన్ యూనిట్లు కొనుగోలు చేశాయి. ఎస్‌టీపీఏ కింద 4.8 ఎంయూలు స్వాపింగ్ ద్వారా తీసుకున్నారు. మొత్తంగా 44.436 ఎంయూలను బహిరంగ మార్కెట్లో డిస్కమ్‌లు కొనుగోలు చేశాయి. గత మూడు రోజుల్లో రూ.80 కోట్ల విద్యుత్‌ను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేశాయి. డిస్కమ్‌లు ఈ భారమంతా జనంపైనే వేస్తాయి. మిగిలిన రాష్ట్రాలు విద్యుత్ ఉత్పత్తికీ.. డిమాండ్‌కీ మధ్య ఉన్న తేడాను షార్టేజీగా చూపిస్తుంటే.. రాష్ట్రంలో మాత్రం అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయని ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఎవరి ఆదేశాల మేరకు ఇలా అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని నిలదీస్తున్నాయి.

నేడు పాలిసెట్ గ్రాండ్ టెస్ట్

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్‌లలో ప్రవేశాలకు నిర్వహించే పాలీసెట్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు అవగాహన కోసం బుధవారం రాష్ట్రవ్యాప్తంగా గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో ఈ టెస్ట్ జరుగుతుందని, దీనికి ఎలాంటి ఫీజు ఉండదని, ఏ విద్యార్థి అయినా దీనిని ఉపయోగించుకోవచ్చని అన్నారు. ఏప్రిల్ 27న పాలీసెట్ జరుగుతుందని పేర్కొన్నారు.

చికెన్ బిర్యానీ పెట్టినా... జనం రాలే!

- వైసీపీ అభ్యర్థి వస్తున్నాడంటూ ఒక రోడ్డులో రాకపోకలకు బ్రేక్
- సమయం దాటిపోవటంతో అంబటి మురళి నామినేషన్ నిరాకరణ

పొన్నూరు టౌన్, మార్చి 23: గుంటూరు జిల్లా పొన్నూరు వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ నామినేషన్‌కు మంగళవారం అట్టహాసంగా ఏర్పాట్లు చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆర్వో కార్యాలయానికి 20 మీటర్ల దూరంలోనే భారీగా టెంట్‌లు ఏర్పాటు చేసి చికెన్ బిర్యానీ వండి.. నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన వారికి భోజన ఏర్పాట్లు చేశారు. ఆర్వో కార్యాలయం ఎదురుగా రోడ్డుపై వైసీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. ఆ రోడ్డుపై ట్రాఫిక్‌ను నిలిపివేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. మధ్యాహ్నం రెండున్నర నుంచి నాలుగున్నర వరకూ నడి ఎండలో నిలిచిపోయిన ప్రయాణికులు నరకం చూశారు. ఇక, జన సమీకరణ కోసం పురుషులకు రూ.200, క్వార్టర్ మద్యం, రూ.100 పెట్రోల్ కూపన్, బిర్యాని అందజేశారు. మహిళలకు 500 నగదు, బిర్యానీ అందజేశారు. దాదాపు రెండు గంటల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో భోజన ఏర్పాట్లు చేసిన ప్రాంతంలోని కార్యకర్తలు భోజనం మిగిలిపోయింది తినండంటూ బస్సులు, ఇతర వాహనాల్లోకి తెచ్చి ఇచ్చారు. పొన్నూరు వెళ్లాల్సిన బస్సులు శివార్లలోనే గంటలకొద్దీ ఆగిపోవడంతో ఎండకు తాళలేక మహిళలు, పిల్లలు ఎండలోనే నడుచుకుంటూ ఊరిలోకి రావాల్సి వచ్చింది. నాలుగున్నర తర్వాత పోలీసులు శ్రమకోర్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇక, చేబ్రోలు, పొన్నూరులోని బంకుల వద్ద వైసీపీ జెండాలతో కార్యకర్తలు కూపన్లు ఇచ్చి పెట్రోలు కొట్టించుకున్నారు. ఆర్వో కార్యాలయం వద్ద బారికేడ్లను వైసీపీ శ్రేణులు ధ్వంసం చేశాయి. ఇంతా చేసినా ఆశించిన మేర నామినేషన్ కార్యక్రమానికి జనం రాలేదు. అంబటి మురళీకృష్ణ కార్యాలయానికి సకాలం(మధ్యాహ్నం 3గంటలలోపు)లో చేరుకోకపోవడంతో నామినేషన్‌ను స్వీకరించేందుకు అధికారులు అంగీకరించలేదు.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంటెక్



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. గేట్ అర్హత ఉన్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. మొత్తం 115 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, గేట్ వ్యాలిడ్ స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: బయోఇన్ఫర్మాటిక్స్ 25, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 18, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ 18, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 18, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ టెక్నాలజీ 18, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్ 18 సీట్లు ఉన్నాయి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 10
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 22
- **కౌన్సెలింగ్ తేదీ:** మే 31
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in, www.uohyd.ac.in

మెడికల్ జెనెటిక్స్‌లో ట్రెయినింగ్ కోర్సు

ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఇన్ రీప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్(ఎన్ఐఆర్ఆర్‌సీహెచ్, ముంబై)కు చెందిన జెనెటిక్ రీసెర్చ్ సెంటర్- 'అప్లికేషన్ ఆఫ్ మెడికల్ జెనెటిక్స్ ఇన్ రీప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్' ట్రెయినింగ్ కోర్సును అందిస్తోంది. దీనిని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేస్తోంది. కోర్సు వ్యవధి నాలుగు వారాలు. ఇందులో జెనెటిక్ టెస్టింగ్, డయాగ్నస్టిక్ అల్గారిథమ్స్ ఫర్ జెనెటిక్ డిజార్డర్స్, చైల్డ్ హెల్త్, ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ జెనెటిక్ డయాగ్నస్టిక్ రిపోర్ట్, జెనెటిక్ కౌన్సెలింగ్, రీసెర్చ్ మెథడాలజీ, క్లినికల్ అండ్ ల్యాబొరేటరీ జెనెటిక్స్ అంశాలకు సంబంధించి లెక్చర్స్, సెషన్స్ నిర్వహిస్తారు. కోర్సు ఫీజు లేదు.

అర్హత: ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్/డీఎం/ఎంసీహెచ్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మెడికల్ కాలేజీలు/ఆసుపత్రులు/ఇన్‌స్టిట్యూట్‌లు/మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్స్/మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్స్‌కు చెందిన ఫ్యాకల్టీ మెంబర్లు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000 (రిఫండబుల్ డిపాజిట్)
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 25
- **ఎంపికైన అభ్యర్థులకు ఈమెయిల్ సమాచారం:** ఏప్రిల్ 30న
- **కోర్సు తేదీలు:** జూన్ 3 నుంచి 28 వరకు
- **ఈ మెయిల్:** grc@nirrch.res.in
- **వెబ్‌సైట్:** www.nirrch.res.in

కర్నూలు ఐఐఐటీడీఎంలో పీహెచ్‌డీ

కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్(ఐఐఐటీడీఎం)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫుల్ టైం, పార్ట్ టైం విధానాలు అందుబాటులో ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ, సంబంధిత జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు నిర్వహించి సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అర్హులను ఎంపిక చేస్తారు. రిటెన్ టెస్ట్‌ను గేట్ 2024 సిలబస్ ప్రకారం నిర్వహిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి గరిష్ఠంగా అయిదేళ్లు.

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, ఫిజిక్స్.

సీట్లు: ఫుల్ టైమ్ పీహెచ్‌డీ(ఇన్‌స్టిట్యూట్ ఫెలోషిప్) ప్రోగ్రామ్‌లో 28 సీట్లు, ఫుల్ టైమ్ పీహెచ్‌డీ(స్పాన్సర్డ్ ప్రాజెక్ట్) ప్రోగ్రామ్‌లో 6 సీట్లు, పార్ట్ టైమ్ పీహెచ్‌డీలో 9 సీట్లు; విశ్వేశ్వరాయ స్కీమ్ కింద ఫుల్ టైమ్ పీహెచ్‌డీలో 4 సీట్లు, పార్ట్ టైమ్ పీహెచ్‌డీలో 2 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు నిర్దేశించిన బ్రాంచ్‌లలో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ ఉత్తీర్ణులై ఉండాలి. ఐఐటీ/సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ పూర్తిచేసిన వారు కూడా అర్హులే. గుర్తింపు పొందిన ఇతర ఇంజనీరింగ్ కళాశాలల నుంచి కనీసం 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసినవారికి గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. మేథమెటిక్స్‌కు ఎమ్మెస్సీ(మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) ఉత్తీర్ణతతోపాటు గేట్/సీఎస్ఐఆర్ నెట్/ఎన్‌బీహెచ్‌ఎం/ఇన్‌స్పైర్ ఫెలోషిప్ అర్హత ఉండాలి. ఫిజిక్స్ విభాగానికి ఎమ్మెస్సీ(ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/మెటీరియల్ సైన్స్) ఉత్తీర్ణతతోపాటు గేట్/సీఎస్ఐఆర్ నెట్/ఇన్‌స్పైర్ ఫెలోషిప్ అర్హత ఉండాలి. పార్ట్ టైం ప్రోగ్రామ్‌నకు అప్లయ్ చేసుకోవాలంటే పీజీ అభ్యర్థులకు కనీసం మూడేళ్ల అనుభవం, డిగ్రీ అభ్యర్థులకు కనీసం ఆరేళ్ల రీసెర్చ్ అనుభవం ఉండాలి. ప్రభుత్వ ఆర్ అండ్ డీ సంస్థలు/ప్రముఖ ఎడ్యుకేషనల్ సంస్థలు(ప్రభుత్వ/ప్రైవేట్)/పీఎస్‌యూలు/ప్రభుత్వ పరిశ్రమల్లో సీ గ్రేడ్



సైంటిస్టులు/అసిస్టెంట్ ప్రొఫెసర్లు/ లెక్చరర్లు/ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా పనిచేస్తూ ఉండాలి.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: ఫుల్ టైం అభ్యర్థులకు మొదటి రెండేళ్ల నెలకు రూ.37,000ల జేఆర్ఎఫ్; చివరి మూడేళ్ల నెలకు రూ.42,000ల ఎస్ఆర్ఎఫ్ చెల్లిస్తారు. అభ్యర్థులు వారానికి ఎనిమిది గంటలసేపు హాఫ్ టైమ్ టీచింగ్/రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ వర్క్ చేయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** మే 22
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 5, 6
- **ఫలితాలు విడుదల:** జూన్ 11
- **ఫస్ట్ సెమిస్టర్ ఫీజు చెల్లింపులు:** జూన్ 18
- **తరగతులు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** iiitk.ac.in

భారత్ సొంత సూచీలను ఏర్పాటు చేసుకునే తరుణం ఆసన్నమయ్యిందా?

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి తరువాయి)



● మానసిక ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు వంటివి ఒక వ్యక్తి ఆనందంగా ఉండటానికి ప్రధాన హేతువులుగా ఉంటాయి. భారతదేశంలో పటిష్ఠ వివాహవ్యవస్థ, దృఢ కుటుంబ సంబంధాలు - వయో వృద్ధుల సంరక్షణలో కీలకపాత్ర వహిస్తున్నాయి. కానీ పాశ్చాత్యదేశాల్లో వయోవృద్ధులు తమ జీవనాన్ని తామే ఒంటరిగా కొనసాగించాల్సిన పరిస్థితులు ఉంటాయి. పైగా ప్రస్తుతం ఆనందసూచీలో అగ్రస్థానంలో ఉన్న నార్డిక్ దేశాల్లో కుంగుబాటు సమస్య ప్రపంచంలోనే అత్యధికంగా కనిపిస్తూ ఉంటుంది. ఆ దేశాల్లో కుంగుబాటు, ఎడిక్షన్, యాంగ్జైటీ వంటి మానసిక రుగ్మతలను ఎదుర్కోవడానికి యాంటీ డీప్రెసెంట్ల వినియోగం ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో ఉందని ఐఈసీడీ(ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) సంస్థ నివేదికలు తెలుపుతున్నాయి. అదేవిధంగా గత దశాబ్దకాలంలో యురోపియన్ దేశాల్లో మానసిక రుగ్మతల కోసం ప్రిస్క్రిప్షన్ డ్రగ్స్ వినియోగం రెండున్నర రెట్లు పెరిగిందని సర్వేలు చెబుతున్నాయి. ఇలాంటి దేశాల ఆనంద సూచీల్లో అగ్రస్థానంలో ఉండటం సూచీ నిర్మాణ ప్రాతిపదికల్లో డొల్లతనాన్ని నిరూపిస్తున్నాయి.

● ఇక 'వి-డెమ్(వెరైటీస్ ఆఫ్ డెమోక్రసీ)' అనే స్వీడన్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఏటా 'లిబరల్ డెమోక్రసీ ఇండెక్స్' పేరిట ప్రపంచ ప్రజాస్వామ్య సూచీని ప్రకటిస్తుంది. ఈ సూచీ నిర్మాణం కోసం 71 ఇండికేటర్స్‌ను తీసుకొని వాటిని

(1) లిబరల్ కాంపోనెంట్ ఇండెక్స్(ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణ, కార్యనిర్వాహక శాఖలపై శాసనపరమైన అడ్డంకులు)

(2) ఎలక్టోరల్ డెమోక్రసీ ఇండెక్స్(స్వేచ్ఛాయుత, న్యాయబద్ధమైన ఎన్నికలు, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, సంఘాలు ఏర్పాటుచేసుకునే స్వేచ్ఛ)

(3) ఇగాలిటేరియన్ కాంపోనెంట్ ఇండెక్స్(వివిధ సామాజిక సమూహాల మధ్య గల సమానత్వ స్థాయిలు)

(4) పార్టిసిపేటరీ కాంపోనెంట్ ఇండెక్స్(పౌర సంఘాలు, ప్రజా సంఘాల బలం).

(5) డెలిబ్రేటివ్ కాంపోనెంట్ ఇండెక్స్(రాజకీయ నిర్ణయాలు, ప్రజా సంక్షేమం, శ్రేయస్సు కోసం తీసుకుంటున్నాయా లేదా భావోద్వేగాలు, నిర్బంధాల వల్ల తీసుకుంటున్నాయా)

● ఈవిధంగా అయిదు కేటగిరీల కిందకు వివిధ ఉపఅంశాలను చేర్చి దత్తాంశాలను సేకరించడానికి ప్రశ్నావళిని తయారుచేస్తున్నారు. అయితే ఈ ప్రశ్నావళి సామాన్య ప్రజల నుంచి సమాచారాన్ని రాబట్టడానికి కాదు. ఆ రంగాల్లో, ఆ దేశాల్లో నిష్ణాతులైన ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రొఫెసర్ల వంటి మేధావుల నుంచి(రమారమి 3700 మంది) విస్తృతంగా అభిప్రాయాలు సేకరించడానికి వినియోగిస్తున్నారు. ఈ భారీ సమాచారాన్ని అల్గరిథమ్స్‌ను వినియోగించి విశ్లేషించి దేశాలకు ర్యాంకింగ్‌లు ఇస్తారు.

● అయితే అసలు ప్రజాస్వామ్య మనుగడలో లేని, నియంతృత్వం రాజ్యమేలుతున్న దేశాలు భారతదేశం కన్నా మంచి స్థానాన్ని ప్రజాస్వామ్య సూచీలో పొందడం ఈ దత్తాంశ సేకరణ, విశ్లేషణ విధానాల్లో లోపాలను తేటతెల్లం చేస్తున్నాయి. ప్రజల అభిప్రాయాలు, స్థానిక పరిస్థితుల అంచనాల స్థానంలో మేధావుల అసంతృప్తి, వారి ఆలోచనా వైవిధ్యతలను కొలమానంగా తీసుకోవడం వల్ల, ఎక్కువ ప్రజాస్వామిక పరిస్థితులు ఉన్న స్వేచ్ఛాపూరిత వాతావరణం, అసంతృప్తి వెలువరించడానికి అవకాశం ఉన్న దేశాలకు అథమ ర్యాంకులు దక్కుతుంటాయి.

● ఇక పత్రికాస్వేచ్ఛ సూచీ విషయానికి వస్తే 'రిపోర్టర్స్ విత్‌అవుట్ బోర్డర్స్' అనే ప్యారిస్‌కు చెందిన ఒక స్వచ్ఛంద సంస్థ ఏటా ప్రపంచ పత్రికాస్వేచ్ఛ సూచీని విడుదల చేస్తుంది. ఈ సూచీ నిర్మాణానికి రిపోర్టర్స్ విత్‌అవుట్ బోర్డర్స్ సంస్థకు చెందిన నెట్‌వర్క్‌లోని 150 మంది కరస్పాండెంట్స్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉన్న రీసెర్చర్స్, మానవ హక్కుల కార్యకర్తలు, ప్రముఖ న్యాయకోవిదులు వంటివారిని ఎన్నుకుని వారికి ప్రశ్నావళిని ఆన్‌లైన్‌లో పంపిస్తారు. అంతేకాక ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్(భావవ్యక్తీకరణ స్వేచ్ఛ) కోసం కృషిచేస్తున్న 18 స్వచ్ఛంద సంస్థలకు కూడా ఈ ప్రశ్నావళిని పంపుతారు. ఈ ప్రశ్నావళిలో 83 ప్రశ్నలు ఆరు కేటగిరీల్లో

1) బహుళత్వం(ప్లూరలిజం)
2) మీడియా స్వతంత్రత
3) పాత్రికేయ వాతావరణం, సెల్ఫ్ సెన్సార్‌షిప్
4) పారదర్శకత
5) చట్టబద్ధ కార్యాచరణ
6) వార్తలు, సమాచార వ్యాప్తికి ఉన్న మౌలిక సదుపాయాల నాణ్యత వర్గీకరించి ఉంటాయి.

● ఈవిధంగా రాబట్టిన సమాధానాలకు సదరు దేశాల్లో పాత్రికేయులపై జరిగిన దాడులు వంటి దత్తాంశ సమాచారాన్ని జతచేసి క్రోడీకరించి దేశాల వారీగా ర్యాంకులు విడుదల చేస్తారు. అయితే ఈ సర్వేలో పాల్గొనే 18 స్వచ్ఛంద సంస్థలకూ రిపోర్టర్స్ విత్‌అవుట్ బార్డర్స్ సంస్థ ప్రధాన నిధుల వితరణదారుగా ఉంది. అంతేకాక ఈ సర్వేలో వినియోగిస్తున్న ప్రశ్నావళిలోని అంశాలకు వాటి కేటగిరీ వారీగా, ప్రశ్నల వారీగా ఎంత స్కోర్‌ను కేటాయిస్తున్నారు. ఎవరెవరిని ప్రశ్నావళికి జవాబిచ్చే వారిగా ఎన్నుకుంటున్నారనే విషయాల్లో పారదర్శకత లేదు. అదేవిధంగా 150 మంది నిష్ణాతుల్ని, 18 స్వచ్ఛంద సంస్థలనూ, ప్రతి దేశానికి సంబంధించి 83 ప్రశ్నలకు సమాధానం ఇవ్వమని అడిగినప్పుడు వారు ఏ దేశాల పట్ల పక్షపాతం చూపకుండా వ్యవహరిస్తారని చెప్పలేం. పైగా కొద్దిపాటిమంది కలిసి దేశాల పరిస్థితులను బేరీజు వేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రామాణిక విధానం కాదు. అందువల్లనే ఆఫ్ఘనిస్థాన్, ఉగాండా, యూఏఈల కంటే భారత్ అథమస్థానంలో ఉందని విశ్లేషకుల భావన.

భారత్ సొంత సూచీలను ఏర్పర్చుకోవాల్సిన అవసరం

1. ప్రస్తుతం ఉన్న సూచీలు పాశ్చాత్య దేశాల కనుసన్నల్లో మెలిగే స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రూపొందుతున్నాయి. ఆ సంస్థలకు భారీగా నిధులు సమకూర్చే దేశాలకు వాటి భౌగోళిక రాజకీయాలు, వ్యూహాలకు అనుగుణంగా ఇవి ప్రవర్తించే అవకాశం ఉంది.
2. ఈ సంస్థలు ఇచ్చే సూచీ రేటింగ్స్ ఆధారంగా ప్రపంచ దేశాలకు ఒక దేశంపై అభిప్రాయం స్థిరపడుతుంది. విదేశీ పెట్టుబడులు రావడానికి, పర్యాటకులు రావడానికి మంచి ర్యాంకింగ్స్ సహకరిస్తాయి. అదేవిధంగా వారు దూరం జరగడానికి కూడా అథమ ర్యాంకింగ్స్ కారణమవుతాయి.
3. ఒక దేశ అంతర్జాతీయ స్థాయి ఈ ర్యాంకింగ్‌ల వల్ల/సూచీల వల్ల ప్రభావితమవుతుంది.
4. ఇప్పటికే భారతదేశం గడచిన కొంతకాలంలోనే తన చుట్టుపక్కల ఉన్న అస్థిరదేశాలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్ని నియంతృత్వ దేశాలు, యుద్ధ పరిస్థితులు నెలకొన్న దేశాల కంటే అథమస్థాయిని నిష్కారణంగా పొందింది. దేశంలోని సుస్థిర ప్రజాస్వామ్య పరిస్థితులు, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, సంతోషకర పరిస్థితులు కల్పించగల ప్రజాసంక్షేమ కార్యక్రమాల గురించి ప్రపంచానికి తెలియజేయాలి. తద్వారా ఇంతకాలం మోస్తున్న అపవాదు తొలగించుకోవాల్సి ఉంది.
5. వివిధ అంతర్జాతీయ సూచీలపరంగా ఉన్న లోపాలను సరిచేసి ప్రత్యామ్నాయ సూచీలను, దత్తాంశ సేకరణ విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉంది.

● ఈ పరిస్థితుల్లో భారతదేశం తన సొంత సూచీల రూపకల్పన దిశగా, భారత ప్రభుత్వానికి సుదీర్ఘ కాలం వివిధ అంశాలపరంగా మేధామథన సహకారం అందిస్తున్న థింక్‌ట్యాంక్ సంస్థ ఓఆర్ఎఫ్(అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్) ఢిల్లీ కేంద్రంగా పనిచేసే స్వచ్ఛంద సంస్థకు సూచీల రూపకల్పన బాధ్యతలను అందించింది.

● అయితే ప్రపంచ సూచీల్లో అగ్రస్థానంలో ఉన్న నార్డిక్ వంటి దేశాల జీవన ప్రమాణాల స్థాయిలు మిగిలిన ప్రపంచ దేశాలతో పోలిస్తే ఏవో కొన్ని అంశాల్లో తప్ప చాలా హెచ్చుగానే ఉంటాయి. ఇది కాదనలేని సత్యం. భారతదేశానికి ఇతర దిగువస్థాయి దేశాలతో పోల్చితే తక్కువస్థాయి ర్యాంక్ లభించడం గర్హనీయమే. అత్యున్నత ర్యాంకులు పొందిన దేశాల్లో ఉన్న పరిస్థితులతో పోలిస్తే చాలా దిగువస్థాయి పరిస్థితులే దేశంలో ఉన్నాయి. సొంత సూచీల ఏర్పాటుతో అంతర్జాతీయ అపఖ్యాతిని తొలగించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలకు తోడు, ప్రజల జీవన ప్రమాణాల పెంపుపై కూడా అత్యంత శ్రద్ధ వహించడం ద్వారా అంతర్జాతీయ ఖ్యాతిని పొందగలం.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్



అఖండ విజయం వైర్యాగ చింతన!

అనగనగా ఓ రాజ్యం. ఆ రాజ్యంలో ఓ పేద వ్యక్తి ఉండేవాడు. అతనికి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. పేరుకు పేదవాడే కానీ గట్టివాడు. దైవభక్తి కలవాడు. అనుకున్నది చేయాలనుకునే కసి ఉన్నోడు. అతనికి ఉండే యావత్ ఆస్తి పార. ఆ పారతో మడులు తవ్వి, కూరగాయల పంటలు పండించేవాడు. ఆ కూరగాయలను అమ్మగా వచ్చిన డబ్బుతో పొట్ట పోసుకునేవాడు.

ఒకసారి కూరగాయలు అమ్మాడు. ఇంటికి వస్తోంటే వైరాగ్యం కలిగింది. దీంతో ఆ పారను పొలంలో పాతి పెట్టి వైరాగ్యంతో అడవులకు వెళ్లిపోయాడు. తపస్సు చేసుకున్నాడు. కొన్నాళ్లకు మళ్లీ వచ్చాడు. కూరగాయలు పండించి మళ్లీ బతకటం ఆరంభించాడు. అలా ప్రతి సారి ఆ పేదవాడికి వైరాగ్యం కలిగేది. అడవులకు వెళ్లి తపస్సు చేసుకునేవాడు. వెళ్లిన ప్రతి సారి పారను పూడ్చి పెట్టేవాడు. అది అతి రహస్యమైన మనుషులు తిరగని ప్రాంతంలో పూడ్చిపెట్టేవాడు.


అలా ఆరుసార్లు పారను పూడ్చిపెట్టాడు. ఆరుసార్లు తపస్సు చేసుకున్నాడు. ఈ పార వల్లనే తన ఆధ్యాత్మిక చింతన తగ్గుతోందని లేకుంటే బాగా ఉండేవానినని.. ఈ పాటికి తపస్సులో కూడా మోక్షం పొందేవాడినని.. ఇలా ఏదేదో అనుకున్నాడు. రహస్యంగా పూడ్చిన పారను తీసుకున్నాడు. ఒక గుట్ట ఎక్కాడు. ఆ పారను పైనుంచి విసిరివేసాడు. అది ఎక్కడ పడుతుందో తెలీకూడదని కళ్లు కూడా మూసుకున్నాడు. ఎంతో ఆనందంతో చిందులేశాడు. అఖండ విజయం సాధించానని గట్టిగా నవ్వుతున్నాడు. పేదవాడి ముఖం వెలిగిపోతోంది. అదే సమయంలోనే రాజుగారు శత్రువులను చండాడి ఇంటికి వస్తున్నాడు. ఆ సమయంలో పేదవాడి నవ్వులు వినపడ్డాయి. ఇది అఖండ విజయం అనే మాట వినపడింది. సైనికులను పంపి వాడిని పట్టుకురండి అన్నాడు. పారపోయిన ఆనందంతో అసలే పారవశ్య ఆనందంలో ఉన్న పేదవాడిని చూసి రాజు అసూయపడ్డాడు. ఇంత ఆనందంగా ఎలా ఉండగలుగుతున్నావు? నేను విజయం సాధించినా ఆనందం లేదే? అన్నాడు రాజుగారు. పేదవాడు విషయం అంతా చెప్పాడు. పేదవాడి కథ బాగా అనిపించింది. పేదవాడికి బంగారు నాణేలు ఇవ్వండి అన్నాడు. అతను తీసుకోవటానికి ఒప్పుకోలేదు.

పేదవాడు ఇంటి దారి పట్టాడు. ఎక్కడికి? అని అడిగాడు. 'హిమాలయాలకు తపస్సు చేసుకోవటానికి' అన్నాడు. 'నేనూ నీతో వస్తా పదా' అంటూ ఆ పేదవాడి వెంటనే రాజుగారు వెళ్లిపోయాడు. ఈ చోద్యం చూసి అక్కడి రాజు పరివారం ఆశ్చర్యపోయారు. వైరాగ్య చింతనతో పేదవాడు-రాజుగారు ఆనందంగా హిమాలయాలకు వెళ్లిపోయారు.

జత ఉన్న బొమ్మ ఏది?



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 289

				9	5		4	
		1	2					6
					8			3
		9					1	
	7	3	9		2	8	5	
	6					9		
5			7					
8					6	2		
	3		5	8				

సుడోకు - 288 సమాధానం

8	6	5	2	3	9	7	4	1
2	7	1	4	8	6	5	9	3
4	3	9	7	1	5	8	6	2
7	4	8	6	5	2	3	1	9
9	1	3	8	7	4	6	2	5
5	2	6	3	9	1	4	7	8
3	9	7	1	4	8	2	5	6
1	8	2	5	6	7	9	3	4
6	5	4	9	2	3	1	8	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.